www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శుక్రవారం | 28-11-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 262

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం, తిథి: అష్టమి రా.12:16 తదుపరి నవమి, నక్షత్రం: శతభిషం రా.2:49 తదుపరి పూర్వాభాద్ర, వర్జ్యం: ఉ.9:49-11:26, దుర్ముహూర్తం: ఉ.8:43-9:28, మ.12:25-1:09, అమృతఘడియలు: రా.7:31-9:09, రాహుకాలం: ఉ.10:30-12:00, సూర్యోదయం: 6:31, సూర్యాస్తమయం: 5:34

గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru







ప్రజా రాజధాని

అమరావతికి ఆర్థిక మణిహారం

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి మరో చారిత్రాత్మక ఘట్టానికి వేదిక కానుంది.
ప్రజా రాజధాని ఇకపై ఆర్థిక కార్యకలాపాలకు కేంద్ర బిందువు అయ్యేలా...

15 బ్యాంకింగ్ & బీమా సంస్థల ప్రధాన కార్యాలయాల నిర్మాణానికి

నేడు శంకుస్థాపన




ముఖ్య అతిథి

శ్రీమతి నిర్మలా సీతారామన్

కేంద్ర ఆర్థిక మరియు కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి




గౌరవ అతిథి

శ్రీ నారా చంద్రబాబు నాయుడు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి




Amaravati THE PEOPLE'S CAPITAL

వేదిక : సీఆర్డీఏ కార్యాలయం వద్ద
తేదీ : 28 నవంబరు, 2025
సమయం : ఉదయం 10 గంటలకు

ఈ ఆర్థిక సంస్థల ద్వారా
రూ.1,328 కోట్ల పెట్టుబడులతో పాటు
6,541 ఉద్యోగాలు రానున్నాయి

Amaravati THE PEOPLE'S CAPITAL

SBI | LIC भारतीय जीवन बीमा निगम LIFE INSURANCE CORPORATION OF INDIA | केनरा बैंक Canara Bank | बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda | IDBI BANK | इंडियन बैंक Indian Bank

Union Bank | सेन्ट्रल बैंक ऑफ़ इंडिया Central Bank of India | pnb punjab national bank ...the name you can BANK upon! | Bank of India Relationship beyond banking | ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ Andhra Pradesh Grameena Bank Scheduled Bank Owned by Government | APCOB | NABARD

జారీచేసిన వారు: సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

బిజినెస్

manepally Jewellers Pvt. Ltd. trusted legacy since 1890
MANEPALLY DIGITAL GOLD APP Ph: 99120 10888



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,27,750 ▼	1,17,100 ▼	1,80,000 ▲
విజయవాడ	1,30,000 ▲	1,22,000 ▲	1,67,600 ▲
విశాఖపట్నం	1,29,930 ▲	1,17,250 ▲	1,80,000 ▲
రాజమండ్రి	1,27,750 ▼	1,17,100 ▼	1,64,000 ▲
ప్రొద్దుటూరు	1,25,500 ▼	1,15,460 ▼	1,67,200 ▲
ముంబై	1,26,057 ▼	1,15,468 ▼	1,62,667 ▲

విందు.. మహా పసందు!

బయట బాగా లాగించేస్తున్న భారతీయులు

2030 నాటికి రూ.11.25 లక్షల కోట్లకు దేశీయ ఆహార సేవల మార్కెట్

స్విగ్గీ, కియర్నీ సంయుక్త నివేదిక అంచనా



న్యూఢిల్లీ: వచ్చే ఐదేళ్లలో (2030 నాటికి) భారత ఆహార సేవల మార్కెట్ 12,500 కోట్ల డాలర్ల (సుమారు రూ.11.25 లక్షల కోట్లు) స్థాయికి చేరుకోవచ్చని ఒక నివేదిక అంచనా వేసింది. అలాగే, సంఘటిత ఆహార సేవల విభాగ పరిమాణం ఐదేళ్లలో రెట్టింపు కానుందని, అసంఘటిత విభాగాన్ని మించిపోనుందని అంటోంది. 'హౌ ఇండియా ఈట్స్' పేరుతో ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ, అమెరికన్ గ్లోబల్ కన్సల్టింగ్ కంపెనీ కియర్నీ సంయుక్తంగా ఈ నివేదికను గురువారం విడుదల చేశాయి. 2019లో 4,900 కోట్ల డాలర్ల స్థాయిలో ఉన్న భారత ఆహార సేవల మార్కెట్ 2025లో 7,800 కోట్ల డాలర్ల (రూ.6.97 లక్షల కోట్లు) స్థాయికి చేరి ఉండవచ్చని రిపోర్టు అంచనా. నివేదికలోని మరిన్ని విషయాలు..

- వచ్చే ఐదేళ్లలో ఆహార సేవల మార్కెట్ మొత్తం వృద్ధిలో సంఘటిత విభాగ వాటా 60 శాతానికి మించిపోనుంది. తద్వారా అసంఘటిత విభాగ స్థాయిని అధిగమించనుంది.
- తలసరి ఆదాయంతో పాటే దేశవాసులు ఆహార సేవల కోసం వెచ్చించే మొత్తం కూడా పెరగనుంది. వచ్చే 7 ఏళ్ల పాటు ఈ ఖర్చులో అధిక వృద్ధి నమోదు కానుంది.
- భారత జీడీపీలో ఆహార సేవల మార్కెట్ వాటా కేవలం 1.9 శాతమే. ప్రస్తుతం చైనాలో ఈ వాటా 5 శాతంగా, బ్రెజిల్‌లో 6 శాతంగా ఉంది. కాబట్టి, ముమ్ముందు భారత్‌లో ఈ మార్కెట్ వృద్ధికి బోలెడు అవకాశాలున్నాయి.
- క్లౌడ్ కిచెన్లు, క్విక్ సర్వీస్ రెస్టారెంట్లు (క్యూఎస్ఆర్), డెజర్ట్ పార్లర్లు సగటు కంటే అధిక వృద్ధిని నమోదు చేయనున్నాయి.
- భారత కస్టమర్ వినూత్న వంటకాల ఆర్డర్లు 20 శాతానికి పైగా, రెస్టారెంట్ నుంచి ఆర్డర్లు 30 శాతం వృద్ధి చెందాయి. మొత్తం ఆర్డర్లతో పోలిస్తే, ఆరోగ్యకరమైన ఆహార పదార్థాల ఆర్డర్లు 2.3 రెట్లు పెరుగుతున్నాయి.
- భారతీయులు దేశీయ సంప్రదాయ వంటకాలతో పాటు విదేశీ వంటకాలనూ ఇది వరకెన్నడూ లేనంతగా ఆస్వాదిస్తున్నారు.
- ప్రధాన వంటకాల కంటే గోవా, బిహారీ, పహారీ వంటకాలకు గిరాకీ 2-8 రెట్ల మేర పెరుగుతోంది. అదే సమయంలో కొరియా, వియత్నాం, మెక్సికన్ వంటకాలకు డిమాండ్ వరుసగా 17, 6, 3.7 రెట్ల చొప్పున పెరుగుతోంది.
- దేశీయ పానీయాలైన బటర్‌మిల్క్, షర్బత్‌కు డిమాండ్ మొత్తం పానీయాలతో పోలిస్తే 4-6 రెట్లకు పైగా పెరుగుతోంది. బొబా టీ, మచ్చా టీ విక్రయాలు వరుసగా 11, 4 రెట్లు పెరిగాయి.
- గడిచిన దశాబ్దానికి పైగా కాలంలో ఈ విభాగం అసమాన పరిణామాన్ని చూసింది. ఒకవైపు వినియోగదారులు భారత, ఇటాలియన్ వంటకాల్లో అందుబాటు ధరల కోసం చూస్తున్నారు. మరోవైపు బొబా, మచ్చా టీలను ఇదివరకెన్నడూ లేనంతగా సేవిస్తున్నారని స్విగ్గీ ఫుడ్ మార్కెట్ ప్లేస్ సీఈఓ రోహిత్ కపూర్ అన్నారు.
- దేశంలోని 8 ప్రధాన నగరాలతో పోలిస్తే, మిగతా నగరాల్లో బయట భోజనం చేయడం రెండు రెట్ల స్థాయిలో ఉందని కియర్నీ ప్రతినిధి రజత్ తులి అన్నారు. ప్రధానంగా కార్పొరేట్, పారిశ్రామిక, విద్య, పర్యాటక హబ్‌లలో ఇది అధికమన్నారు. రెస్టారెంట్లలో భోజనం చేసేవారిలో జెన్ జెడ్ అధికమని, మిగతా వయసువాళ్లతో పోలిస్తే 3 రెట్ల చొప్పున పెరుగుతున్నారని తులి పేర్కొన్నారు.

వచ్చే ఏడాది 5000 డాలర్లకు గోల్డ్

డబ్ల్యూజీసీ సీఈఓ డేవిడ్ టైట్ అంచనా

దుబాయ్: బంగారం పరుగు ఇప్పట్లో ఆగదని ఇప్పటికే పలు ఆర్థిక సంస్థలు, విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. తాజాగా ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) సీఈఓ డేవిడ్ టైట్ కూడా ఇదే మాట అంటున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో, ఈ అక్టోబరులో 4,381 డాలర్ల వద్ద ఆల్‌టైం రికార్డు గరిష్ఠాన్ని నమోదు చేసిన ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ రేటు.. ప్రస్తుతం 4,150 డాలర్ల ఎగువన కదలాడుతోంది. ముమ్ముందు మరింత పెరిగి వచ్చే ఏడాదిలో 5,000 డాలర్లకు చేరుకోవచ్చని దుబాయ్‌లో జరిగిన ప్రీషియస్ మెటల్ కాన్ఫరెన్స్‌లో డేవిడ్ టైట్ అభిప్రాయపడ్డారు. ఫెడ్ రేట్ల తగ్గుదల, అమెరికా క్రమంగా ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోతుండటం, సెంట్రల్ బ్యాంక్‌ల పసిడి కొనుగోళ్లు, జపాన్‌లో అధిక ద్రవ్యోల్బణం వంటి అంశాలు బులియన్ ధరలను మరింత ఎగదోయనున్నాయని ఆయన పేర్కొన్నారు. కాగా, గోల్డ్‌మన్ శాక్స్, జేపీ మోర్గాన్, బ్యాంక్ ఆఫ్ అమెరికా వంటి అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజాలు సైతం వచ్చే ఏడాదిలో గోల్డ్ 5,000 డాలర్లకు చేరుకోవచ్చని ఇదివరకే అంచనాలను విడుదల చేశాయి.

త్వరలో బంగారం రుణాల్లోకి పిరామల్ ఫైనాన్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పిరామల్ ఫైనాన్స్ లిమిటెడ్.. బంగారం రుణాల విభాగంలోకి అడుగు పెట్టేందుకు రెడీ అవుతోంది. ఇప్పటి వరకు పిరామల్ ప్రధానంగా గృహ, ఎంఎస్ఎంఈ రంగాల కోసం రుణాలను అందిస్తుండగా.. త్వరలోనే పసిడి రుణాల విభాగంలోకి ప్రవేశించనుందని సంస్థ సీఈఓ (రిటైల్ లెండింగ్) జగ్‌దీప్ మల్లారెడ్డి గురువారం నాడిక్కడ తెలిపారు. పిరామల్ ఫైనాన్స్ ప్రస్తుతం దేశవ్యాప్తంగా 428 నగరాల్లో 517 శాఖలను నిర్వహిస్తోందన్నారు. ఇందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోని 50కి పైగా పట్టణాలు, నగరాల్లో 59 శాఖలు ఉన్నాయని ఆయన చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) సెప్టెంబరు త్రైమాసికం ముగిసే నాటికి నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ (ఏయూఎం) రూ.91,477 కోట్లకు చేరుకుందని ఆయన వివరించారు. కాగా ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి సంస్థ ఏయూఎం రూ.లక్ష కోట్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు జగ్‌దీప్ చెప్పారు.

కుప్పంలో రూ.305 కోట్లతో డెయిరీ ప్లాంట్

ఏస్ ఇంటర్నేషనల్

హైరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రముఖ పాడి ఉత్పత్తుల సంస్థ ఏస్ ఇంటర్నేషనల్ తన వ్యాపార కార్యకలాపాలను విస్తరిస్తోంది. ఇందులో భాగంగా 3.5 కోట్ల డాలర్ల (సుమారు రూ.305 కోట్లు) పెట్టుబడితో ఆంధ్రప్రదేశ్‌లోని కుప్పం వద్ద ప్రత్యేక యూనిట్ ఏర్పాటు చేస్తోంది. కంపెనీ ఈ నిధులను నెదర్లాండ్ కేంద్రంగా పనిచేసే కొన్ని ఆర్థిక సంస్థలు, ప్రైవేట్ ఈక్విటీ సంస్థల నుంచి సమీకరించింది. కుప్పం వద్ద ఏర్పాటు చేసే ప్లాంటులో పెద్దలు, చిన్న పిల్లల ఆరోగ్యం, పోషణకు దోహదం చేసే పాడి ఉత్పత్తులు, ఇతర ఆహార ఉత్పత్తులు తయారు చేయాలని కంపెనీ భావిస్తోంది. ఏస్ ఇంటర్నేషనల్ ఇప్పటికే ఉత్తర ప్రదేశ్‌లో రోజుకు ఐదు లక్షల లీటర్ల ప్రాసెసింగ్ సామర్థ్యం ఉన్న డెయిరీ ప్లాంటును నిర్వహిస్తోంది. ఈ ప్లాంటులో తయారయ్యే ఉత్పత్తులను కంపెనీ దేశీయ మార్కెట్‌తో పాటు విదేశాలకూ ఎగుమతి చేస్తోంది. కుప్పం ప్లాంటులో ఉత్పత్తి చేసే పాల ఉత్పత్తులనూ విదేశాలకు ఎగుమతి చేయనుంది.

- టాటా ఈవీ.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో కొత్తగా 14 టాటా ఈవీ మెగాచార్జర్స్‌ను ప్రారంభించింది. వోల్ట్రాన్ భాగస్వామ్యంతో కీలకమైన జాతీయ రహదారులపై వీటిని ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఈ రెండు సంస్థలు సంయుక్తంగా దేశవ్యాప్తంగా 70కి పైగా మెగాచార్జర్ నెట్‌వర్క్‌ను నిర్వహిస్తున్నాయి. 2027 నాటికి 500 టాటా ఈవీ మెగా చార్జర్లతో పాటు 40,000 చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి.
- హిందుస్థాన్ పవర్.. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈసీఐ) నుంచి 150 మెగావాట్ల సామర్థ్యం గల సౌర విద్యుత్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ ప్రాజెక్ట్ ఆర్డర్‌ను దక్కించుకుంది. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

ఐటీ చేతిలో బడా బాబుల విదేశీ రహస్య ఆస్తుల చిట్టా

త్వరలో 24,678 మందికి ఈ-మెయిల్స్, ఎస్ఎంఎస్‌లు

న్యూఢిల్లీ: విదేశాల్లో రహస్యంగా కూడబెట్టిన బడా బాబుల గుట్టు రట్టవుతోంది. సప్త సముద్రాల ఆవల కూడబెట్టిన ఈ ఆస్తుల వివరాలను సైతం ఆదాయ పన్ను (ఐటీ) శాఖ వెలికి తీస్తోంది. స్విట్జర్లాండ్‌తో సహా పలు దేశాలతో కుదిరిన పరస్పర సమాచార మార్పిడి (ఏఈఓఐ) ఒప్పందం ఇందుకు ఎంతగానో ఉపయోగపడుతోంది. ఇలా విదేశాల నుంచి అందిన సమాచారాన్ని 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఫైల్ చేసిన ఐటీ రిటర్న్‌లను పోల్చి చూసి విదేశాల్లోని తమ ఆస్తుల వివరాలు వెల్లడించని 24,678 మంది బడా బాబుల జాబితాను ఐటీ శాఖ సిద్ధం చేసింది. విదేశాల్లో వీరు కూడబెట్టిన ఆస్తుల విలువ ఎంత లేదన్నా రూ.29,208 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఈ ఆస్తులకు తోడు వీరు తమ ఐటీ రిటర్న్‌ల్లో వెల్లడించని విదేశీ ఆదాయం రూ.1,089.88 కోట్ల వరకు ఉంటుందని అంచనా.

డిసెంబరు వరకే గడువు: ఈ ఏడాది చివరికల్లా ఈ రహస్య ఆస్తుల వివరాలతో సవరించిన ఐటీ రిటర్న్‌లు ఫైల్ చేస్తారా? లేక కొరడా ఝుళిపించమంటారా? అని ఐటీ శాఖ త్వరలో వీరికి ఎస్ఎంఎస్‌లు, ఈమెయిల్స్ పంపనుంది. అప్పటికే వినకపోతే 30 శాతం పన్నుతో పాటు ఆ చెల్లించాల్సిన పన్నుపై రూ.10 లక్షల జరిమానా తప్పదని ఐటీ అధికారులు హెచ్చరించనున్నారు. విదేశాల్లో ఇలా రహస్యంగా ఆస్తులు కూడబెట్టిన వారిలో ప్రముఖ కంపెనీలకు చెందిన ఉన్నతోద్యోగులు కూడా ఉన్నట్టు సమాచారం.

సరికొత్త గరిష్ఠాలకు సూచీలు

ఇంట్రాడేలో 86,000 పైకి సెన్సెక్స్

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు గురువారం ఆరంభ ట్రేడింగ్‌లో సరికొత్త జీవితకాల గరిష్ఠాలకు చేరాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలు, విదేశీ సంస్థాగత పెట్టుబడుల దన్నుతో సెన్సెక్స్ ఒక దశలో 446.35 పాయింట్లు ఎగబాకి 86,055.86 వద్ద, నిఫ్టీ 105.15 పాయింట్ల వృద్ధితో 26,310.45 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డులను నమోదు చేశాయి. అయితే, గరిష్ఠాల వద్ద మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో మధ్యాహ్నం సెషన్‌లో సూచీలు మళ్లీ కిందికి జారాయి. ఒక దశలో నష్టాల్లోకి మళ్లినప్పటికీ, మళ్లీ కాస్త తేరుకున్న సెన్సెక్స్.. చివరికి 110.87 పాయింట్ల లాభంతో 85,720.38 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 10.25 పాయింట్ల పెరుగుదలతో 26,215.55 వద్ద ముగిసింది. 2024 సెప్టెంబరు 27న సెన్సెక్స్ 85,978.25 వద్ద, నిఫ్టీ 26,277.35 వద్ద గత ఇంట్రాడే రికార్డులను నమోదు చేశాయి. అంటే, సూచీలు 14 నెలల తర్వాత మళ్లీ రికార్డు గరిష్ఠాలకు చేరాయి. ఈ ఏడాదిలో ఇప్పటివరకు సెన్సెక్స్ 7,581.37 పాయింట్లు (9.70 శాతం), నిఫ్టీ 2,570.75 పాయింట్లు (10.87 శాతం) పెరిగాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



28వ తేదీ			
హైదరాబాద్	630	విజయవాడ	640
వరంగల్	632	గోదావరి	615
చిత్తూరు	673	విశాఖపట్నం	610
		డజను గుడ్లు రూ. 90	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	103
వరంగల్	100	గుంటూరు	108
కరీంనగర్	100	ఒంగోలు	108
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	100
కర్నూలు	100	నెల్లూరు	105
విశాఖపట్నం	100	అనంతపురం	105
గోదావరి	103		

మార్కెట్లోకి మహీంద్రా ఎక్స్ఈవీ 9ఎస్

ప్రారంభ ధర రూ.19.95 లక్షలు



బెంగళూరు: దేశీయ ఆటో దిగ్గజాల్లో ఒకటైన మహీంద్రా అండ్ మహీంద్రా కొత్త విద్యుత్ కారు ఎక్స్ఈవీ 9ఎస్‌ను మార్కెట్లోకి తెచ్చింది. ఏడు సీట్లుండే ఈ కారు ప్రారంభ ధర రూ.19.95 లక్షలు కాగా టాప్ ఎండ్ వేరియెంట్ ధర రూ.29.45 లక్షలు. ఇంగ్లో ఎలక్ట్రిక్ వేదికపై అభివృద్ధి చేసిన ఈ కారు ప్రయాణికులు మరింత సౌకర్యంగా కూర్చుకునేందుకు అవసరమైన ప్రదేశం కలిగి ఉంటుందని కంపెనీ ప్రెసిడెంట్ (ఆటోమోటివ్ బిజినెస్) ఆర్.వేలుసామి చెప్పారు. 2027-2028 నాటికి మొత్తం అమ్మకాల్లో ఈవీల వాటా 25 శాతానికి పెంచుకోవాలన్నది తమ లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి విద్యుత్ కార్ల తయారీ సామర్థ్యాన్ని నెలకి 8 వేల యూనిట్లకు, విక్రయాలను 7 వేలకు పెంచాలనుకుంటున్నట్లు ఆటో, వ్యవసాయ విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈఓ రాజేష్ జెజూరికర్ తెలిపారు. ఎక్స్ఈ-9వీకి చెందిన అన్ని వేరియెంట్లకు ప్రభుత్వ ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం కింద ప్రోత్సాహకాలు పొందే అర్హత కలిగి ఉందని అన్నారు.

స్పోర్ట్స్

మనోళ్లకు మరో గెలుపు

కివీస్‌పై భారత్ విజయం | అజ్లాన్ షా హాకీ

ఇఫో (మలేసియా): హోరాహోరీగా సాగిన మ్యాచ్ చివర్లో సెల్వం కార్తీ చేసిన గోల్‌తో భారత హాకీ జట్టు ఉత్కంఠ విజయాన్ని నమోదు చేసింది. సుల్తాన్ అజ్లాన్ షా కప్‌లో గురువారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 3-2తో న్యూజిలాండ్‌పై గెలిచింది. టీమిండియా తరపున అమిత్ రోహిదాస్ (4వ నిమిషం), సంజయ్ (32వ), సెల్వం (54వ) గోల్స్ చేయగా.. కివీస్ ఆటగాడు జార్జ్ బాకర్ (42వ, 48వ) రెండు గోల్స్ సాధించాడు. శనివారం జరిగే మ్యాచ్‌లో కెనడాతో భారత్ తలపడనుంది.

ప్రస్తుతానికి గౌతీ సేఫ్!

గంభీర్‌కు అండగా బీసీసీఐ



న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికా చేతిలో భారత్ వైట్‌వాష్ కావడంతో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. అయితే బీసీసీఐ గంభీర్‌పై పూర్తి విశ్వాసం వ్యక్తం చేసింది. గంభీర్‌పై హడావుడిగా ఎటువంటి చర్యలూ తీసుకోబోమని బోర్డు కార్యదర్శి దేవజిత్ సైకియా చెప్పాడు. రోహిత్, కోహ్లీ, అశ్విన్ రిటైర్మెంట్‌తో జట్టు సంధి దశలో ఉందని.. మళ్లీ పుంజుకోవడానికి సమయం పడుతుందని అన్నాడు. ఆటగాళ్లు ఎటువంటి పిచ్‌లపైనైనా ఆడే విధానాన్ని అలవర్చుకోవాలని సూచించాడు. కాగా గంభీర్‌కు సునీల్ గవాస్కర్ మద్దతుగా నిలిచాడు. జట్టు ఓటమిపాలైతే కోచ్‌ను ఎందుకు టార్గెట్ చేస్తున్నారని ప్రశ్నించాడు. గెలిచినప్పుడు అతడికి క్రెడిట్ ఇవ్వనప్పుడు.. ఓటమికి విమర్శలెందుకు చేస్తున్నారో వివరించాలని సన్నీ కోరాడు.

మంధాన కోసం బిగ్‌బాష్‌కు దూరం

జెమీమా నిర్ణయం

ముంబై: జెమీమా రోడ్రిగ్స్ మహిళల బిగ్‌బాష్ లీగ్‌కు దూరమైంది. తన క్లోజ్‌ఫ్రెండ్, సహచర క్రికెటర్ స్మృతి మంధాన వివాహం కోసం భారత్‌కు వచ్చిన తను తిరిగి లీగ్‌లో ఆడేందుకు ఆసీస్‌కు వెళ్లాలనుకోవడం లేదు. ఇటీవలే మంధాన వివాహం అర్థంతరంగా ఆగిపోగా.. ఈ కష్ట సమయంలో తన స్నేహితురాలికి అండగా ఉండాలని జెమీమా నిర్ణయించుకుంది.

రెజ్లర్ పల్లవికి స్వర్ణం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలో ఇండియా విశ్వవిద్యాలయాల క్రీడల్లో ఆంధ్ర ఆటగాళ్లు సత్తా చాటారు. గురువారం రాజస్థాన్‌లోని బికనీర్‌లో జరిగిన ఈ పోటీల్లోని ఫ్రీస్టయిల్ రెజ్లింగ్ 65 కిలోల విభాగంలో ఎస్.పల్లవి (ఆంధ్ర వర్సిటీ) స్వర్ణం సాధించింది. నర్రా మహేష్ (ఆంధ్ర కేసరి) రజతం అందుకున్నాడు. 25 మీటర్ల ర్యాపిడ్ పిస్టల్ ఫైర్ ఈవెంట్‌లో ముఖేష్, తనిష్క్, నాగసాయి (కేఎల్ వర్సిటీ) బృందం రజతం కైవసం చేసుకుంది.




మీ విజయం భావి తరాలకు స్ఫూర్తి

అంధుల క్రికెట్ జట్టుతో ప్రధాని మోదీ ఇష్టాగోష్ఠి

న్యూఢిల్లీ: మహిళల అంధుల టీ20 ప్రపంచకప్ నెగ్గిన భారత జట్టు విజయం భావితరాలకు స్ఫూర్తిదాయకంగా చరిత్రలో నిలిచిపోతుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. గురువారం న్యూఢిల్లీలో మోదీని భారత జట్టు సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సుమారు 45 నిమిషాల పాటు జరిగిన ఇష్టాగోష్ఠిలో భారత కెప్టెన్, అనంతపురం అమ్మాయి దీపిక, పాడేరు యువ క్రికెటర్ కరుణ కుమారి.. మోదీతో ముచ్చటించారు. దీపిక పాటలు బాగా పాడుతుందని తెలిసి ఆమెను మోదీ ఒక పాట పాడాలని అడిగారు. దాంతో దీపిక శివుడి భక్తి గీతం ఆలపించగా.. ఆమెను మోదీ అభినందించారు. చివర్లో జట్టు సభ్యులు సంతకం చేసిన బ్యాట్‌ను మోదీకి దీపిక బహూకరించింది. కొన్ని క్రికెట్ బంతులపై జట్టు సభ్యులు మోదీ సంతకాలు తీసుకున్నారు.

దీప్తి ధమాకా

రూ.3.20 కోట్లకు యూపీ కొనుగోలు



- అలీసా హీలీకి నిరాశ
- మహిళల ప్రీమియర్ లీగ్ వేలం

రూ.3 కోట్లతో ముంబైకి అమేలీ కెర్



న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) నాలుగో సీజన్ కోసం గురువారం అట్టహాసంగా మెగా వేలం జరిగింది. స్టార్ ఆటగాళ్లతో పాటు అన్‌క్యాప్‌డ్ ప్లేయర్ల కోసం ఐదు ఫ్రాంచైజీలు పోటీపడ్డాయి. 73 స్లాట్లకు జరిగిన వేలం కోసం 277 మంది రిజిస్టర్ చేసుకున్నారు. ఎక్కువగా విదేశీ ఆటగాళ్లవైపు ఆయా జట్లు మొగ్గు చూపినా.. ఈసారి వేలంలో అత్యధిక ధర మాత్రం భారత క్రికెటర్‌దే కావడం విశేషం. స్టార్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మకు జాక్‌పాట్ తగిలింది. వన్డే వరల్డ్‌కప్ ఫైనల్లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టి జట్టును విజేతగా నిలిపిన దీప్తి ఏకంగా రూ.3.20 కోట్ల ధర పలికింది. ఈ ఏడాది యూపీ వారియర్స్ కెప్టెన్‌గా వ్యవహరించిన దీప్తిని తొలుత ఆ జట్టు రిటైన్ చేసుకోలేదు. కానీ రైట్ టు మ్యాచ్ (ఆర్‌టీఎం) ద్వారా రికార్డు ధరతో తిరిగి యూపీనే సొంతం చేసుకుంది. వాస్తవానికి కనీస ధర రూ.50 లక్షలకే దీప్తిని ఢిల్లీ క్యాపిటల్స్ సొంతం చేసుకోగా, ఏ జట్టూ పోటీ పడలేదు. అయితే గతంలో తమ జట్టు తరపున ఆడిన ప్లేయర్లను తిరిగి సొంతం చేసుకునే ఆర్‌టీఎంను ఉపయోగించాలని యూపీ నిర్ణయం తీసుకుంది. దీంతో ఇదే అదనుగా డీసీ తమ బిడ్‌ను ఏకంగా రూ.3.20 కోట్లకు పెంచగా.. ఏమాత్రం ఆలస్యం చేయకుండా యూపీ ఓకే చెప్పి దీప్తిని సొంతం చేసుకుంది. మరోవైపు డబ్ల్యూపీఎల్‌లో స్మృతి మంధాన (రూ.3.40 కోట్లు, ఆర్‌సీబీ) తర్వాత అత్యధిక ధర పలికిన రెండో భారత ప్లేయర్‌గా దీప్తి నిలిచింది. ఇదిలావుండగా వేలంలో అందరికంటే ఎక్కువగా రూ.14.50 కోట్ల పర్స్‌తో యూపీ వారియర్స్ అడుగుపెట్టింది. దీంతో సహజంగానే మిగతా జట్లతో పోలిస్తే వీరి హడావిడి ఎక్కువగా కనిపించింది. వేలంలో అందరికంటే పిన్న వయస్కురాలిగా 16 ఏళ్ల దియా యాదవ్ (రూ.10 లక్షలు, ఢిల్లీ) నిలిచింది.

విదేశీ ప్లేయర్ల హవా

వేలంలో అన్ని జట్లు కూడా భారత ప్లేయర్లకంటే విదేశీ క్రికెటర్ల వైపు మొగ్గు చూపాయి. ముంబై జట్టు కివీస్ ఆల్‌రౌండర్ అమేలీ కెర్‌ను రూ.3 కోట్లకు తిరిగి తీసుకుంది. తాజా వేలంలో విదేశీ ఆటగాళ్లలో కెర్‌దే అధిక మొత్తం. 2023, 2025 సీజన్లలో ముంబైని చాంపియన్‌గా నిలపడంలో కెర్‌ది కీలక పాత్ర. అంతేకాకుండా గుజరాత్ జెయింట్స్ సోఫీ డివైన్‌ను రూ.2 కోట్లకు, మెగ్ లానింగ్‌ను యూపీ వారియర్స్ రూ.1.90 కోట్లకు తీసుకున్నాయి. దక్షిణాఫ్రికా కెప్టెన్ వోల్వార్ట్ రూ.1.10 కోట్లకు డీసీ కొనుగోలు చేయగా.. విండీస్ పేసర్ చినెల్లె హెన్రీని రూ.1.30 కోట్లకు ఢిల్లీ తీసుకుంది. అలాగే ఇంగ్లండ్ స్పిన్నర్ సోఫీ ఎకెల్‌స్టోన్‌ను రూ.80 లక్షలకు ఆర్‌టీఎం ద్వారా యూపీ సొంతం చేసుకుంది. అయితే ఆసీస్ కెప్టెన్ అలీసా హీలీతో ఈ వేలం ఆరంభం కాగా.. తనను మాత్రం ఏ జట్టూ కొనుగోలు చేయకపోవడం గమనార్హం.


శిఖాకు అనూహ్య ధర

రూ.40 లక్షల కనీస ధరతో వేలంలోకి అడుగుపెట్టిన 36 ఏళ్ల వెటరన్ పేసర్ శిఖా పాండే అనూహ్య ధర పలికింది. రెండేళ్ల క్రితం భారత్ తరపున చివరి టీ20 ఆడిన ఆమె కోసం యూపీ, ఆర్‌సీబీ హోరాహోరీగా పోటీపడడం ఆశ్చర్యపరిచింది. చివరికి రూ.2.4 కోట్ల అధిక ధరకు యూపీ దక్కించుకుంది. ఈ వేలంలో ఇది మూడో అత్యధిక ధర. అలాగే భారత్ నుంచి ప్రతీకా (రూ.50 లక్షలు), రాజేశ్వరి గైక్వాడ్ (రూ.40 లక్షలు), హేమలత (రూ.30 లక్షలు), హర్లీన్ (రూ.40 లక్షలు), యాస్తిక (రూ.50 లక్షలు), క్రాంతి గౌడ్ (రూ.50 లక్షలు), స్నేహ్ రాణా (రూ.50 లక్షలు) బరిలోకి దిగనున్నారు.

జనవరి 9 నుంచి పోటీలు

వచ్చే ఏడాది జనవరి 9 నుంచి మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ జరుగనుంది. మ్యాచ్‌లన్నీ నవీ ముంబై, వడోదరలో నిర్వహించనున్నారు. సహజంగా ఫిబ్రవరి-మార్చిలో డబ్ల్యూపీఎల్ జరుగుతుంటుంది. కానీ ఈసారి స్వదేశంలోనే ఫిబ్రవరి 7 నుంచి పురుషుల టీ20 వరల్డ్‌కప్ ఉండడంతో లీగ్‌ను ముందుకు జరిపారు.

'సిరి' చరణి



వేలంలో తెలుగు క్రికెటర్లు కూడా బెర్త్ దక్కించుకున్నారు. ముఖ్యంగా మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో విశేషంగా రాణించిన ఆంధ్ర స్పిన్నర్ శ్రీచరణి రూ.1.30 కోట్ల ధర పలకడం విశేషం. తన కనీస ధర రూ.30 లక్షలే అయినప్పటికీ యూపీ వారియర్స్‌తో ఎదురైన తీవ్ర పోటీని అధిగమించి ఢిల్లీ క్యాపిటల్స్ తీసుకుంది. గత సీజన్‌లోనూ తను ఢిల్లీకే ఆడింది. ఇక ఇతర తెలుగు క్రికెటర్లలో అరుంధతి రెడ్డిని రూ.75 లక్షలకు ఆర్‌సీబీ, క్రాంతి రెడ్డిని ముంబై రూ.10 లక్షలకు, మడివాల మమతను ఢిల్లీ రూ.10 లక్షలకు, గొంగడి త్రిషను రూ.10 లక్షలకు యూపీ జట్లు తీసుకున్నాయి.

వేలంలో వెలుగులు

పేరు	ధర	జట్టు
దీప్తి శర్మ	రూ.3.20 కోట్లు	యూపీ వారియర్స్ (ఆర్‌టీఎం)
అమేలీ కెర్	రూ.3 కోట్లు	ముంబై ఇండియన్స్
శిఖా పాండే	రూ.2.40 కోట్లు	యూపీ వారియర్స్
సోఫీ డివైన్	రూ.2 కోట్లు	గుజరాత్ జెయింట్స్
మెగ్ లానింగ్	రూ.1.90 కోట్లు	యూపీ వారియర్స్
శ్రీచరణి	రూ.1.30 కోట్లు	ఢిల్లీ క్యాపిటల్స్
చినెల్లె హెన్రీ	రూ.1.30 కోట్లు	ఢిల్లీ క్యాపిటల్స్
లిచ్‌ఫీల్డ్	రూ.1.20 కోట్లు	యూపీ వారియర్స్
లారా వోల్వార్ట్	రూ.1.10 కోట్లు	ఢిల్లీ క్యాపిటల్స్
ఆశా శోభన	రూ.1.10 కోట్లు	యూపీ వారియర్స్
జార్జియా వేర్‌హామ్	రూ.1 కోటి	గుజరాత్ జెయింట్స్



స్వదేశంలో మరో టైటిల్ కోసం..

చిలీతో భారత్ ఆరంభ మ్యాచ్ నేడు | జూనియర్ హాకీ ప్రపంచ కప్

చెన్నై: పురుషుల జూనియర్ వరల్డ్ కప్ హాకీ టోర్నీ శుక్రవారం ఇక్కడ ప్రారంభం కానుంది. తొమ్మిదేళ్ల తర్వాత స్వదేశంలో టైటిల్ అందుకోవడమే లక్ష్యంగా ఆతిథ్య భారత్ బరిలోకి దిగుతోంది. ఈక్రమంలో శుక్రవారం జరిగే ఆరంభ మ్యాచ్‌లో చిలీతో తలపడుతోంది. 2016లో లఖ్‌నవూ వేదికగా జరిగిన ఈ చాంపియన్‌షిప్‌లో చివరిసారి భారత్ టైటిల్ దక్కించుకుంది. పూల్ 'బి'లో చిలీ, ఒమన్, స్విట్జర్లాండ్‌తో కలిసి భారత్ అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. వాస్తవంగా ఈ పూల్‌లో పాకిస్థాన్ కూడా ఉంది. కానీ భద్రతా కారణాలతో ఆ జట్టు వైదొలగడంతో ఒమన్‌కు స్థానం కల్పించారు. చెన్నై, మధురైలలో జరిగే ఈ టోర్నమెంట్‌లో మొత్తం 24 జట్లు తలపడుతున్నాయి.

ఒకుహారాకు తన్వీ షాక్

సయ్యద్ మోదీ బ్యాడ్మింటన్

లఖ్‌నవూ: ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్స్ రజత పతక విజేత తన్వీ శర్మ తన కెరీర్‌లోనే గొప్ప విజయం సాధించింది. సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ టోర్నీలో ప్రపంచ మాజీ చాంపియన్ నవోమి ఒకుహారాకు తన్వీ షాకిచ్చింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో 16 ఏళ్ల తన్వీ 13-21, 21-16, 21-19తో రెండో సీడ్ ఒకుహారా (జపాన్)ని చిత్తు చేసింది. 19 ఏళ్ల మన్‌రాజ్.. ప్రణయ్‌ని కంగు తినిపించి రౌండ్-8కి చేరాడు. మరో మ్యాచ్‌లో కిడాంబి శ్రీకాంత్-సనీత్ దయానంద్‌ని ఓడించి క్వార్టర్స్‌లో ప్రవేశించాడు. ఆరోసీడ్ తరుణ్ మన్నేపల్లి 16-21, 21-17, 17-21తో మిథున్ మంజునాథ్ చేతిలో ఓడాడు. పురుషుల డబుల్స్‌లో అర్జున్/హరిహరన్, మహిళల డబుల్స్‌లో గాయత్రి/ట్రీసా జంటలు కూడా క్వార్టర్‌ఫైనల్లోకి అడుగుపెట్టాయి.

ఇదో చెత్త అనుభవం

ఎయిరిండియాపై సిరాజ్ ఫైర్



న్యూఢిల్లీ: ఎయిరిండియాపై టీమిండియా పేసర్ మహ్మద్ సిరాజ్ తీవ్ర అసహనం వ్యక్తంజేశాడు. బుధవారం రాత్రి 7.25కి ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ (ఐఎక్స్ 2884) విమానంలో గువాహటినుంచి అతడు హైదరాబాద్ వెళ్లాల్సి ఉంది. అక్కడి నుంచి 4 గంటలపాటు వేచి చూసినా..పలుమార్లు విచారించినా..విమానం ఆలస్యానికి సంబంధించి ఎయిరిండియా ఎలాంటి సమాధానమూ ఇవ్వలేదని సిరాజ్ మండిపడ్డాడు. దాంతో తీవ్ర అసహనానికి లోనైన హైదరాబాదీ తనకిది చెత్త విమాన ప్రయాణ అనుభవమని తేల్చాడు. అంతేకాదు..ఈ ఎయిర్‌లైన్స్ విమానం ఎక్కొద్దని సూచించాడు. ఎయిరిండియా..జరిగిన అసౌకర్యానికి సిరాజ్‌కు క్షమాపణ చెప్పింది. ఊహించని కార్యాచరణ సమస్యల వల్ల విమానం రద్దయిందని వివరణ ఇచ్చింది.



www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

దీప్తి శర్మకు రూ.3.20 కోట్లు

డబ్ల్యూపీఎల్ వేలంలో ఆల్‌రౌండర్ టాప్

తెలుగమ్మాయి శ్రీ చరణికి కోటీ 30 లక్షలు

జనవరి 9 నుంచి డబ్ల్యూపీఎల్

II

శుక్రవారం | 28-11-2025 | Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | గుంటూరు సిటీ

ఇష్టం.. కొంచెం కష్టం

కొత్త జిల్లాలు.. మార్పుచేర్పులపై మిశ్రమ స్పందన



మార్కాపురంతో పాటు ప్రకాశం ఓకే

కానీ కనిగిరి డివిజన్‌లో కలపడంపై గిద్దలూరు నియోజకవర్గంలో వ్యతిరేకత

మదనపల్లె జిల్లాపై సర్వత్రా హర్షం

నెల్లూరుకు దూరంగా గూడూరు, వెంకటగిరి

మడకశిర డివిజన్‌పై సంతృప్తి

సిద్దవటం, ఒంటిమిట్ట మండలాలను అన్నమయ్యలో చేర్చడంపై అభ్యంతరం

గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాలను ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని వినతి

గత జగన్ ప్రభుత్వంలో చేపట్టిన జిల్లాల పునర్విభజన ప్రక్రియ అనేక చిక్కుముడులు తెచ్చిపెట్టింది. కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుపై చాలా చోట్ల తీవ్ర వ్యతిరేకత, అభ్యంతరాలు వచ్చాయి. వీటిని సరిదిద్దుతామని ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం కొత్తగా మూడు జిల్లాలు, ఐదు రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. ప్రభుత్వ నిర్ణయంపై కొన్ని చోట్ల హర్షం వ్యక్తమవుతుండగా, మరికొన్ని చోట్ల అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఆయా జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల కేంద్రాలకు దగ్గరగా, అనుకూలంగా ఉన్న కొన్ని నియోజకవర్గాలు, మండలాలను పక్క జిల్లాలు, ఇతర రెవెన్యూ డివిజన్లలో చేర్చడాన్ని వ్యతిరేకిస్తున్నారు. అలాగే కొన్నింటిని మార్చకపోవడంపైనా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

జిల్లాల పునర్విభజనపై ఉమ్మడి ప్రకాశం జిల్లావ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తం కాగా, గిద్దలూరు నియోజకవర్గ ప్రజలలో మాత్రం అసంతృప్తి నెలకొంది. పశ్చిమ ప్రాంత ప్రజలు కోరుకుంటున్న విధంగా మార్కాపురం కేంద్రంగా మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, యర్రగొండపాలెం నియోజకవర్గాలు కలిపి కొత్త జిల్లా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఒంగోలు, సంతనూతలపాడు, కొండపి, దర్శి నియోజకవర్గాలతో పాటు గతంలో బాపట్ల జిల్లాలో కలిపిన అద్దంకి, నెల్లూరు జిల్లాలో చేర్చిన కందుకూరు నియోజకవర్గాలను తిరిగి ప్రకాశం జిల్లాలో చేర్చారు. అలాగే ఈ జిల్లాలో అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ చేసి అందులో దర్శి, అద్దంకి నియోజకవర్గాలను చేర్చారు. ఈ మేరకు ప్రభుత్వ నిర్ణయంపై అన్ని ప్రాంతాల్లోనూ సానుకూలత వ్యక్తం అవుతోంది. అయితే కొత్తగా ఏర్పాటు చేస్తున్న మార్కాపురం జిల్లాలో డివిజన్ల ఏర్పాటు విషయంలో గిద్దలూరు ప్రాంతవాసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు మార్కాపురం డివిజన్‌లో ఉన్న గిద్దలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాలను తాజా ప్రతిపాదనలో దూరంగా ఉన్న కనిగిరి డివిజన్‌లోకి మార్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. గిద్దలూరులోని ఆరు మండలాలు జిల్లా కేంద్రమైన మార్కాపురానికి 25 నుంచి 65 కి.మీ. దూరంలో ఉంటాయి. అన్నింటికీ రవాణా సౌకర్యం బాగుంది. కానీ 100 కి.మీ. దూరంలో ఉన్న

మిగతా 10వ పేజీలో...

అభ్యంతరాలుంటే చెప్పండి

కొత్త జిల్లాలపై ప్రాథమిక గెజిట్‌లు విడుదల

3 కొత్త జిల్లాలు, 5 డివిజన్‌లు, ఒక మండలం ఏర్పాటు


30 రోజుల పాటు అభ్యంతరాలు, సూచనల స్వీకరణ

నేరుగా జిల్లా కలెక్టర్‌కే పంపవచ్చు

10

చంద్రబాబు హామీ ఇచ్చినా..

మదనపల్లె జిల్లాలో పుంగనూరు నియోజకవర్గంలోని పుంగనూరు, చౌడేపల్లె, సదుం, సోమల మండలాలను కలపడంపై ఆ ప్రాంత ప్రజలు సానుకూలంగా స్పందిస్తున్నారు. రొంపిచెర్ల, పులిచెర్ల మండలాలను చిత్తూరు జిల్లాలో కొనసాగిస్తుండగా, పులిచెర్ల మండల ప్రజలు దీన్ని స్వాగతిస్తున్నారు. రొంపిచెర్ల వాసులు మాత్రం.. తమకు పక్కనే ఉన్న పీలేరు రెవెన్యూ కేంద్రంలో కాకుండా చిత్తూరులో ఉంచడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో ఉన్న నగరి, నిండ్ర, విజయపురం మండలాలను తిరుపతి జిల్లాలో కలిపేస్తామని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు. తిరుపతిలో కలపాలని క్యాబినెట్ సబ్ కమిటీ కూడా సిఫారసు చేసింది. కానీ అమలు కాలేదు. దీంతో ఆ మూడు మండలాల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



అమరావతిలోని టీటీడీ ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల శిలా ఫలకాన్ని ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు. చిత్రంలో.. టీటీడీ ఈవో సింఘాల్, ఎమ్మెల్యే శ్రవణ్, మంత్రులు నారాయణ, మనోహర్, ఆనం, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తదితరులు.

అమరావతి ఆర్థిక హబ్!

నేడు 15 బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు శంకుస్థాపన

రాష్ట్రస్థాయి కార్యాలయాలు అమరావతిలో నిర్మాణం

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ శంకుస్థాపన

పాల్గొననున్న ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం

ఎల్ఐసీ, ఎస్‌బీఐ, ఎన్ఐఏసీఎల్‌తో పాటు పలు బ్యాంకుల కార్యాలయాలు

కొలువుదీరనున్న 6,514 మంది ఉద్యోగులు

రాజధానిలో ఫైనాన్స్ డిస్ట్రిక్ట్ పనులు వేగవంతం

మూడు విభాగాలుగా 27.8 ఎకరాలు కేటాయింపు

సిబ్బంది నివాసాలకు 11.5 ఎకరాలు

రాజధానికి రానున్న సంస్థలు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నాబార్డ్, ఏపీ గ్రామీణ బ్యాంకు, ఏపీ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, ఐడీబీఐ బ్యాంక్ లిమిటెడ్, ఎల్ఐసీ, ఎన్ఐఏసీఎల్

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అమరావతికి ఇది కొత్త జోష్! 'రాజధాని'కి సరికొత్త కళ! ఇప్పటిదాకా 'ఆంధ్రప్రదేశ్'లో ఎక్కడెక్కడో, అసలు ఉన్నాయో లేదో తెలియని జాతీయ బ్యాంకుల రాష్ట్ర కార్యాలయాలకు అమరావతి చిరునామా అవుతోంది. శుక్రవారం ఒకే రోజు, ఒకేసారి 15 బ్యాంకులు, ఆర్థిక సంస్థలు తమ కార్యాలయాల నిర్మాణాలను అమరావతిలో

మిగతా 10వ పేజీలో...



విశాఖకు డేటా సెంటర్ల వెల్లువ

ఇప్పటికే సిద్ధమైన పలు సంస్థలు

తాజాగా అదే బాటలో రిలయన్స్ కంపెనీ

ప్రభుత్వంతో సంప్రదింపుల్లో మరికొన్ని

సబ్‌సీ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ముందుకొచ్చిన 'మెటా'

ఇప్పటికే 3.65 గిగావాట్లకు ఒప్పందాలు

రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం

పలు కంపెనీలకు భూకేటాయింపు పూర్తి

ప్రపంచ ప్రసిద్ధి చెందిన గూగుల్ అమెరికా వెలుపల అతి పెద్ద పెట్టుబడి రూ.1.35 లక్షల కోట్లతో ఒక గిగావాట్ సామర్థ్యంతో ఏఐ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుకు ఇప్పటికే ముందుకొచ్చింది. తాజాగా రిలయన్స్ సంస్థ ఒక గిగావాట్ సామర్థ్యంతో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తామని పేర్కొంది. ఇక, సిఫీ టెక్నాలజీస్ సంస్థ 550 మెగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేసింది.



గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేయనున్న తర్లువాడ ప్రాంతం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

తీర ప్రాంత నగరం 'విశాఖ' డేటా సెంటర్ల హబ్‌గా మారనుంది. విశాఖపట్నాన్ని గ్లోబల్ డేటా సెంటర్‌గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. కేవలం ఏడాది కాలంలోనే అర డజనుకు పైగా సంస్థలు నగరంలో కృత్రిమ మేధ (ఏఐ)తో కూడిన హైపర్ స్కేల్ డేటా సెంటర్ల ఏర్పాటుకు ముందుకు వచ్చాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా వీటిని అతి తక్కువ వ్యవధిలో సాకారం చేయడానికి

మిగతా 12వ పేజీలో...

తిరుమలను తలపించేలా ఆలయం

రూ.260 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఆ దేవదేవుడి సంకల్పంతోనే రాజధానికి ఆ పేరు

భూములిచ్చిన రైతులకు కృతజ్ఞతాభివందనాలు

ఆయనకు అప్రతిష్ఠ తెచ్చే పనిచేయను: ముఖ్యమంత్రి

గుంటూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): 'తిరుమలలోని శ్రీవారి ఆలయాన్ని తలపించేలా రాజధాని అమరావతిలో ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం. దీనికోసం కృష్ణానది పక్కన 25 ఎకరాల స్థలాన్ని కేటాయించాం. రూ.260 కోట్లతో చేపట్టిన నిర్మాణాలను రెండున్నరేళ్లలో పూర్తిచేయాలి' అని టీటీడీని సీఎం చంద్రబాబు కోరారు. అమరావతిలోని వెంకటపాలెం గ్రామంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. గురువారం ఉదయం 10.55 నుంచి 1.30 గంటల మధ్య ద్వితీయ చతుర్ద్వార మహా ప్రాకారం, మాడ వీధులు, అన్నదాన కాంప్లెక్స్ నిర్మాణానికి సీఎం భూమిపూజ చేశారు. ఇందులో

మిగతా 11వ పేజీలో...

అమరావతిలో అద్భుత అభివృద్ధి

భూముల ధరలు పెరుగుతాయ్: సీఎం

రాజధాని రైతులతో సమావేశం

రిటర్నబుల్ ప్లాట్లను అమ్ముకోవద్దు

బిట్స్ పిలానీ, క్వాంటమ్ వ్యాలీ వస్తున్నాయ్

'రాజధాని' నోటిఫికేషన్ ఇవ్వాలని కేంద్రాన్ని కోరాం

12

క్యాపిటల్ గెయిన్స్ గడువు పొడిగింపుపైనా మాట్లాడతాం

అమరావతి రైతులకు న్యాయం చేయడం నా బాధ్యత: చంద్రబాబు

ఎస్సీలకు పదోన్నతుల్లో వర్గీకరణ

కేటగిరీ -1కి 1 శాతం

కేటగిరీ -2 కి 6.5, కేటగిరీ -3కి 7.5%

10

మహిళలకు 33.3 శాతం సమాంతర రిజర్వేషన్లు

డిసెంబరు 5న మెగా పీటీఎం

10

దాతలు, పూర్వ విద్యార్థులు, నేతలకు భాగస్వామ్యం

వైట్‌హౌస్ వద్ద కాల్పుల కలకలం

నేషనల్ గార్డులపై అఫ్గాన్ జాతీయుడి కాల్పులు

8

ఇద్దరికి తీవ్ర గాయాలు



'టీటీడీ'లో తొలి అరెస్టు

కల్తీ నెయ్యి కేసులో అప్పటి ప్రొక్యూర్‌మెంట్ జీఎం సుబ్రమణ్యం అదుపులోకి..



తిరుపతిలో అరెస్టు.. నెల్లూరు ఏసీబీ కోర్టుకు

డిసెంబరు 10 వరకు రిమాండ్

11

వైవీ పీఏ చిన్న అప్పన్న లింకులో సుబ్రమణ్యం

నెయ్యి సరఫరాదారుల వివరాలు చేరవేత

'భోలేబాబా' నెయ్యి కల్తీ అని తేలినా గప్‌చుప్

ప్రతిఫలంగా రూ.లక్షలు సుబ్రమణ్యం చేతికి..

కేసులో ఏ 29గా చేర్చిన సిట్ అధికారులు

'లై డిటెక్టర్' పరీక్షకు సిద్ధం

గత పదేళ్లలో నెయ్యి సరఫరాపై విచారణ చేపట్టాలి

నేడు సీఐడీ విచారణకు వెళ్తా: వైవీ సుబ్బారెడ్డి

9

దుబాయ్‌లో ఆస్తులు ఎలా వచ్చాయ్?

12

విదేశాల్లో పెట్టుబడుల సొమ్ము ఎక్కడిది..

ఐదేళ్లలో ఆరు కంపెనీలు దేనికోసం సృష్టించారు

ఆ కంపెనీల్లో లావాదేవీల వెనుక వాస్తవం ఏంటి?

జగన్ మాజీ జైలు మేట్ సునీల్‌రెడ్డికి సిట్ ప్రశ్నలు

అధికారులకు సహకరించని జగన్ సన్నిహితుడు

సాగునీటి ప్రాజెక్టులపై కేంద్రాన్ని ఒప్పించండి

11



టీడీపీపీ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

టీడీపీ ఎంపీలకు చంద్రబాబు ఆదేశం

కృష్ణా-గోదావరి జలాల్లో రాష్ట్ర వాటాపై గళం విప్పండి

రైతుల సమస్యలనూ ప్రస్తావించండి: సీఎం

కృష్ణా జలాల్లో వివక్షకు ఆధారాలు చూపాల్సిందే

తెలంగాణకు ఏపీ సీనియర్ న్యాయవాది స్పష్టీకరణ

ఏడాదిగా పెండింగులోనా?

చట్టాలు చేసేవారు చట్టం కంటే అధికులేం కాదు

ఎమ్మెల్సీ జయమంగళ రాజీనామా లేఖపై నాలుగు వారాల్లో విచారణ ముగించండి

నిర్ణయం వెల్లడించి ఆయనకూ తెలియజేయండి

మండలి చైర్మన్ మోషేన్ రాజుకు హైకోర్టు ఆదేశం

రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్నవారి నిర్ణయాలు రాజ్యాంగ స్ఫూర్తిని పెంపొందించేలా ఉండాలి

విచారణకు రావాలని ఏడాది తర్వాత నోటీసివ్వడం సమర్థనీయం కాదు

మీ చర్య 33వ రాజ్యాంగ సవరణ స్ఫూర్తికి విరుద్ధం

విచారణ ప్రక్రియను దుర్వినియోగం చేయడమే: న్యాయమూర్తి

12



8

కూలుతున్న భవిష్యత్ తరం!

విద్యార్థుల్లో పెరుగుతున్న ఆత్మహత్యలు

42 నిమిషాలకు ఒక విద్యార్థి బలవన్మరణం

ర్యాంకులకు పోటీ, సుదీర్ఘ స్టడీ అవర్స్, ఒత్తిడి, నిరాశలో కూరుకుపోవడమే కారణాలు

గేమ్‌చేంజర్ ఎస్-400

మరో ఐదు గగనతల రక్షణ వ్యవస్థల కొనుగోలుకు భారత్ సిద్ధం

8

10 వేల కోట్లతో క్షిపణుల కొనుగోలు

63 వేల కోట్లతో సుఖోయ్-30 ఆధునీకరణ

మోదీ, పుతిన్ మధ్య రక్షణ ఒప్పందాలకు చాన్స్

దూసుకొస్తున్న దిత్వా

రాష్ట్రానికి మరో తుఫాన్ ముప్పు

7

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను

30న తమిళనాడు, దక్షిణ కోస్తాంధ్ర మధ్య తీరంపైకి

నేటి నుంచి 4 రోజులు భారీ వర్షాలు

రేపు, ఎల్లుండి పలు జిల్లాల్లో అసాధారణ వర్షపాతం



ఓ పునరావాస శిబిరంలో బాధితులు

ప్రాణాలు బుగ్గి

హాంకాంగ్ అగ్ని ప్రమాద ఘటనలో

83కు పెరిగిన మృతుల సంఖ్య

300 మందికి పైగా ఆచూకీ గల్లంతు

కొనసాగుతున్న సహాయక చర్యలు

8

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మళ్లీ శాంతి దౌత్యాలు

రేపోమాపో ఉక్రెయిన్ యుద్ధం ఆగిపోతుందంటూ మళ్ళీ హడావుడి మొదలైంది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తిరిగి తీవ్రంగా శాంతి ప్రయత్నాలు ఆరంభించారు. ట్రంప్ విరచిత ఒప్పందానికి ఇప్పటికే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సరేనన్నారనీ, రష్యా అధినేత పుతిన్‌కూడా తలూపారని ప్రచారం జరుగుతోంది. చర్చలు జరపడానికి అభ్యంతరం అక్కరలేదని అంటూనే, ఉక్రెయిన్ ఏమాత్రం తలెగరేసినా యుద్ధక్షేత్రంలో జవాబు చెప్పడానికి తాను సర్వసన్నద్ధంగా ఉంటానని పుతిన్ అంటున్నారు. ట్రంప్ మధ్యవర్తిత్వంలో, మార్గదర్శకత్వంలో తయారైన శాంతిముసాయిదా ఉభయపక్షాల మధ్య చర్చలకు ఉపకరిస్తుందే తప్ప, అదే పునాది కాబోదని కూడా పుతిన్ అంటున్నారు. అక్రమంగా ఉక్రెయిన్ అధ్యక్షుడైన జెలెన్‌స్కీతో ఒకవేళ తాను ఒప్పందం కుదర్చుకుంటే అది సక్రమమెలా అవుతుందని కూడా పుతిన్ అడుగుతున్నారు. గతంలో శ్వేతసౌధంలో ఇదేవ్యాఖ్యతో అవమానించిన జెలెన్‌స్కీనే ఈమారు ట్రంప్ శాంతిసాధనకోసం ఎక్కువగా నమ్ముకున్నారు.

రేపోమాపో యుద్ధం ఆగుతుందన్న స్థాయిలో ట్రంప్ వ్యాఖ్యలు ఉంటాయి. పుతిన్ మాత్రం ఎప్పటిలాగానే చిరునవ్వుతోనే తాను అన్నదీ, అనుకున్నదే చేస్తారు. ఉక్రెయిన్ బలగాలు తాము ఉన్న, తమ అధీనంలో ఉన్న ప్రాంతాలను విడిచిపెట్టిపోతేనే యుద్ధం ఆగుతుందంటున్నారు పుతిన్. యుద్ధక్షేత్రంలో రష్యా సాధించిన విజయాలు, రేపటిరోజుల్లో దాని ప్రయోజనాల పరిరక్షణ పునాదిగానే ఒప్పందం ఉండాలన్నారు ఆయన. ఒప్పందం కుదరకపోతే ఎంతకాలమైనా చక్కగా యుద్ధం చేసుకుంటానని ఆ వ్యాఖ్యల సారాంశం. ట్రంప్ కొత్త ప్రణాళికకు ఉక్రెయిన్ అంగీకరించిందనీ, ఏవో కొన్ని చిన్నచిన్న అంశాలు తేలడమే మిగిలిందని అమెరికన్ మీడియా అంటోంది. అమెరికాతో చర్చలు జరుగుతున్నాయని, ట్రంప్ కృషి అభినందనీయమైదని జెలెన్‌స్కీ కృతజ్ఞతలు కూడా చెప్పారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో అమెరికా, రష్యా బృందాల మధ్య చర్చలు విజయవంతమైనాయని, ముసాయిదాలో ఉన్న కొన్ని అంశాలమీద ఉక్రెయిన్ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని మార్పుచేర్పులు కూడా జరిగాయనీ వార్తలు వచ్చాయి. వ్యవహారం ముందుకు కదలుతోందని అనుకుంటున్న తరుణంలో ఒక వార్తాసంస్థ వదిలిన కథనం శాంతిప్రణాళికమీద కొత్త వివాదాన్ని రేపింది. ట్రంప్ ప్రతిపాదిత 28 పాయింట్ల ప్రణాళిక సృష్టికర్త రష్యా అనీ, పుతిన్ సన్నిహితుడైన కిరిల్ దిమిత్రివ్ దీని రచయితనీ ఆ కథనం సారాంశం. ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపాలంటే ఈ షరతులకు అంగీకరించాల్సిందేనంటూ అక్టోబర్‌లో అమెరికాకు రష్యా అందించినపత్రంలో ఉన్నవే ఈ ప్రణాళికలో చేరాయన్న ఆ కథనాన్ని అమెరికా ఖండించినప్పటికీ, ముసాయిదా పూర్తిగా రష్యాకు అనుకూలంగా ఉన్నదన్న యూరప్ దేశాల విమర్శల నేపథ్యంలో, ఓ తొమ్మిది అంశాలనైతే అందులోనుంచి తొలగించిందట. అయినాకూడా ఇంకా అది రష్యా పక్షానే తూగుతోందని, దానికే తలూపాలంటూ ఉక్రెయిన్ అధ్యక్షుడిని ట్రంప్ ఒత్తిడిచేస్తున్నారని వార్తలు వస్తున్నాయి.

ఉక్రెయిన్ మిలటరీ గుప్పిట్లో ఉన్న చిన్నాచితకా ప్రదేశాలతో సహా మొత్తం డాన్బాస్ ప్రాంతాన్ని రష్యాకు వదులుకోవడం ఈ ప్రణాళికలో ప్రధానం. ఉక్రెయిన్ సైనికబలం కూడా గతంలో మాదిరిగా కాక పరిమితికి లోబడి ఉంటుంది. లాంగ్‌రేంజ్ మిసైల్స్ వంటి మారణాయుధాలు ఇకమీదట ఉక్రెయిన్ కొనకూడదు, వాడకూడదు. అన్నింటికంటే ముఖ్యంగా, ఎట్టిపరిస్థితుల్లోనూ ఉక్రెయిన్ నాటోలో చేరకూడదు. తదనుగుణంగా ఆ దేశం రాజ్యాంగాన్ని సవరించుకోవాలి, అంతర్జాతీయ సమాజానికి హామీ పడాలి. యుద్ధం మొదలవడానికి అసలు కారణం ఇదే కనుక రష్యా ఈ విషయంలో పట్టుదలపట్టడంలో ఆశ్చర్యమేమీ లేదు. మూడుదశాబ్దాల క్రితం ఇచ్చిన హామీని వమ్ముచేస్తూ నాటో అతివేగంగా తన చుట్టూ విస్తరించడం రష్యాకు అభద్రతను పెంచింది, అవమానం కలిగించింది. ఉక్రెయిన్ అధ్యక్షుడిగా జెలెన్‌స్కీ రాక, పశ్చిమదేశాల తోడ్పాటుతో అతడి వీరంగాలు ఒకదశదాటి సహించలేక రష్యా కయ్యానికి కాలుదువ్వింది. ఇకపై విస్తరించనని నాటో మాట ఇస్తే, రష్యా కూడా అందరి క్షేమానికీ హామీ పడుతుందని పుతిన్ అంటున్నారు. యుద్ధక్షేత్రంలో సాధించిన విజయాలను నిలుపుకోవడంతోపాటు, భవిష్యత్తులో పశ్చిమదేశాలనుంచి తనకు ఏ ప్రమాదమూ ఉండదన్న భరోసా ఏర్పడినప్పుడే రష్యా ఏ ఒప్పందానికైనా సిద్ధపడుతుంది. ఈ విషయంలో ట్రంప్ ముసాయిదా రష్యా పక్షాన ఎంతమేరకు తూగిందన్నది ప్రధానం.

ప్రతి కార్మికుడికీ గౌరవం కల్పించాలన్న ఎన్డీయే సర్కారు హామీతో కొత్త కార్మిక స్మృతులు దేశంలో అమల్లోకి వచ్చాయి.
ఈ కోడ్‌లతో కార్మికులందరికీ కనీస వేతనాలు లభిస్తాయి.
యువతకు నియామక పత్రాలు అందుతాయి.
మహిళలకు సమాన వేతనం, గౌరవం లభిస్తుంది.
40 కోట్ల మంది కార్మికులకు సామాజిక భద్రత లభిస్తుంది.

శ్రామిక చట్టాలకు నూతన శకం

మన దేశంలో 1930–50 మధ్య రూపొందించిన కార్మిక చట్టాలే నేటికీ అమలులో ఉన్నాయి. సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న భారతదేశంలో ప్రస్తుత తరానికి ఆ చట్టాలు సరిపోవు. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం మన దేశంలో శ్రామిక చట్టాలకు కొత్త శకం ఆరంభమైంది. కేవలం చారిత్రక సంస్కరణ మాత్రమే కాదు, దేశంలోని ప్రతి శ్రామికుడికి గౌరవాన్ని, భద్రతను కల్పించే దిశగా ఎన్డీయే ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోవడం హర్షణీయం. ఇప్పటి వరకు ఉన్న 29 పాత కార్మిక చట్టాలను సరళతరం చేస్తూ, దేశంలోని 40 కోట్ల మందికి పైగా కార్మికులకు కనీస వేతనం, సామాజిక భద్రత, గ్రాట్యుటీ వంటి కీలక ప్రయోజనాలకు హామీ లభిస్తున్నది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ చరిత్రాత్మక నిర్ణయంతో కార్మికుల జీవితాల్లో వెలుగులు ప్రసరించనున్నాయి. నూతన చట్టాల వల్ల కీలక మార్పులతో అందరికీ సాంఘిక భద్రత చేకూరనుంది. అసంఘటిత రంగం, గిగ్ వర్కర్లు, ప్లాట్‌ఫామ్ వర్కర్ల వంటి వర్గాలకు కూడా రక్షణ పొందే అవకాశం లభించింది.

ఇప్పటి వరకు అమల్లో ఉన్న కార్మిక చట్టాలను సమీక్షించిన కేంద్ర ప్రభుత్వం తాజాగా నాలుగు కొత్త లేబర్ కోడ్‌లను ప్రకటించింది. వేతనాల కోడ్–2019, సామాజిక భద్రతా కోడ్–2020, పారిశ్రామిక సంబంధాల కోడ్–2020, వృత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్–2020 ఇందులో ఉన్నాయి. ఇవి ఈ నెల 21 నుంచి అమల్లోకి వచ్చాయి. అన్ని రంగాలకూ ఇవి వర్తిస్తాయని, కార్మికుల భద్రత మెరుగుపర్చడానికి, అలసటను తగ్గించడానికే కాక భద్రత, అదనపు ప్రయోజనాలు లభిస్తాయని కేంద్రం చెబుతోంది. నూతన కార్మిక చట్టాలతో పరిశ్రమలకు సరళీకృత విధానాలు, పెట్టుబడులు, ఉత్పత్తి, ఉద్యోగావకాశాలు పెరిగేలా వ్యవస్థను రూపొందించారు.

దేశంలోని 40 కోట్ల మంది, ముఖ్యంగా ఏపీలోని సంఘటిత, అసంఘటిత రంగాల్లోని లక్షలాది మంది కార్మికులకు కనీస వేతనం, సామాజిక భద్రత, గ్రాట్యుటీ వంటి కీలక ప్రయోజనాలు ఈ నూతన కార్మిక చట్టాలతో లభించనున్నాయి. తాజా కోడ్‌లలో మహిళలకు హక్కులు, భద్రతను మరింత పెంచడం, ప్రమాదకరమైన ప్రాసెసింగ్ కేంద్రాలు సహా, దేశవ్యాప్తంగా అన్ని చోట్లా ఈఎస్ఐ సౌకర్యం కల్పించడం, సింగిల్ రిజిస్ట్రేషన్, లైసెన్స్, రిటర్న్ వ్యవస్థలు ఏర్పాటు చేయడం వంటి ప్రధాన సంస్కరణలు ఉన్నాయి. ఈ నాలుగు స్మృతులతో ఉపాధిని సంఘటితం చేయడం, కార్మికుల సంరక్షణను బలోపేతం చేయడం, కార్మిక నిర్వహణ వ్యవస్థను సులభతరం, సురక్షితం చేయడంతో పాటు అంతర్జాతీయంగా అనుసంధానించవచ్చు.



కొత్త కార్మిక నియమావళి ప్రకారం అతిపెద్ద మార్పులలో ఒకటి: రోజువారీ పని పరిస్థితులు. ఉద్యోగులు ఎంతకాలం పనిచేస్తారు, వారు ఎప్పుడు వేతనంతో కూడిన సెలవులకు అర్హులు, వారు ఎంత ఓవర్ టైం తీసుకోవచ్చు, వారు ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలకు అర్హులు... వంటివి ఈ వ్యవస్థ నిర్ణయిస్తుంది. ఇప్పటివరకు, ఉద్యోగులు వార్షిక వేతనంతో కూడిన సెలవుకు అర్హత సాధించడానికి ముందు ఒక క్యాలెండర్ సంవత్సరంలో 240 పని దినాలను పూర్తి చేయాల్సి ఉండేది. కొత్త కోడ్‌లు ఆ అవసరాన్ని 180 రోజులకు తగ్గించాయి. అంటే ఇప్పుడు ఒక కార్మికుడు ఏడాదిలో చాలా ముందుగానే సెలవుకు అర్హుడు అవుతాడు. ఇది తయారీ, వస్త్రాలు, రిటైల్, నిర్మాణం, హాజరు నియమాలు సంప్రదాయకంగా కఠినంగా ఉండే ఇతర రంగాలలోని వారికి పెద్ద మార్పు అని చెప్పవచ్చు. దీని వలన కార్మికులకు మరింత విశ్రాంతి దొరుకుతుంది. ఇది దీర్ఘకాలంలో ఉత్పాదకతతో పాటూ ఉద్యోగ సంతృప్తిని మెరుగుపరుస్తుంది.

కొత్త కోడ్‌ల ప్రకారం రోజుకు ఎనిమిది గంటలు, వారానికి 48 గంటలు పని చేయాలనే నియమం అలానే ఉంటుంది. కానీ వాటిని ఎలా ఏర్పాటు చేసుకోవచ్చనేది మాత్రం మారుతుంది. అంటే, దీనిని వారంలో నాలుగు రోజులు– 12 గంటలు, వారంలో అయిదు రోజులు– దాదాపు 9.5 గంటలు, వారంలో ఆరు రోజులు– రోజుకు ఎనిమిది గంటల కింద విభజించుకోవచ్చును. దీంతో పాటూ ఓవర్ టైమ్ పరిమితిని స్థానిక అవసరాల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వాలు సొంత పరిమితులను నిర్ణయించుకోవచ్చు.

కొత్త కోడ్‌లలో మరో ప్రధాన మార్పు– ఆరోగ్యం, వైద్య కవరేజ్. 40 ఏళ్లు పైబడిన ప్రతి ఉద్యోగికి ఇప్పుడు ఉచిత వార్షిక ఆరోగ్య తనిఖీ లభిస్తుంది. ముఖ్యంగా ఎక్కువ గంటలు, ప్రమాదకర వాతావరణం లేదా శారీరక ఒత్తిడి ఉండే రంగాలల్లోని కార్మికుల ఆరోగ్య సంరక్షణకు ఇది ఉపకరిస్తుంది. తోటల కార్మికులకు గతంలో ఒకే విధంగా అందుబాటులో లేని ESIC వైద్య సౌకర్యాలు ప్రస్తుతం అందుబాటులో ఉంటాయి.

ప్రతి కార్మికుడికీ గౌరవం కల్పించాలన్న ఎన్డీయే సర్కారు హామీతో కొత్త కార్మిక స్మృతులు దేశంలో అమల్లోకి వచ్చాయి. ఈ కోడ్‌లతో కార్మికులందరికీ కనీస వేతనాలు లభిస్తాయి, యువతకు నియామక పత్రాలు అందుతాయి. మహిళలకు సమాన వేతనం, గౌరవం లభిస్తుంది. 40 కోట్ల మంది కార్మికులకు సామాజిక భద్రత లభిస్తుంది. ఫిక్స్‌డ్ టర్మ్ ఉద్యోగులకు ఏడాది పనిచేసిన తర్వాత గ్రాట్యుటీ వంటివి దక్కుతాయి. ఈ సంస్కరణలు సాధారణమైన మార్పులు కాదు. కార్మికుల సంక్షేమం కోసం ఎన్డీయే ప్రభుత్వం తీసుకున్న అతిపెద్ద చర్య. స్వయం సమృద్ధ భారత్ దిశగా కీలక ముందడుగు. 2047 కల్లా అభివృద్ధి చెందిన భారత్‌గా నిలవాలన్న లక్ష్యానికి ఊతమని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.



• వాసంశెట్టి సుభాష్
రాష్ట్ర కార్మికశాఖ మంత్రి

బంధమా, బతుకా.. దాంపత్యంలో ఏది ముఖ్యం?

ప్రయాగ్‌రాజ్ (అలహాబాద్) హైకోర్టు ఇటీవల ఇచ్చిన ఒక తీర్పు హిందూ మహిళలకు భారత రాజ్యాంగ నీతి పూర్తిగా వర్తించే స్థితి ఇంకా ఏర్పడలేదని చాటుతున్నది. వివాహబంధంలో ఉండగా భర్త నుంచి విడిపోయి వేరొక పురుషునితో సహజీవనం చేస్తున్న మహిళకు ఆ మాజీ భర్త నుంచి, అతడి తరపు పోలీసు జోక్యం నుంచి రక్షణ కల్పించడానికి తిరస్కరిస్తూ నవంబర్ 15న ప్రయాగ్‌రాజ్ హైకోర్టు తీర్పు చెప్పింది. పురుషాధిక్య ఆధిపత్య భావజాల స్ఫూర్తితో రూపొందిన 1955 నాటి హిందూ వివాహ చట్టాన్ని ఉల్లంఘించడం సాధ్యం కాదని ఈ తీర్పు అర్థం. భర్తల దుర్మార్గం నుంచి రక్షణ కోసం, వైవాహిక 'జైలు' నుంచి తప్పించుకొని పారిపోయేవారిని మెడపట్టుకొని తిరిగి ఆ జైలుకే పంపించడం మానవీయమా?

"వర్ణానికి వర్ణానికి మధ్య, స్త్రీ పురుషుల మధ్య (జెండర్ల మధ్య) అసమానత హిందూ సమాజం ఆత్మ. దానిని విడిచిపెట్టి ఆర్థిక సమస్యలకు సంబంధించిన చట్టాలు చేసుకొంటూపోవడం రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమే. పేడకుప్ప పైన మేడ కట్టడమే," అని అంబేద్కర్ తన హిందూ కోడ్ బిల్లును పార్లమెంట్ తిరస్కరించినప్పుడు మంత్రి పదవి నుంచి తప్పుకొంటూ సమర్పించిన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. మహిళను విముక్తం చేయడమన్న తన లక్ష్యం నెరవేరనందుకు నిరసనగానే అంబేద్కర్ రాజీనామా చేశారు.

సంప్రదాయ హిందూ సమాజంలో మహిళది రెండవ స్థాయి పౌరసత్వమే. దాని నిర్మాణం ప్రకారం ఆమె బతుకు ఆశయం పురుషుడి అడుగులకు మడుగులొత్తడమే. మన దేశాన్ని ఇప్పుడు పరిపాలిస్తున్న శక్తుల గురువైన ఆరెస్సెస్ సంస్థ అధినేత మోహన్ భగవత్ చెప్పిన ధర్మ సూత్రమూ ఇదే. భర్తకు సేవ చేయడమే భార్య పని అని 2013 జనవరిలో ఆయన స్పష్టంగా చెప్పారు. పురుషునితో ఆమెకు గల సామాజిక ఒప్పందం ప్రకారం ఆమె ఇంటి పనులకి పరిమితం కావాలి. పురుషుడు బయటి బాధ్యతలు చూసుకుంటూ ఉండాలి. ఇలా ఇంటి ఇంతిగా ఆమె అతడిని సంతృప్తిపరచడంలో విఫలమైన వెంటనే ఆమె పోషణ బాధ్యత నుంచి అతడు తప్పుకోవచ్చని, అక్కడితో భార్య భర్తల మధ్య సామాజిక కాంట్రాక్టు ముగిసిపోతుందని భగవత్ అభిప్రాయపడ్డారు. ఆడవారిపై లైంగిక అత్యాచారాలు దేశంలోని గ్రామీణ ప్రాంతాలలో అరుదుగాను, పట్టణ ప్రాంతాలలో తరచుగానూ సంభవిస్తున్నాయని ఆయన అంతకు ముందు అన్నారు. అంటే సంప్రదాయ సమాజం గట్టిగా వేళ్ళూనుకుని ఉన్న గ్రామాల్లోనే మహిళ సురక్షితంగా బతుకుతున్నదని, ఆధునిక పురోగామి పట్టణ సమాజంలోనే ఆమెకు భద్రత కరువైందని ఆయన నొక్కి వక్కాణించారన్నమాట. పురాతన హిందూ సమాజం ఈ విలువలనే ఇప్పటికీ పాటిస్తున్నది. హిందూ వివాహచట్టంలోని 9వ సెక్షన్ ఈ పునాదుల పైనే నిర్మితమైంది.



భార్య, భర్త విడిపోయిన తర్వాత ఒకరిపై ఒకరు దాంపత్య హక్కుల పునరుద్ధరణను కోరుతూ కోర్టుకు వెళ్లే అవకాశాన్ని హిందూ వివాహ చట్టంలోని 9వ సెక్షన్ ఉభయులకూ కల్పిస్తున్నది. ఆయా పరిస్థితులను పరిశీలించి కోర్టు ఆ హక్కును పునరుద్ధరించవచ్చునని పేర్కొంటున్నది. వైవాహిక అక్రమ వర్తనకు పాల్పడి భాగస్వామికి దూరంగా బతుకుతుంటే అటువంటి భార్య లేదా భర్తపై తనకుగల లైంగికత సహా సంపూర్ణ దాంపత్య హక్కును తిరిగి కల్పించాలని కోరుతూ జిల్లా కోర్టుకు వెళ్లే హక్కును 9వ సెక్షన్ కల్పిస్తున్నది. ఇది నిజానికి భార్యా భర్తా సమానులన్న అభిప్రాయం నుంచి ఉత్పన్నమైనది. కానీ వాస్తవంలో ఇప్పటికీ భర్తది పైచేయి, భార్యది కింది చేయిగానే ఉన్నది. భర్తతో బాటు అతడి తల్లి, తండ్రి, సోదరులు, ఆడపడుచులు కూడా ఆమెపై పెత్తనాన్ని, హింసాయుతమైన అణచివేతను అమలు చేస్తున్నారు. అందుచేత భార్య తనకు దూరమైన తన భర్తను తిరిగి తన దగ్గరకు చేర్చుకొనేలా దాంపత్య హక్కు పునరుద్ధరణను అర్థించడానికి, అదే పనిని భర్త స్థానంలోని వ్యక్తి చేయడానికి చాలా తేడా ఉంది.

రాజ్యాంగం హామీ ఇస్తున్న వ్యక్తిగత, జీవన స్వేచ్ఛలు తిరుగులేనివి కావని, విడాకులు తీసుకోనందున ఆమెపై తన మాజీ భర్తకు ఇంకా హక్కు ఉంటుందని అలహాబాద్ తీర్పు స్పష్టం చేసింది. మహిళ తాను కోరుకొన్నట్టు వేరొకరితో ఉండాలీ అనుకొంటే భర్త నుంచి విడాకులు తీసుకోవాలని ఆ మహిళకు దిక్కు చూపింది. హిందూ వివాహ చట్టం 9వ సెక్షన్ మహిళకు శాపం వంటిదని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.ఎ.చౌదరి 1983 జులైలో చలన చిత్ర నటి సరిత, వెంకటసుబ్బయ్య కేసులో తీర్పు ఇచ్చారు. ఈ సెక్షన్‌ను రద్దు చేస్తూ, ఇది జంటల వ్యక్తిగత గోప్యత హక్కును కాలరాస్తున్నదని, వివాహ బంధాన్ని కాపాడే నెపంతో పౌరుల ప్రాథమిక హక్కులను హరిస్తున్నదని జస్టిస్ చౌదరి తన తీర్పులో స్పష్టం చేశారు. అయితే జస్టిస్ చౌదరి విప్లవాత్మక తీర్పును సుప్రీంకోర్టు ఆ తర్వాత రద్దు చేసింది. అప్పటి నుంచి వివిధ కోర్టులు వివాహిత మహిళలకు విషం వంటి ఈ 9వ సెక్షన్‌ను ఆమె చేత బలవంతంగా తాగిస్తున్నాయి.

పెళ్లి అనే వ్యవస్థను కాపాడాలని, భార్యాభర్తలు ఆ బంధానికి జీవిత కాలమంతా కట్టుబడి ఉండాలని 9వ సెక్షన్ కోరుతున్నది. కాని మహిళ అక్షరాస్యతలోనే కాదు విద్యాబుద్ధులు, ఆధునిక నిపుణతలలోనూ పురుషునితో సమానమైన స్థాయికి చేరుకొంటున్న వర్తమానంలో ఇష్టంలేని మగవానితో కలిసి కాపురం చేయవలసిన అగత్యాన్ని ఆమె ధైర్యంగా ఎదిరిస్తోంది. అసలు పెళ్లినే కాదని ఇష్టపూర్వక సహజీవనాన్ని సాగించే జంటల సంఖ్య పెరుగుతున్నది. చదువుకున్న, స్వతంత్ర వ్యక్తిత్వమూ చైతన్యమూ గల పలువురు స్త్రీలు సంప్రదాయ వివాహ వ్యవస్థను తృణీకరిస్తున్నారు. ఒంటరి జీవనాన్ని కోరుకొనే మహిళలు ఎక్కువవుతున్నారు. వివాహేతర సహజీవన బంధం అక్రమమైనది, న్యాయవిరుద్ధమైనది కాదని కూడా సుప్రీంకోర్టు నిర్ధారించింది. సహజీవన జంటలకు పుట్టే పిల్లలకు ఆస్తి హక్కు ఉంటుందని ప్రకటించింది. అందుచేత ఇష్టపూర్వక సహజీవన స్వేచ్ఛకు గల సంకెళ్ళను పటాపంచలు చేయాలి. మన సంపూర్ణ ప్రజాస్వామిక లక్ష్యాన్ని, లక్షణాన్ని కాపాడుకోవాలి.

> **పెళ్లి అనే వ్యవస్థను కాపాడాలని, భార్యాభర్తలు ఆ బంధానికి జీవిత కాలమంతా కట్టుబడి ఉండాలని 9వ సెక్షన్ కోరుతున్నది. కాని మహిళ అక్షరాస్యతలోనే కాదు విద్యాబుద్ధులు, ఆధునిక నిపుణతలలోనూ పురుషునితో సమానమైన స్థాయికి చేరుకొంటున్న వర్తమానంలో ఇష్టంలేని మగవానితో కలిసి కాపురం చేయవలసిన అగత్యాన్ని ఆమె ధైర్యంగా ఎదిరిస్తోంది.**

▪ గార శ్రీరామమూర్తి
సీనియర్ జర్నలిస్ట్

వాలిడేషన్ బిల్లుతో
పెన్షనర్లకు వేదన

మనదేశంలో ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం పొందే పెన్షన్ వారి జీవిత భద్రతకు, గౌరవానికి ఆధారం. ఇది కేవలం ఒక ఆర్థిక లావాదేవీ కాదు; ప్రభుత్వ సేవకు అంకితమైన జీవితానికి గుర్తింపు. కానీ గత 21 సంవత్సరాలుగా పెన్షన్ వ్యవస్థలో సంభవించిన మార్పులు ఉద్యోగులలో గందరగోళాన్ని, అస్థిరతను కలిగించాయి. నేడు పాత పెన్షన్ పద్ధతి (ఓపీఎస్), కాంట్రిబ్యూటరీ పెన్షన్ (సీపీఎస్) గ్యారెంటీడ్ పెన్షన్ (జీపీఎస్) అనే మూడు వ్యవస్థలు వర్తిస్తున్నాయి. ఇప్పటికే మూడు రకాల పెన్షన్ వ్యవస్థలు ఉన్న ఈ సమయంలో, కేంద్రం కొత్తగా 'వ్యాలిడేషన్ సిస్టమ్' (పెన్షన్లకు సంబంధించి ప్రభుత్వం చేసిన చట్టాలపై కోర్టులు తీర్పులు ఇస్తాయి. ఆ తీర్పుల ఆధారంగా ఆ చట్టం అమలులో ఉండే లోపాలను కొత్త చట్టం ద్వారా సరిదిద్దుకుని, ఆ గత చర్యలను కూడా ప్రభుత్వం చట్టబద్ధం చేసే విధానం)ను ప్రవేశపెట్టడం పాత పెన్షన్ కింద ఉన్న పెన్షనర్లపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతోంది. అసమానతలను మరింత పెంచుతోంది. పెన్షనర్లు ప్రస్తుతం కూడా డియర్‌నెస్ రిలీఫ్ (DRs) సకాలంలో అందుకోలేకపోతున్నారు.

1982లో వచ్చిన 'డి.ఎస్ నకరా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో సుప్రీంకోర్టు స్పష్టంగా పేర్కొంది: 'పెన్షన్ ఉద్యోగి హక్కు; దానిని ఎలాంటి యాదృచ్ఛిక వర్గీకరణ ద్వారానూ తగ్గించరాదు. ఒకే సేవలో ఉన్నవారికి ఒకే పెన్షన్ విధానం ఉండాలి.' వ్యాలిడేషన్ బిల్లు ద్వారా ఈ తీర్పు సూత్రాలను పక్కన పెట్టడం, వృద్ధుల హక్కులను మళ్లీ ప్రభుత్వం హరించడం అవుతుంది. పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ) బకాయిలు కూడా విడుదల కాకపోవడంతో వృద్ధులు ఆవేదనకు గురవుతున్నారు.



బకాయిల చెల్లింపుల్లో ఆలస్యం, పెన్షన్ విధానాల అసమానతలు, ఇటీవల ప్రవేశపెట్టిన వ్యాలిడేషన్ బిల్లు వృద్ధుల జీవితంలో మరింత అనిశ్చితిని సృష్టిస్తున్నాయి. వారు ప్రతి నెలా ఖజానా కార్యాలయాల చుట్టూ తిరుగుతూ తమ హక్కుల కోసం పోరాడాల్సి వస్తోంది. ఈ ఆలస్యాలు కేవలం ఆర్థిక ఇబ్బందులు మాత్రమే కాదు; మానసిక వేదనకు ప్రధాన కారణం. పెరుగుతున్న జీవన వ్యయం, వైద్య ఖర్చులు, కుటుంబ బాధ్యతలు... ఇవన్నీ వారి జీవన నాణ్యతను దెబ్బతీస్తున్నాయి. వృద్ధులలో మానసిక ఒత్తిడి, నిస్పృహను పెంచుతున్నాయి.

2025 మార్చి 25న లోక్‌సభలో ఆమోదించిన 'సెంట్రల్ సివిల్ సర్వీసెస్ (పెన్షన్) నియమాలు, పెన్షన్ బకాయిల వ్యయానికి సంబంధించిన సూత్రాల చట్టం' వృద్ధుల హక్కులపై పెద్ద ఆందోళన కలిగించింది. ఈ చట్టం ప్రకారం పాత కేసుల బకాయిల చెల్లింపుల్లో ప్రభుత్వం 'గత నిబంధనల ప్రకారం' వేర్వేరు వర్గీకరణ చేయవచ్చు. ఇది 'సమాన సేవకు సమాన పెన్షన్' అనే సూత్రానికి విరుద్ధం. అంటే, ఒకే పదవిలో, ఒకే స్థాయిలో పనిచేసిన ఇద్దరు ఉద్యోగులు పదవీ విరమణ తేదీ ఆధారంగా వేర్వేరు పెన్షన్లను పొందడం చట్టపరంగా సమర్థించబడుతోంది. ఫలితంగా పాత పెన్షన్‌దారులు తక్కువ మొత్తాలు, కొత్త వర్గం ఎక్కువ మొత్తాలు పొందడం ద్వారా అసమానత మరింత పెరిగిపోతోంది. పెన్షన్ ఆలస్యం వలన వైద్య చికిత్సలు ఆగిపోవడం, కుటుంబ అవసరాలు సరిగా తీర్చలేకపోవడం వంటి సమస్యలు పెరుగుతున్నాయి. తమపై ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం వృద్ధులను వేధిస్తోంది.

పెన్షనర్లను ప్రభుత్వం భారంగా కాకుండా దేశసేవకు జీవితం అంకితం చేసిన పునాది శిలలుగా చూడాలి. వారి హక్కులను ఆలస్యం చేయడం న్యాయ విరుద్ధం మాత్రమే కాదు, మానవతా విలువలకు విరుద్ధం కూడా. పెన్షన్ బకాయిలు, సమాన పెన్షన్ హక్కు, డి.ఎస్ నకరా తీర్పును అమలు చేస్తే వృద్ధుల ఆవేదనకు ఉపశమనం కలుగుతుంది. ప్రభుత్వాలు పెన్షన్ ఖర్చును 'భారంగా కాకుండా న్యాయబద్ధమైన బాధ్యత'గా చూడాలి.

– టి.ఎం.బి.బుచ్చిరాజు

బిహార్‌లో నూతన అధ్యాయం

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు సాధించి, విజయదుందుభి మోగించిన ఎన్డీయే కూటమి, నితీశ్‌కుమార్ సారథ్యంలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. మంత్రివర్గం కూర్పు ఎంతో చక్కగా, అత్యంత సాఫీగా జరిగి, మరోవిడత పాలన మొదలైంది. బిహార్ అసెంబ్లీ ఎన్నికలు భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఒక సువర్ణాధ్యాయం. బిహార్ రాజకీయ చరిత్రలో దశాబ్దాల తరబడి వెంటాడుతున్న హింసాత్మక నీడలను చెరిపేసి, అత్యంత ప్రశాంతంగా, పారదర్శకంగా ఎన్నికలు ముగియడం ఈసీ సాధించిన విజయం.

ఒకప్పుడు ఎన్నికలు అంటేనే బిహార్ ప్రజల్లో ఒక రకమైన ఆందోళన ఉండేది. బ్యాలెట్ బాక్సులను ఎత్తుకెళ్లడం, పోలింగ్ కేంద్రాల వద్ద ఘర్షణలు, హింసాత్మక ఘటనలు సాధారణంగా కనిపించేవి. కానీ, మొన్నటి ఎన్నికలు ఈ అభిప్రాయాన్ని పూర్తిగా మార్చివేశాయి. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకపోవడం, ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ఈ ఎన్నికల ప్రత్యేకత. ఈ మార్పు బిహార్ సామాజిక, రాజకీయ పరిణితికి నిదర్శనం.

ఎన్నికలలో ప్రశాంత వాతావరణం ప్రజలలో విశ్వాసాన్ని నింపింది. దీని ఫలితమే రికార్డు స్థాయి పోలింగ్ నమోదు కావడం. కనీవిని ఎరగని రీతిలో 67.1 శాతం పోలింగ్ జరగగా, 71.7 శాతం మహిళా ఓటర్ల పోలింగ్ జరిగింది. 1951 తర్వాత బిహార్‌లో అత్యధిక ఓటింగ్ శాతం నమోదైంది 2025 ఎన్నికల్లోనే కావడం గమనార్హం. మహిళలు, వృద్ధులు, యువత అనే తేడా లేకుండా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. ఈ ఎన్నికల నిర్వహణలో ఈసీఐ సాధించిన అతిపెద్ద, చారిత్రక విజయం 'జీరో రీపోలింగ్'. సాధారణంగా సాంకేతిక లోపాలు, ఈవీఎంల మొరాయింపు లేదా అక్రమాలు జరిగినప్పుడు ఆయా కేంద్రాల్లో మళ్ళీ పోలింగ్ నిర్వహిస్తారు. కానీ, 2,616 మంది అభ్యర్థులు, 12 గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు బరిలో ఉన్నా, ఒక్కరంటే ఒక్కరు కూడా 'రీపోలింగ్' కోరకపోవడం అపూర్వం. ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితా సవరణపై ప్రతిపక్షాలు, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ అనేక అనుమానాలు వ్యక్తం చేసింది. ఓట్ల తొలగింపు లేదా 'ఓట్ చోరీ' ఆరోపణలు వచ్చాయి. అయితే, ఎన్నికలు ముగిసి ఫలితాలు వెలువడిన తర్వాత, ఓటర్ల జాబితాపై 'జీరో అప్పీల్స్' నమోదు కావడం గమనార్హం.

ఈ ఎన్నికల్లో స్వయం సేవకులు స్వచ్ఛందంగా పాల్గొని భారీ పోలింగ్‌కు సహకారం అందించారు. వీరు భాజపా తరపున ప్రచారం చేశారు. ఇంటింటికి తిరిగి మోదీ ఆయుష్మాన్ భారత్, పీఎం కిసాన్, ఉజ్వల యోజన, జల్ జీవన్ మిషన్ వంటి పథకాల లబ్ధిని వివరించారు. అలాగే బీహార్‌లో ఎన్డీఏ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి గురించి... రోడ్లు, విద్యుత్, ఆస్పత్రులు, లా అండ్ ఆర్డర్ వంటి వాటిలో మెరుగుదలను ఉదాహరణలతో వివరించారు. గత జంగిల్ రాజ్‌లో ప్రతి గ్రామంలో రోజూ కిడ్నాప్, హత్యలు, అవినీతి, మహిళలపై అత్యాచారాలతో పాటు రోడ్లు, కరెంటు, ఉద్యోగాలు లేకుండా ప్రజలు భయంతో బతికిన దుర్గతిని గుర్తు చేశారు. దాంతో పాటు ఇప్పుడు నితీష్–మోదీ డబుల్ ఇంజన్ సర్కార్ తెచ్చిన శాంతి, అభివృద్ధి, సంక్షేమాన్ని పోల్చి చూపించారు. ఈ పోలికతోనే ఓటు అడిగారు. ఎన్డీఏ ప్రభుత్వానికి ఓటు వేయాల్సిన అవశ్యకతను వివరించి, ఓటర్లందరూ పోలింగ్‌లో పాల్గొనేలా సిద్ధం చేశారు. అందువల్లే ఓటింగ్‌లో భారీ పెరుగుదల కనిపించింది.

బిహార్ ఎన్నికలు కేవలం ఒక ప్రభుత్వ మార్పును మాత్రమే సూచించడం లేదు. అవి ఎన్నికల నిర్వహణ ప్రమాణాలను కొత్త ఎత్తుకు తీసుకెళ్లాయి. సాంకేతికత, పారదర్శకత, పటిష్టమైన ప్రణాళిక ఉంటే ఎంతటి క్లిష్టమైన ఎన్నికలనైనా ప్రశాంతంగా నిర్వహించవచ్చని బిహార్ దేశానికి చాటిచెప్పింది.



బిహార్ 2025 అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ఓటర్లే కారణం. ప్రతిపక్షాలు ఎన్నికలకు అంతరాయం కలిగించే ప్రయత్నాలను వారే అడ్డుకుని ప్రశాంతంగా నిర్వహించేలా కృషి చేశారు. ఈ ఏడాది ప్రారంభం నుంచి రాహుల్‌గాంధీ ఎన్నికల కమిషన్‌ను విమర్శిస్తూనే ఉన్నారు. కమిషన్ పారదర్శకతను ప్రశ్నిస్తూనే ఉన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన దరిమిలా ఆయనతో పాటు ఆర్జేడీ నాయకుడు తేజస్వి యాదవ్, కమ్యూనిస్టులు లేవనెత్తిన 'ఓట్ చోరీ', 'ఈవీఎం ట్యాంపరింగ్', ఓటర్ల జాబితా అవకతవకల వంటి ఆరోపణలు ప్రారంభించారు. వీటిని ప్రజలు పూర్తిగా తిరస్కరించారు. ప్రతిపక్షాలు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఎన్నికల సంఘంపై నిందలు వేస్తున్నాయని, వారి వద్ద స్పష్టమైన అభివృద్ధి అజెండా లేదని ఓటర్లు గ్రహించారు. మరోవైపు, ఎన్డీఏ ప్రభుత్వం అందించిన 'సుపరిపాలన', శాంతిభద్రతల మెరుగుదల ప్రజల్లో గాఢమైన విశ్వాసాన్ని నింపింది. గతంలో బిహార్‌ను పట్టి పీడించిన అరాచక పరిస్థితులు మళ్ళీ తిరిగి రాకూడదని యువత బలంగా కోరుకుంది. అందుకే, కుల రాజకీయాలకు అతీతంగా, అభివృద్ధి, ఉపాధి అవకాశాల వైపు చూస్తూ యువత ఎన్డీఏకు పట్టం కట్టింది. మోదీ–నితీశ్‌ల 'డబుల్ ఇంజిన్' సర్కారు వల్లనే రాష్ట్రం పారిశ్రామికంగా, ఆర్థికంగా ముందుకు వెళ్తుందని యువత నమ్మింది. హింస ద్వారా అధికారాన్ని దక్కించుకునే రోజులు పోయాయని, ఓటు అనే ఆయుధంతోనే మార్పు సాధ్యమని యువత నిరూపించి, తద్వారా ఎన్డీఏ విజయానికి బాటలు వేసింది.


ఈ ఎన్నికల్లో ఎన్డీఏ విజయానికి వెన్నెముకగా నిలిచింది మాత్రం నిస్సందేహంగా మహిళా ఓటర్లే. మహిళలు పెద్ద ఎత్తున బారులు తీరి ఓట్లు వేయడానికి ప్రధాన కారణం ఎన్డీఏ ప్రభుత్వం కల్పించిన 'భద్రత', 'మహిళా సంక్షేమ పథకాలు'. నితీశ్‌కుమార్ ప్రభుత్వంలో శాంతిభద్రతలు అదుపులో ఉండటం, మద్యనిషేధం వంటి నిర్ణయాలు మహిళల రోజువారీ జీవితాల్లో సానుకూల మార్పులు తెచ్చాయి. తమ కుటుంబాలకు రక్షణ కల్పించే ప్రభుత్వం వైపే వారు మొగ్గు చూపారు. కేవలం భద్రతే కాకుండా, మహిళా స్వయం సహాయక బృందాలకు ఆర్థిక సాయం, 'మహిళా రోజ్‌గార్ యోజన' వంటి ప్రత్యక్ష నగదు బదిలీ పథకాలు వారిని ఆర్థికంగా బలోపేతం చేశాయి. ప్రతిపక్షాల ప్రచార ఆర్భాటాలను పట్టించుకోకుండా, తమకు మేలు చేసిన ప్రభుత్వానికి నిశ్శబ్ద విప్లవంలా ఓట్లు వేశారు.

2025 బిహార్ ఎన్నికలు కేవలం ఒక ప్రభుత్వ మార్పును మాత్రమే సూచించడం లేదు. అవి ఎన్నికల నిర్వహణ ప్రమాణాలను ఒక కొత్త ఎత్తుకు తీసుకెళ్లాయి. సాంకేతికత, పారదర్శకత, పటిష్టమైన ప్రణాళిక ఉంటే ఎంతటి క్లిష్టమైన ఎన్నికలనైనా ప్రశాంతంగా నిర్వహించవచ్చని బిహార్ దేశానికి చాటిచెప్పింది.

◆ వల్లూరు జయప్రకాశ్ నారాయణ్
బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com







శ్రీవారి చిత్తంతోనే అమరావతి

ఆలయ ధ్వజస్తంభానికి నమస్కరిస్తున్న సీఎం చంద్రబాబు

- వెంకన్న ఆలయానికి రాజధానిని కాపాడే శక్తి
- రూ.260 కోట్లతో శ్రీనివాసుడి ఆలయం అభివృద్ధి
- ఆలయ విస్తరణకు శంకుస్థాపనలో సీఎం చంద్రబాబు
- వెంకటపాలెంలో వైభవంగా భూమిపూజ, అద్వేష్టక శిలేష్టకాన్యాసం



శంకుస్థాపన క్రతువులో పాల్గొన్న సీఎం చంద్రబాబు

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): 'దేవతల రాజధాని అమరావతి.. మన రాజధాని కూడా అమరావతి. దేవతల రాజధాని ఎలా ఉంటుందో.. ఆ నమూనాగా అమరావతి ఉండాలి. ఆయన ఆశీస్సులతోనే అమరావతి నిర్మాణం ముందుకు సాగుతుంది. ఆయన చిత్తంతోనే రాజధాని రైతులు కూడా అమరావతి కోసం భూములిచ్చారు. అమరావతి విషయంలో ఎవరికీ ఎలాంటి అనుమానం అవసరం లేదు. ఆ దేవదేవుడే అమరావతిని రక్షిస్తాడు. వేంకటేశ్వరస్వామి సంకల్పంతోనే రాజధానికి అమరావతి అనే పేరు పెట్టాను..' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెంకటేశ్వర స్వామిని కోరుకున్నారు. గురువారం ఉదయం రాజధాని పరిధిలోని వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో రూ.260 కోట్లతో అభివృద్ధి పనులకు టీటీడీ సంకల్పించింది. ఈ సందర్భంగా శ్రీవెంకటేశ్వరస్వామివారి ద్వితీయ చతుర్ద్వార మహా ప్రాకార నిర్మాణం, మాడవీధులు, అన్నదాన కాంప్లెక్స్‌ల నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. భూమిపూజ, అద్వేష్టక శిలేష్టకాన్యాసం అత్యంత వైభవోపేతంగా జరిగింది. అర్చకుల వేద మంత్రాలు, మంళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ ముఖ్యమంత్రి పునాదిరాయి వేశారు. అర్చకులు చతుర్వేద పారాయణం, నివేదనం, దివ్య సమర్పణ, హోమం, పూర్ణాహుతి, వేదాశీర్వచనం నిర్వహించారు. ఆలయానికి సంబంధించి మాస్టర్ ప్లాన్ పరిశీలించిన ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ముఖ్యమంత్రికి శ్రీవారి లడ్డూ ప్రసాదాలు అందజేశారు. వేద పండితులు వేద ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ 2019లోనే ఆలయాన్ని నిర్మించేందుకు సంకల్పించామని, ఇప్పుడు దానిని పూర్తి స్థాయిలో అభివృద్ధి (మిగతా 6వ పేజీలో)



టీటీడీ బోర్డు సభ్యులతో సీఎం చంద్రబాబు

వనరులను ఉపయోగించుకోవాలి

ఎంఎస్‌ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వనరులు, మార్గదర్శకత్వం, అవకాశాలను పూర్తిగా ఉపయోగించుకుని ఆవిష్కర్తలు ఎదగాలని ఎంఎస్‌ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. మంగళగిరి-చినకాకాని సమీపంలో ఎన్‌హెచ్-16 పక్కన ఉన్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో గురువారం ఆర్‌టీఐహెచ్ ప్రధాన ఐడియా ఎక్స్‌ప్లోరేషన్ ప్రోగ్రామ్ స్పార్క్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆవిష్కరణ-ఆధారిత వ్యవస్థాపకత కోసం పటిష్టమైన పర్యావరణ వ్యవస్థ నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. సామాజిక పరివర్తన, ఆర్థిక వృద్ధిని ముందుకు తీసుకెళ్లడంలో వ్యవస్థాపకులది కీలక పాత్ర అన్నారు. స్పార్క్ వంటి కార్యక్రమాలు వర్ధమాన ఆవిష్కర్తలకు సరైన దిశానిర్దేశం, మద్దతును అందిస్తాయని చెప్పారు. ఆవిష్కరణకు సంబంధించి ప్రారంభ దశలో



రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

నిర్మాణపరమైన ఆలోచన ధృవీకరణ ప్రాముఖ్యతను రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏపీఐఎస్ సీఈవో ధాత్రి రెడ్డి వివరించారు. ఆవిష్కర్తలు తమ భావనలను మెరుగుపరచడానికి, బలోపేతం చేయడానికి మార్గదర్శకత్వం, మార్గనిర్దేశం చేసే అన్వేషణ, రియల్-టైమ్ ఫీడ్‌బ్యాక్‌పై స్పష్టమైన దృష్టితో స్పార్క్ కార్యాక్రమాన్ని రూపొందించామని చెప్పారు. ఆవిష్కరణ అనేది ఉత్సుకతతో ప్రారంభమవుతుందని, అయితే దాని నిర్మాణం క్రమశిక్షణ, నిరంతర అభ్యాసంతో మాత్రమే ప్రభావవంతంగా మారుతుందన్నారు. స్పార్క్ ప్రారంభ కార్యక్రమానికి అద్భుతమైన స్పందన లభించింది, 100 మందికి పైగా ఔత్సాహికులు మొదటి బ్యాచ్‌లో చేరారు. క్యూరేటెడ్ లెర్నింగ్, పరస్పర చర్య సెషన్లలో పాల్గొన్నారు.



పుడమి తల్లి రుణం తీర్చుకోవాలి

◆ సభలో మాట్లాడుతున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, వేదికపై సామాజిక వేత్త దుర్గా కామేశ్వరరావు మండలి బుద్ధప్రసాద్, ఆలపాటి తదితరులు

- డాక్టర్ పీడీకేరావు సేవలు నిరుపమానం
- సేవ తృప్తినిస్తుంది.. మనపై అభిమానం పెంచుతుంది
- భారతజ్యోతి పురస్కార సభలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

తెనాలి, నవంబరు 27: (ఆంధ్రజ్యోతి): 'నేటి యువత అమెరికా, జర్మనీ అంటూ విదేశాల బాటపడుతున్నారు. మాతృమూర్తిని, పుట్టిన గడ్డను వదిలిపెట్టి సంపాదన కోసం జీవిత సత్యాన్ని మరిచి పరుగులు పెడుతున్నారు. అటువంటి వారికి డాక్టర్ పెమ్మరాజు దుర్గా కామేశ్వరరావు(పి.డి.కె.రావు) వంటి వారి జీవితం ఆదర్శంగా నిలుస్తుంది.' అని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు అన్నారు. అమెరికాలో డాలర్లు కురిపించే ఉద్యోగాన్ని వదలి, పుట్టిన గడ్డపై సేవ చేయాలనే నిర్ణయంతో ఆనాడే తిరిగివచ్చి.. వెనుకబడిన గ్రామాల ప్రజల ఉన్నతికి పాటుపడటం నిజంగా నేటి రోజుల్లో ఆదర్శమే అవుతుందన్నారు. సేవ తృప్తినిస్తుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఆయన సూచించారు. గురువారం తెనాలిలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో తెనాలి ప్రచురణలు, రోటరీ క్లబ్ ఆఫ్ వైకుంఠపురం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన భారత జ్యోతి పురస్కార ప్రదాన సభకు వెంకయ్యానాయుడు ముఖ్య అతిథిగా విచ్చేశారు. సభకు ముందే భారత జ్యోతి పురస్కారాన్ని కామేశ్వరరావుకు వెంకయ్యానాయుడు చేతుల మీదగా ప్రదానం చేశారు. పీడీకే రావు పరిచయ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సభలో మాజీ ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ.. సమాజంలో మార్పు కేవలం ప్రభుత్వాల వల్ల కాదని, ప్రజల్లో మార్పు, సేవా భావం పెరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కేవలం నాలుగు గోడలకే చదువు పరిమితం కాకుండా వ్యవసాయ క్షేత్రాల వంటివాటికి కూడా అలవాటు చేయాలని కోరారు. ఈ నేలపై ఉన్నందుకు పుడమి తల్లి రుణం కూడా తీర్చుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండాల్సిన (మిగతా 6వ పేజీలో)

నానో యూరియా

- తమకొద్దంటున్న రైతులు
- ప్రతి మూడు బస్తాలకు లీటర్ కొనాల్సిందే
- సొసైటీలు, డీసీ ఎంఎస్‌లో ఒత్తిడి

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి): ఏ వస్తువు అయినా.. కొనుగోలు విషయంలో కొనుగోలుదారులకు పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. ఎరువుల కొనుగోలు విషయంలో మాత్రం రైతులకు ఆ స్వేచ్ఛ ఉండటం



లేదు. రైతుకు ఇష్టం ఉన్నా.. లేకపోయినా నానో యూరియా కొనాల్సిందే నని పట్టుపడుతున్నారు. మొన్నటి వరకు.. ప్రైవేట్ డీలర్లు ఈ విధంగా పట్టుబట్టి మరీ.. ఇష్టం లేని ఎరువులను అంటగట్టే వారు. ఇప్పుడు ప్రభుత్వ రంగ సంస్థలు కూడా అదే వ్యాపారం మొదలు పెట్టడం వివాదాస్పదమవుతోంది. కేంద్రం రాయితీపై యూరియా బస్తా రూ.266.50కు రైతులకు అందజేస్తోంది.గతంలో ప్రైవేట్ డీలర్లు బస్తా రూ.290 నుంచి రూ.350 వరకు వసూలు చేస్తున్నా రన్న ఆరోపణలతో.. ప్రభుత్వం (మిగతా 6వ పేజీలో)

రాష్ట్రంలోనే తొలి మోడల్ లైబ్రరీ

ప్రారంభించిన మంత్రి నారా లోకేశ్ • నియోజకవర్గంలో ప్రారంభోత్సవాలు, ఆవిష్కరణలు



మోడల్ లైబ్రరీని ప్రారంభిస్తున్న మంత్రి లోకేశ్

మంగళగిరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ, విద్యా, మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేశ్ గురువారం నగరంలో సుడిగాలి పర్యటన చేశారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ప్రైవేటు కార్యక్రమాల్లో కూడా పాల్గొన్నారు. స్థానిక ఎగువ సన్నిధి మెట్ల మార్గంలో రూ.1.72 కోట్ల వ్యయంతో ఆధునీకరించిన రాష్ట్రంలోనే తొలి మోడల్ లైబ్రరీని ప్రారంభించారు. 1986లో అప్పటి సీఎం ఎన్టీ రామారావు ఆధ్వర్యంలో రాష్ట్రమంత్రి డాక్టర్ ఎమ్మెస్సెస్ కోటేశ్వరరావు చొరవతో రాష్ట్రంలోనే మొట్టమొదటి తెలుగు విజ్ఞాన సమాచార కేంద్రాన్ని ఇక్కడ ఏర్పాటు చేశారు. నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేశ్ రాష్ట్రంలోనే తొలి మోడల్ లైబ్రరీగా అప్‌గ్రేడ్ చేయించారు. శిలాఫలకం ఆవిష్కరణ అనంతరం గ్రంథాలయ ఆవరణలో మంత్రి లోకేశ్ మొక్కలు నాటారు. ఈ లైబ్రరీ ఆధునీకరణకు మొత్తం రూ.1.72 కోట్లు ఖర్చు కాగా, ఈ నిధులను వివిధ ప్రైవేటు సంస్థలు సీఎస్‌ఆర్ ఫండ్స్ రూపంలో సమకూర్చాయి. గుంటూరు డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్స్ కింద రూ.90 లక్షలు, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ సంస్థ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ ఆధ్వర్యంలో రూ.42 లక్షలు, నోవో ఇన్సూరెన్స్ బ్రేకింగ్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.30లక్షల వంతున అందించాయి. ఈ లైబ్రరీ మొత్తం రెండంతస్తుల రూపంలో నిర్మితమైంది. గ్రౌండు ఫ్లోర్‌లో పిల్లలకోసం రీడింగ్ రూమ్, ప్లే ఏరియా, రీడింగ్‌రూమ్, సీనియర్ సిటిజన్స్ రీడింగ్ రూమ్, పబ్లిక్ రీడింగ్ ఏరియా, ఫలహారశాల ఉన్నాయి. మొదటి అంతస్తులో రెండు టీచింగ్ హాల్స్, స్టడీ రూమ్, పోటీ పరీక్షలకు హాజరయ్యేవారి కోసం ప్రత్యేకంగా రీడింగ్ రూమ్, డిజిటల్ లైబ్రరీ, డిజిటల్ రిసోర్స్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. గ్రంథాలయ ఆవరణలో మంత్రి లోకేశ్ మొక్కలను నాటారు. అనంతరం మంగళగిరి బైపాస్ రోడ్డు వెంబడి ఉన్న కొండపనేని టౌన్‌షిప్‌లో 65 సెంట్ల విస్తీర్ణంలో రూ 1.23 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసిన పార్కును మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. లోకేశ్ పార్కులో కలియతిరిగి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఎన్టీఆర్, ఎమ్మెస్సెస్ విగ్రహాల ఆవిష్కరణ

అంతకుముందు ఆత్మకూరు గ్రామంలో ఏర్పాటు చేసిన స్వర్గీయ ఎన్టీఆర్, మాజీమంత్రి స్వర్గీయ ఎమ్మెస్సెస్ కోటేశ్వరరావు విగ్రహాలను మంత్రి లోకేశ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్, ఎమ్మెస్సెస్ సేవలను మంత్రి కొనియాడారు. ఈ సందర్భంగా గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు మంత్రి లోకేశ్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమాలలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ, విద్యా సంక్షేమ మౌలిక సదుపాయాల కార్పొరేషన్ ఛైర్మన్ ఎస్. రాజశేఖర్, ఏపీఐఐసీ డైరెక్టర్ కనికళ్ల చిరంజీవి, మంగళగిరి ఏఎంసీ ఛైర్మన్ జవ్వాది కిరణ్ చంద్, పీఏసీఎస్ అధ్యక్షుడు గాదె పిచ్చిరెడ్డి, టీడీపీ గ్రామ అధ్యక్షుడు తాటి వెంకట్రావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



కొండపనేని పార్కును ప్రారంభించి పరిశీలిస్తున్న మంత్రి లోకేశ్

ఆరు నెలల్లో మౌలిక వసతులు పూర్తి

- రాజధాని రైతుల సమస్యల పరిష్కారం దిశగా చర్యలు
- మంత్రి నారాయణ, ప్రిన్సిపల్ సెక్రెటరీ, సీఆర్‌డీఏ కమిషనర్‌తో మంత్రి పెమ్మసాని భేటీ



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారాయణ సీఆర్‌డీఏ అధికారులు

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అమరావతి రైతుల భూ సమస్యలకు పరిష్కారం దిశగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చర్యలు చేపట్టారు. అందులో భాగంగా మంత్రి పొంగూరు నారాయణ, ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేష్ కుమార్, సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు, స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌తో ఆయన గురువారం తన క్యాంపు కార్యాలయంలో సమావేశమై భవిష్యత్తు కార్యచరణపై చర్చించారు. ప్రతి సమావేశానికి సమస్యల పరిష్కారంలో పురోగతి కనిపించాలని స్పష్టం చేశారు. అసైన్డ్, లంక, జరీబు, మెట్ట భూములు రైతుల ప్లాట్ల విభజన, గ్రామ కంఠం, రాజధానికి సంబంధించిన ఆర్ అండ్ బీ రోడ్ల ఏర్పాటు, టీడీఆర్ బాండ్లు, వీధి పోటు తదితర అంశాలపై ఈ సమావేశంలో పెమ్మసాని సమగ్రంగా చర్చించారు. అధికారులకు, కాంట్రాక్టర్లకు ఇచ్చిన గడువు ప్రకారం పనులు వేగవంతంగా జరగాల్సిందేనని పెమ్మసాని తెలిపారు. ఇప్పటివరకు జరిగిన పలు అంశాలపై మంత్రి నారాయణ పూర్తి వివరాలను కమిషనర్ కన్నబాబు నుంచి తెలుసుకున్నారు. పలు అంశాలకు పరిష్కారం దిశగా పెమ్మసానితో చర్చించారు. అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ రాజధాని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రాబోయే ఆరు నెలల్లో రాజధాని మౌలిక సదుపాయాలను పూర్తి చేసే దిశగా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. మరో నాలుగు రోజుల్లో రెండో దశ సమావేశంలో రైతులకు మరిన్ని వివరాలు తెలియజేస్తామని పెమ్మసాని తెలిపారు.

నేడు అమరావతికి నిర్మల సీతారామన్

- కేంద్ర మంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజధాని పరిధిలోని నేలపాడులో జాతీయ బ్యాంకుల ప్రధాన కార్యాలయాల శంకుస్థాపనకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా శీతారామన్ గురువారం హాజరు కానున్నారు. శంకుస్థాపన అనంతరం సీఆర్‌డీఏ కాన్ఫరెన్స్ హాల్లో పలు శాఖల అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షలో కేంద్ర ఆర్థికతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాల్గొననున్నారు. ఈ క్రమంలో కేంద్రమంత్రి పర్యటన బందోబస్తు ఏర్పాట్లను గురువారం అధికారులతో కలిసి ఎస్పీ వకుల్ జిందాల్ పరిశీలించారు. శాఖల వారీగా చేపట్టాల్సిన చర్యల గురించి అధికారులతో చర్చించారు. వీవీఐపీ, వీఐపీల రాకపోకల మార్గాలు, పార్కింగ్ ఏర్పాట్లు రాకపోకల నియంత్రణ, సమావేశ స్థలాల వద్ద భద్రతా విభజన, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, ప్రజలకు ఎటు వంటి సమస్య తలెత్తకుండా సమన్వయంతో పని చేయాలని ఎస్పీ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు మురళీకృష్ణ, గొట్టిపాటి శ్రీనివాసరావు, సీఐలు కొంకా శ్రీనివాసరావు, మా తంగి శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, వెంకటరావు, ఆళహరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

3న హనుమత్‌వ్రత మహోత్సవం

పొన్నూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో వచ్చే నెల 3న హనుమత్‌వ్రత మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ పాలకమండలి ఛైర్మన్ జీఎంఎస్ గుప్తా, ఈవో గద్దే వెంకట అమర్నాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్సవాలలో భాగంగా ఉదయం స్వామి వారికి పంచామృత అభిషేకాలు . 10 గంటలకు సామూహిక దీక్షలు, మధ్యాహ్నం లక్ష తమలపాకుల పూజ సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు.

అమరావతి అభివృద్ధికి రైతుల మద్దతు కావాలి

- రెండో దశ ల్యాండ్ పూలింగ్‌కు సహకరించండి
- రైతులతో సీఎం చంద్రబాబు

6



అమరావతి అభివృద్ధికి రైతుల మద్దతు కావాలి

- ● రెండో దశ ల్యాండ్ పూలింగ్‌కు సహకరించండి
- ● అప్పుడే హైదరాబాద్ తరహాలో అభివృద్ధి: రాజధాని రైతులతో సీఎం చంద్రబాబు
- ● 22 రకాల సమస్యలు వివరించాం.. సీఎం సానుకూల స్పందన
- ● అమరావతి రాజధాని ఐక్యకార్యాచరణ సమితి కన్వీనర్ పువ్వాడ సుధాకర్

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లా అమరావతి అభివృద్ధి చెందాలంటే 29 గ్రామాల పరిధి సరిపోదని సీఎం చంద్రబాబు చెప్పారు. రాజధాని రైతులతో ఆయన పలు విషయాలు ప్రస్తావించారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆయన ఏమన్నారంటే.. "రాజధానిగా 1953లోనే విజయవాడ కావాల్సి ఉంది. అప్పుడు కమ్యూనిస్టుల ప్రాబల్యం వల్ల నాటి ప్రభుత్వం కర్నూలును రాజధానిగా చేసింది. ఆ తర్వాత తెలుగు మాట్లాడే ప్రాంతాలన్నీ ఒకే రాష్ట్రంగా ఉండాలని హైదరాబాద్ కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. విభజన సమయంలో రాజధాని ప్రాంతం విషయంలో పలు ప్రతిపాదనలు వచ్చినా.. గతంలో ఈ ప్రాంతానికి జరిగిన అన్యాయాన్ని దృష్టిలో పెట్టుకుని అమరావతిని రాజధానిగా నిర్ణయించాం. అమరావతి పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందాలంటే నేను తీసుకునే నిర్ణయాలకు రైతుల మద్దతు కూడా కావాలి. కార్పొరేట్ స్థాయిలో అమరావతి అభివృద్ధి చెందాలంటే రెండో దశ ల్యాండ్ పూలింగ్‌కు వెళ్లాల్సిందే. అప్పుడు అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులు, స్పోర్ట్ సిటీ, వివిధ పరిశ్రమలు వస్తాయి. మిమ్మల్ని అడిగే రెండవ దశ ల్యాండ్ పూలింగ్‌కి వెళుతున్నాం. ఇక్కడకు వచ్చే కంపెనీలకు భూములు ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఇక్కడే మన వారికి ఉద్యోగాలు వస్తాయి. భూములు విరివిగా ఉండటంతో హైదరాబాద్ అన్ని వైపుల నుంచి అభివృద్ధి చెందింది. అమరావతి కూడా అదే విధంగా అభివృద్ధి చెందుతుంది. రైతులెవరూ రిటర్నబుల్ ప్లాట్లు అమ్ముకోవద్దు. మీలో నమ్మకం లేకపోతే అమరావతి కథ చిరిగిన విస్తరి అవుతుంది. ప్రభుత్వానికి సహకరించండి. రాజధానికి భూమిలిచ్చిన రైతులను మీపై అభిమానం కృతజ్ఞత ఉన్నాయి" అని సీఎం చెప్పారు.

పారదర్శకంగా రాజధాని నిర్ణయాలు

అమరావతిలో ప్రతి సమస్యను తీర్చడానికి కూటమి ప్రభుత్వం ముందుంటుందని సీఎం చంద్రబాబు చెప్పారని, అమరావతి రాజధాని ఐక్యకార్యాచరణ సమితి కన్వీనర్ పువ్వాడ సుధాకర్ తెలిపారు. గురువారం అమరావతి సచివాలయంలో సీఎంతో భేటీ అనంతరం రాజధాని రైతులు పలువురితో కలిసి పువ్వాడ సుధాకర్ మీడియాతో మాట్లాడారు. అమరావతి రాజధానిపై తీసుకునే ప్రతి నిర్ణయం పారదర్శకంగా ఉంటుందని సీఎం చెప్పారన్నారు. సుమారు గంటన్నర సమావేశంలో తమలోని అపోహలు, భయాందోళనలను సీఎం తొలగించే ప్రయత్నం చేశారన్నారు. అధికారుల ద్వారా ఎవరికైనా అన్యాయం జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని, దాన్ని సత్వరమే సరిచేస్తానని, కావాలని అమరావతి రాజధాని మహాయజ్ఞానికి ఎవరైనా భంగం కలిగిస్తే.. చూస్తూ ఊరుకోమని సీఎం స్పష్టం చేశారని చెప్పారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌తో కూడిన కమిటీ ప్రతి నెల రాజధాని రైతుల సమస్యలపై సమావేశం నిర్వహిస్తుందన్నారు. ప్రతి మూడు నెలలకోసారి అమరావతి రైతులు, రైతు ప్రతినిధులతో మాట్లాడతానని సీఎం చెప్పారని పేర్కొన్నారు. త్రిసభ్య కమిటీ ప్రతి నెల సమావేశం అవుతుందన్నారు. గ్రామ కంఠాల పరిశీలన కోసం కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ వేసి.. సర్వే చేసి పరిష్కరిస్తామని చెప్పారన్నారు. నెలరోజుల్లో కలెక్టర్, రెవెన్యూ యంత్రాంగం గ్రామ కంఠాలను సర్వే చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారన్నారు. పరిష్కరించదగ్గ సమస్యలన్నింటినీ త్రిమెన్ కమిటీ పరిష్కరిస్తుందని తెలిపారన్నారు.

22 రకాల సమస్యలను వివరించాం

సీఎం చంద్రబాబుకు 22 రకాల సమస్యలను వివరించామని రాజధాని రైతు అప్పారావు తెలిపారు. రైతుల అన్ని సమస్యలు పరిష్కరిస్తామని ఇబ్బందులు కలగనీయమని సీఎం హామీ ఇచ్చారన్నారు. నెలరోజుల్లో త్రిమెన్ కమిటీ పరిష్కరిస్తుందన్నారు. ఎటువంటి అన్యాయం జరగనివ్వనని సీఎం చెప్పారన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న రైతులందరూ చంద్రబాబు తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని స్వాగతిస్తామని, ఆమోదిస్తామని చెప్పినట్టు తెలిపారు. రాబోయే రోజుల్లో అంతర్జాతీయ విమానాశ్రయం, రైల్వేస్టేషన్, క్రికెట్ స్టేడియం, ఇంకా ఏదైనా ప్రాజెక్టులు రావాలంటే కొంత భూమి అవసరం అవుతుందని సీఎం చెప్పారన్నారు. హైదరాబాద్ తరహాలో అమరావతి అభివృద్ధి చెందాలంటే 29 గ్రామాల పరిధి సరిపోదని అదే జరిగితే ఓ మున్సిపాలిటీగా మాత్రమే అమరావతి ఉంటుందని సీఎం చెప్పారన్నారు. అమరావతి పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందాలంటే తాను తీసుకునే నిర్ణయాలకు రైతుల మద్దతు కావాలని సీఎం కోరారన్నారు. రాజధాని అభివృద్ధికి, రాష్ట్రాభివృద్ధి తోడ్పడే విధంగా ఇక్కడ ఏ సంస్థలు వస్తే బాగుంటుంది, రైతులకు ఏ విధంగా ఆదాయం సమకూరుతుందో దానికి అవసరమైతే ల్యాండ్‌పూలింగ్ తీసుకోవడానికి సిద్ధంగా ఉంటామని సీఎం స్పష్టంగా చెప్పారన్నారు.

రుణాల కోసం విన్నవించాం

క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్ రెండేళ్ల మినహాయింపు అడిగామని, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌తో మాట్లాడి చేస్తామని సీఎం సమాధానమిచ్చారని రైతు ఇడుపులపాటి సీతారామయ్య తెలిపారు. గుంటూరు, విజయవాడ కంటే అమరావతిలో ఎకరం కొంచెం పెంచమని అడిగామన్నారు. కమర్షియల్ ప్లాట్, రెసిడెన్షియల్ ప్లాట్లు పరిశీలించి చేస్తామన్నారు. న్యాయబద్ధంగా ఉన్న గ్రామ కంఠాలు చేస్తామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్లాట్‌పై రుణాలకు 30 ఏళ్ల లింక్ డాక్యుమెంట్ బ్యాంకుల్లో అడుగుతున్నారని.. అలా లేకుండా లోన్ ఇచ్చేలా చూడాలని సీఎంను కోరామని రాజధాని రైతు ఇడుపులపాటి సీతారామయ్య తెలిపారు.

సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణ
దరఖాస్తు గడువు పొడిగింపు

గుంటూరు (విద్య) నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీసెస్ పరీక్షకు ఉచిత శిక్షణ దరఖాస్తు గడువు డిసెంబరు 5వ తేదీ పొడిగించినట్టు బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మయూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో అభ్యర్థులకు విజయవాడలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు వెల్లడించారు. ఈ శిక్షణకు ఎంపిక చేసేందుకు డిసెంబరు 7న ప్రాథమిక పరీక్ష నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. దరఖాస్తులు బీసీ స్టడీ సర్కిల్, రాజా గారి తోట, గుంటూరు చిరునామాకు అందజేయాలని సూచించారు. ఇతర వివరాలకు 0863 -2358071లో సంప్రదించాలని సూచించారు.

ఆప్తమాలజీలో టాపర్‌గా డాక్టర్ హర్షితా రెడ్డి


హర్షితారెడ్డిని అభినందిస్తున్న సుందరాచారి, రవిబాబు

గుంటూరు మెడికల్, నవంబరు 27 (ఆంధ్ర జ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం విడుదల చేసిన ఆప్తమాలజీ (నేత్ర వైద్య విభాగం) పోస్టు గ్రాడ్యుయేషన్ వార్షిక పరీక్షల్లో గుంటూరు వైద్య కళాశాల విద్యార్థిని డాక్టర్ డి.హర్షితా రెడ్డి టాపర్‌గా నిలిచారు. మొత్తం 800 మార్కులకు గాను ఆమె 585 మార్కులు సాధించారు. ఎన్నారై వైద్య కళాశాలలో ఆమె ఎంబీబీఎస్ చేశారు. అనంతరం జీఎంసీలో ఆప్తమాలజీ పీజీ సీటు పొందారు. జీజీహెచ్ నేత్ర వైద్య విభాగం వైద్యులు అందించిన ప్రోత్సాహంతోనే తాను పీజీలో టాపర్‌గా నిలిచినట్లు ఆమె తెలిపారు. గురువారం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారీ, నేత్ర వైద్య విభాగాధిపతి డాక్టర్ రవిబాబు తదితరులు డాక్టర్ హర్షితా రెడ్డిని అభినందించారు.

33,916 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 35,654 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 33,916 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 12,710 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	11000	13700
334	10000	17500	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	11000	15300	334	11000	17400
273	---	----	నెంబరు. 5	10500	15800
341	10500	17300	273	--	---
4884	----	----	341	12000	17400
సూపర్ 10	---	----	4884	12000	14000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15600	తేజ	10500	15300
షార్క్-1	---	----	బ్యాడిగి	11000	17700
బ్యాడిగి	10500	17600	దేవనూరు డీలక్స్	10500	16500
దేవనూరు డీలక్స్	11000	17000	తాలుకాయలు	5000	8200

రైతులను మోసం చేసిన వైసీపీ సర్కార్

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

నాదెండ్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయని రైతు ద్రోహి జగన్ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు. మండలంలోని గణపవరం గ్రామంలో రైతన్నా నీ కోసం కార్యక్రమంలో భాగంగా ఆయన పర్యటించారు. కెల్లంపల్లి భద్రాచలం ఉన్నత పాఠశాల ఎదుట రూ.10 లక్షల వ్యయంతో మురుగు కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన ఆయన ధరల స్థిరీకరణ కోసం విపత్తు నిధితో రైతులను ఆదుకుంటానన్న జగన్.. తన నిధిని మాత్రం బాగా పెంచుకున్నారని ఆరోపించారు. అధికారం కోసం రైతులను వాడుకున్న జగన్ వారిని మోసగించిన ఏకైక నాయకుడిగా చరిత్రలో నిలిచిపోతారన్నారు. ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగు నీరు అందించాలని, గిట్టుబాటు ధర కల్పించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మునిసిపల్ చైర్మన్ రఫానీ, ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు, డైరెక్టర్ కందుల రమణ, సొసైటీ అధ్యక్షుడు పెంటాల శేషయ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే పుల్లారావు

అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

● 22 ద్విచక్ర వాహనాలు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

బాపట్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లాలో వరుస ద్విచక్రవాహనాల దొంగతనం కేసులను సీసీఎస్, అమర్తలూరు పోలీసులు సంయుక్తంగా ఛేదించారు. దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను చాకచాక్యంగా అరెస్ట్ చేశారు. గురువారం ఎస్పీ బి.ఉమామహేశ్వర్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించి, కేసు వివరాలను వెల్లడించారు. యద్దనపూడి మండలం చిమటవారిపాలేనికి చెందిన ధంకసాల సుబ్బారావు తన డీలక్స్‌బైక్ అమర్తలూరు మండలం ఇంటూరు గ్రామంలో గత జూన్‌లో గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. వరుస ద్విచక్ర వాహనాల దొంగతనాలు చోటు చేసుకోవటంతో దీనిపై దృష్టిసారించారు. బాపట్ల సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్‌నాయక్ ఆధ్వర్యంలో సీసీఎస్ సీఐ ప్రేమయ్య, అమర్తలూరు ఎస్సై రవితేజ, సిబ్బందితో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం సాయంతో.. అంతర్‌రాష్ట్ర ద్విచక్ర వాహనాల దొంగలు ఆరుగురును అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. రూ.16.5లక్షల విలువ గల 22 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. వినుకొండకు చెందిన కొమ్మ వెంకటసాయి, కొమ్మ సాయికృష్ణ, సంపంగలి నాని, సయ్యద్ నాగూర్‌వలి, పందుల రమేష్‌బాబు, పొదలికి చెందిన బండి శివారెడ్డి నిందితులని చెప్పారు. సీసీఎస్, అమర్తలూరు పోలీసులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, క్యాష్‌రివార్డులను అందజేశారు. సీసీఎస్ డీఎస్పీ జగదీష్‌నాయక్, రేపల్లె డీఎస్పీ శ్రీనివాసరావు, సీసీఎస్ సీఐ ప్రేమయ్య, చుండూరు సీఐ పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం

విజయపురిసౌత్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం గురువారం నాటికి 582.00 అడుగులు ఉంది. ఇది 288.78 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9500, ఎడమ కాలువ ద్వారా 3972, ఎస్ఎల్‌బిసి ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో 15,272 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో 15,272 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

హత్య కేసులో నిందితులకు యావజ్జీవం

కారంపూడి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ గురజాల పదో అదనపు జిల్లా జడ్జి ప్రియదర్శిని గురువారం తీర్పునిచ్చారు. మండలంలోని పేటసన్నిగండ్లకు చెందిన చప్పిడి వెంకటేశ్వర్లు, సోదరుడు మల్లయ్య కుమారులు చప్పిడి అంజయ్య, శంకర్, నరసింహారావు, అయ్యప్పల మధ్య 2.50 ఎకరాల భూవివాదం నెలకొంది. 2016 జూలై 19న చప్పిడి వెంకటేశ్వర్లు తన కుమారుడు వెంకటనరసయ్య, చిన్న కుమార్తె ఆదిలక్ష్మి, కూలి ఏసురత్నంతో కలిసి పొలానికి వెళ్లి వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో వెంకటేశ్వర్లు అన్న మల్లయ్య కుమారులు అంజయ్య, శంకర్, నరసింహారావు, అయ్యప్పలు తమ ట్రాక్టర్‌తో పొలానికి వెళ్లి వెంకటేశ్వర్లు, అతని కుమారుడు వెంకట నరసయ్యతో గొడవపడి గొడ్డలి, వేట కొడవళ్లతో దాడి చేశారు. వెంకట నరసయ్యపై విచక్షణా రహితంగా దాడి చేసి.. తలను శరీరం నుంచి వేరు చేశారు. తన కుమారుడిని రక్షించుకోవాలనే ఆత్రుతతో అడ్డుకోబోయిన వెంకటేశ్వర్లును శంకర్ వేట కొడవలితో వీపుపై నరికాడు. ప్రాణభయంతో వెంకటేశ్వర్లు, ఆదిలక్ష్మి, ఏసురత్నం అక్కడి నుంచి పారిపోయారు. వెంకటేశ్వర్లు పోలీసులకు జరిగిన సంఘటనపై ఫిర్యాదు చేశారు. అప్పటి కారంపూడి ఎస్ఐ టి.నారాయణస్వామి కేసు నమోదు చేశారు. గురజాల సీఐ అలహరి శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేపట్టారు. 2016 ఆగస్టు 8న నిందితులను అరెస్ట్ చేసి గురజాల అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో చార్జి షీటు దాఖలు చేశారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సూర్యరాజు వాదనలతో ఏకీభవించిన జిల్లా కోర్టు నాలుగో నిందితుడు చప్పిడి అయ్యప్ప ఈ నెల 17న కాలువలో పడి మృతిచెందడంతో మిగిలిన ముగ్గురు నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష, రూ. 1000 జరిమానా విధించారు. రెండో నిందితునికి పదేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

రేపటి నుంచి పల్నాడు బాలోత్సవం


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నరసరావుపేట కల్చరల్, నవంబరు27(ఆంధ్రజ్యోతి): పల్నాడు బాలోత్సవం ఆధ్వర్యంలో 3వ ప్రతిష్టాత్మక పిల్లల పండుగ శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు జరగనున్నాయి. స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాల వేదికగా జరిగే ఈ సాంస్కృతిక పోటీల్లో జిల్లా నుంచి రెండు వందల పాఠశాలల విద్యార్థులు పాల్గొంటారని బాలోత్సవం ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు గురువారం తెలిపారు. మొత్తం 69 అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 5 వేదికలపై ఏకకాలంలో పోటీలు జరుగుతాయని తెలిపారు. కోలాటం, శాస్త్రీయ నృత్యం, బుర్రకథ, విచిత్ర వేషధారణ వంటి అంశాలు బాలోత్సవంలో ప్రధాన ఆకర్షణ ఉంటాయన్నారు. జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ కేటగిరిలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. కార్యక్రమానికి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్యఅతిథులుగా పాల్గొంటున్నట్లు చెప్పారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	117, 124, 136
చికెన్ విత్ స్కిన్(కిలో)	222.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	232.00

హస్నాబాద్ తండాలో కార్డెన్ సెర్చ్

విజయపురిసౌత్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మండలం హస్నాబాద్ తండాలో పోలీసు, ఎక్సైజ్ అధికారులు గురువారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. మాచర్ల రూరల్ సీఐ నఫీజ్ బాషా, విజయపురిసౌత్ ఎస్ఐ అశోక్ ఆధ్వర్యాన గ్రామంలో తనిఖీలు జరిపారు. సరైన పత్రాలు లేని 23 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నఫీజ్ బాషా తెలిపారు. గృహాల్లో దాచి ఉంచిన 16 గొడ్డళ్లు, 14 కత్తులు స్వాధీనం చేసుకున్నామన్నారు. నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. ఎక్సైజ్ కేసుల్లో ఇద్దరు పాత నేరస్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. మాచర్ల పట్టణ సీఐ వెంకటరమణ, ఎక్సైజ్ సీఐ వెంకటరమణ, ప్రొబేషన్ ఎస్ఐ రాంబాబు పాల్గొన్నారు.

వేధింపుల కేసులో ఏడాది జైలు

యడ్లపాడు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మహిళను వేధింపులకు గురిచేయడం, బెదిరించడంతోపాటు అసభ్యకరంగా ప్రవర్తించిన నిందితుడికి న్యాయ స్థానం ఏడాది జైలు శిక్ష విధించింది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని వంకాయలపాడు గ్రామానికి చెందిన మహిళను రోడ్డుపై వేధించడంతో.. నిందితుడు షేక్ కరిముల్లాకు చిలకలూరిపేట అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి కె.నరేంద్రరెడ్డి ఏడాది జైలు శిక్షతోపాటు రూ.3వేలు జరిమానా విధిస్తూ గురువారం తీర్పునిచ్చారు. 2020 అక్టోబరు 30న అప్పటి ఎస్ఐ డి.శ్రీహరి కేసు నమోదు చేయగా.. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్.మహేంద్రనాథ్ వాదనలు వినిపించారు.

'అమరావతి' వేళల్లో స్వల్ప మార్పు

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నిత్యం గుంటూరు మీదగా ప్రయాణించే 17225 నరసపూర్ - హుబ్లీ అమరావతి ఎక్స్‌ప్రెస్ కాలమాన పట్టికను ఈ నెల 30 నుంచి రైల్వే శాఖ స్వల్పంగా సవరించింది. ఈ రైలు ప్రస్తుతం గుంటూరుకు రాత్రి 9 గంటలకు వచ్చి 9.05కి బయలుదేరుతుండగా ఆదివారం నుంచి రాత్రి 9.05కి వచ్చి 9.10కి బయలుదేరుతుంది.



ఉద్యోగావకాశాలు

➡ TATA కంపెనీ లో లైఫ్ & హెల్త్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ మరియు టీమ్ లీడర్స్ కావలెను. మీ శ్రమకు తగిన ఆదాయం + ఫారిన్ ట్రిప్స్ కలవు. సంప్ర॥ 94908 66938. AJG-239731

➡ గుంటూరు పరిసర ప్రాంతాల్లో ప్రముఖ పురుగు మందుల కంపెనీలో పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. Q: డిగ్రీ, జీతం : 15000+3000. సంప్ర॥ 9121469383. AJG-249478

➡ ఉత్సాహవంతులైన Sales executives కావలెను. నరసరావుపేట, వినుకొండ, గురజాల, మాచర్ల, సత్తెనపల్లి, పెదకూరపాడు, చిలకలూరిపేట. మంచి జీతం + ఇన్‌సెంటివ్, వయస్సు : 35 లోపు. మరియు మండలాల వారిగా డీలర్లు కావలెను. 0% పెట్టుబడి, ఆకర్షణీయమైన రాబడి, పల్నాడు జిల్లాలో సోలార్ పవర్ బిజినెస్. Ph: 7997018666 AJG-239130

FLAT FOR SALE

➡ గుంటూరు, గుజ్జనగుండ్ల పెద్ద పలకలూరు రోడ్డు కరెంటు ఆఫీసు, Opp. రోడ్డులో సాయి కృష్ణనగర్, 3వలైన్‌లో శ్రీ సాయి కృష్ణ ఆర్చిడ్‌లో 3BHK ఇండిపెండెంట్ ఫ్లాట్స్ మొత్తం 5.2313Sft తూర్పు ఫేసింగ్ ఫుల్ ఫినిష్డ్ ఫ్లాట్ అమ్మబడును. ఫోన్ : 9849470552. RK-318

గోల్డ్ ఫైనాన్స్

బంగారం కొనబడును

➡ బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర : 88024 89999 AJB-259783

రియల్ ఎస్టేట్

➡ గుంటూరు ఇన్నర్‌రింగ్ రోడ్‌లో సిద్ధంగా ఉన్న అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లు అమ్మకానికి ! 12సం॥ అద్దె గ్యారంటీతో మీ పెట్టుబడికి భద్రత.. 12 నెలల అద్దె అడ్వాన్స్ మరియు ప్రతి రెండు సం॥లకు 10% అద్దె పెరుగదల పక్కా ! బ్యాంక్ లోన్ సదుపాయం. ఇది కేవలం ఇల్లుకాదు - గ్యారెంటీ ఆదాయ మార్గం సంప్ర॥ మానస సెల్: 89774 58385. AJO-0268072

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనల కొరకు
ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు
99854 03281
సమయం : ఉ॥ 10:00 గం॥ల నుండి సా॥ 06:00 గం॥ల వరకు (సోమవారం నుండి శనివారం వరకు)

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి





అఖండ విజయాన్ని చేకూర్చిన సందర్భాన్ని పురస్కరించుకొని ప్రేక్షకులను స్వయంగా కలిసి ధన్యవాదములు తెలియజేసేందుకు ఈ రోజు ఒంగోలు : గోపి థియేటర్‌కు మ్యాట్నీ ఆటలో గుంటూరు : ఫోనిక్స్ మాల్ (మైత్రి) థియేటర్‌కు మొదటి ఆటలో హీరో, హీరోయిన్, దర్శక నిర్మాతలు మరియు యూనిట్ సభ్యులు విచ్చేస్తున్నారు.

గుంటూరు :	కీర్తన	రేపల్లె	: రాజ్యలక్ష్మీ
గుంటూరు :	బాలీవుడ్	మంగళగిరి :	అన్నపూర్ణ
గుంటూరు :	ఫోనిక్స్‌మాల్ (మైత్రి)	పిడుగురాళ్ళ :	గంగామహల్
తెనాలి	: సంగమేశ్వర	సత్తెనపల్లి	: సాయికృష్ణ
ఒంగోలు	: గోపి	వినుకొండ	: కీర్తిడీలక్స్
ఒంగోలు	: రవిప్రియమాల్	మాచర్ల	: వెంకటేశ్వర
నరసరావుపేట :	గీతామల్టీప్లెక్స్	చీరాల	: సురేష్‌మహల్
బాపట్ల	: విజయకృష్ణ	అద్దంకి	: VNS
పొన్నూరు	: శ్రీలక్ష్మీ		

Vamsi Nandipati Entertaiment LLP release

బహిరంగ ప్రకటన

ICICI Bank | నమోదిత కార్యాలయం : ICICI బ్యాంక్ టవర్, చక్లి సర్కిల్ సమీపాన, పాత పద్రా రోడ్, వడోదర - 390007 కార్పొరేట్ కార్యాలయం : ICICI బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, ముంబాయి 400051.

బంగారం ఇ-వేలం సహిత ఆహ్వాన ప్రకటన

బంగారు ఆభరణాల సౌకర్యం నిమిత్తం ICICI బ్యాంక్ లిమిటెడ్ ("ICICI బ్యాంక్") నుండి పొందిన ("సౌకర్యం") తమ బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా దిగువ తెలిపిన రుణగ్రహీతలకు నోటీసు జారీచేయడమైనది. వారు బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాలను డిసెంబర్ 08, 2025న ఇ-వేలం వేయడానికి మాకు తప్పనిసరి అయ్యింది. ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండానే ఖాతాను తొలగించడానికి/ ఇ-వేలం తేదీని మార్పు చేయడానికి ICICI బ్యాంక్‌కు అధికారం ఉంది. వేలం https://gold.samil.in ఆన్‌లైన్‌లో మ.12:30 గం. నుండి మ.3:30 గం. మధ్య నిర్వహించబడుతుంది. సవివరమైన నియమ నిబంధనల కోసం ఇవ్వబడిన వెబ్‌సైట్‌కు లాగిన్ అవండి. మరణించిన రుణగ్రహీత విషయంలో, వారి న్యాయవారసులకు అన్ని నియమ నిబంధనలు వర్తిస్తాయి.

రుణ ఖాతా నం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: భీమవరం - వన్ టౌన్	
795057000022	దొమ్మేటి రాంబాబు
శాఖ పేరు: గుడివాడ	
061162007160	మాధవి పండి
శాఖ పేరు: గుంటూర్-కొత్తపేట	
664957015049	వాల్మీకి కిరణ్మయి
శాఖ పేరు: కరివేన	
752462000989	అంచ నాగేశ్వర రావ్
752462000999	అంచ నాగేశ్వర రావ్
శాఖ పేరు: కొవ్వూర్	

రుణ ఖాతా నం.	ఖాతాదారు పేరు
378762002623	శ్రీనివాస్ కంటిపూడి
శాఖ పేరు: పెద్ద టేకూర్	
285762000879	మంగలి జయలక్ష్మి
శాఖ పేరు: పెద్దాపురం	
067857000070	ఎస్ శ్రీనివాస్
067862016705	ఎస్ శ్రీనివాస్
శాఖ పేరు: పుల్లంపేట	
204662000552	సింగం వెంకట రమణా రెడ్డి
204662000553	సింగం వెంకట రమణా రెడ్డి
204662000554	సింగం వెంకట రమణా రెడ్డి
204662000555	సింగం వెంకట రమణా రెడ్డి

రుణ ఖాతా నం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: రాజమండ్రి	
631562015113	నల్లాకుల సూర్య ప్రకాశ్ రావ్
శాఖ పేరు: రాజవరం	
286762000859	కుర్రి వెంకట నాగేశ్వరరావు
శాఖ పేరు: తిరుపతి	
630962039372	కె కుమార్
శాఖ పేరు: ఒంటిమిట్ట	
211262001021	ఉప్పుటూరు నరసింహులు
శాఖ పేరు: బెంగళూరు - నీలాద్రి మెయిన్ రోడ్	
317562001044	నరేష్ నీలం

తేది: 28.11.2025
ప్రదేశము: అన్నమయ్య, గుంటూరు, కాకినాడ, తూర్పు గోదావరి, ఏలూరు, కృష్ణా, కర్నూలు, నంద్యాల, తిరుపతి, పశ్చిమ గోదావరి, వై.యస్.ఆర్, ప్రకాశం,
సం/- అధీకృత అధికారి ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరపున

SHRIRAM Finance | శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
జోనల్ ఆఫీస్ చిరునామా: శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లైన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, గోరంట్ల, గుంటూరు - 522034.

డిమాండ్ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 లోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ గా పిలువబడేది, ఎన్.సి.ఎల్.టి బెంచ్-II, చెన్నై, తేది: 09-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేది నాటి కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్డ్ కంపెనీ అయి ఉన్నాము. మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 వద్ద రిజిస్టర్డ్ ఆఫీస్ కలిగియున్నది. మరియు జోనల్ ఆఫీస్: మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లైన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, గోరంట్ల, గుంటూరు-522034, బ్రాంచి ఆఫీస్ చిరునామా: పొన్నూరు లో మరియు నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్.బి.ఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నము. (ఇక నుండి మమ్మల్నీ కంపెనీ / ఋణదాతగా సూచిస్తారు). ఇందుమూలముగా ఈ క్రింది నోటీసు జారీ చేస్తున్నాము.

ఋణగ్రహీతలు / సహ-ఋణగ్రహీతలు / హామీదార్లు / దిగువ తెలుపబడిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదిల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు / హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 3తో చదువబడు సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసులు స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా చెల్లింపు తేది వరకు నోటీసులో తెలిపిన మొత్తం పై కాంట్రాక్టువల్ రేటున తదుపరి వడ్డీతో పాటు నోటీసులో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాలను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదార్లు / తనఖాదారులను కోరుతూ సర్ఫేసి చట్టం 2002లోని 13(2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదిలలో డిమాండ్ నోటీసులు జారీచేశారు.

చివరగా తెలిసిన వారి చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందజేయబడకుండ తిరిగి వచ్చినందుకు సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన రూపంలో వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధిత చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

ఋణగ్రహీత (లు) / సహ ఋణగ్రహీతలు / హామీదారు(లు) పేరు	ఎన్.పి.ఎ తేది ఋణ మొత్తం	డిమాండ్ నోటీసు తేది బకాయి మొత్తం
1. గరికపాటి అభిరామ్, తండ్రి: వెంకట శివ రామకృష్ణ, డి. నెం. 1-38, కృష్ణాయపాలెం, మంగళగిరి, గుంటూరు జిల్లా-522502. **2. గరికపాటి జ్యోతి,** భర్త: వెంకట శివ రామకృష్ణ, డి. నెం. 1-38, కృష్ణాయపాలెం, మంగళగిరి, గుంటూరు జిల్లా-522502. **3. గోడి వెంకట కృష్ణయ్య,** తండ్రి: సాంబయ్య, డి. నెం. 9-16, గోవాడ, అమృతలూరు, గుంటూరు జిల్లా-522325.	**31.10.2021** రూ. 10,00,000/- (అక్షరాలా పది లక్షల రూపాయలు మాత్రమే)	**25-10-2025** ది. 25-10-2025 తేది నాటికి రూ. 25,46,625/- (అక్షరాలా ఇరవై ఐదు లక్షల నలభై ఆరు వేల ఆరు వందల ఇరవై ఐదు రూపాయలు మాత్రమే)
ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ లోన్ అగ్రిమెంట్ నెం. PONNRTF2106300002		

ఆస్తిదారు అయిన గరికపాటి అభిరామ్ గారు తనఖా పెట్టిన స్థిరాస్తి వివరాలు:
గుంటూరు జిల్లా, తెనాలి రిజిస్ట్రేషన్ జిల్లా, చెరుకుపల్లి సబ్ జిల్లా, గోవాడ గ్రామ పంచాయతీ ఏరియా, గోవాడ గ్రామం నందు డి. నెం. 923-2 లోని ఎకరా 0.72 సెంట్ల విస్తీర్ణంలో నుండి ఎకరా 0.11 సెంట్లు లేదా 532 1/2 చదరపు గజాలు లేదా 445.22 చదరపు మీటర్ల స్థలం మరియు అందులో నిర్మించిన 'రామలింగేశ్వర రైస్ & ఫ్లోర్ మిల్' అనే పేరు గల రైస్ మిల్లు, డోర్ నెం. 4-13 తో సహా, హరిజన కాలనీ, గోవాడలో కలదు. **హద్దులు:తూర్పు:** పావులూరి లక్ష్మయ్య గారి స్థలం మొదలైనవి, **దక్షిణం:** గామినీ కృష్ణ గారి స్థలం, **పడమర:** జాయింట్ గల్లీ, **ఉత్తరం:** గామినీ విజయమ్మ గారి స్థలం. పైన తెలిపిన హద్దుల లోపల ఉన్న ఎకరా 0.11 సెంట్లు లేదా 532 1/2 చదరపు గజాలు లేదా 445.22 చదరపు మీటర్ల స్థలం మరియు అందులో నిర్మించిన 'రామలింగేశ్వర రైస్ & ఫ్లోర్ మిల్' పేరు గల రైస్ మిల్లు, డోర్ నెం. 4-13 మాత్రమే. (ఈ ఆస్తి ఎస్.ఆర్.ఓ. తెనాలి (పశ్చిమ) యొక్క డాక్యుమెంట్ నెం. 1850/2020 మరియు ఎస్.ఆర్.ఓ. అమర్తలూరు యొక్క డాక్యుమెంట్ నెం. 762/2021 కు సంబంధించినది).

పైన పేర్కొన్న పరిస్థితులలో ఈ నోటీసు ప్రచురించబడిన తేది నుండి 60 రోజులలోగా భవిష్యత్తు వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతో పాటు పైన పేర్కొన్న విధంగా చెల్లించవలసిన మిగులు బకాయి మొత్తాలను చెల్లించవలసిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు / సహ-ఋణగ్రహీతలు మరియు / లేదా వారి హామీదార్లు (వర్తించునపుడు) కు ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది. ఆ విధంగా చేయుటలో విఫలమైతే ఈ నోటీసు తేది నుండి 60 రోజులు ముగిసిన తరువాత సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002లోని సెక్షన్ 13(4) మరియు దాని క్రింద వర్తించే రూల్స్ క్రింద ఋణగ్రహీతలు మరియు తనఖా పెట్టిన వ్యక్తుల సెక్యూర్డ్ ఆస్తుల స్వాధీనం చేసుకొనుటతో సహా సెక్యూర్డ్ ఆస్తుల పైన తదుపరి చర్యలు చేపట్టబడును. సదరు చట్టంలోని సెక్షన్ 13(13) క్రింద ఏ ఋణగ్రహీత సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు వ్రాతపూర్వక సమ్మతి లేకుండా పొందకుండా నోటీసులో రిఫర్ చేసిన అతని సెక్యూర్డ్ ఆస్తులు వేటిని అమ్మకం, లీజు ఇతరత్రా బదిలీ చేయరాదని గమనించవలెను.

ప్రదేశం: గుంటూరు | అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్



కాపునాడు స్వర్ణోత్సవ సభ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దేగల ప్రభాకర్, మలిశెట్టి సుబ్బారావు, కాపు నేతలు

కాపునాడు స్వర్ణోత్సవాలు జయప్రదం చేయండి

● దేగల ప్రభాకర్

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విజయవాడ గాంధీనగర్ జింఖానా గ్రౌండ్స్‌లో ఈ నెల 30న జరిగే కాపునాడు బహిరంగసభను విజయవంతం చేయాలని ఏపీఐడీసీ చైర్మన్ దేగల ప్రభాకర్ కోరారు. కాపునడు స్వర్ణోత్సవాలను పురస్కరించుకొని గురువారం ఆయన, మలిశెట్టి సుబ్బారావుతో కలిసి సెవెన్ హిల్స్ ఫార్మసీ కార్యాలయంలో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దివంగత వంగవీటి మోహనరంగా రావు, మిరియాల వెంకటరావు 50 సంవత్సరాల క్రితం విజయవాడలో స్థాపించిన కాపునాడు, తదనంతరం గాళ్ళ సుబ్రహ్మణ్యం సారధ్యంలో దిగ్విజయంగా కొనసాగుతూ స్వర్ణోత్సవాలు జరుపుకోబోతోందని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కాపునాడు ఉపాధ్యక్షుడు యర్రగోపు నాగేశ్వరరావు, రాగం సదాశివరావు, బొందలపాటి వెంకట్రావు, చెల్లుబోయిన శ్రీనివాసరావు, సోమ రౌతు శ్రీనివాసరావు, చెన్నం శెట్టి చక్రపాణి, తోట కోటేశ్వరరావు, తోట అక్కి, మేకల బాబురావు, బొక్కిసం శివరాం, కాపు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా జరగాలి

● జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ



జేసీ అశుతోష్ శ్రీవాస్తవ

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్దతు ధరకు ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా వ్యవసాయ, రెవెన్యూ, పౌరసరఫరాల శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి ఆయన వ్యవసాయ, పౌరసరఫరా అధికారులు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ శ్రీవాస్తవ మాట్లాడుతూ, జిల్లాలో వరి కోతలు పూర్తిస్థాయిలో ప్రారంభమైనందున రైతులకు ఇబ్బంది లేకుండా మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు సరిపడా గోనె సంచులు, వాహనాలను పౌరసరఫరాల అధికారులను సమన్వయం చేసుకుంటూ తహసీల్దార్లు అందుబాటులో ఉంచాలన్నారు.

హిందూ శ్మశాన వాటికలను అభివృద్ధి చేయండి

● నగర కమిషనర్‌కు ఎమ్మెల్యే నసీర్ విజ్ఞప్తి



కమిషనర్‌తో నియోజకవర్గ సమస్యలపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): హిందూ శ్మశాన వాటికల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులును గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ కోరారు. నగర కమిషనర్ చాంబర్‌లో గురువారం ఆయనను కలిసిన ఎమ్మెల్యే నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై చర్చించారు. పాత గుంటూరు, డీసీ నగర్ ప్రాంతాల్లో హిందూ శ్మశాన వాటికల్లో సరైన సౌకర్యాలు లేక ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, అక్కడ అభివృద్ధి పనులు ప్రారంభించాలని కోరారు. అలాగే బస్టాండ్ సమీపంలోని ఎన్టీఆర్ ఐలాండ్, నాజ్ సెంటర్, హిందూ కాలేజీ వద్ద ఐలాండ్‌లను సుందరీకరించాలని ఎమ్మెల్యే నసీర్ కమిషనర్‌కు విన్నవించారు. పనుల్లో నిర్లక్ష్యం వహించే కాంట్రాక్టర్లకు వెంటనే నోటీసులివ్వాలని, అవసరమైతే వారిని తొలగించి కొత్త వారికి అవకాశం కల్పించాలని కోరారు.

● డిసెంబరు 3న జాబ్ మేళా

గుంటూరు తూర్పు నియోజకవర్గంలో డిసెంబరు 3న నిర్వహించే జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నసీర్ పిలుపునిచ్చారు. జాబ్ మేళాకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను గురువారం తన కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు.

అప్పుల బాధతో కూరగాయల వ్యాపారి అదృశ్యం



నూతలపాటి ఆదినారాయణ (ఫైల్)

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక శ్రీనివాసరావుతోట 9వ లైనుకు చెందిన నూతలపాటి ఆదినారాయణ (42) అనే కూరగాయల వ్యాపారి అదృశ్యమయ్యాడు. గుంటూరు మార్కెట్‌లో కూరగాయల వ్యాపారం చేసే ఆదినారాయణకు మద్యం సేవించే అలవాటుంది. అప్పై వ్యాపారం సరిగా లేక బయట అప్పులు చేశాడు. నాలుగు నెలల నుంచి ఏం పనిచేయకుండా ఇంట్లోనే ఖాళీగా ఉంటున్నాడు. అప్పుడప్పుడూ ఇంటి నుంచి వెళ్లిపోతా అంటూ ఉండేవాడు. ఇలాగే గతంలో ఒకసారి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా శ్రీశైలం వెళ్లి మళ్లీ తిరిగి వచ్చాడు. ఇదే క్రమంలో ఈ నెల 24న ఇంట్లో నుంచి వెళ్లి ఇప్పటివరకు తిరిగి రాలేదు. ఈ మేరకు అతని భార్య పూర్ణకుమారి పోలీసులకు ఫిర్యాదు చేయగా నగరంపాలెం ఎస్ఐ ప్రసన్నకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చుట్టుగుంట సిగ్నల్ వద్ద ఎండిపోయిన డివైడర్‌లో మొక్కలు



పొగాకు బోర్డు సమీపంలో ఎండిపోయిన మొక్కలు



కుండీల్లో మొక్కలు ఇలా..

రెండు వారాలకే మోడువారాయి..!

● నగరపాలకా ఏమిటీ వైచిత్రం

గుంటూరు(విద్య), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సరిగ్గా రెండు వారాల క్రితం నవంబరు 11న కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ నగరానికి వచ్చారు. ఈ సందర్భంగా నగరంలో ఎత్తురోడ్డు నుంచి చుట్టుగుంట వరకు డివైడర్స్‌లో రూ.లక్షలు వెచ్చించి మొక్కలు నాటారు. అప్పుడే ఆ మొక్కలు ఎండిపోయాయి. అదేవిధంగా పొగాకు బోర్డు నుంచి కలెక్టరేట్ వరకు ఇరువైపుల కుండీల్లో ఏర్పాటుచేసిన మొక్కలు కొన్నిచోట్ల ఎండిపోతున్నాయి. మొక్కలకు నీరుపోసే సమయంలో సరైన జాగ్రత్త తీసుకోకపోవడం వేళ్ళు బయటపడి కొన్నిచోట్ల మొక్కలు ఎండిపోతున్నాయి. కొన్నిచోట్ల నీరుపోసినా తూతూ మంత్రంగా పైపునుంచి నీళ్ళు చిలకరించి సిబ్బంది చేతులు దులుపుకవోడం వంటి కారణాలతో వాడిపోతున్నాయి. మొక్కలు నాటే ముందు డివైడర్స్‌లో వేసిన ఎర్రమట్టిలో నాణ్యత లోపించడడం మొక్కలు ఎండిపోవడానికి కారణమని ఫారెస్టు సిబ్బంది చెబుతున్నారు. ఇలా ప్రజాధనాన్ని రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన మొక్కలు నిలువునా ఎండిపోతున్నా నగరపాలక సంస్థ అధికారులకు చీమకుట్టినట్లైనా లేకపోవడం గమనార్హం.



సర్వే ఆన్‌లైన్ విధానాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

సర్వేను వేగంగా పూర్తి చేయాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరుకార్పొరేషన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వార్డ్ సచివాలయాల వారీగా జరుగుతున్న సమగ్ర సర్వేను వేగంగా పూర్తి చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం స్థానిక ఆకులవారితోటలోని 83,84 వార్డ్ సచివాలయాలను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేసి సర్వే ఆన్ లైన్ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగర పరిధిలో సమగ్ర సర్వే కచ్చితమైన వివరాలతో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతి కార్యదర్శి తమకు కేటాయించిన క్లస్టర్‌లో ప్రజలకు సర్వే అంశంపై వివరించి, నిర్దేశిత ఫార్మేట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం సచివాలయ భవన సమస్యలను కార్యదర్శులు, నోడల్ అధికారి వివరించగా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పర్యటనలో నోడల్ అధికారి పోలేశ్వరరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తి నరసింహకు ఆహ్వానం



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీ నరసింహకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న డాక్టర్ గజల్ శ్రీనివాస్

గుంటూరు (తూర్పు), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జనవరి 3 నుంచి గుంటూరులో జరిగే ప్రపంచ తెలుగు మహాసభలకు భారత సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ పమిడి ఘంటం శ్రీ నరసింహకు ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ ఆహ్వానం పలికారు. 3వ తేదిన జరిగే తెలుగు మహాసభల ప్రారంభోత్సవానికి సతీ సమేతంగా హాజరు కావాలని కోరారు. సంస్థాగతమైన వ్యవస్థను ఏర్పరచుకొని తెలుగును రాబోయే తరాల వారికి అందించేటట్టు అందరూ పనిచేయాలని జస్టిస్ శ్రీ నరసింహా అభిప్రాయపడ్డారని ఈ సందర్భంగా గజల్ శ్రీనివాస్ తెలిపారు.

మాతృ, శిశు మరణాల నియంత్రణకు కిల్కారీ కాల్స్

● డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి వెల్లడి



ప్రసంగిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి

గుంటూరు మెడికల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాతృ, శిశు మరణాల నియంత్రణకు కిల్కారీ కాల్స్ ఎంతగానో దోహదపడతాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి తెలిపారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో జరిగిన జిల్లాస్థాయి ఆశ నోడల్ అధికారుల సమావేశంలో ఆమె ప్రసంగించారు. తల్లి బిడ్డల ఆరోగ్య క్షేమ సమాచారాన్ని అందించే కిల్కారి కాల్స్ సమాచారం ద్వారా గర్భిణీలు, బాలింతలు తమ బిడ్డల ఆరోగ్య పరిరక్షణ పాటించవచ్చన్నారు. మాతా శిశు మరణాలు తగ్గించేందుకు ఇవి ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు. కిల్కారీ కాల్స్ కోసం ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో గర్భిణీల వివరాలు సకాలంలో కచ్చితంగా నమోదు చేయాలని ఆమె సూచించారు. కిల్కారి కాల్ వచ్చే, 911 600 40 3660 నంబర్‌ని గర్భిణీ, బాలింతల మొబైల్ ఫోన్లో సేవ్ చెయ్యాలని, అప్పుడు మాత్రమే కాల్ వచ్చినప్పుడు లిఫ్ట్ చేసి సమాచారాన్ని వినగాలుగుతారని డాక్టర్ కె.విజయలక్ష్మి సూచించారు. తిరిగి కాల్ సమాచారాన్ని వినేందుకు 14423 లేక 1800 532 1255 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ అన్నపూర్ణ, పీవో ఎన్‌సీడీ డాక్టర్ రోహిణి రత్నశ్రీ, డిపిహెచ్ఎన్ఓ ఇంచార్జ్ డాక్టర్ కే ప్రియాంక, ,కిల్కారి రీజనల్ ప్రోగ్రాం ఆఫీసర్ బి రాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డైరక్టర్ మూర్తి, ఎస్ఈలు రమేష్, శ్రీనివాసరెడ్డి

పీఎం సూర్యఘర్ అమలుపై దృష్టి పెట్టాలి

● ఎస్సీ, ఎస్టీలకు మరింత లబ్ధి చేకూర్చాలి ● ఏపీ సీపీడీసీఎల్ డైరక్టర్ మూర్తి

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం అమలుపై అధికారులు మరింత దృష్టి సారించాలని ఏపీ సీపీడీసీఎల్ ప్రాజెక్ట్ డైరక్టర్ టీవీఎస్ ఎన్ మూర్తి సూచించారు. సంగడిగుంటలోని విద్యుత్ భవన్‌లో గురువారం గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ చల్లా రమేష్, స్కాడా ఎస్ఈ జె.శ్రీనివాసులరెడ్డితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరక్టర్ మాట్లాడుతూ, పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా 200 యూనిట్లలోపు వినియోగించుకునే ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచితంగా సూర్య పలకాలను ఏర్పాటు చేస్తారన్నారు. ఆ దిశగా పూర్తిస్థాయిలో అర్హులైన వారికి పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటులో కూడా ఎక్కడా అశ్రద్ధ చేయొద్దని, కేటగిరీ 2 విభాగంలో పూర్తిస్థాయిలో అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు టౌన్-1 డివిజన్ ఆపరేషన్ ఈఈ టి.శ్రీనివాసబాబు, ఏడీఈలు తదితరులున్నారు.



యువ క్రీడాకారుడికి బ్యాట్ అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

హెడ్ కానిస్టేబుల్ కుమారుడికి ప్రోత్సాహకం

● రూ.20 వేల విలువైన టెన్నిస్ బ్యాట్ ఇచ్చిన ఎస్పీ

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్ టెన్నిస్ పోటీల్లో రాణిస్తున్న హెడ్ కానిస్టేబుల్ కుమారుడికి ఎస్పి వకుల్ జిందాల్ ప్రోత్సాహకాన్ని అందించారు. జిల్లా పోలీస్‌శాఖలోని ఏఆర్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ మొహిద్దిన్ బాషా కుమారుడు షేక్ అఖ్యార్ అహ్మద్ సాఫ్ట్ టెన్నిస్ క్రీడలో అసాధారణ ప్రతిభను కనబరుస్తున్నాడు. ఈ నేపథ్యంలో అతనికి ప్రోత్సాహకంగా రూ.20 వేల ఖరీదైన బ్యాట్‌ను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ బహుమతిగా అందించారు. ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన అండర్-17 పోటీల్లో అఖ్యార్ ప్రథమ స్థానం సాధించి, మధ్యప్రదేశ్‌లో జరగబోయే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా అతను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకొని తన విజయం గురించి తెలియజేశాడు. ఎస్పీ అతన్ని అభినందిస్తూ టెన్నిస్ బ్యాట్‌ను బహుమతిగా అందజేసి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

మానవత్వాన్ని విడువకూడదు

● మతాలు వేరైనా దైవం ఒక్కటే
● నూర్ మస్జిద్ ప్రారంభోత్సవంలో మంత్రి లోకేశ్

మంగళగిరి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎవరు ఏ మతంలో జన్మించినా.. మానవత్వాన్ని ఎవరూ ఏ సందర్భంలోనూ విడువకూడదని రాష్ట్ర ఐటీ విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ ఉద్బోధించారు. ప్రతి ఒక్కరికీ మానవత్వమే ప్రధాన ఆభరణం, అదే అలంకారం కావాలని ఆయన అభిలషించారు. స్థానిక ఆర్టీసి డిపో రోడ్డులో నూతనంగా నిర్మించిన నూర్ మస్జీద్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం మస్జీద్‌లో ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మతాలు వేరైనా దైవం మాత్రం ఒక్కరేనన్న సత్యాన్ని అందరూ గుర్తుంచుకోవాలన్నారు. మతాల పేరుతో విద్వేషాలకు పోవడం మానవత్వం కాదన్నారు. అందరి అంతిమ లక్ష్యం మానవత్వమే కావాలన్నారు. మంగళగిరి నియోజకవర్గానికి సేవ చేసే అవకాశాన్ని ఇక్కడి ప్రజలు తనకు కల్పించారన్నారు. తనకున్న పరిధిలో తనకున్న అవకాశాల మేరకు మంగళగిరి ప్రజలకు సేవ చేస్తున్నానని చెప్పారు. కష్టాల్లో ఉన్నవారికి కులమతాలు చూడకుండా సాయపడాలన్నారు. 2047 నాటికి దేశాన్ని అగ్రప ధాననిలిపేందుకు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారన్నారు. ఆ భగవంతుడు తనపై పవిత్రమైన బాధ్యతను పెట్టాడని, దానిని నెరవేర్చడమే తన లక్ష్యమన్నారు. మంగళగిరి అభివృద్ధికి అందరం కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. మంగళగిరి అభివృద్ధి కోసం లోకేశ్ బాగా పనిచేశాడని నలుగురు చెప్పుకున్నపుడే తనకు మనశ్శాంతి ఉంటుందని, ఆ మెప్పు కోసం తాను నిరంతరం శ్రమిస్తూనే ఉంటానని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీడీపీ నేతలు కనికళ్ల చిరంజీవి, గాదె పిచ్చిరెడ్డి, ముస్లిం ప్రతినిధులు షేక్ నాగుల్‌మీరా, మసీదు వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ మహమ్మద్ ఆలీ, మసీదు కమిటీ సభ్యుడు షేక్ మహమ్మద్ జానీ, మహమ్మద్ ఫిరోజ్, షేక్ షౌకత్ ఆలీ, షాహిద్ ఆలీ, జాఫర్,, నజీర్, ఆసిఫ్, అబ్దుల్లా కుట్టీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నల్లపాడు పోలీసుస్టేషన్ పరిధి ఇన్నర్ రింగ్ రోడ్డులో జరిగిన ప్రమాదంలో గాయపడిన వంగ గణేష్ రెడ్డి (20) జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. గోరంట్లకు చెందిన గణేష్ రెడ్డి టైల్స్ పని చేస్తుంటాడు. ఈ నెల 25న రాత్రి సమయంలో తన స్నేహితులను కలిసేందుకు వెళుతూ ఇన్నర్ రింగ్‌రోడ్డులో బైక్ అదుపుతప్పి పక్కనే ఉన్న దిమ్మెను ఢీ కొట్టాడు. స్థానికులు వెంటనే అతన్ని జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తల్లి రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయాభివృద్ధికి బ్యాంక్ ఆఫ్ బరోడా చేయూత

● బీవోబీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ వీఎల్ శ్రీధర్

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాభివృద్ధి కోసం బ్యాంక్ ఆఫ్ బరోడా అనేక పథకాలతో చేయూత కల్పిస్తోందని ఆ బ్యాంకు చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ ఇనుమెల్ల వీఎల్ శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం పెదనందిపాడు గ్రామంలో కిసాన్ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. రైతులకు బ్యాంకింగ్ సేవలు, వ్యవసాయ రుణాలు, ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలను చేరవేయటమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. రైతు బలమే దేశ బలం, రైతు అభివృద్ధి దేశ అభివృద్ధి అనే నమ్మకంతో బ్యాంక్ ఆఫ్ బరోడా ఎల్లప్పుడూ రైతుల పక్షాన నిలుస్తుందన్నారు. జనరల్ మేనేజర్ రితేష్ కుమార్ మాట్లాడుతూ డిజిటల్ బ్యాంకింగ్ సౌకర్యాల ప్రాధాన్యాన్ని వివరించి, రైతులు సులభంగా, సౌకర్యవంతంగా రుణాలు పొందడంలో, డిజిటల్ లావాదేవీలు నిర్వహించడంలో నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. చిన్న పొదుపుల ప్రాముఖ్యతను వివరించి, రెక్యురింగ్ డిపాజిట్ ద్వారా పొదుపు అలవాటు చేసుకోవాలని ప్రోత్సహించారు. వ్యవసాయ శాఖ జాయింట్ డైరక్టర్ ఎమ్ పద్మావతి మాట్లాడుతూ, వ్యవసాయ ఉత్పాదకత పెంచడానికి డ్రోన్లు, హార్వెస్టర్లు, ట్రాక్టర్లు వంటి సాంకేతిక పరికరాల వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు. అలాగే డిమాండ్ ఆధారిత పంటల మార్పిడిపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా వివిధ పథకాల కింద రైతులకు రూ. 60.25 కోట్ల విలువైన రుణాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు రీజనల్ మేనేజర్ ఎస్‌కే కిరణ్ రెడ్డి, గుంటూరు ఎల్‌డీఎమ్ రత్న మహిపాల్ రెడ్డి, డీడీఎమ్ జి.శరత్‌బాబు, డీపీఎమ్ కేశవ్ కుమార్, మండల వ్యవసాయాధికారి సుబ్రహ్మణ్యం, పెదనందిపాడు బీవోబీ చీఫ్ మేనేజర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు చెక్కులు పంపిణీ చేస్తున్న చీఫ్ ఫైనాన్షియల్ అధికారి వీఎల్ శ్రీధర్, జీఎం రితేష్ కుమార్ తదితరులు

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్ర॥ 99854 11213 99854 11225 99854 01877 99854 04047 99854 01614

గుంటూరు పశ్చిమలో అభివృద్ధి వేగవంతం

● ఎమ్మెల్యే గళ్ళా మాధవి
● రూ.16.44 కోట్ల పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాధవి, పక్కన మేయర్ తదితరులు

గుంటూరుకార్పొరేషన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. గురువారం నియోజకవర్గంలోని వివిధ డివిజన్లలో రూ.16.44 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు మేయర్ కోవెలమూడి రవీంద్రతో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ, రోడ్లు, బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, వాటర్ పైప్‌లైన్లు వంటి కీలక మౌలిక వసతుల పనులకు శంకుస్థాపన చేశామని తెలిపారు. ప్రజలు కోరిన ప్రతి అభివృద్ధి పనిని వెంటనే అంచనాలు తయారు చేయించి మంజూరు చేయడంలో మేయర్ కోవెలమూడి రవీంద్ర సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే మాధవి కొనాయాడారు. అలాగే కార్పొరేషన్ బిల్లులు కూడా వేగంగా క్లియర్ చేయాలని మేయర్ రవీంద్రను ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ప్రముఖ హోమియో వైద్య నిపుణులు డాక్టరు ఓవీ రమణ, కార్పొరేటర్ వరప్రసాద్, అధికారులు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మోడల్ పేపర్స్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తదితరులు

10వ తరగతి మోడల్ పేపర్ల ఆవిష్కరణ

గుంటూరు (విద్య), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పదో తరగతి పరీక్షలకు సంబంధించిన మోడల్ పేపర్లను యూటీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆవిష్కరించారు. పరీక్షలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు వీలుగా మోడల్ పేపర్లను రూపొందించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యూ.రాజశేఖర్, ఎం.కళాధర్ వెల్లడించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, ప్రచురణల విభాగం చైర్మన్ ఎం.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి రాజ్యాంగమే కీలకం

● డాక్టర్ రాయపాటి శ్రీనివాస్



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

గుంటూరు (విద్య), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): యువత రాజ్యాంగ స్ఫూర్తిని ఆచరణలో పెట్టినప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుందని ఆర్‌వీఆర్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. చౌడవరంలోని కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న రాజ్యాంగ ఆమోద దినోత్సవాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు రాజ్యాంగం ఎంతో కీలకమన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ, ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు .

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

గుంటూరు (తూర్పు), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు పూనేపల్లి శ్రీనివాసరావు, నగర ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు డిమాండ్ చేశారు. గురువారం నగరపాలక సంస్థ హెడ్ వాటర్ వర్క్స్ వద్ద లేబర్ కోడ్‌ల కాపీలను దగ్ధం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, కార్మికులకు సమ్మె, యూనియన్ ఏర్పాటు చేసే హక్కులు లేకుండా ఈ కోడ్‌లను రూపొందించారని, ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ పేరుతో ఉపాధి భద్రత లేకుండా చేశారని మండిపడ్డారు. ఈ చట్టాలు యాజమాన్యాలకు అనుకూలం తప్ప కార్మికులకు కాదన్నారు. లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా భవిష్యత్తులో జరిగే ఆందోళనల్లో ప్రతి కార్మికుడు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ నిరసనల్లో యూనియన్ నాయకులు యాసిర్ ఖాన్, బాషా, షమ్మీ, వెంకటేశ్వరరావు, సలాం, సీహెచ్ అజీల్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

గుంటూరు (తూర్పు), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం కృషి చేయాలని ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఏపీ ఎన్జీజీవో కల్యాణ మండపంలో నూతనంగా ఎన్నికైన నగర యూనిట్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఏఎన్ఎంలకు వైద్య, ఆరోగ్యశాఖకు సంబంధించిన విధులు మాత్రమే నిర్వహించేలా ఉత్తర్వులు జారీచేయడం, పీఆర్సీ కమిటీ ఏర్పాటు, నగదు రహిత చికిత్స, రావాల్సిన బకాయిలు వంటి సమస్యలపై సమావేశంలో చర్చించారు. అనంతరం నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌పీఎస్ సూరి, సీహెచ్ కల్యాణ్‌కుమార్‌ను రాష్ట్ర, జిల్లా నాయకులు ఘనంగా సత్కరించారు. తొలుత 20 మంది ఈసీ సభ్యుల కోఆప్షన్ ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆరాధ్యుల శ్యాం సుందర్ శ్రీనివాస్, షేక్ నాగూర్‌షరీఫ్ పాల్గొన్నారు.



నగర కమిటీ సభ్యులను సత్కరిస్తున్న ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు తదితరులు


హోమ క్రతువు నిర్వహిస్తున్న వేద పండితులు


దేవాలయ నమూన గ్యాలరీని తిలకిస్తున్న సీఎం చంద్రబాబు

శ్రీవారి చిత్తంతోనే.. అమరావతి

(3వ పేజీ తరువాయి)

చేస్తున్నామని చెప్పారు. అమరావతినే కాకుండా, ఈ ప్రాంతాన్ని కాపాడే శక్తి ఈ దేవాలయానికి ఉందన్నారు. గత ప్రభుత్వం విధ్వంసం తప్ప మంచి చేసిన సందర్భాలు లేవని, మంచి సంకల్పంతో రైతులు భూములు ఇస్తే నరకాన్ని చూపించారన్నారు. రైతులు వేంకటేశ్వరస్వామిని నమ్ముకుని న్యాయస్థానం నుంచి దేవస్థానం వరకు యాత్ర చేసి రాజధానిని కాపాడుకోవడానికి పోరాడారన్నారు. కార్యక్రమం లో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరి నారాయణ, నాదెండ్ల మనోహర్, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, సభ్యులు జానకీదేవి, భానుప్రకాశ్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, పెద్ద సంఖ్యలో రాజధానిప్రాంత రైతులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు


కార్యక్రమానికి హాజరైన అభిమానులు, భక్తులు

కోడిగుడ్డు.. అధరహో

● హోల్‌సేల్‌లోనే రూ.6.40 ● చిల్లర దుకాణాల్లో ధర రూ.8



గుంటూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మార్కెట్లో కోడి గుడ్డు ధర అదరకొడుతోంది. గత నెలలో హోల్‌సేల్‌లో రూ.6 లోపు ఉన్న ధర క్రమంగా పెరుగుతూ తాజాగా రూ.6.40కి చేరింది. ఒకవైపు కూరగాయల ధరలతో పాటు కోడి గుడ్డు ధరలు అమాంతం పెరగడంతో సామాన్యులు ఏమి తినాలోనని ఆవేదన చెందుతున్నారు. సాధారణంగా మాంసాహార ప్రియుల తో పాటు ఇతర వర్గాలవారు కోడి గుడ్డు అంటే ఇష్టపడతారు. కొందరైతే నిత్యం ఆహారంలో కోడిగుడ్డును భాగం చేసుకుంటారు. నవంబరు మొదటి వారంలో 100 గుడ్ల ధర రూ.585 ఉండేది. క్రమంగా పెరుగుతూ అది రూ.660 వరకు చేరింది. ఇక విజయవాడ జోన్ నెక్ వారు శుక్రవారం ధర రూ.640గా ప్రకటించారు. కాగా గతంలో 30 గుడ్ల ట్రే రూ.180 నుంచి రూ.200 లోపు ఉండేది. ప్రస్తుతం పెరిగిన ధరతో 30 గుడ్ల ట్రే రూ.210 నుంచి రూ.220 వరకు విక్రయిస్తున్నారు. హోల్‌సేల్ ధరలు ఇలా ఉంటే చిల్లర దుకాణాల్లో రెండు గుడ్లు రూ.15, గుడ్డు రూ.8 అంటూ ఇష్టానుసారంగా వి క్రయిస్తు న్నారు. చలికాలం ప్రారంభంతో సహజం గానే కో డిగుడ్ల ఉత్పత్తి సాధారణం కంటే కొంత తక్కు వగానే ఉంటుందని పౌల్ట్రీ వర్గాలు తెలిపాయి. ఉత్పత్తి తగ్గడంతో పాటు ఇదే సమయంలో ఎగుమతులు పెరగడంతో కోడిగుడ్లకు డిమాండ్ పెరిగింది. ఈ కారణంగా ధరలు పెరిగా యని హోల్‌సేల్ వ్యాపారి యర్రబోతు వెంకటరమణ తెలిపారు. ఇవే ధరలు మరికొంత కాలం ఉండే అవకాశం ఉంటుందని పౌల్ట్రీ వ్యాపారులు తెలిపారు.

పరిశ్రమల భాగస్వామ్యంతోనే
పర్యావరణ పరిరక్షణ

● ఏపీ పీసీబీ చైర్మన్ కృష్ణయ్య

గుంటూరు(తూర్పు), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో పరిశ్రమలు భాగస్వామ్యం తప్పనిసరి అని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి బోర్డు(ఏపీ పీసీబీ) చైర్మన్ పి.కృష్ణయ్య అన్నారు. ఇండస్ట్రీ పర్యావరణ పర్యవేక్షణ, సమీక్ష కార్యక్రమంలో భాగంగా గుంటూరులోని ఐటీసీ హోటల్, హిందుస్థాన్ రీసైక్లింగ్ హబ్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఐటీసీ హోటల్లోని ఉత్పత్తి అయ్యే తడి వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించేందుకు 200 కిలోల సామర్థ్యం కలిగిన ఆర్గానిక్ వేస్ట్ కంపోస్టింగ్ యంత్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ యంత్రం ద్వారా ఉత్పత్తి అయ్యే కంపోస్టును ప్రాంగణంలో ఎరువుగా వినియోగిం చడంతో పాటు, బయట నర్సరీలకు పంపిణీ చేస్తున్నట్లు చైర్మన్‌కు హోటల్ మేనేజ్‌మెంట్ వివరించింది. ఈ సందర్భంగా పర్యావరణహిత వ్యర్థ నిర్వహణ సమర్థంగా అమలు చేస్తున్నం దుకు మేనేజ్‌మెంట్‌ను అభినందించారు. అనంతరం హిందుస్థాన్ రీసైక్లింగ్ హబ్‌ను సందర్శించి వాహనాల రీసైక్లింగ్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. తుక్కును పర్యావరణానికి హాని కలిగించకుండా, అనుబంధ పరిశ్రమల్లో వినియోగించి, విలువ అధారిత ఉత్పత్తులుగా మార్చే అవకాశాలను అన్వేషించాలని మేనేజ్‌మెంట్‌కు చైర్మన్ సూచించారు. ఈ సందర్భంగా చైర్మన్‌కు ఈ రెండు పరిశ్రమలు చేపట్టిన పర్యావరణ హిత కార్యక్రమాలు, వాటి నిర్వహణ విధానాలు గురించి జిల్లా పర్యావరణ ఇంజనీరు నజీనా బేగం వివరించారు. అనంతరం ఈ రెండు పరిశ్రమల ఆవరణల్లో పి.కృష్ణయ్య, నజీనా బేగం మొక్కలు నాటారు. ఆయా పరిశ్రమల ఉద్యోగులు, కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న ఏపీపీసీబీ చైర్మన్ పీ కృష్ణయ్య, పాల్గొన్న జిల్లా పర్యావరణ ఇంజనీరు నజీనా బేగం



ఆర్టీసీ ప్రయాణికులకు చల్లనికబురు

ఏసీ సర్వీసుల్లో చార్జీలపై 10 శాతం రాయితీ
డిసెంబరు 1 నుంచి 20 వరకు అవకాశం

గుంటూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఏసీ సర్వీసులకు ప్రయాణికులను ఆకర్షించేందుకు సంస్థ ప్రయాణ చార్జీలపై 10 శాతం రాయితీ ప్రకటించింది. ఈ రాయితీ డిసెంబరు ఒకటో తేదీ నుంచి 20వ తేదీ వరకు అమల్లో ఉండనున్నది. అయితే ప్రయాణికులు రద్దీ ఉండే ఆదివారం రోజున రాయితీని మినహాయిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆయా బస్టాండ్ల నుంచి రాకపోకలు సాగించే ఇంద్ర, అమ రావతి ఏసీ సర్వీసులలో ఈ రాయితీ వర్తిస్తుందన్నారు. రాయితీ చార్జీలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని డీపీటీవో సామ్రాజ్యం తెలిపారు.

రాయితీ ధరలు ఇలా....

రూట్	సర్వీసు	పాత ధర	రాయితీ ధర
గుంటూరు టూ బీహెచ్ఈఎల్ వయా మిర్యాలగూడ	అమరావతి	870	790
గుంటూరు టూ బీహెచ్ఈఎల్ వయా విజయవాడ	అమరావతి	970	880
గుంటూరు టూ బీహెచ్ఈఎల్ వయా మిర్యాలగూడ	ఇంద్ర	700	640
తెనాలి టూ బీహెచ్ఈఎల్	ఇంద్ర	770	710
తెనాలి టూ విశాఖపట్నం	ఇంద్ర	960	880

పుడమి తల్లి రుణం తీర్చుకోవాలి

(3వ పేజీ తరువాయి)

ఎమ్మెల్యేలు ఇప్పుడు దారి తప్పుతున్నారని, వారు చెబితేనే ఏ పనైనే చేసేందుకు అధికారులు అలవాటు పడ్డారని, ఇటువంటి పరిస్థితుల్లో పేదలకు సంక్షేమం అందటం కష్టమవుతుందన్నారు. అమ్మ భాషను మర్చిపోయినవాడు అసలు మనిషే కాదన్నారు. సాటి మనిషికి సేవ చేయడం గొప్ప భాగ్యమని, దీనికి దుర్గా కమేశ్వరరావు ఒక ఆధునిక రుషిలా పాటుపడ్డారని కొనియాడారు. నేటి ప్రభుత్వాలు చేపలు పట్టడం నేర్పటం కాకుండా, ఏకంగా చేపలనే అందిస్తున్నారని, దీనివల్ల మనిషిలో నిపుణత తగ్గిపోతుందన్నారు. సోమరితనం పెరిగిపోయి దేశ భవిష్యత్తుకు ప్రమాదకరంగా మారుతుందన్నారు.

అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ దేశ విదేశాల్లో తెలుగు కీర్తిని పెంచిన వ్యక్తి వెంకయ్యనాయుడని, ఆయనను మాజీ ఉపరాష్ట్రపతి అంటే సరిపోదని, అపూర్వ ఉపరాష్ట్రపతి అని పిలవడం సముచితమన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రతిష్ఠను వెంకయ్యనాయుడు పెంచితే, సేవకు ప్రతిరూపంగా డాక్టర్ పీడీకే రావ్‌ను చెప్పుకోవచ్చన్నారు. సేవకుడిగా, పేదల పాలిట పెన్నిధిగా నిలిచిన కామేశ్వరరావు వంటి సేవా శిఖరాన్ని సత్కరించుకోవడం గొప్ప విషయమన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మట్లాడుతూ మాతృ దేశం, బాష కోసం పాటుపడే గొప్ప వ్యక్తి వెంకయ్యనాయుడు అయితే, పేదలకోసం పాటుపడటంలో ఒక వ్యక్తే మహోన్నత శక్తి అవుతుందన్న విషయాన్ని నిరూపించిన మహామనిషిగా కామేశ్వరరావు నిలుస్తారన్నారు. అటువంటి గొప్ప వ్యక్తికి తెనాలిలో పురస్కారం అందించుకోవడం గొప్ప భాగ్యంగా భావిస్తున్ననన్నారు. అవార్డు గ్రహీత కామేశ్వరావు మాట్లాడుతూ తను ఇంతటి పురస్కారానికి అర్హుడినో! కాదో కానీ, తనకు నచ్చిన పని నేను చేసుకు వెళ్లానని, అది అందరికీ గొప్ప విషయంగా కనిపించడం గర్వంగా ఉదన్నారు. చీపురుపల్లి వంటి మారుమూల గ్రామాల్లో వెనుకబడిన వారు ఎదుర్కొంటున్న సమ్యలు, పేదరికం వంటివాటిపై తనవంతు సేవ చేశానన్నారు. సేవ చేసేటప్పుడు కూడా బెదిరింపులు, కేసులు తప్పలేదని, అన్నిటికీ తట్టుకుని తాను ఎంచుకున్న మార్గంలోనే నడిచానన్నారు. తన సేవలను గుర్తించి పురస్కారం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. తన 84 ఏళ్ల జీవితంలో ఇది మరిచిపోలేని రోజన్నారు. సభలో హైకోర్టు న్యాయవాది ఇంద్రనీల్, రోటరీక్లబ్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావులు ప్రసంగించారు. ఓలేటి పార్వతీశం పరిచయ కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం, డబుల్ హార్స్ మినపగుళ్ల పరిశ్రమ అధినేత మునగాల మోహన్ శ్యాంప్రసాద్, చిత్రకారుడు గిరిధర్ పాల్గొన్నారు.


పురస్కారం అందుకున్నాక సభలో మాట్లాడుతున్న డాక్టర్ పీడీకే రావ్

నానో యూరియా

(3వ పేజీ తరువాయి)

అమ్మకాల బాధ్యతను డీసీఎంఎస్, మార్క్‌ఫెడ్‌కు అప్పగించింది. ప్రస్తుతం జిల్లాలకు వస్తున్న యూరియా నిల్వల్లో 70 శాతం డీసీఎంఎస్, సొసైటీ లకు, 30 శాతం ప్రైవేట్ డీలర్లకు కేటాయిస్తున్నారు.

అక్కడ కూడా అదే గోల

డీసీఎంఎస్, సొసైటీల ద్వారా యూరియా అమ్మకాలు జరుపుతున్నప్పటికీ నానో యూరియా బాధలు రైతులకు తప్పడం లేదు. గత ఖరీఫ్ సీజన్‌లో మూడు బస్తాలు యూరియా తీసుకుంటే ఒక లీటర్ నానో యూరియా తీసుకోవాలని ముడిపెట్టారు. రబీలో కూడా అదే పరిస్థితి కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. రానురాను ఘన యూరియా వాడకం తగ్గించి రైతులను ద్రవ నానో యూరియా వైపునకు మళ్లించాలని కేంద్రం ఆలోచిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే రైతులు మాత్రం నానో యూరియా వాడేందుకు పెద్దగా ఆసక్తి చూపించకపోవడంతో దాని కొనుగోలు వారికి భారంగా మారింది. ఒక వేళ నానో యూరియా తీసుకోకుంటే యూరియా ఇవ్వమని రైతుల ముఖం మీదే చెబుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

రూ. 250 వృథానే

నానో ఎరువులు తీసుకోకుంటే యూరియా ఇవ్వరన్న ఆలోచనతో రైతులు అవసరం ఉన్నా.. లేకున్నా కొనుగోలు చేస్తున్నట్లు చెబుతున్నారు. మూడు యూరియా బస్తాల కోసం రూ.799.50 వెచ్చిస్తే, నానో యూరియా కోసం రూ. 250 వరకు చెల్లిస్తున్నారు. నానో ఎరువులను బలవంతంగా కొన్నా.. వాడటం లేదని రైతులు చెబుతున్నారు. ఈ విషయం పై అధికారులు దృష్టి సారించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నా సంతకం ఫోర్జరీ చేసి.. నగదు డ్రా చేశారు

● పంచాయతీ కార్యదర్శిపై సర్పంచ్ ఫిర్యాదు

శావల్యాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తన సంతకాన్ని పంచాయతీ కార్యదర్శి ఫోర్జరీ చేసి.. పనులు చేసినట్లుగా బిల్లులు పెట్టి ఖాతాలోని నగదును దోచేశాడని పోట్లూరు గ్రామ సర్పంచ్ పోపూరి జ్యోతి గురువారం ఎంపీడీవో పేరుమీన సీతారామయ్యను కలసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ పోట్లూరు పంచాయతీ కార్యదర్శి పంచాయతీ ఖాతా నుంచి ఆరు విడతలుగా రూ.7,58,198 నగదు విత్‌డ్రా చేశాడని చెప్పారు. బ్యాంకు నుంచి తన ఫోన్‌కు మెస్సేజ్ రావడంతో పంచాయతీ కార్యదర్శిని అడిగితే సమాదానం ఇవ్వకుండా.. తనను పరుష పదజాలంతో దూషించాడని చెప్పారు. ఎస్సీ కాలనీలో డ్రెయినేజీల నిర్మాణం పూర్తిచేసినా.. పంచాయతీ కార్యదర్శి తనకు బిల్లులు చేయకుండా ఇబ్బందులు పెడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్, జేసీకి కూడా ఫిర్యాదు చేశామన్నారు. అక్రమ బిల్లులపై పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకుని, రూ.15 లక్షలు బిల్లులను వెంటనే ఇప్పించాలని సర్పంచ్ కోరారు. ఎంపీడీవో సీతారామయ్యను వివరణ కోరగా తన వద్ద ఎటువంటి సమాచారం లేదన్నారు.


విలేకర్లతో మాట్లాడుతున్న పోట్లూరు సర్పంచ్ జ్యోతి

పాపం ఆదాయం లేక.. పరిహారం రాక


మునగతోటలో అంతరపంటగా సాగు చేస్తున్న బంతిపూలు

వినుకొండటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారుల సూచనల మేరకు పూల తోటలపై అధిక లాభాలతో సంతోషంగా ఉండాలన్న రైతుకు చివరకు కన్నీరే మిగిలింది. ప్రకాశం జిల్లా గొర్రెపాడు ప్రాంతం నుంచి వ్యవసాయం కోసం వినుకొండలో స్థిరపడిన రైతు ఆదాం పట్టణంలోని మసీదు మాన్యం సమీపంలో రెండెకరాలు కౌలుకు తీసుకున్నాడు. అర ఎకరా విస్తీర్ణంలోని మునగ పంట వేశారు. దాంతో పాటు అంతర్ పంటగా మొక్క రూ.3 చొప్పున ఎకరాకు 1,400 బంతి మొక్కలను రెండెకరాల్లో నాటారు. ఇటీవల కురిసిన మొంథా తుపాను ధాటికి పూలన్నీ వాడిపోయాయి. సుమారు ఎకరా బంతిపూలను తొలగించాల్సి వచ్చింది. మిగిలిన తోటలోని పూలకు మచ్చరావడంతో సుమారు రూ.1.70లక్షల మేరకు నష్టం వాటిల్లిందని రైతు లబోదిబోమంటున్నారు. పంట నష్టపరిహారం కోసం ప్రయత్నిద్దామన్నా .. కౌలు సాగు కావడంతో.. యజమానుల సహకారం లేదని ఆదాం వాపోయారు.


రెండు రకాల బంతిపూల తోట


విజేత కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు, ముఖ్యఅతిథి బీ సూర్యనారాయణ రావు తదితరులు



రన్నర్‌గా నిలిచిన యూనిర్శిటీ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జట్టును అభినందిస్తున్న అతిథులు

ఉత్కంఠ పోరులో విజేత కృష్ణవేణి

● ముగిసిన ఏఎన్‌యూ అంతర కళాశాలల వాలీబాల్ పోటీలు

నరసరావుపేట టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట లోని కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం అంతర కళాశాలల వాలీబాల్ టోర్నమెంట్ గురువారం విజయవంతంగా ముగిసింది. ఉత్కంఠ భరితంగా జరిగిన ఈ పోటీలో కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. రన్నర్‌గా వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ జట్టు నిలిచింది. మొదటి రెండు సెట్లలో 27-25, 26-24 పాయింట్లతో కృష్ణవేణి కళాశాల జట్టు ఆధిపత్యం ప్రదర్శించగా.. మూడో సెట్‌లో 22-25లో యూనివర్సిటీ ఎడ్యుకేషన్ జట్టు లైవ్‌లోకి వచ్చింది. అయితే ఏకపక్షంగా సాగిన నాలుగు సెట్‌లో 25-13 తేడాతో కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టు విజయం సాధించడంతో విజేతగా నిలిచింది. మూడవ స్థానానికి జరిగిన పోటీలో ధనలక్ష్మి ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజ్‌పై బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ విజయం సాధించింది. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల ప్రదానోత్సవం కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ క్రీడాకారుల్లో కనిపించిన స్ఫూర్తి, క్రమశిక్షణ అభినందనీయం అన్నారు. ముఖ్య అతిథి ఏఎన్‌యూ యోగా కోఆర్డినేటర్ బి.సూర్యనారాయణరావు మాట్లాడుతూ క్రీడలు యువత భవిష్యత్తును తీర్చిదిద్దడానికి సహకరిస్తాయన్నారు. క్రీడలు శారీరక, మానసిక వికాసానికి ఎంతో ఉపయోగ పడతాయన్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ ఈదర ఆదిబాబు మాట్లాడుతూ కృష్ణవేణి డిగ్రీ కళాశాల విజేతగా నిలచి, యూనివర్శిటీ టోర్నమెంట్‌లో హ్యాట్రిక్ సాధించిందన్నారు. డైరెక్టర్ కే.నాసరయ్య, డాక్టర్ సీహెచ్ వెంకటరావు, డాక్టర్ గౌరీ శంకర్, డాక్టర్ పి. శ్రీనివాసరావు, అమ్మయ్య చౌదరి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సతీష్‌బాబు, మహమ్మద్ పాల్గొన్నారు.

దూసుకొస్తున్న ‘దిత్వా’

రాష్ట్రానికి మరో తుఫాన్ ముప్పు

» నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను

» 30న తమిళనాడు, దక్షిణ కోస్తాంధ్ర మధ్య తీరంపైకి

» నేటి నుంచి 4 రోజులు భారీ వర్షాలు

విశాఖపట్నం/అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఇండోనేషియా పరిసరాల్లో ఏర్పడిన ‘సెన్‌యార్’ తుఫాన్ ముప్పు తప్పిందనుకుంటే.. ‘దిత్వా’ రూపంలో మరో తుఫాను రాష్ట్రంపైకి దూసుకొస్తోంది. దీనివల్ల కోస్తా, రాయలసీమల్లో పంటలకు నష్టం కలుగుతుందన్న వాతావరణ శాఖ హెచ్చరిక రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది. శ్రీలంకకు సమీపంలో నైరుతి బంగాళాఖాతంలో ఉన్న తీవ్ర అల్పపీడనం బుధవారం అర్ధరాత్రి తర్వాత వాయుగుండగా, ఆ తర్వాత కొద్దిగంటల్లోనే తీవ్ర వాయుగుండంగా అనంతరం తుఫాన్‌గా మారింది. దీనికి యెమన్ దేశం సూచించిన ‘దిత్వా’గా భారత వాతావరణ శాఖ(ఐఎండీ) పేరు పెట్టింది. తుఫాను గంటకు 10 నుంచి 15 కి.మీ వేగంతో ఉత్తర వాయవ్యంగా పయనిస్తోంది. గురువారం సాయంత్రానికి శ్రీలంకలోని ట్రింకోమలైకు 170, పుదుచ్చేరికి 570, చెన్నైకి 670 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఈ నెల 30వ తేదీ ఉదయానికి తమిళనాడు, కోస్తాంధ్ర తీరాల వైపు రానుందని ఐఎండీ తెలిపింది. పలు వాతావరణ మోడళ్ల మేరకు 30 ఉదయం ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తాంధ్ర మధ్య తీరం దాటనుంది. దీని ప్రభావం కోస్తాలో కోనసీమ జిల్లా నుంచి నెల్లూరు వరకూ, రాయలసీమలో కొన్ని జిల్లాలపై ఎక్కువగా ఉంటుందని అంచనా వేశారు.

నేడు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు

శుక్రవారం దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలు చోట్ల, ఉత్తర కోస్తాలో అక్కడక్కడ వర్షాలు, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయి. శనివారం రాష్ట్రవ్యాప్తంగా అనేకచోట్ల వర్షాలు.. నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో అతిభారీ, ప్రకాశం, బాపట్ల, కడప, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయి. తుఫాన్ తీరం దాటే సమయంలో(ఆదివారం) రాష్ట్రంలో అనేకచోట్ల వర్షాలు.. నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, అన్నమయ్య, కడప జిల్లాల్లో కొన్ని చోట్ల కుంభవృష్టిగా, బాపట్ల, పల్నాడు, గుంటూరు, నంద్యాల జిల్లాల్లో అతిభారీగా, కృష్ణా, ఎన్టీఆర్, పశ్చిమగోదావరి, కర్నూలు, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయి. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అనేకచోట్ల వర్షాలు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు, కృష్ణా జిల్లాల్లో అతిభారీ, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, పల్నాడు, కడప, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. కోస్తాలోని అన్ని ఓడరేవుల్లో ఒకటో నంబరు ప్రమాద సూచిక ఎగురవేశారు. సముద్రం అల్లకల్లోలంగా ఉన్నందున మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. శుక్రవారం నుంచి కోస్తాంధ్రలో తీరం వెంబడి గాలుల వేగం పెరగనున్నది. శనివారం నుంచి తీరం వెంబడి గంటకు 60 నుంచి 70, అపుడప్పుడు 80 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయి. తీరానికి ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో గాలుల ఉధృతి పెరుగుతుందని, పొలాల్లో వరి కుప్పలు, ఉద్యానవన పంటల రక్షణకు చర్యలు తీసుకోవాలని రైతులకు ఐఎండీ సూచించింది. ‘దిత్వా’ తుఫాన్ కోస్తా, రాయలసీమల్లో అనేక ప్రాంతాలపై ప్రభావం చూపుతుందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. ఈ తుఫాను ఆదివారం తెల్లవారుజామున తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తా తీరాలకు చేరుకునే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

అన్నదాతల్లో ఆందోళన

‘దిత్వా’ తుఫాన్ అన్నదాతల్ని కలవరపెడుతోంది. శనివారం నుంచి సోమవారం వరకు రాష్ట్రంలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ హెచ్చరించడంతో రైతులు గాబరాపడుతున్నారు. ప్రస్తుతం కృష్ణా, గోదావరి జిల్లాల్లో వరి కోతలు, నూర్పిళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే నూర్చిన ధాన్యాన్ని రోడ్ల పక్కన, ఆరుబయట, పొలాల్లో రైతులు ఆరబోశారు. ఈ సమయంలో వర్షాలు కురిస్తే.. ధాన్యం తడిచిపోతుందని ఆందోళన చెందుతున్నారు. టార్పాలిన్ పట్టాల కోసం రైతులు ఎదురుచూస్తుండగా, వాటిని సరఫరా చేస్తున్నట్లు మంత్రులు చెప్తున్నారు, కానీ క్షేత్రస్థాయిలో పంపిణీ జరుగుతున్న దాఖలా లేదు. ఆరబెట్టిన ధాన్యాన్ని బస్తాలకు ఎత్తడానికి గన్నీ బ్యాగుల కొరత ఉందని కొందరు రైతులు చెప్తున్నారు. ఇప్పటికే మొంథా తుఫాన్‌తో కోస్తా జిల్లాల్లో వరి పంట దెబ్బతింది. కృష్ణా, గోదావరి జిల్లాల్లో ధాన్యం తడిసి, రంగు మారింది. కొన్ని చోట్ల గింజ మొలకెత్తింది. ఆ ధాన్యాన్ని మద్దతు ధర కన్నా తక్కువకు అమ్ముకోవాల్సి వచ్చింది. ఇప్పుడు దిత్వా తుఫాన్ దూసుకొస్తుండటంతో రైతులు కలవరం చెందుతున్నారు. ఖరీఫ్‌లో 51 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంలో ఇప్పటి వరకు 8.22 లక్షల టన్నులను మాత్రమే పౌరసరఫరాల సంస్థ సేకరించింది. ఇదే అదునుగా మిల్లర్లు సిండికేట్ అయ్యి, దళారుల ద్వారా ధాన్యం రైతులకు మద్దతు ధర చెల్లించకుండా, తక్కువకు అడుగుతున్నారు. అయితే, దళారీల మాట నమ్మి తక్కువ ధరకు అమ్ముకోవద్దని, ఈ-క్రాప్‌లో నమోదైన ప్రతి రైతు నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామని పౌరసరఫరాలశాఖ మంత్రి మనోహర్ ప్రకటించారు.



పాలెపు నాగేశ్వరరావు, మంత్రి లోకేశ్ ట్వీట్

పేరడీ పాటలతో లెక్కలు చెబుతారు!

» ఆకట్టుకుంటున్న ఉపాధ్యాయుడి ఆన్‌లైన్ పాఠాలు

» వినూత్న ప్రయోగానికి మంత్రి లోకేశ్ అభినందన

రాయవరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సాధారణంగా లెక్కలు అంటే కొందరు విద్యార్థులు ఆమడ దూరం పరిగెడతారు. కానీ, లెక్కలు అంటే కష్టం కాదు ఇష్టమే అనేలా సంగీతం జోడించి పేరడీ పాటల ద్వారా బోధిస్తూ విద్యార్థులకు గణితంపై మక్కువ కలిగిస్తున్నారు ఓ ఉపాధ్యాయుడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం వి.సావరం ఎంపీయూపీ స్కూల్‌లో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పాలెపు నాగేశ్వరరావు విద్యార్థులకు వినూత్నంగా గణితం బోధిస్తున్నారు. గణితాన్ని సంగీతంతో జత చేసి తాజా సినిమా పాటలుగా మార్చి ఆసక్తికరంగా చెబుతున్నారు. గతేడాది తొలి ప్రయత్నంగా ఫైనస్ ఇన్టూ ఫైనస్ ప్లస్ అనే పాట పాడి సరికొత్త ట్రెండ్‌ను సృష్టించారు. ఈ పాటను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేయగా 70 వేల మంది ఫాలోవర్స్ వచ్చారు. ఇప్పటివరకు 5 కోట్ల మంది వీక్షకులు ఉన్నట్లు నాగేశ్వరరావు తెలిపారు. అప్పటినుంచి 50 తెలుగు సినిమా హిట్ పాటలను లెక్కలకు జోడించి పాడారు. పాలెపు నాగేశ్వరరావును ఎక్స్ వేదికగా విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అభినందించారు. లెక్కలను పాటలా మార్చి పాఠంగా చెప్పడం వినూత్నంగా ఉందని ప్రశంసించారు.

‘స్లీప్‌వెల్’లో ప్రమాదకర పురుగుమందు

» శ్వాసకోశ వ్యాధులు వచ్చే అవకాశం

» నిర్ధారించిన వ్యవసాయ శాఖ

అమరావతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దోమల నిర్మూలనకు వాడే స్లీప్‌వెల్ అగరబత్తీల్లో మేపర్ ఫ్లూథ్రిన్ అనే క్రిమిసంహారక మందు ఉన్నట్లు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ నిర్ధారించింది. మేపర్ ఫ్లూథ్రిన్ వల్ల శ్వాసకోశ సంబంధ వ్యాధులు రావడానికి అవకాశం ఉందని తేల్చింది. వ్యవసాయశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆదేశాల మేరకు విజయవాడ వ్యవసాయ అధికారులు గుణదలలోని సాయి హనుమాన్ ఏజెన్సీలో తనిఖీలు నిర్వహించి, భారీగా స్లీప్‌వెల్ అగరబత్తీలను స్వాధీనం చేసుకున్నారు. వీటిని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్‌కు పంపగా, బెంగుళూరులోని మెస్సెర్స్ ఆశికాస్ కంపెనీలో తయారైన స్లీప్‌వెల్ అగరబత్తీలో అనుమతిలేని మేపర్ ఫ్లూథ్రిన్ అనే క్రిమిసంహారక మందు ఉన్నట్లు గుర్తించారు. దీంతో విజయవాడలో రూ.69లక్షల విలువైన స్లీప్ వెల్ అగరబత్తీల అమ్మకాన్ని నిలుపుదల చేశారు.

కంబోడియా నుంచి సైబర్ వల..!

13 మంది భారతీయ స్కామర్లు అరెస్టు.. రూ.42 లక్షలు, పాస్‌పోర్టులు స్వాధీనం



పట్టుబడిన నిందితులు, కేసు వివరాలు చెబుతున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తమ బ్యాంకు ఖాతా వివరాలను వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల ద్వారా కంబోడియాలోని సైబర్ స్కామర్లకు అందించి.. అందుకు ప్రతిఫలంగా కమీషన్లు పొందుతున్న 13 మందిని పశ్చిమ గోదావరి జిల్లా పోలీసులు పట్టుకున్నారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి గురువారం విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. పట్టణానికి చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్‌కు కొద్ది రోజుల క్రితం తాము బెంగళూరు పోలీసులమంటూ ఫోన్ కాల్ వచ్చింది. మీపై క్రిమినల్ కేసులున్నాయని, మాఫీ చేయాలంటే తాము చెప్పిన అకౌంట్లకు డబ్బు పంపించాలని డిమాండ్ చేశారు. దీంతో ఆ ప్రొఫెసర్ తన నాలుగు బ్యాంకు ఖాతాల నుంచి పలు దఫాలుగా ఆర్టీజీఎస్ ద్వారా సొమ్ము పంపించారు. ఆ తర్వాత అనుమానం రావడంతో ఆ ప్రొఫెసర్ భీమవరం రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, డీఎస్పీ జయసూర్య ఆధ్వర్యంలో ఏడు టీమ్‌లను ఏర్పాటు చేసి రిటైర్డ్ ప్రొఫెసర్ నగదు బదిలీ చేసిన బ్యాంకు ఖాతాలపై నిఘా పెట్టారు. ఈ క్రమంలో ముంబైకి చెందిన రహతేజే నయన్ వ్యక్తి సాయంతో కాంబోడియా ముఠాకు చేరిన బ్యాంకు ఖాతాలను ట్రాక్ చేశారు. అవన్నీ బెంగళూరు, హైదరాబాద్, విశాఖపట్నం, ఖమ్మం, అనంతపురం, సత్యసాయి జిల్లాలకు చెందిన వారివిగా గుర్తించి 13 మందిని అరెస్ట్ చేశారు. రహతేజే నయిన్ పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. వారివద్ద నుంచి రూ.42 లక్షలతో పాటు అంతర్జాతీయ సిమ్ కార్డులతో కూడిన 15 మొబైళ్లు, బ్యాంకు డాక్యుమెంట్లు, పాస్‌పోర్టులు, ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు.

7 గంటల్లో 4.63 లక్షలు

» వైకుంఠద్వార దర్శనాలకు తొలిరోజు వెల్లువలా ఈ-డిప్ రిజిస్ట్రేషన్లు

తిరుమల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుమల వైకుంఠ ద్వార దర్శనాల కోసం భక్తులు వెల్లువలా ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకుంటున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ప్రారంభంకాగా సాయంత్రం 5 గంటల సమయానికి 4.63 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. డిసెంబరు 30 నుంచి జనవరి 8వ తేదీ వరకు తిరుమల శ్రీవారి ఆలయంలో జరిగే వైకుంఠ ద్వార దర్శనాల్లో తొలి మూడు రోజులకే టీటీడీ వెబ్‌సైట్, యాప్, వాట్సాప్ ద్వారా ఈ నమోదు ప్రక్రియ మొదలైంది. డిసెంబరు 1 సాయంత్రం 5 గంటల వరకు పేర్లు నమోదు చేసుకోవచ్చు. ఈ మూడు రోజుల్లో 2.5 లక్షల మందికి దర్శన అవకాశం ఉండొచ్చు. 2వ తేదీ మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఈ-డిప్ ద్వారా దర్శనానికి పేర్లను ఎంపిక చేస్తారు. డిసెంబరు 30 వైకుంఠ ఏకాదశి రోజున 70 వేలు, 31న ద్వాదశి రోజున 75 వేలు, మూడోరోజు జనవరి 1న 68 వేల మందికి దర్శనం చేయించే అవకాశ ముందని టీటీడీ అంచనా వేస్తోంది.

నెల్లూరులో నకిలీ కరెన్సీ ముఠా గుట్టురట్టు

» 22 కిలోల గంజాయి పట్టివేత, నలుగురి అరెస్ట్

నెల్లూరురూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నకిలీ కరెన్సీ నోట్ల మార్పిడి రాకెట్ గుట్టును నెల్లూరు రూరల్ పోలీసులు రట్టు చేశారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేసి 22 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గురువారం నెల్లూరు రూరల్ పోలీస్ స్టేషనులో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ గుంజి వేణు వివరాలు వెల్లడించారు. నెల్లూరు రూరల్‌లోని ధనలక్ష్మీపురం సమీపంలో ఓ ఇంట్లో గంజాయి, నకిలీ కరెన్సీ నోట్ల మార్పిడి జరుగుతున్నట్టు అందిన సమాచారంతో పోలీసులు రెక్కీ నిర్వహించారు. అల్లూరు మండలం ఇస్కపల్లి పంచాయతీ కుర్రులబ్బిపాళెంకు చెందిన ప్రధాన నిందితుడు మున్నా అలియాస్ అశోక్‌రెడ్డి అలియాస్ కార్తీక్‌రెడ్డిను పట్టుకునే ప్రయత్నం చేయగా పరారయ్యేందుకు ప్రయత్నించాడు. అతన్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు మున్నా ఇచ్చిన సమాచారంతో ధనలక్ష్మీపురం వద్దనున్న ఇంటిపై దాడి చేసి ముత్తుకూరు బీసీ కాలనీకి చెందిన షేక్ రియాజ్, షేక్ ముస్తఫా, పిడతాపోలూరుకు చెందిన బెల్లంకొండ అనిల్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మార్పిడికి సిద్ధంగా ఉంచిన రూ.37.50 లక్షల విలువైన నకిలీ కరెన్సీ నోట్లు, ప్యాకెట్ల తయారీకి సిద్ధంగా ఉంచిన 22 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు డీఎస్పీ చెప్పారు.

ఎంపీ సీఎం రమేశ్ తల్లికి తుది వీడ్కోలు

ఎర్రగుంట్ల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ తల్లి చింతకుంట రత్నమ్మ(83) అంత్యక్రియలు వైఎస్సార్ కడప జిల్లా ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తిలో గురువారం జరిగాయి. రత్నమ్మ భౌతికకాయాన్ని సందర్శించేందుకు ప్రజాప్రతినిధులు, ప్రజలు, బంధువులు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఉదయం 11 గంటలకు అంతిమ యాత్ర ప్రారంభం అయింది. పెన్నా తీరంలో ఆమె భౌతికకాయానికి చిన్న కుమారుడు సీఎం రాజేశ్ అంత్యక్రియలు నిర్వహించారు.

ANDHRA PRADESH POWER GENERATION CORPORATION LIMITED
APGENCO
VIDYUT SOUDHA, VIJAYAWADA-520004

Notification for e-procurement:
TENDER NOTICE NO:M100029256/P61/2025-2026/CE/O&M/Dr.NTTPS/CONSTRUCTION/CHP/Stage-V

Name of the work: "Supply of Impact, Carrying and Flat returned Idlers "for Construction/CHP/Stage-V/Dr. NTTPS."
a) Tender Schedule available Date & Time: From **18.00 Hrs on** 01.12.2025 onwards.
b) Schedule Closing Date & Time: **At 13.00 Hrs on 22.12.2025**
c) Bid submission Closing Date & Time: **At 14.00 Hrs on 23.12.2025** (for downloading/Uploading tender specification and Documents)
d) For other details visit the website: **https://tender.apeprocurement.gov.in Ph:0866-2882614.**

DIPR RO No.4608PP/CL/ADVT/1/1/2021-22, Dt: 27.11.2025

శ్రీ భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్ల దేవస్థానం,
శ్రీశైలం - 518101, నంద్యాల జిల్లా, ఆంధ్రప్రదేశ్.
SRISAILA DEVASTHANAM

ఇ-ప్రొక్యూర్మెంట్ (ఆన్‌లైన్) టెండర్ మరియు బహిరంగవేలం ప్రకటన
(రెండవ పిలుపు) RC No. C2/E-436386/2025, Date : 25.11.2025

శ్రీశైల దేవస్థానము కల్యాణకట్ట నందు భక్తులు సమర్పించబడు తలనీలాలు తేది: **27.12.2025** నుండి **26.12.2027** వరకు రెండు **(2)** సంవత్సరముల కాలపరిమితి వరకు ప్రోగు చేసుకొను లైసెన్సు హక్కు మంజూరు కొరకు తేది : **11.12.2025**న ఇ-ప్రొక్యూర్‌మెంట్ (ఆన్‌లైన్) టెండర్ & బహిరంగవేలమును దేవస్థాన పరిపాలన భవనము నందు ఉదయం **10:00** గం.ల నుండి నిర్వహించబడును.
ఆసక్తి గలవారు “ కార్యనిర్వహణాధికారి, శ్రీశైల దేవస్థానం, శ్రీశైలము” వారి పేరున ధరావత్తు రూ.50 లక్షల డిమాండ్ డ్రాఫ్ట్, 3 పోస్ట్ డేటెడ్ చెక్కులు, ఆధార్ కార్డ్ కాపీలను దేవస్థానము వారికి సమర్పించి పాల్గొనవచ్చును. దేవస్థానం అప్‌సెట్ ప్రైస్ సంవత్సరమునకు **రూ. 5,00,00,000/-** లుగా నిర్ణయించడమైనది. ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ల వివరముల కొరకు **www.apeprocurement.gov.in** వెబ్‌సైట్ నందు & కార్యాలయ పనివేళలలో స్వయముగా గాని లేక సెల్ నం: **8801192939, 9441096182 & 6300057600** ద్వారా వివరములు పొందవచ్చును.

శ్రీ స్వామి అమ్మవార్ల సేవలో... సం/- యం.శ్రీనివాసరావు
స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ & కార్యనిర్వహణాధికారి

వృద్ధ దంపతులపై ఘాతుకం

» కత్తులతో దాడి... మహిళ హత్య.. భర్తకు తీవ్ర గాయాలు

శ్రీకాళహస్తి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం పుల్లారెడ్డికండ్రిగలో బుధవారం రాత్రి వృద్ధ దంపతులపై దుండగులు కత్తులతో దాడి చేశారు. ఈ ఘటనలో భార్య జయమ్మ(75) మృతి చెందగా... ఆమె భర్త చెవిరెడ్డి మహదేవరెడ్డి(85)కి తీవ్రగాయాలయ్యాయి. గురువారం ఉదయం సుమారు 7 గంటల సమయంలో వారి ఇంటిలో పనిచేసే సుబ్బరత్న(సర్పంచి) పాలు తీసుకొని వచ్చి, తలుపు కొట్టినా ఎవరూ తీయకపోవడంతో ఇరు గు పొరుగును పిలిచి విషయం చెప్పింది. అందరూ కలసి మళ్లీ తలుపు కొట్టారు. నెత్తుటి గాయాలతో రోదిస్తూ మహదేవరెడ్డి తలుపు తీశారు. సమాచారం తెలిసి వీరి చిన్న కుమారుడు, వైసీపీ నేత మధుసూదన్‌రెడ్డి శ్రీకాళహస్తి నుంచి గ్రామానికి చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుపతి ఎస్పీ రవిమనోహరాచారి, ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మహదేవరెడ్డిని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. హత్యకు కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు
చీఫ్ ఇంజనీర్ కార్యాలయం: తిరుపతి

ADV No. 47/D3/CE/TTD/2025-26 **ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన** **Dt.24.11.2025**
తితిదే ఇంజనీరింగ్ శాఖ యొక్క అరవై ఎనిమిది (68) పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా ఇ-టెండర్లు కోరబడుచున్నవి. **SE-I:-** NIT No:64/SE-I/2025-26 (1 పని), **SE-II:-** NIT No:770 to 794/SE-II/2025-26 (25 పనులు), **EE-I:-** NIT No:122 to 126/EE-I/2025-26 (5 పనులు), **EE-XIV:-** NIT No: 154 to 155/EE-XIV/2025-26 (2 పనులు), **EE (FMS):-** NIT No: 61 to 65/EE (FMS) /2025-26 (5 పనులు), **DE(Elec)-I:-** NIT No: 241 to 248/DE(Elec)-I/2025-26 (8 పనులు), **DE(Elec)-II:-** NIT No:432 to 442/DE(Elec)-II/2025-26 (11 పనులు), **DE(Elec)-TML:-** NIT No:355 to 365/DE(Elec)-TML/2025-26 (11 పనులు). తదుపరి పని వివరాల కొరకు **www.tirumala.org**. మరియు **https://tender.apeprocurement.gov.in** కు లాగిన్ కాగలరు.
TTD-40021/10/2025-PRO SEC (Adv. No.303), Dt: 27.11.2025 కార్యనిర్వహణాధికారి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రహదారులు & భవనాల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

NIT No.28/1-4/CE(R&B)SH&MD, APRDC/2025-26 **తేది:25.11.2025**
శ్రీకాకుళం జిల్లాలో ఒక పని, SPSR నెల్లూరు జిల్లాలో ఒక పని, బాపట్ల జిల్లాలో ఒక పని మరియు తూర్పు గోదావరి జిల్లాలో ఒక పని కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరు స్వీకరణకు ఆఖరి తేది:15.12.2025న మ.03.30 గం. వరకు. తదుపరి వివరాలకు **www.apeprocurement.gov.in** దర్శించవచ్చును.
సం/- చీఫ్ ఇంజనీర్, (R&B) SH & మేనేజింగ్ డైరెక్టర్, APRDC
DIPR RO No.18195/CL/ADVT/1/1/2021-22, తేది: 27.11.2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ
టెండరు ప్రకటన

No.EAGLE/ELECTRONICS/2025-26/08, తేది: 20.11.2025, టెండరు ఐడి నం: 867592
ఎలైట్ యాంటీ-నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ (EAGLE), ఆంధ్రప్రదేశ్, మంగళగిరి కొరకు యాక్టివ్ & ప్యాసివ్ నెట్‌వర్క్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సేకరణ కోసం టెండర్లు కోరబడుచున్నవి. టెండరు వివరాలు https://tender.apeprocurement.gov.inలో 26.11.2025 సా.06.30 గం. నుండి 11.12.2025 సా.5.00 గం. వరకు లభిస్తాయి. సంప్రదించు వ్యక్తి: DSP, Tech, EAGLE, AP, Mangalagiri, ఫోన్: 8686068888
సం/- ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, EAGLE, AP, మంగళగిరి
DIPR RO No.18193/CL/ADVT/1/1/2021-22, తేది: 27.11.2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పంచాయతీరాజ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

నెం.15/ టి1/2025-26, నిట్ నెం.69 టు 80/2025-26, **తేది: 25.11.2025**
గుంటూరు జిల్లా పరిధిలోని వివిధ నియోజకవర్గములలో జిల్లా ప్రజాపరిషత్ మరియు యం.పి.యల్.ఎస్.గుంటూరు వారి నిధుల క్రింద మంజూరైన 12 (పన్నెండు) పనులకు అంచనా విలువ: రూ.96.75 లక్షలకు టెండర్లు తేది: 02.12.2025 నుండి ఇ-ప్రొక్యూర్మెంట్ ప్లేస్ www.apeprocurement.gov.in ద్వారా కోరబడుచున్నవి.
సం/- కార్యనిర్వాహక ఇంజినీరు, (పి.ఆర్) పి.ఐ.యు డివిజన్, గుంటూరు
DIPR RO No.18192/CL/ADVT/1/1/2021-22, Dt: 27.11.2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ

NIT No:73 to 79/TO/2025-26 **ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన** **తేది:24.11.2025**
కృష్ణా జిల్లాలో PMABHIM గ్రాంట్ల క్రింద **రూ.385.00 లక్షల** అంచనా వ్యయంతో 7 భవన నిర్మాణ పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. **బిడ్ అప్‌లోడ్ & డౌన్‌లోడ్ ప్రారంభ తేది:** 29.11.2025 నుండి. తదుపరి వివరాలకు దర్శించండి: **www.tender.apeprocurement.gov.in.** ఫోన్ నం. 6305693265. **సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, పిఆర్ సర్కిల్, మచిలీపట్నం, కృష్ణా జిల్లా**
DIPR RO No.18185/CL/ADVT/1/1/2021-22, Dt.27.11.2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

NIT No.20-28/TO/SE (R&B) OGL/2025-26 **తేది: 24.11.2025**
ప్రకాశం జిల్లాలో కోర్టు భవనం మరమ్మతులు-4, అదనపు ప్రణాళిక పనులు-3, బాక్స్ కల్వర్ట్ పునర్నిర్మాణం-1 పని కొరకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. **అంచనా విలువ:** రూ.507.86 లక్షలు. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 28.11.2025 మ.3 గం. తదుపరి వివరాలకు దర్శించండి: tender.apeprocurement.gov.in. ఫోన్ నం: 220170 & 220450
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, (R&B) సర్కిల్, ఒంగోలు
DIPR RO No.18183/CL/ADVT/1/1/2021-22, Dt: 27.11.2025

ఇద్దరు సీఎంలూ ఉచితాలపై పునరాలోచించాలి!

» తెలుగులో పాలనకు మాటిచ్చారు.. అమలు చెయ్యండి

» డాక్టర్ పీడీకే రావు యువతకు ఆదర్శం కావాలి

» భారత జ్యోతి పురస్కార సభలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



పెమ్మరాజు దుర్గా కామేశ్వరరావుకు భారత జ్యోతి పురస్కారాన్ని అందిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తదితరులు

తెనాలి, నవంబరు 27: (ఆంధ్రజ్యోతి): ‘మన మాతృభాష పరాయి భాషగా మారిపోతోంది. దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉంది. ఒక సభలో రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాటిచ్చారు.. తెలుగులోనే ఉత్తర్వులు ఇస్తాం. పాలన సాగిస్తామని. దానిని అమలుచేసి మాట నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నా. భవిష్యత్ తరాలకు మరో ముప్పు పొంచి ఉంది. అదే ఉచితం. ఉచితాలు ఇస్తూపోతే ప్రజలు సోమరులవుతారు. ఇది దేశ భవితకు పెను ప్రమాదం. ఈ రెండింటిపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు ఆలోచించాలి’ అంటూ భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరకు వెంకయ్యనాయుడు హితవు పలికారు. గుంటూరు జిల్లా తెనాలిలో గురువారం భారత జ్యోతి పురస్కార ప్రధాన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెనాలి ప్రచురణలు, రోటరీ క్లబ్ ఆఫ్ వైకుంఠపురం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సామాజిక వేత్త పెమ్మరాజు దుర్గా కామేశ్వరరావుకు వెంకయ్యనాయుడు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, శాసనమండలి సభ్యుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో కలసి పురస్కారాన్ని అందించారు. తర్వాత జరిగిన సభలో వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. ఉచిత ప్రోత్సాహకాలను అందించే విషయంలో ఏ ముఖ్యమంత్రినీ తాను విమర్శించడం లేదని, రానున్న రోజుల్లో దీని వల్ల కలిగే ప్రమాదకర పరిస్థితులను వారికి వివరించే ఉద్దేశంతోనే హెచ్చరిస్తున్నానని తెలిపారు. అందరికీ ఉచిత సేవలు ఇచ్చే బదులు పేదవారికి ఉచిత విద్య, ఉచిత వైద్యం ఇస్తే సరిపోతుందని, అంతకు మించి ఇచ్చేవన్నీ ప్రమాదకర పరిణామాలకు దారితీసేవేనని పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన దుర్గా కామేశ్వరరావు అమెరికాలో చదివి, అక్కడే ప్రొఫెసర్‌గా మంచి ఉద్యోగం సాధించినా.. తిరిగి మన రాష్ట్రానికి వచ్చి, పేద ప్రజల ఉన్నతికి పాటుపడటం గొప్ప విషయమని వెంకయ్యనాయుడు అభినందించారు. అమెరికా వంటి విదేశాలకు వెళుతున్న యువత అక్కడే ఉండిపోకుండా తిరిగి స్వదేశానికి తిరిగి రావాలని, మన ప్రాంతాల అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. మారుమూల పల్లెలకు పరిమితమైన తనకు గొప్ప పురస్కారాన్ని ఇవ్వటం 83 ఏళ్ల వయస్సులో మరింత ఉత్సాహాన్ని నింపిందని దుర్గా కామేశ్వరరావు సంతోషం వ్యక్తం చేశారు.

अखिल भारतीय आयुर्विज्ञान संस्थान, गुवाहाटी
ALL INDIA INSTITUTE OF MEDICAL SCIENCES, GUWAHATI
(A statutory body under the aegis of Ministry of Health and Family Welfare, GoI)
Changsari, Kamrup, Assam-781101, Website: www.aiimsguwahati.ac.in

No. 1-74/2022-23/AIIMS/GHY/ADMN./CONT-APPOINT/2280 **Date: 27-11-2025**

WALK-IN-INTERVIEW FOR RECRUITMENT OF FACULTY IN THE DEPARTMENT OF ANAESTHESIOLOGY, CARDIOLOGY AND GENERAL SURGERY AT AIIMS, GUWAHATI ON CONTRACT BASIS.

All India Institute of Medical Sciences, Guwahati intends to conduct Walk-in-Interview for the post of Assistant Professor on Contractual Basis in the Departments of Anaesthesiology, Cardiology and General Surgery at AIIMS, Guwahati. The details of category-wise vacancies are as under:

Department	Post	Category	Total number of posts
ANAESTHESIOLOGY	Assistant Professor(Contractual)	UR-04, OBC-01	05
CARDIOLOGY	Assistant Professor(Contractual)	UR-01	01
GENERAL SURGERY	Assistant Professor(Contractual)	UR-01	01

Date and time of the interview	23.12.2025, 10:00 AM onwards
Venue	Executive Director Conference Hall, AIIMS, Guwahati.

For details of advertisement including application form, educational qualifications, age, and eligibility criteria etc., kindly visit the Institute's website i.e., **https://aiimsguwahati.ac.in.** Candidates are advised to visit AIIMS Guwahati website regularly for all updates regarding recruitment.


Sd/-
Executive Director
AIIMS, Guwahati

బాలుడిని చంపిన మేనమామ


» గొంతు నులిమి అటవీ ప్రాంతంలో పడేసిన వైనం

» సోదరి కుటుంబంపై కక్షతోనే చేశానని అంగీకరించిన నిందితుడు

» శ్రీసత్యసాయి జిల్లాలో ఘటన



హర్షవర్ధన్



నిందితుడు ప్రసాద్ (సర్కిల్‌లో ఉన్న వ్యక్తి)

కదిరి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సోదరి కుటుంబంపై కక్షతో ఐదేళ్ల బాలుడిని అతని మేనమామే హత్య చేశాడు. శ్రీసత్యసాయి జిల్లా కదిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో రూరల్ సీఐ నాగేంద్రతో కలిసి ఎస్పీ సతీష్‌కుమార్ గురువారం హత్య వివరాలను వెల్లడించారు. తలుపుల మండలం గరికపల్లికి చెందిన కొమ్మెర గంగాధర్, చంద్రకళ దంపతులకు హర్షవర్ధన్(5) అనే కుమారుడు ఉన్నాడు. చంద్రకళ అన్న ప్రసాద్ కదిరి మున్సిపాలిటీ పరిధిలోని మూర్తిపల్లిలో నివాసం ఉంటున్నాడు. బుధవారం ఉదయం 11 గంటలకు గరికపల్లి వచ్చిన ప్రసాద్, చంద్రకళతో మాట్లాడాడు. అంగన్వాడీలో ఉన్న మేనల్లుడు హర్షవర్ధన్‌ను ఇంటికి పిలిపించుకున్నాడు. రూ.20 ఇచ్చి.. ఏదైనా కొనుక్కోమని చెప్పి బయటకు పంపించాడు. ప్రసాద్ వెళ్లిపోయిన కాసేపటి తర్వాత హర్షవర్ధన్ కనిపించకపోవడంతో చంద్రకళ, గ్రామస్థులు వెతికారు. ప్రసాద్‌కు ఫోన్ చేస్తే తన వెంట రాలేదని చెప్పాడు. మధ్యాహ్నం 3 గంటలకు గరికపల్లికి వచ్చి, హర్షన్‌వర్ధన్ కోసం వెతికినట్లు నటించి, కాసేపు అక్కడే ఉండి వెళ్లిపోయాడు. గంగాధర్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు ప్రసాద్‌ను అనుమానించి, విచారించారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన హర్షవర్ధన్‌ను ప్రసాద్ నంబులపూలకుంట మండలంలోని మర్రికొమ్మదిన్నె-జౌకల మధ్య ఉన్న అటవీ ప్రాంతానికి తీసుకువెళ్లాడు. చిన్నారిని గొంతు నులిమి హత్య చేశాడు. మృతదేహాన్ని అక్కడే పడేసి వచ్చాడు. మేనల్లుడిని హత్య చేయడానికి తన సోదరి కుటుంబంపై ఉన్న అసంతృప్తే కారణమని ప్రసాద్ అంగీకరించాడని ఎస్పీ తెలిపారు. ప్రసాద్ కుమారుడికి బ్లడ్ క్యాన్సర్ ఉంది. చికిత్సకు గంగాధర్ ఇప్పటికే కొంత సాయం చేశాడు. ఆ వ్యాధి నయంకాదని గంగాధర్ అనడంతో ప్రసాద్ కోపం పెంచుకున్నాడు. నిందితుడిపై కిడ్నాప్, హత్య కేసు నమోదు చేశారు. గురువారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో బాలుడి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు.

కార్మిక రాజ్య భీమా సంస్థ
(కార్మిక మరియు ఉపాధి మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం)
कर्मचारी राज्य बीमा निगम
(श्रम एवं रोजगार मंत्रालय, भारत सरकार)
Employees' State Insurance Corporation
(Ministry of Labour & Employment, Govt. of India)
క.రా.బీ.ని. E.S.I.C.

ప్రాంతీయ కార్యాలయం/क्षेत्रीय कार्यालय /Regional Office
ఈ ఎస్ ఐ రోడ్డు, గుణదల, విజయవాడ – 520 004
ईएसआई रोड, गुणदला, विजयवाड़ा–520 004
ESI Road, Gunadala, Vijayawada-520 004
Telephone: 0866-2453498
e-mail : rd-andhrapradesh@esic.nic.in

ఇ-టెండర్లు కోరుతూ ప్రకటన

ఆం.ప్ర.రీజియన్, ESIC, రీజినల్ డైరెక్టర్ I/c, వారు తెలియజేయునది ఏమనగా 2025-26 కాలానికి ఆంధ్రప్రదేశ్‌లో దిగువ సివిల్ పనుల యొక్క వార్షిక మరమ్మతులు మరియు నిర్వహణ (ARM) చేపట్టుట కొరకు ESIC యొక్క వెబ్‌సైట్లు **(https://www.esic.gov.in/tenders)** & సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ **(https:// eprocure.gov.in/eprocure/app)**లో అప్‌లోడ్ చేయబడిన ఇ-టెండర్లను తగిన తరగతి మరియు కేటగిరీతో భవనాలు మరియు రోడ్లతో వ్యవహరించుటకు అర్హత గల మరియు నమోదు చేయబడిన CPWD/ రాష్ట్ర PWD/MES/ రైల్వేలు/BSNL లేదా రాష్ట్ర ప్రభుత్వ శాఖల యొక్క కాంట్రాక్టర్లు/ సంస్థల నుండి ఇ-టెండర్లు కోరుచున్నారు.

క్ర. సం.	పని పేరు & ప్రదేశము	ఇ-బిడ్ల దాఖలుకు ఆఖరి తేది	సాంకేతిక బిడ్లు తెరుచు తేది
1	**టెండరు ID No.2025 ESIC 880192_2** 2025-26 కాలానికి చిట్టివలస ESIC శాఖా కార్యాలయం, మరియు చిట్టివలస, నెల్లిమర్ల, గరివిడి మరియు పైడిభీమవరం, ESI డయాగ్నస్టిక్ సెంటర్ విజయనగరం వద్ద ESI డిస్పెన్సరీల యొక్క సివిల్ పనుల యొక్క వార్షిక మరమ్మతులు మరియు నిర్వహణ (ARM)	08.12.2025న మ.03.00 గం.ల వరకు	09.12.2025న మ.03.00 గం.లకు

ఆసక్తి గల బిడ్డర్లు తమ టెండర్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయగలరు మరియు టెండర్‌లో గల ఆదేశాలను అనుసరించగలరు. బిడ్ ఫారంలు మరియు ఇతర వివరాలు పై వెబ్‌సైట్‌ల నుండి డౌన్‌లోడ్ చేసుకొనగలరు. టెండర్‌కు సంబంధించిన అప్‌డేట్‌లు సదరు వెబ్‌సైట్లపై మాత్రమే ప్రచురించబడుతుంది. తదుపరి సమాచారం కొరకు వెబ్‌సైట్‌లు దర్శించవలసిందిగా బిడ్డర్లను అభ్యర్థించడమైనది.

విజయవాడ సం/-
27.11.2025 రీజినల్ డైరెక్టర్ I/C

రసకందాయంలో 'కర్ణాటకం'

» సిద్దరామయ్య, డీకే శివకుమార్ మాటల తూటాలు

బెంగళూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై రాజకీయం బాగా వేడెక్కింది. ఒకదాన్ని మించి ఒకటిగా నాటకీయ పరిణామాలు కొనసాగుతున్నాయి. సిద్దరామయ్య, డీకే శివకుమార్ మధ్య కుర్చీపోరు తుది దశకు చేరుకుంది. తన సహనం నశిస్తోందంటూ డీకే సంకేతాలు ఇస్తుండగా, కుర్చీ దిగేదే లేదన్నట్టు సిద్దరామయ్య తేల్చిచెబుతున్నారు. వీరి పోరాటం తాజాగా సోషల్ మీడియాకు ఎక్కింది. ఇద్దరూ గురువారం 'ఎక్స్'లో వాడీవేడీ పోస్టులు పెట్టారు. 'ఇచ్చిన మాట మీద నిలబడటం ప్రపంచంలో గొప్ప విషయం, అది న్యాయమూర్తి కావచ్చు, రాష్ట్రపతి కావచ్చు లేదా నేను కావచ్చు' అని డీకే శివకుమార్ పోస్టు చేయగా, దీనికి కౌంటర్‌గా సిద్దరామయ్య.. 'మేము కర్ణాటకకు ఇచ్చిన మాట కేవలం నినాదం కాదు.. అదే మాకు సర్వస్వం' అని ట్వీట్ చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే కన్నడ రాజకీయం ఢిల్లీకి మారింది. బెంగళూరు పర్యటనకు వచ్చిన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఉదయం హడావుడిగా ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. దీనికి ముందు ఆయన తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడుతూ 'రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు నాకు తెలుసు. ఒకట్రెండు రోజుల్లోనే సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌ను ఢిల్లీకి పిలుస్తాం. సోనియా, రాహుల్‌తో సహా సీనియర్ నేతలతో సమావేశమై చర్చిస్తా' అన్నారు.

వైట్‌హౌస్ వద్ద కాల్పుల కలకలం

» నేషనల్ గార్డులపై అఫ్గాన్ జాతీయుడి కాల్పులు

» మహిళసహా ఇద్దరు గార్డులకు తీవ్ర గాయాలు



వాషింగ్టన్, నవంబరు 27: అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌కు అతి సమీపంలో నేషనల్ గార్డులపై ఓ అఫ్గానిస్థాన్ జాతీయుడు కాల్పులు జరపటం కలకలం సృష్టించింది. దేశ రాజధాని వాషింగ్టన్ డీసీలోని ఫరాగట్ వెస్ట్ మెట్రో స్టేషన్ సమీపంలో రహమానుల్లా లకన్‌వాల్ అనే వ్యక్తి బుధవారం మధ్యాహ్నం(స్థానిక కాలమానం) 2.15 గంటల సమయంలో కాల్పులు జరిపాడు. వీధుల్లో గస్తీ నిర్వహిస్తున్న వెస్ట్ వర్జీనియా నేషనల్ గార్డు దళ సభ్యులపై అతి సమీపం నుంచి కాల్పులు జరపటంతో ఇద్దరు గార్డులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒక మహిళ కూడా ఉంది. గార్డుల ఎదురుకాల్పుల్లో రహమానుల్లా కూడా గాయపడ్డాడు. అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అమెరికాలో గురువారం థ్యాంక్స్ గివింగ్ డే వేడుకలు నిర్వహిస్తున్నారు. ప్రజలంతా ఆ ఉత్సాహంలో ఉండగా, ఒక రోజు ముందు కాల్పులు జరగటం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

ఇది క్రూరమైన దాడి

కాల్పుల ఘటనపై అమెరికా అధ్యక్షుడు తీవ్రంగా స్పందించారు. థ్యాంక్స్ గివింగ్ డే వేడుకల్లో పాల్గొనేందుకు ఫ్లోరిడా వెళ్లిన ఆయన.. మీడియాతో మాట్లాడుతూ.. గత అధ్యక్షుడు జో బైడెన్ ఇమిగ్రేషన్ విధానాల వల్లే దేశంలో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. 'వాషింగ్టన్ డీసీలో విధుల్లో ఉన్న నేషనల్ గార్డు సభ్యులపై వైట్‌హౌస్‌కు కొన్ని అడుగుల దూరంలోనే చోటుచేసుకున్న కాల్పుల ఘటన అత్యంత క్రూరమైన చర్య. ఇది కచ్చితంగా ఉగ్రవాద దాడే. భూమిపై అఫ్గానిస్థాన్ నరకద్వారంగా మారింది.' అని అన్నారు. కాగా, కాల్పులు జరిపిన రహమానుల్లా లకన్‌వాల్‌కు గతంలో అఫ్గానిస్థాన్‌లో సైనిక శిక్షణ ఇచ్చింది అమెరికా నిఘా వర్గాలేనని తేలింది. అఫ్గానిస్థాన్ నుంచి అమెరికా తన బలగాలను వెనక్కు తీసుకున్న సమయంలో నాటి అధ్యక్షుడు బైడెన్ అమలుచేసిన 'ఆపరేషన్ అలైజ్ వెల్కం'(భాగస్వాములకు స్వాగతం)లో భాగంగా 2021, సెప్టెంబర్ 8న అతడు అమెరికా చేరుకున్నాడు. ఇప్పటికే విదేశీయుల రాకపై ఆంక్షలు విధించిన ట్రంప్.. తాజా ఘటన నేపథ్యంలో అఫ్గానిస్థాన్‌తో సంబంధాలను పూర్తిగా నిలిపేస్తున్నట్లు ప్రకటించారు. ఆ దేశస్థుల ఇమిగ్రేషన్ దరఖాస్తుల పరిశీలనను నిరవధికంగా నిలిపేస్తున్నట్లు అమెరికా సిటిజన్‌షిప్, హోంల్యాండ్ సెక్యూరిటీ ప్రకటించింది.

ఆన్‌లైన్ కంటెంట్‌పై ఎవరిది బాధ్యత..?: సుప్రీం

న్యూఢిల్లీ, నవంబరు 27: సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసే కంటెంట్‌కు ఎవరో ఒకరు జవాబుదారీగా ఉండాల్సిన అవసరముందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. వ్యక్తులు సొంతంగా చానెళ్లు ప్రారంభించి.. ఆ తర్వాత బాధ్యతారాహిత్యంగా ఉండటమనేది వింతగా ఉందని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిల ధర్మాసనం ఆక్షేపించింది. ఓ కార్యక్రమంలో యూట్యూబర్ రణవీర్ అలహాబాదియా తల్లిదండ్రుల శృంగారంపై ఓ వ్యక్తిని అడిగిన ప్రశ్నలు వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన కేసు తాజాగా విచారణకు వచ్చింది. దీనిపై కోర్టు స్పందిస్తూ.. 'నేను సొంతంగా చానెల్ పెట్టుకుంటాను. ఎవరికీ జవాబుదారీగా ఉండను అంటే ఎలా..? ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలలో అశ్లీల, అభ్యంతరకర, చట్ట విరుద్ధమైన కంటెంట్‌ను నియంత్రించడానికి తటస్థ, స్వతంత్ర, స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ అవసరముంది. యూజర్లు రూపొందించిన సోషల్ మీడియా కంటెంట్‌ను నియంత్రించేలా నిబంధనలు తీసుకురావడానికి కేంద్రానికి నాలుగు వారాల గడువు ఇస్తున్నాం" అని సుప్రీంకోర్టు పేర్కొంది.

పాకిస్థానీయులకు యూఏఈ వీసాలు బంద్

ఇస్లామాబాద్, నవంబరు 27: పాకిస్థానీయుల్లో చాలా మందికి యూఏఈ వీసాలను నిలిపివేసింది. దాదాపుగా నిషేధించినంత పని చేసింది. యూఏఈకి వెళ్లే పాకిస్థానీయులు నేరపూరిత చర్యలకు పాల్పడుతుండడమే ఇందుకు కారణం. సౌదీ అరేబియా కూడా దాదాపుగా ఇలాంటి నిర్ణయాన్నే అమలు చేస్తోంది. ఈ విషయాన్ని సెనేట్ మానవ హక్కుల ఫంక్షనల్ కమిటీకి అంతర్గత వ్యవహారాల శాఖ తెలిపింది. ఒకవేళ నిషేధమే విధిస్తే దానిని ఎత్తేయించడం కష్టమవుతుందని ఆ కమిటీ చైర్‌పర్సన్ సమీనా జాహ్రీ అభిప్రాయపడ్డారు. యూఏఈ అతికష్టం మీద ఇటీవల కొంతమందికి మాత్రమే వీసాలు జారీ చేసిందని చెప్పారు. జూలై నుంచి వీసాల మంజూరును బాగా తగ్గిస్తుండడాన్ని ప్రభుత్వం గుర్తించి ఆ దేశం దృష్టికి తీసుకెళ్లింది. మరోవైపు పాకిస్థాన్‌లోని యూఏఈ రాయబారి.. పాక్ ఆర్థిక మంత్రి ఔరంగజేబ్‌తో కలిసి తాము చేపట్టిన వీసా సంస్కరణలను వివరించారు. పాక్‌లోని యూఏఈ వీసా సెంటర్‌లో రోజుకు 500 వీసా దరఖాస్తులను పరిశీలిస్తున్నట్టు చెప్పారు.

అస్సాంలో బహుభార్యత్వం నిషేధం

గువాహటి, నవంబరు 27: బహుభార్యత్వాన్ని నిషేధిస్తూ గురువారం అస్సాం అసెంబ్లీ తీర్మానాన్ని ఆమోదించింది. నిబంధనలు ఉల్లంఘించి రెండో పెళ్లి చేసుకున్న వారికి గరిష్ఠంగా పదేళ్ల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఈ బిల్లులో ఉంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి హిమాంత బిశ్వశర్మ మాట్లాడుతూ తుర్కియే దేశాన్ని ఉదాహరణగా తీసుకొని ఈ బిల్లును ప్రవేశపెట్టినట్టు చెప్పారు. ఇది ఇస్లాంకు వ్యతిరేకం కాదని చెప్పారు. నిజమైన ముస్లింలుగా ఈ బిల్లుకు మద్దతు తెలపాలని కోరారు. ఇస్లాం బహుభార్యాత్వాన్ని ప్రోత్సహించదని తెలిపారు. తుర్కియే బహుభార్యాత్వాన్ని నిషేధించిందని, పాకిస్థాన్‌లో ఆర్బిట్రేషన్ కౌన్సిల్ ఉందని చెప్పారు. ఈ బిల్లు రాజ్యాంగంలోని ఆరో షెడ్యూలు అమలయ్యే గిరిజన ప్రాంతాలకు వర్తించదని చెప్పారు. గిరిజనులకు కూడా వర్తించదని తెలిపారు. అక్రమంగా రెండో వివాహం చేసుకున్నవారికి ఏడేళ్ల జైలు శిక్ష, మొదటి వివాహాన్ని దాచిపెట్టిన వారికి పదేళ్ల వరకు జైలు శిక్ష ఉంటుంది. పదేపదే ఈ తప్పు చేసిన వారికి మరింత కఠిన శిక్షలు ఉంటాయి. బాధిత మహిళలకు రక్షణ, పరిహారం చెల్లించే ఏర్పాట్లు ఉన్నాయి.

'సిందూర్' మన సామర్థ్యాన్ని చాటింది: రాష్ట్రపతి

న్యూఢిల్లీ, నవంబరు 27: ఉగ్రవాద అణచివేత-నిరోధ వ్యూహంలో 'ఆపరేషన్ సిందూర్'ను నిర్ణయాత్మక చర్యగా రాష్ట్రపతి, భారత సాయుధ బలగాల సర్వసైన్యాధ్యక్షురాలు ద్రౌపది ముర్ము అభివర్ణించారు. దీని ద్వారా భారత సైనిక సామర్థ్యాన్నే గాక.. నైతిక స్పష్టతతో అది నిక్కచ్చిగా, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని ప్రపంచంతా చూసిందన్నారు. భారత సైన్యం గురువారం ఢిల్లీలో నిర్వహించిన 'చాణక్య డిఫెన్స్ డైలాగ్' మూడో సంచికలో ఆమె ప్రసంగించారు. 'వసుధైవ కుటుంబకం' స్ఫూర్తితో.. వ్యూహాత్మక స్వయం సామర్థ్యంతో పాటు ప్రపంచ జవాబుదారీతనం కూడా మనకుందని ఆపరేషన్ సిందూర్‌తో చాటామని తెలిపారు.

కూలుతున్న భవిష్యత్ తరం!

విద్యార్థుల్లో పెరుగుతున్న ఆత్మహత్యలు.. గత పదేళ్లలో 65 శాతం పెరుగుదల



'మాథ్స్‌లో తక్కువ మార్కులు వచ్చాయి.. బాగా కష్టపడి చదువు.. నీ భవిష్యత్తు కోసమే చెబుతున్నా' అంటూ తండ్రి మందలించిన తెల్లారే పదో తరగతి విద్యార్థిని అయిన కుమార్తె అపార్ట్‌మెంట్‌పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. 'ఇంకా ఎన్ని రోజులు సెలవు పెట్టి ఇంట్లో ఉంటావు.. ఉన్నది చాలు.. స్కూలుకు వెళ్లు!' అని తల్లిదండ్రులు కోప్పడినందుకు 8వ తరగతి విద్యార్థి ప్రాణాలు తీసుకున్నాడు. ఈ రెండు ఘటనలూ ఇటీవల హైదరాబాద్‌లో జరిగాయి. దేశంలో పెరిగిపోతున్న విద్యార్థుల ఆత్మహత్యలకు ఇవి నిదర్శనాలు. ఒకప్పుడు రైతుల ఆత్మహత్యలు మీడియాలో ప్రముఖంగా కనిపించేవి. వాటి స్థానంలో ఇప్పుడు విద్యార్థుల ఆత్మహత్యలు కనిపిస్తున్నాయి. వినటానికి నమ్మశక్యంగా లేకపోవచ్చుగానీ.. నేడు దేశంలో రైతులు, ఉద్యోగులు తదితర వర్గాల కంటే విద్యార్థుల ఆత్మహత్యలే అధికంగా ఉంటున్నాయి. రైతుల ఆత్మహత్యలు సమాజంలో కలిగించే కలకలం, వాటికి మీడియా ఇచ్చే ప్రాధాన్యం విద్యార్థుల ఆత్మహత్యలకు ఇవ్వకపోవటంతో ఆ అంశం బలంగా ముందుకు రావటం లేదని విశ్లేషకులు చెబుతున్నారు. దేశంలో ప్రతీ 42 నిమిషాలకు ఒక విద్యార్థి ప్రాణాల్ని తీసుకుంటున్నాడని జాతీయ నేర గణాంకాల విభాగం చెబుతోంది. దేశంలో ఆత్మహత్యలు ఏటా సగటున 2 శాతం చొప్పున పెరుగుతుండగా.. విద్యార్థుల్లో మాత్రం ఇది 4 శాతంగా నమోదవుతోంది. రైతుల ఆత్మహత్యలు ఇటీవలి కాలంలో క్రమంగా తగ్గుతుండగా.. విద్యార్థుల ఆత్మహత్యలు మాత్రం పెరుగుతుండటం ఆందోళన కలిగించే పరిణామం.

పదేళ్లలో 65 శాతం పెరుగుదల

2013-2023 మధ్య నమోదైన గణాంకాల్ని పరిశీలిస్తే.. 2013లో 8,423 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోగా, 2023లో 13,892 మంది ప్రాణాలు తీసుకున్నారు. అంటే, పదేళ్లలో 65 శాతం పెరిగిపోయాయి. ఇదే పదేళ్లలో దేశంలో మొత్తం ఆత్మహత్యలు 27 శాతం పెరిగాయి (2013లో 1.35 లక్షలు కాగా 2023లో 1.71 లక్షలు). మొత్తం ఆత్మహత్యల్లో విద్యార్థుల ఆత్మహత్యలు 2013లో 6.2 శాతం కాగా, 2023లో అది 8.1 శాతానికి పెరిగాయి. ప్రాణాలు తీసుకుంటున్న విద్యార్థుల్లో బాలికల కంటే బాలురు అధికంగా ఉంటున్నారు.

కారణాలేమిటి?

విద్యార్థుల్లో ఆత్మహత్యలు పెరిగిపోవటానికి పలు కారణాలు ఉన్నాయని మానసిక నిపుణులు చెబుతున్నారు. అవి.. మార్కులు, ర్యాంకుల కోసం ఇతర విద్యార్థులతో ఉండే పోటీ, విరామం లేకుండా సుదీర్ఘంగా ఉంటున్న కాలేజీ, రీడింగ్ అవర్స్, మంచి ర్యాంకు తెచ్చుకోవాలంటూ కుటుంబపరంగా ఉండే ఒత్తిడి, కుటుంబంలో ఆర్థికపరమైన సమస్యలు, ఉద్యోగం లభిస్తుందో లేదోనన్న ఆందోళన, నిరాశలో కూరుకుపోయిన విద్యార్థిని ఓదార్చి, ధైర్యం ఇచ్చే వ్యక్తులు, వ్యవస్థలు అందుబాటులో లేకపోవటం మొదలైనవి. కరోనా సమయంలో విద్యాసంస్థలు మూతబడిపోయి విద్యార్థులు ఇంటికే పరిమితమైన సమయంలో వారిలో ఒంటరితనం, అనిశ్చితి వంటివి పెరిగిపోయాయని, తర్వాత కూడా వీటి ప్రభావం కొనసాగుతోందని చెబుతున్నారు. గణాంకాలు కూడా దీనికి అనుగుణంగా ఉండటం గమనార్హం. 2019 నుంచి 2023 మధ్య విద్యార్థుల ఆత్మహత్యలు ఏకంగా 34 శాతం పెరిగాయని జాతీయ నేర గణాంకాల విభాగం వెల్లడించింది.

నివారణ మార్గాలు

- తమ పిల్లలు తమ ముందు స్వేచ్ఛగా అభిప్రాయాల్ని, భావోద్వేగాల్ని వెల్లడించే స్వేచ్ఛ, వాతావరణం ఇంట్లో తల్లిదండ్రులు కల్పించాలి. పిల్లలు తమ సమస్యలు చెప్పినప్పుడు సావధానంగా విని, తామున్నామనే భరోసా కల్పించాలి. మార్కులు, ర్యాంకులు అవసరమేగానీ.. వాటి కోసం పిల్లల మీద విపరీతమైన ఒత్తిడి తీసుకురావొద్దు.
- సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటైన పిల్లలు సెల్‌ఫోన్ మీద ఎక్కువ సమయం వెచ్చిస్తూ ఒంటరితనంలో కూరుకుపోతున్నారు. దీనిని జాగ్రత్తగా మాన్పించాలి. వారితో తల్లిదండ్రులు ఎక్కువ సమయం గడపాలి.
- స్కూళ్లు, కాలేజీలు కెరీర్ కౌన్సెలింగ్‌కు ఇస్తున్న ప్రాధాన్యం.. సైకలాజికల్ కౌన్సెలింగ్‌కు ఇవ్వటం లేదన్న విమర్శలున్నాయి. విద్యార్థుల్లో ఆదుర్దా, డిప్రెషన్ వంటి సమస్యలను నివారించటానికి మానసిక కౌన్సెలర్లను నియమించుకోవాలి. వారి సేవలు విద్యార్థులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలి.
- విద్యార్థి చదువుల్లో వెనకబడుతున్నప్పుడు క్రమశిక్షణ చర్యలు తీసుకోవటానికి బదులు కారణాలేమిటో కనుక్కొని వాటిని పరిష్కరించే దిశగా విద్యాసంస్థలు కృషి చేయాలి. అందుకు తగిన వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలి.

లక్షణాలు

యుక్తవయస్కుల్లో ఆదుర్దా, డిప్రెషన్ వంటివి పెరుగుతున్నాయని, కానీ, ఈ లక్షణాల్ని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తీవ్రంగా తీసుకోకుండా, చదువుల మీద శ్రద్ధ లేకపోవటం, బద్ధకం అని భావిస్తున్నారని డాక్టర్ శివప్రసాద్ అనే సైకియాట్రిస్ట్ తెలిపారు. ఆత్మహత్యకు పాల్పడటానికి ముందు కొన్ని లక్షణాలు కనిపిస్తాయని, వాటిని గమనించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. 'కుటుంబం నుంచి దూరంగా, ఒంటరిగా ఉండటం. స్నేహితుల్ని కలవకపోవటం, అమితంగా బాధపడటం, చిరాకు, కోపం పెరగటం, తరచూ ఏడవటం, వ్యక్తిత్వంలో అకస్మాత్తుగా మార్పులు రావటం ఇవన్నీ ఆత్మహత్యకు ముందు ఉండే లక్షణాలే'నని పేర్కొన్నారు. ఢిల్లీకి చెందిన ఫోరెన్సిక్ సైకియాట్రిస్ట్ డాక్టర్ అస్తిక్‌జోషి మాట్లాడుతూ.. తలనొప్పి, కడుపునొప్పి వంటి కారణాలతో స్కూలు/ కాలేజీకి తరచూ డుమ్మా కొట్టటం, అకస్మాత్తుగా బరువు తగ్గటం వంటివి కూడా సీరియస్‌గా తీసుకోవాల్సిన లక్షణాలని తెలిపారు. ఆత్మహత్య ఆలోచనలు వస్తున్నాయని తమకు సన్నిహితంగా ఉండే వారికి కూడా చెబుతుంటారని, ఏదో చెప్పి సర్దిపుచ్చకుండా.. తక్షణం మానసిక వైద్యుడి వద్దకు తీసుకెళ్లాలని సూచించారు.

- విద్యార్థుల మధ్య, విద్యార్థులకు ఉపాధ్యాయులకు మధ్య సహృద్భావ వాతావరణం నెలకొనేలా విద్యాసంస్థలు చర్యలు తీసుకోవాలి.
- ఆత్మహత్య వంటి తీవ్రమైన ఆలోచనలతో విద్యార్థి ఉన్నట్లు గమనిస్తే.. తల్లిదండ్రులుగానీ, విద్యాసంస్థలుగానీ మానసిక వైద్యుల వద్దకు తీసుకెళ్లాలి.
- విద్యార్థుల్లో వ్యాయామం, యోగా, ధ్యానం, తగినంత సమయం నిద్రపోవటం వంటి మంచి అలవాట్లను పెంపొందించటం ద్వారా వారిలో నిరాశ వంటివి దరిచేరకుండా చేయవచ్చు.
- ప్రభుత్వాల పరంగా పరీక్షల్లో సంస్కరణలు, మానసిక నిపుణుల సేవలను అందుబాటులో ఉంచటం, ఉపకారవేతనాలు అందించి ఆర్థికపరమైన సమస్యలు లేకుండా చేయటం, విద్యాసంస్థలకు తగిన నిబంధనల్ని నిర్దేశించటం వంటి విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.
- ఒత్తిడి బారిన పడిన విద్యార్థులకు చేయూత అందించటం కోసం 2020లో కేంద్రప్రభుత్వం మనోదర్పణ్ పేరుతో టెలీ కౌన్సెలింగ్ సేవల్ని ప్రారంభించింది. ఆత్మహత్యల నివారణకు పలు స్వచ్ఛందసంస్థలు కూడా సమర్థవంతమైన సేవల్ని అందిస్తున్నాయి. వాటి సేవల్ని కూడా వినియోగించుకోవచ్చు.

- సెంట్రల్ డెస్క్

లోకం తీరు



క్యూఆర్ కోడ్‌లతో జరభద్రం

» వాట్సాప్ వెబ్ కోడ్‌లతో సైబర్ నేరగాళ్ల నయా మోసం

» టాస్కల పేరిట వల వేసి గుట్టుగా వాట్సాప్ ఖాతాల్లోకి లాగిన్

న్యూఢిల్లీ, నవంబరు 27: మేము చెప్పిన ఈ చిన్న పని(టాస్క్) పూర్తి చేసి మా పేజీ లేదా వెబ్‌సైట్‌లోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే చాలు మీ వ్యాలెట్‌లో రూ.100 జమ అవుతాయి.. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సామాజిక మాధ్యమాల్లో ఈ తరహా ప్రకటన ఏదైనా చూస్తే.. ఈజీ మనీ కోసం ఆశపడి గుర్తు తెలియని వెబ్‌సైట్‌లోని క్యూఆర్ కోడ్‌లు స్కాన్ చేశారో.. అంతే సంగతి. మీ వాట్సాప్ హ్యాక్ అయిపోయినట్టే. అవును సైబర్ నేరగాళ్లు ఇటీవల ఈ కొత్త మోసానికి తెగబడుతున్నారు. టాస్కల పేరిట సోషల్ మీడియాలో ఎర వేసి వాట్సాప్ వెబ్ లాగిన్ క్యూఆర్ కోడ్‌లతో అమాయక ప్రజల వాట్సాప్ ఖాతాల్లోకి గుట్టుగా లాగిన్ అయిపోతున్నారు. ఆపై, ఫలానా కష్టంలో ఉన్నా కొంత డబ్బు పంపండి అంటూ ఆ వాట్సాప్ ఖాతాలోని ఇతర కాంటాక్ట్‌లకు మెసేజ్‌లు పంపుతున్నారు. తెలిసిన వ్యక్తి నుంచి సందేశం రావడంతో చాలా మంది ఆ సందేశంలో పేర్కొన్న విధంగా డబ్బులు పంపేస్తున్నారు. అలాగే, బ్యాంకు ఖాతాలు ఖాళీ చేసేందుకు, వ్యక్తిగత సమాచారాన్ని కాజేసేందుకు పనికొచ్చే ప్రమాదకరమైన ఏపీకే ఫైల్స్‌ను కూడా సైబర్ నేరగాళ్లు ఆ వాట్సాప్ లాగిన్ల ద్వారా షేర్ చేస్తున్నారు. దీంతో బాధితుల సంఖ్య చాపకింద నీరులా పెరిగిపోతుంది. వాట్సాప్ వెబ్ లాగిన్ ద్వారా ఈ మోసమంతా జరుగుతుండడంతో అసలైన వాట్సాప్ యూజర్లు ఈ వ్యవహారాన్ని ఆలస్యంగా గుర్తించి తలలు పట్టుకుంటున్నారు. వాట్సాప్ వెబ్ లాగిన్ మోసాలు ఇటీవల అధికమైన నేపథ్యంలో.. వాట్సాప్ క్యూఆర్ కోడ్‌ల అంశంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్(ఐ4సీ) హెచ్చరించింది.

గేమ్‌చేంజర్ ఎస్-400

» మరో ఐదు గగనతల రక్షణ వ్యవస్థల కొనుగోలుకు భారత్ సిద్ధం

» 10 వేల కోట్లతో క్షిపణుల కొనుగోలు

» 63 వేల కోట్లతో సుఖోయ్-30 ఆధునీకరణ

» 5న మోదీ, పుతిన్ మధ్య ఒప్పందాలు..?

న్యూఢిల్లీ, నవంబరు 27: గగనతలాన్ని శత్రు దుర్భేద్యంగా మార్చడానికి మనదేశం వేగంగా అడుగులు వేస్తోంది. ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్ దాడులను సమర్థంగా తిప్పికొట్టిన ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థను మరింత విస్తరించడానికి సిద్ధమైంది. భారత వైమానిక దళం (ఐఏఎఫ్) దీనిని ఓ గేమ్‌చేంజర్‌గా అభివర్ణిస్తున్న నేపథ్యంలో మరో ఐదు ఎస్-400లను కొనుగోలు చేయనున్నారు. డిసెంబరు 5న జరిగే ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ భేటీలో వీటితో పాటు మరిన్ని క్షిపణుల కొనుగోలుకు ఒప్పందాలు జరిగే అవకాశం ఉంది. అలాగే రూ. 63 వేల కోట్లతో సుఖోయ్-30ఎంకేఐ యుద్ధవిమానాల ఆధునీకరణ కార్యక్రమానికి కూడా భారత్ సిద్ధమవుతోందని టైమ్స్ ఆఫ్ ఇండియా తన కథనంలో తెలిపింది. ఆ కథనం ప్రకారం.. మరిన్ని ఎస్-400 స్క్వాడ్రన్‌లు కొనుగోలుకు ఇప్పటికే రక్షణ శాఖ సిద్ధమైంది. అలాగే పాక్‌తో యుద్ధం సమయంలో తరిగిపోయిన నిల్వలను మళ్లీ పెంచడానికి ఎస్-400 క్షిపణులను కూడా కొనుగోలు చేయాలని నిర్ణయించింది. 120, 200, 250, 380 కి.మీటర్ల రేంజ్ క్షిపణుల కోసం ప్రత్యేకంగా రూ. 10 వేల కోట్లను కేటాయించడానికి నిర్ణయించారు. ఇక ఐఏఎఫ్‌కు చెందిన 259 సుఖోయ్-30 ఎంకేఐ యుద్ధ విమానాల్లో మొదటి దఫాలో 80 యుద్ధ విమానాలను రూ. 63 వేల కోట్లతో ఆధునీకరించడానికి ప్రధాని నేతృత్వంలోని భద్రతపై క్యాబినెట్ కమిటీ (సీసీఎస్) అనుమతి తెలిపింది. ఈ ఫైటర్లను ఆధునిక రాడార్లు, ఏవియానిక్స్, సుదూర రేంజ్ ఆయుధాలు, బహుళ సెన్సార్లతో ఆధునీకరించి, మరో 30 ఏళ్లపాటు పోరాడే సామర్థ్యానికి తగ్గట్లుగా తీర్చిదిద్దుతారు. వీటిని రష్యా సహకారంతో దేశీయంగా అభివృద్ధి చేస్తారు.

ఫ్రాన్స్‌లో ఇక మిలటరీ వాలంటీర్లు

» 18-19 ఏళ్ల యువత సైన్యంలో 10 నెలల పాటు పనిచేయాలి

వర్సేస్, నవంబరు 27: ఫ్రాన్స్‌లో ఇక నుంచి మిలటరీ వాలంటీర్ల వ్యవస్థను తీసుకురానున్నట్టు అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మేక్రాన్ వెల్లడించారు. యూరోప్ దేశాలకు రష్యా నుంచి ముప్పు ఉన్న నేపథ్యంలో ఫ్రాన్స్ సైన్యాన్ని బలోపేతం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. 18-19 ఏళ్ల మధ్య ఉన్న యువత సైన్యంలో చేరి, 10 నెలల పాటు పని చేయాల్సి ఉంటుందని తెలిపారు. మిలటరీ యూనిఫారం ధరించి ప్రధాన భూ భాగంలోనూ, ఫ్రాన్స్ ఆధీనంలోని ఇతర ప్రాంతాల్లోనూ పనిచేయాల్సి ఉంటుందని చెప్పారు. విదేశాల్లో నిర్వహించే మిలటరీ ఆపరేషన్లకు మాత్రం పంపించబోమని స్పష్టం చేశారు. వర్సేస్ మిలటరీ బేస్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ వచ్చే ఏడాది వేసవిలో ఈ నూతన జాతీయ సేవా వ్యవస్థను ఏర్పాటు చేస్తామని తెలిపారు. దాన్ని క్రమేణా విస్తరిస్తామని తెలిపారు. తొలుత వచ్చే ఏడాది 3,000 మందిని వాలంటీర్లుగా తీసుకుంటామని చెప్పారు.

డ్రాగన్ రుణ 'వల'యంలో ప్రపంచం!

అమెరికా, రష్యా, ఆస్ట్రేలియా సహా పెద్ద దేశాల కంపెనీలకూ భారీగా రుణాలు

» 179 దేశాలకు అప్పులిచ్చిన చైనా ప్రభుత్వ ఆర్థిక సంస్థలు

» ఆ దేశాల్లోని కీలక రంగాల కంపెనీల్లో వాటాలు, పెత్తనం పెంచుకునే వ్యూహాలు



న్యూఢిల్లీ, నవంబరు 27: ప్రపంచం 'డ్రాగన్' రుణ వలయంలో చిక్కింది. అగ్రరాజ్యాలు సహా ప్రపంచంలోని 80శాతం దేశాల్లోని కంపెనీలకు చైనా బ్యాంకులు భారీ స్థాయిలో అప్పులు ఇచ్చాయి. ఈ రుణాలను అడ్డుపెట్టుకునే ఆ కంపెనీలను, తద్వారా దేశాలను చైనా ప్రభావితం చేస్తోంది. చైనా నుంచి రుణాలు తీసుకున్న దేశాల్లో అమెరికా టాప్‌లో ఉంది. రష్యా, ఆస్ట్రేలియా, వెనెజువెలా, పాకిస్థాన్ దేశాలు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అమెరికా వర్జీనియాలోని విలియం అండ్ మేరీ కాలేజీకి చెందిన పరిశోధక విభాగం 'ఎయిడ్ డేటా' తాజాగా విడుదల చేసిన నివేదిక ఈ వివరాలు వెల్లడించింది. సుమారు మూడేళ్లపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ ఆర్థిక సంస్థలు, ఇతర మార్గాల ద్వారా సమాచారాన్ని సేకరించి, క్రోడీకరించి.. 2000వ సంవత్సరం నుంచి 2023 మధ్య డేటాతో ఈ నివేదికను రూపొందించింది. అందులోని వివరాల ప్రకారం..

పెద్ద దేశాలకే ఇస్తూ.. ప్రభావితం చేస్తూ..

చైనా మొదట్లో పేద, అభివృద్ధి చెందుతున్న దేశాలకు భారీగా రుణాలు ఇచ్చేది. ఆయా దేశాలు, అక్కడి వనరులపై పెత్తనం చలాయించేది. కానీ 2000 సంవత్సరం నుంచి వ్యూహం మార్చి క్రమంగా సంపన్న దేశాలు, వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాలకు రుణాలను పెంచుతూ వచ్చింది. మొదట్లో పేద, మధ్యాదాయ దేశాలకే 90శాతం రుణాలు ఇవ్వగా.. ఇప్పుడు 75శాతానికి పైగా రుణాలు పెద్ద దేశాలకే ఇవ్వడం గమనార్హం. దీంతో ఆయా దేశాల్లోని సంస్థలను, వాటి ద్వారా ఆ దేశాలను తనకు అనుకూలంగా వ్యవహరించేలా లేదా తనపై ఎలాంటి చర్యలూ చేపట్టలేని విధంగా చైనా ప్రభావితం చేస్తోంది. ఉదాహరణకు చైనా ఇప్పటివరకు అమెరికాలోని 2,500 సంస్థలు, ప్రాజెక్టులకు రూ.18.1 లక్షల కోట్ల (202బిలియన్ డాలర్లు) రుణాలు ఇచ్చింది. 27దేశాల యూరోపియన్ యూనియన్ కూటమికి చెందిన 1,800 కంపెనీలు, ప్రాజెక్టులకు రూ.14.4లక్షల కోట్లు (161 బిలియన్ డాలర్లు) అప్పులు ఇచ్చింది. ఈ రుణాల్లో 95శాతానికిపైగా చైనా ప్రభుత్వ బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఇచ్చినవే. చైనా నుంచి సంపన్న దేశాలకు వెళ్తున్న రుణాల్లో చాలా వరకు కీలక మౌలిక సదుపాయాలు, సెమీ కండక్టర్ తయారీవంటి టెక్ కంపెనీలు, అరుదైన ఖనిజాలకు సంబంధించిన కంపెనీలు, ప్రాజెక్టులకే అందుతుండటం గమనార్హం. ఇందుకోసం షెల్ కంపెనీలు, అంతర్జాతీయ బ్యాంక్ సిండికేట్లను చైనా వినియోగించుకుంటోందని నివేదిక పేర్కొంది. మొత్తంగా ఆయా కంపెనీల్లో వాటాలు పెంచుకోవడం, వీలైతే చేజిక్కించుకోవడం ద్వారా సంపన్న దేశాల్లోని కీలక రంగాలపై చైనాపట్టు సాధిస్తోందని తెలిపింది.

- ప్రపంచంలో గుర్తింపు ఉన్న మొత్తం 217 దేశాలకుగాను 179 దేశాలకు చైనా ప్రభుత్వ ఆర్థిక సంస్థలు 196 లక్షల కోట్ల రుణాలు ఇచ్చాయి.
- 2023లో ప్రపంచంలో అత్యంత ఎక్కువగా రుణాలు ఇచ్చిన, తిరిగి వసూలు చేసుకున్న దేశం చైనాయే. ఆ ఏడాది చైనా వివిధ దేశాలకు కలిపి మొత్తం రూ.12.5 లక్షల కోట్లు (140 బిలియన్ డాలర్లు) రుణాలు ఇచ్చింది.
- నాటో, జీ7 వంటి కూటములు కూడా వివిధ దేశాలకు భారీగా రుణాలు ఇస్తున్నాయి. పశ్చిమ దేశాల్లోని చాలా ఆర్థిక సంస్థలు కొంత కాలం నుంచి చైనా ప్రభుత్వ ఆర్థిక సంస్థలతో కలిసి పనిచేస్తున్నాయి. చైనా నుంచి భారీగా రుణాలు తీసుకుని, ఇతర దేశాలకు అందిస్తున్నాయని 'ఎయిడ్‌డేటా' పేర్కొంది.
- చైనా నుంచి భారత కంపెనీలకు అందిన రూ. 1.6 లక్షల కోట్ల రుణాల్లో చాలా వరకు విద్యుత్, ఆర్థిక రంగాల్లోని కంపెనీలకే అందాయి.

చైనా నుంచి వివిధ దేశాలు తీసుకున్న అప్పులు (రూ.లలో)

దేశం	తీసుకున్న రుణాలు
అమెరికా	18.1 లక్షల కోట్లు
రష్యా	15.3 లక్షల కోట్లు
ఆస్ట్రేలియా	11.6 లక్షల కోట్లు
వెనెజువెలా	9.4 లక్షల కోట్లు
పాకిస్థాన్	6.6 లక్షల కోట్లు
బ్రెజిల్	5.7 లక్షల కోట్లు
ఇండోనేషియా	5.4 లక్షల కోట్లు
యూకే	5.3 లక్షల కోట్లు
స్విట్జర్లాండ్	3.6 లక్షల కోట్లు
అర్జెంటీనా	3.2 లక్షల కోట్లు
సింగపూర్	3.1 లక్షల కోట్లు
జర్మనీ	2.9 లక్షల కోట్లు
టర్కీ	2.9 లక్షల కోట్లు
భారత్	1.6 లక్షల కోట్లు

మృతదేహాల దిబ్బగా భవన సముదాయం

» హాంకాంగ్ అగ్ని ప్రమాద ఘటనలో 83కు పెరిగిన మృతుల సంఖ్య

» 300 మందికి పైగా ఆచూకీ గల్లంతు

హాంకాంగ్, నవంబరు 27: హాంకాంగ్‌లోని బహుళ అంతస్తుల భవన సముదాయంలో నెలకొన్న భారీ అగ్ని ప్రమాద ఘటనలో లారెన్స్ లీ అనే బాధితుడు వ్యక్తం చేసిన ఆవేదన ఇది. అగ్ని ప్రమాద ఘటనలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. వందల మంది ఆచూకీ తెలియకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. థాయ్ పో జిల్లాలోని న్యూ టెరిటరీస్ ఎనిమిది భారీ అపార్ట్‌మెంట్‌ల సముదాయంలో స్థానిక కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 2.50 గంటలకు మంటలు చెలరేగాయి. క్షణాల్లో ఏడు అపార్ట్‌మెంట్లకు అగ్ని కీలలు వ్యాపించాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 36 మంది మృతిచెందగా.. రెండోరోజు మృతుల సంఖ్య 83కు పెరిగింది. ఈ ప్రమాదంలో 70 మంది గాయపడ్డారు. మృతుల్లో ఒకరు, క్షతగాత్రుల్లో 10మంది అగ్నిమాపకదళానికి చెందిన వారు ఉన్నారు. ఈ భవన సముదాయంలోని 2వేల ఫ్లాట్లలో 4,800 మంది నివసిస్తున్నారు. ప్రమాదం సంభవించిన రాత్రే 900మందిని అపార్ట్‌మెంట్ల నుంచి సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించారు. కాగా భవన సముదాయంలోని 300 మందికిపైగా ఆచూకీ తెలియడం లేదు. ఒకవైపు మృతుల సంఖ్య పెరుగుతుండగా ప్రమాదం జరిగిన 24 గంటల తర్వాత ఓ అపార్ట్‌మెంట్ 16వ అంతస్తులోని ఫ్లాట్ నుంచి గురువారం సాయంత్రం ఓ వ్యక్తిని సహాయక సిబ్బంది ప్రాణాలతో బయటకు తీయడం గమనార్హం.



ధాన్యం కొనుగోళ్లపై వైసీపీ అబద్ధాలు

▸▸ జగన్‌కు రైతుల పక్షాన మాట్లాడే అర్హత లేదు: మంత్రి మనోహర్



అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు రైతులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.1,674 కోట్లు చెల్లించకుండా పారిపోయిన జగన్మోహన్‌రెడ్డి ఇప్పుడు రైతుల పక్షాన మాట్లాడుతుండటం విడ్డూరంగా ఉందని మంత్రి నాదెండ్ల మనోహర్ ఎద్దేవా చేశారు. విజయవాడలోని సివిల్ సప్లయిస్ భవన్‌లో గురువారం పౌరసరఫరాల సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.డిల్లీరావుతో కలసి మంత్రి మీడియాతో మాట్లాడారు. గిట్టుబాటు ధరలపై జగన్ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. 'కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర ప్రకారం 75 కిలోల ధాన్యం బస్తాకు కచ్చితంగా రూ.1,792 చెల్లించాం. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో ఎక్కడా పొరపాట్లు జరగకుండా, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా 51 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం. మా ప్రభుత్వంలో జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, క్షేత్రస్థాయిలో అధికారులు అహర్నిశలు కష్టపడుతూ అద్భుతంగా పని చేస్తున్నారు. ఇప్పటికే 8.22 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి.. రూ.1,713 కోట్ల సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేశాం. రాష్ట్రంలో సజావుగా సాగుతున్న ఈ ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై వైసీపీ నాయకులు కావాలనే రకరకాల అబద్ధాలను ప్రచారం చేస్తున్నారు. రాజకీయంగా లబ్ధిపొందాలనే దురుద్దేశంతో అలజడి సృష్టిస్తున్నారు. ప్రభుత్వం ఎకరానికి 25 బస్తాల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తుందంటూ కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు. ఇలాంటివారి పట్ల రైతులు అప్రమత్తంగా ఉంటూ వారి మోసాలను అర్థం చేసుకోవాలి. ఈ-క్రాప్ డేటా ప్రకారం రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. దుష్ప్రచారాన్ని నమ్మి రైతులు తమ ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకోవద్దు' అని మంత్రి సూచించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు వస్తాయని రైతులు ఆందోళన చెందవద్దని మంత్రి చెప్పారు. 'ఈనెల 30 వరకు రాష్ట్రంలో వర్షాలు ఉండవు. వర్షాల భయంతో కొంతమంది రైతులు తమ వరి పంటను పచ్చిగా ఉన్నప్పుడే కోసేసుకుంటూ నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో డిసెంబరు ఒకటో తేదీ నుంచి ఆయా జిల్లాల్లో ఐసోలేషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాం' అని మంత్రి మనోహర్ వివరించారు.

జగన్.. చిన్నారులను చూసైనా బుద్ధి తెచ్చుకో: యనమల

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నిర్వహించిన మాక్ అసెంబ్లీని చూసి వైసీపీ నేత జగన్ బుద్ధి తెచ్చుకోవాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు సూచించారు. గురువారం ఓ ప్రకటన చేస్తూ... 'విద్యార్థులు అద్భుతంగా మాక్ అసెంబ్లీని నిర్వహించారు. ఆ చిన్నారులను చూసైనా జగన్ అసెంబ్లీకి హాజరుకావాలి. లేకుంటే అనర్హత వేటు పడటం ఖాయం' అని యనమల హెచ్చరించారు.

జగన్‌కు రైతుల గురించి మాట్లాడే అర్హత లేదు: మర్రెడ్డి

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): 'అధికారంలో ఉన్న ఐదేళ్లు వ్యవసాయాన్ని నిర్వీర్యం చేశారు. ఇప్పుడు పులివెందులలో నంగనాచి కబుర్లు చెబుతూ, అబద్ధాలతో నానా యాగీ చేస్తున్నారు' అని జగన్‌పై రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ హయాంలో రైతు ఆత్మహత్యల్లో ఏపీ దేశంలో రెండో స్థానంలో నిలిచింది. ఆయనకు రైతుల గురించి మాట్లాడే అర్హత లేదు' అని మర్రెడ్డి మండిపడ్డారు.

ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా ఫరూక్ షుబ్లీ

రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ అకాడమీకి కొత్త బోర్డును ఏర్పాట్లు చేసింది. అకాడమీ చైర్మన్‌గా మొహమ్మద్ ఫరూక్ షుబ్లీని నియమించింది. గురువారం ఈ మేరకు రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

గురుకుల పాఠశాలలో సాకర్ స్టార్ బెక్‌హామ్

▸▸ విద్యార్థినులతో ఫుట్‌బాల్ ఆడి సందడి



విద్యార్థినులతో ఫుట్‌బాల్ ఆడుతున్న డేవిడ్ బెక్‌హామ్

శృంగవరపుకోట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సాకర్ స్టార్, ఇంగ్లండ్ ఫుట్‌బాల్ టీమ్ మాజీ కెప్టెన్ డేవిడ్ బెక్‌హామ్ విజయనగరం జిల్లాలో సందడి చేశాడు. లక్కవరపుకోట మండలం రంగాపురం మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించారు. యూనిసెఫ్ అంబాసిడర్‌గా ఇక్కడకు వచ్చిన ఆయన బుధవారం.. విద్యార్థినులతో కాసేపు ముచ్చటించారు. వారు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలించారు. తరగతి గదులు, విద్యావిధానం, బోధన, భోజనం, వసతి, ఇతర సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి కాసేపు ఫుట్‌బాల్ ఆడారు. ఆ తర్వాత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థికంగా వెనకబడిన బాలికలకు సమగ్ర విద్యాబోధన, నాణ్యమైన భోజన వసతి కల్పించేందుకు ఈ గురుకుల పాఠశాలను స్థాపించారు. యూనిసెఫ్ అందించే సాయానికి ఈ పాఠశాల ఎంపికైంది.

'ఫీజు' చిక్కులకు చెక్!

▸▸ ప్రైవేటు యూనివర్సిటీ ఫీజులపై త్వరలో జీవో

▸▸ హడావిడిగా ప్రైవేటు వర్సిటీ చట్టాన్ని సవరించిన వైసీపీ

▸▸ కానీ, ఫీజులపై స్పష్టత ఇవ్వని నాటి ప్రభుత్వం

▸▸ ఫీజుల కోసం విద్యార్థులపై వర్సిటీల ఒత్తిడి

▸▸ ప్రత్యేక ఉత్తర్వు ఇవ్వాలని సర్కారు నిర్ణయం

(అమరావతి, ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వం చేసిన పొరపాట్లను కూటమి ప్రభుత్వం సరిదిద్దుతోంది. హడావిడిగా ఆనాడు ప్రైవేటు యూనివర్సిటీల చట్టాన్ని సవరించిన జగన్ ప్రభుత్వం, ఫీజుల చెల్లింపుపై మాత్రం స్పష్టత ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసింది. దానివల్ల నెలకున్న సాంకేతిక సమస్యలకు చెక్ పెట్టాలని నిర్ణయించిన ప్రభుత్వం, త్వరలోనే ప్రత్యేక జీవో జారీచేయాలని నిర్ణయించింది. గత వైసీపీ ప్రభుత్వం ప్రైవేటు యూనివర్సిటీల చట్టాన్ని సవరించి 35 శాతం సీట్లను కన్వీనర్ కోటా కిందకు మార్చింది. కానీ ఆ కోటా కింద అడ్మిషన్లు పొందే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలుపై స్పష్టత ఇవ్వలేదు. చట్ట సవరణ అనంతరం జారీచేసిన జీవోల్లోనూ ఫీజుల చెల్లింపు గురించి స్పష్టత ఇవ్వలేదు. దీంతో 35 శాతం కోటా సీట్లలో చేరిన విద్యార్థులకు ఫీజుల చెల్లింపులో సాంకేతిక సమస్య ఏర్పడింది. ఆలస్యంగా పొరపాటును గుర్తించిన నాటి ప్రభుత్వం ఏటా ప్రత్యేకంగా ఫైలు పెట్టి ప్రైవేటు యూనివర్సిటీల విద్యార్థులకు ఫీజులు విడుదల చేస్తోంది. ఈ ఏడాది ఫీజులు విడుదల చేసినప్పుడు ఆ సమస్య మళ్లీ తలెత్తింది. ప్రైవేటు కాలేజీలు, యూనివర్సిటీ అనుబంధ కాలేజీల ఖాతాలకు ఫీజులు వెళ్లగా, ప్రైవేటు యూనివర్సిటీలకు మాత్రం వెళ్లలేదు. దీంతో ప్రైవేటు యూనివర్సిటీల్లో చదివే విద్యార్థులపై ఒత్తిడి పెరిగింది. అమరావతిలోని ఓ ప్రైవేటు యూనివర్సిటీ దీనిపై ఇంకా అత్యుత్సాహం ప్రదర్శించింది. తమ వర్సిటీలో చదివే పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వర్తించదని, అందువల్ల వెంటనే ఫీజులు కట్టాలని ఆ యూనివర్సిటీ యాజమాన్యం విద్యార్థులకు మెయిల్స్ పంపింది. ఇది వివాదంగా మారడంతో మంత్రి లోకేశ్ కార్యాలయం స్పందించింది. ఫీజుల పథకం వర్తించదని ఎవరు చెప్పారంటూ ఆ యూనివర్సిటీ యాజమాన్యాన్ని నిలదీసింది. సమస్యపై దృష్టిపెట్టిన ఉన్నత విద్యాశాఖ, ప్రతిసారీ ఫీజులు విడుదల చేసినప్పుడు ఈ సమస్య తలెత్తకుండా ప్రత్యేకంగా జీవో తీసుకురావాలని నిర్ణయించింది. త్వరలోనే ఈ జీవో విడుదల చేస్తారు.

ధాన్యం తడవకుండా చూడండి

▸▸ తడిచి తక్కువ ధరకు అమ్ముకుంటే జేసీలదే బాధ్యత: సీఎస్

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో కోస్తా, రాయలసీమలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లాల్లో అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ కలెక్టర్లను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'వర్షాలకు ముఖ్యంగా ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలి. తుఫాను నేపథ్యంలో రైతుల్ని అప్రమత్తం చేయాలి. ఆర్టీజీఎస్ ద్వారా తుఫాను సమాచారాన్ని సంక్షిప్త సందేశాల ద్వారా తెలియజేయాలి. ధాన్యం తడిసి, తేమ శాతం పెరిగిందనే ఫిర్యాదులు రాకూడదు. ధాన్యం తడిసి తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వచ్చిందనే ఫిర్యాదులు వస్తే సంబంధిత జాయింట్ కలెక్టర్లే బాధ్యత వహించాలి. ధాన్యం కొనుగోలు కేంద్రాలన్నీ వెంటనే ప్రారంభించాలి' అని సీఎస్ పేర్కొన్నారు. సమావేశంలో వర్చువల్‌గా పాల్గొన్న వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ రాజశేఖర్ మాట్లాడుతూ... ఈ సీజన్‌లో 17 లక్షల హెక్టార్లలో వరి సాగవ్వగా 113 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి అంచనా వేసినట్లు చెప్పారు. సీఎం కార్యదర్శి రాజమౌళి మాట్లాడుతూ... 'ధాన్యం కొనుగోలుకు సంబంధించి, కొన్ని అంశాలు సీఎం దృష్టికి వచ్చాయి. మిల్లర్లు సిండికేట్ కాకుండా చూడాలి. వర్షం వస్తే ధాన్యం తడిసిపోతుంది. నిర్దేశిత ధర కన్నా తక్కువకు బయట అమ్ముకునే పరిస్థితులు రాకుండా చూడాలి. రవాణా సౌకర్యంపై చర్యలు తీసుకోవాలి' అని పేర్కొన్నారు.

పరకామణి కేసులో పెద్దల పాత్ర... భూమనే అంగీకరించారు: రవినాయుడు

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పరకామణి కేసులో జగన్ మొదలు చాలా మంది పెద్దల పాత్ర ఉందని, ఈ విషయాన్ని భూమన కరుణాకర్ రెడ్డి పరోక్షంగా అంగీకరించారని శాప్ చైర్మన్ రవి నాయుడు అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'పరకామణి కేసులో అడ్డంగా దొరికిపోతున్నామనే భయంతోనే భూమన లాంటి వారు దొంగ ఏడుపులు ఏడుస్తున్నారు. ఆ కేసు రాజీలో ఆయన పాత్ర లేకుంటే దొంగ ఏడుపులు ఎందుకు?' అని రవి నాయుడు నిలదీశారు.

ఐఆర్ఎస్ కృష్ణకిశోర్‌పై అభియోగాల ఉపసంహరణ

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఐఆర్ఎస్ అధికారి జాస్తి కృష్ణ కిశోర్‌పై గతంలో ఏపీ సీఐడీ నమోదు చేసిన అభియోగాలు ఉపసంహరించుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. 2014-19 సమయంలో కృష్ణకిశోర్ ఏపీ ఆర్థిక అభివృద్ధి మండలి సీఈవోగా పనిచేసినప్పుడు రూ.60 కోట్లకు పైగానే అవినీతికి పాల్పడ్డారంటూ వైసీపీ హయాంలో ఆయనపై సీఐడీ కేసు నమోదు చేసింది. దీంతో జగన్ ప్రభుత్వం ఆయన్ను సస్పెండ్ చేసింది. దీనిపై ఆయన క్యాట్‌ను హైకోర్టును ఆశ్రయించారు. క్యాట్, సస్పెన్షన్ ఉత్తర్వులను రద్దు చేసి, తిరిగి కేంద్ర సర్వీసులకు వెళ్లేందుకు అనుమతివ్వగా... హైకోర్టు కృష్ణకిశోర్‌పై సీఐడీ నమోదు చేసిన కేసును కొట్టేసింది.

'లై డిటెక్టర్' పరీక్షకు సిద్ధం

▸▸ అప్పన్న గతంలో పీఏగా చేశారు.. తర్వాత నాతో లేరు

▸▸ 'పరకామణి' గురించి తెలియదు: వైవీ సుబ్బారెడ్డి

న్యూఢిల్లీ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుమల కల్తీ నెయ్యి వ్యవహారంలో 'లై డిటెక్టర్' పరీక్షకు సిద్ధమని టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. గత పదేళ్లలో నెయ్యి సరఫరాపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. టీటీడీ ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేశానని పేర్కొన్నారు. రాజకీయ స్వార్థం కోసం ఆలయాలపై అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఆలయ ప్రతిష్ఠను పెంచేలా పనిచేశానే తప్ప.. ఏనాడూ ఆలయ పవిత్రతను దెబ్బతీసేలా వ్యవహరించలేదని చెప్పారు. తిరుమల లడ్డూ ప్రసాదంపై ఉద్దేశపూర్వకంగానే విష ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తన తప్పు లేదు కాబట్టే.. సిట్ విచారణకు హాజరై నిజాలు చెప్పానని, చంద్రబాబు ఆరోపణలపై సుప్రీంకోర్టులో కేసు వేశానన్నారు. ఒకవైపు సిట్ దర్యాప్తు, మరోవైపు సుప్రీంకోర్టులో విచారణ జరుగుతుంటే.. కల్తీ నెయ్యి పేరుతో మీడియాలో కథనాలు వస్తుండడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. గత చంద్రబాబు పాలనలో నెయ్యి కొనుగోళ్ల పైనా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పరకామణి విషయంలో ఏం జరిగిందో తనకు తెలియదని సుబ్బారెడ్డి చెప్పుకొచ్చారు. అప్పన్న గతంలో తనవద్ద పీఏగా పనిచేశారని, ఆ తర్వాత అతనితో సంబంధం లేదన్నారు. శుక్రవారం విజయవాడలో సీఐడీ విచారణకు హాజరవుతానని తెలిపారు.

రాజమండ్రి జైలులో ఎయిర్ జెట్ లూమ్

▸▸ జైళ్ల శాఖ ఐజీ శ్రీనివాసరావు

బుక్కరాయసముద్రం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి సెంట్రల్ జైలులో ఖైదీల ఉపాధి, పునరావస కార్యక్రమాలను బలోపేతం చేయడంలో భాగంగా ఎయిర్ జెట్ లూమ్, హ్యాండ్ లూమ్ టెక్స్‌టైల్ పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర జైళ్ల శాఖ ఐజీ ఐ.శ్రీనివాసరావు తెలిపారు. అనంతపురం ఓపెన్ ఎయిర్ జైలును గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. 'రాజమండ్రి మహిళా జైలులో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో గార్మెంట్స్ పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నాం. తమిళనాడులో నూతన టెక్నాలజీతో ఏర్పాటు చేసిన ఎయిర్ జెట్ లూమ్ తరహాలో టెక్స్‌టైల్ పరిశ్రమను రాజమండ్రి సెంట్రల్ జైలులో రూ.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేస్తాం. ప్రస్తుతం పవర్ లూమ్స్ మగ్గాలు జైలులో కొనసాగుతున్నాయి. పవర్‌లూమ్స్‌తో పాటు హ్యాండ్‌లూమ్స్ ఏర్పాటు చేస్తాం. వీటితోపాటు ఏ 4, లీగల్ సైజు పేపర్ తయారీ, తెల్లపేపర్ తయారీ పరిశ్రమను రూ.10 లక్షల వ్యయంతో త్వరలోనే నెలకొల్పుతాం. జైలు బేకరీలో నూతన టెక్నాలజీతో కేక్స్, సాండ్‌విచ్, వెజ్ పఫ్, ఎగ్‌పఫ్, ఓవెన్‌తో నాణ్యమైన స్నాక్స్ తయారు చేసేందుకు ప్రణాళిక రుపొందించాం. దీనికోసం రూ.5 లక్షలు వెచ్చిస్తాం. అనంతపురం జిల్లా ఓపెన్ ఎయిర్ జైలులో వేరుశనగ ప్లాంట్ విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ఈ విస్తరణతో వేరుశనగ ఉత్పత్తుల సామార్థ్యాన్ని పెంచి, జైళ్ల శాఖ ఆదాయాన్ని పెంచుతాం. నూతన ఉపాధి కల్పన కార్యక్రమాలు త్వరలోనే అమలువుతాయి' అని ఐజీ తెలిపారు. సమావేశంలో జైళ్లశాఖ రాయలసీమ డీఐజీ రవికిరణ్ పాల్గొన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

కథ బాగుంటేనే ఆదరిస్తున్నారు

- మంచు మనోజ్



'ఈ రోజు చిన్న సినిమా, పెద్ద సినిమా అని లేదు. కథాంశం బాగున్న చిత్రాలనే ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. అలాంటి చిత్రాలు భాషలకు అతీతంగా దేశవ్యాప్తంగా ఆడుతున్నాయి. 'వానర' టీజర్ బాగుంది. అవినాశ్ కష్టపడి తీస్తోన్న ఈ సినిమా విజయవంతం కావాలి' అని ఆకాంక్షించారు హీరో మంచు మనోజ్. అవినాశ్ తిరువీధుల కథానాయకుడిగా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తోన్న చిత్రం 'వానర'. సిమ్రాన్ చౌదరి హీరోయిన్. శంతను పత్తి సమర్పణలో అవినాశ్ బుయానీ, ఆలపాటి రాజా, సి.అంకిత్‌రెడ్డి నిర్మిస్తున్నారు. గురువారం నిర్వహించిన వేడుకలో టీజర్‌ను మంచు మనోజ్ విడుదల చేశారు. అవినాశ్ తిరువీధుల మాట్లాడుతూ 'విష్వక్సేన్ గారు వాయిస్ ఓవర్ ఇచ్చారు. సినిమాను త్వరలో విడుదల చేస్తాం' అని అన్నారు.

జాతిరత్నం నోట మాస్ గీతం



ఇప్పటికే పలువురు టాలీవుడ్ హీరోలు తమ సినిమాల్లోని పాటలను పాడుకొని గాయకులుగానూ అభిమానులను ఎంటర్‌టైనర్ చేశారు. తాజాగా ఈ జాబితాలో నవీన్ పొలిశెట్టి చేరారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'అనగనగా ఒకరాజు'. మారి దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం నుంచి తొలి గీతాన్ని యూనిట్ విడుదల చేసింది. 'భీమవరం బల్మా' అంటూ సాగే ఈ గీతాన్ని గాయని నూతన మోహన్‌తో కలసి హీరో నవీన్ పొలిశెట్టి స్వయంగా పాడడం విశేషం. గాయకుడిగా తన తొలి ప్రయత్నంలోనే ఆయన ఆకట్టుకున్నారు. అలాగే ఈ మాస్ గీతంలో కథానాయిక మీనాక్షి చౌదరితో కలసి ఆయన వేసిన స్టెప్పులూ అలరించాయి. ఈ గీతానికి చంద్రబోస్ సాహిత్యం అందించగా, మిక్కీ జే మేయర్ స్వరాలు సమకూర్చారు. సినిమాటోగ్రఫీ: జే యువరాజ్

అందర్నీ ఆకట్టుకునేలా...



'మత్తు వదలరా' ఫేమ్ నరేశ్ అగస్త్య హీరోగా చైతన్య గండికోట దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. జీనీ ప్రొడక్షన్స్ బేనర్‌పై డా.ఎమ్ రాజేంద్ర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రేయ రుక్మిణి హీరోయిన్ గురువారం ఈ సినిమాను ప్రారంభించారు. హీరో శ్రీవిష్ణు క్లాప్ కొట్టారు. నటుడు రఘుబాబు కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు బీ గోపాల్ ముహూర్తపు సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా అగస్త్య మాట్లాడుతూ 'ఈ చిత్రం అద్భుతమైన కథాకథనాలతో సాగుతుంది. హృదయానికి హత్తుకునే భావోద్వేగాలు, వినోదంతో నిండిఉండే ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులనూ ఆకట్టుకుంటుంది' అని అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: కోటగిరి వేంకటేశ్వర రావు, డీఓపీ: విద్యాసాగర్ చింతా, సంగీతం: మిక్కీ జే మేయర్.



టాలీవుడ్ గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ ఓ ఇంటివాడయ్యారు. ప్రేయసి హరిణ్యరెడ్డితో ఆయన వివాహం గురువారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి రిసెప్షన్ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.



జయకృష్ణ 'శ్రీనివాస మంగాపురం'



సూపర్ స్టార్ కృష్ణ మనవడు, దివంగత రమేశ్ బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా అజయ్ భూపతి దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును వైజయంతీ మూవీస్ అశ్వనీదత్ సమర్పణలో చందమామ కథలు బేనర్‌పై పి. కిరణ్ నిర్మిస్తున్నారు. గురువారం ఈ సినిమా టైటిల్‌ను ప్రీ లుక్ పోస్టర్ ద్వారా మేకర్స్ ఆవిష్కరించారు. ఈ చిత్రానికి 'శ్రీనివాస మంగాపురం' అనే పేరు పెట్టారు. పోస్టర్‌లో హీరో చేతులు, అతని ప్రేమికురాలి చేతులు ఒక రస్టిక్ గన్ పట్టుకొని ఉండటం ఆసక్తిగా ఉంది. కథలో రొమాన్స్, భారీ యాక్షన్‌ని ఈ పోస్టర్ సూచిస్తోంది. కాగా, ఈ చిత్రంలో బాలీవుడ్ నటి రాషా తడాని కథానాయికగా నటిస్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

ట్రెండ్‌కు తగ్గ సినిమా

-రఘురామకృష్ణ రాజు



'మరువ తరమా' సినిమా విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. ప్రస్తుత ట్రెండ్‌కు తగ్గ కథ. యూత్‌తో పాటూ కుటుంబ ప్రేక్షకులనూ ఆకట్టుకుంటుంది. ఈ చిత్రం ఘనవిజయం సాధించాలి' అని ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు ఆకాంక్షించారు. హరీశ్ ధనుంజయ, అవంతిక ప్రధాన పాత్రధారులుగా చైతన్య వర్మ నడింపల్లి తెరకెక్కించిన చిత్రం 'మరువ తరమా'. నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకు ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు, హీరో నారా రోహిత్, శ్రీవిష్ణు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో నారా రోహిత్ మాట్లాడుతూ 'కంటెంట్ ఫ్రెష్‌గా అనిపిస్తోంది. మంచి సినిమాను ప్రేక్షకులు కచ్చితంగా ఆదరిస్తారు. ఈ చిత్రం కూడా అలాంటిదే' అని చెప్పారు. 'ఈ చిత్రంలోని మాటలు కూడా పాటల్లాగా ఉంటాయి. సినిమా అందరికీ నచ్చుతుంది' అని హీరో శ్రీవిష్ణు తెలిపారు.





విద్యుత్తు ప్రాజెక్టు పనులు వేగవంతం



» పారిశ్రామికాభివృద్ధికి బాసటగా చర్యలు

» విద్యుత్ సమీక్షలో మంత్రి గొట్టిపాటి ఆదేశాలు

అమరావతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెద్ద ఎత్తున జరుగుతున్న పారిశ్రామికాభివృద్ధికి బాసటగా విద్యుత్తు శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రాజెక్టులను వేగవంతం చేయాలని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కోరారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన ట్రాన్స్‌కో, ఏపీఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. కొత్త పరిశ్రమల స్థాపన, తయారీ యూనిట్ల విస్తరణ, పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధి శరవేగంగా జరుగుతున్న నేపథ్యంలో పెరుగుతున్న డిమాండ్, భవిష్యత్తు విద్యుత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తు విద్యుత్తు లోడ్‌ను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన, నిరంతర విద్యుత్తు సరఫరా చేసేందుకు విద్యుత్తు సంస్థలు సిద్ధం కావాలని సూచించారు. ఈ ప్రక్రియలో ఏ విధమైన ఆటంకాలు లేకుండా ఉండేందుకు 132 కేవీ, 220 కేవీ, 400 కేవీ సామర్థ్యాలతో 29 కొత్త సబ్‌స్టేషన్లను నెలకొల్పాలని నిర్ణయించామని అధికారులకు తెలిపారు. గృహ, వ్యవసాయ వినియోగదారులకు అందించే సేవలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, వీటి కనెక్షన్ల విషయంలో ఫిర్యాదుల్లేకుండా చూడాలన్నారు.

మార్చి నాటికి గుంతల్లేని రోడ్లు

» వైసీపీ నిర్లక్ష్యం వల్ల రూ.20వేల కోట్ల భారం

» ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి వెల్లడి

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): టీడీపీ హయాంలో 2014-19 మధ్య ఆర్‌అండ్‌బీని అగ్రభాగాన నిలబెడితే, జగన్ ప్రభుత్వం రహదారులను నిర్లక్ష్యం చేసి ఆ శాఖపై రూ.20 వేల కోట్ల భారాన్ని మోపి వెళ్లిందని ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వచ్చే మార్చికి రాష్ట్రంలో గుంతల్లేని రహదారులను తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకుని తమ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. జగన్ ప్రభుత్వం కనీసం గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు కూడా చేయలేదన్నారు. జగన్ హయాంలో రోడ్లకు మరమ్మతులు లేని ఫలితంగా 15 వేల కిలోమీటర్ల రహదారులు ఎందుకూ పనికిరాకుండా పోయాయన్నారు. '2014-19 మధ్య రూ.36 వేల కోట్ల విలువైన 5 జాతీయ రహదారుల నిర్మాణ పనులు ప్రారంభించాం. వైసీపీ వచ్చాక వాటిని రద్దు చేసింది. సుమారు 30వేల కిలోమీటర్ల రహదారులను నిర్లక్ష్యం చేశారు' అని జనార్దన్ రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం రహదారుల నిర్మాణానికి పెద్దపీట వేస్తోందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 22వేల కిలోమీటర్ల గుంతల రహదారులను రూ.1,061 కోట్లతో మరమ్మతులు చేశామన్నారు. వర్షాల వల్ల చాలా రోడ్లు దెబ్బతిన్నాయని, వాటికీ మరమ్మతులు చేస్తున్నామని, త్వరలో పీపీపీ రోడ్లకు టెండర్లు పిలవనున్నామని మంత్రి తెలిపారు. మొంథా తుఫాను వల్ల ఆర్‌అండ్‌బీ శాఖపై పెనుభారం పడిందని, 4,794 కిలోమీటర్ల రహదారులు ధ్వంసం అయ్యాయని, శాఖపై రూ.2,774 కోట్ల భారం పడిందని తెలిపారు. రాష్ట్రాభివృద్ధిలో కీలకమైన పోర్టుల నిర్మాణం వచ్చే ఏడాదికి పూర్తి చేస్తామన్నారు.

రోడ్లకు మరో రూ.276.58 కోట్లు

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రహదారులపై గుంతలు పూడ్చేందుకు ప్రభుత్వం రూ.276.58 కోట్ల విడుదలకు పరిపాలనా అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ఆర్‌అండ్‌బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రహదారులపై గుంతలు పూడ్చడం, ఇతర పనుల కోసం సెప్టెంబరులో ప్రభుత్వం అదనంగా రూ.500 కోట్లు కేటాయించిన సంగతి తెలిసిందే. అందులో నుంచే రూ.276.58 కోట్ల విడుదలకు తాజాగా పరిపాలనా అనుమతి ఇచ్చింది. ఎన్‌డీబీ జాబితా నుంచి తొలగించిన రోడ్లు, ఇంకా జిల్లా ప్రధాన రహదారులపై గుంతలు పూడ్చేందుకు ఈ నిధులు ఉపయోగించనున్నారు.

ఈహెచ్‌ఎస్‌పై సీఎస్ నేతృత్వంలో కమిటీ

» 8 వారాల్లో నివేదిక ఇవ్వాలని సూచన

అమరావతి, విజయవాడ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులు, వారి కుటుంబ సభ్యుల ప్రయోజనం కోసం అమలవుతున్న ఎంప్లాయిస్ హెల్త్ కార్డ్స్ స్కీమ్ నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు, లోపాలను గుర్తించి పరిష్కార మార్గాలను సూచించడానికి ప్రభుత్వం ఏడుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. ఈహెచ్‌ఎస్ అమలులో వచ్చిన సమస్యలపై గత నెలలో ఉద్యోగ సంఘాలకు, సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ గురువారం కమిటీ ఏర్పాటుకు ఆమోదించారు. కమిటీకి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ నేతృత్వం వహిస్తారు. ఆయనతో పాటు కమిటీలో జీఏడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ కార్యదర్శి, ఆరోగ్య శాఖ కార్యదర్శి ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సీఈవో, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఉండనున్నారు. ఈహెచ్‌ఎస్ పథకంలో మొత్తం 23.58 లక్షల మంది లబ్ధిదారులున్నారు. లబ్ధిదారుల అనుభవాలు, సమస్యలు, లోపాలను క్షుణ్ణంగా పరిశీలించి, వాటి పరిష్కార మార్గాలపై 8 వారాల్లో నివేదిక సమర్పించాలని కమిటీకి మంత్రి సత్యకుమార్ సూచించారు.

ఏపీఎన్జీజీవో హర్షం

ఉద్యోగుల హెల్త్ కార్డు వ్యవస్థ ప్రక్షాళన కోసం ఉద్యోగ సంఘాల సమావేశంలో సీఎం ఇచ్చిన హామీ ప్రకారం కమిటీని ఏర్పాటు చేయడంపై ఏపీ ఎన్జీజీవో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డి.వి.రమణ హర్షం వ్యక్తం చేశారు. గురువారం వారు మీడియాతో మాట్లాడుతూ సుమారు 24 లక్షల మంది ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులకు హెల్త్ కార్డుల సేవలు అందడం లేదనే విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. బిల్లుల పరిశీలన విషయంలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. ఉద్యోగుల వైద్య సేవల పరిమితిని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పెంచాలని ఉద్యోగులు కోరుతున్నారని తెలిపారు. ఉద్యోగుల హెల్త్ స్కీం మొత్తాన్ని ఇన్సూరెన్స్‌లోకి తీసుకురావడంపై కమిటీ దృష్టి సారించాలని కోరారు. రిటైరైన సీపీఎస్ ఉద్యోగులకు హెల్త్ కార్డులు అందజేయాలన్నారు. ఉద్యోగుల జీతాల నుంచి మినహాయిస్తున్న సొమ్మును నేరుగా హెల్త్ ట్రస్ట్‌కు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

డిసెంబరు 5న మెగా పీటీఎం

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మెగా పేరెంట్ - టీచర్స్ సమావేశాన్ని డిసెంబరు 5న నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. గతేడాది మొదటిసారి మెగా పీటీఎం జరిగింది. ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలో రెండో మెగా పీటీఎం నిర్వహించగా, ఇప్పుడు మూడో పీటీఎం జరగనుంది. రాష్ట్రంలోని జూనియర్ కాలేజీలతో పాటు సుమారు 45 వేల ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో మెగా పీటీఎం నిర్వహిస్తారు. మెగా పీటీఎం నిర్వహణపై పాఠశాల విద్యాశాఖ షెడ్యూలు జారీ చేసింది. అన్ని తరగతుల విద్యార్థులకు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు అందజేస్తారు. వాటిని తల్లిదండ్రులకు క్లాస్ టీచర్ చూపించి వ్యక్తిగతంగా వారితో మాట్లాడతారు. ఈసారి కూడా మెగా పీటీఎంలో దాతలు, పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేస్తున్నారు. మంత్రి లోకేశ్ పార్వతీపురం మన్యంలో మెగా పీటీఎంలో పాల్గొంటారు.

పంచాయతీల పునర్వ్యవస్థీకరణపై నిషేధం ఎత్తివేత

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రామ పంచాయతీల పునర్వ్యవస్థీకరణ, విభజన ప్రక్రియపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకు గ్రామ పంచాయతీల సర్పంచులు, వార్డు సభ్యుల పదవీ కాలం ముగియనుంది. ఇక గ్రామ పంచాయతీ ఎన్నికల నగారా మోగించనున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీల పునర్వ్యవస్థీకరణ, విభజన చేపట్టాల్సి ఉంది. ఎన్నికలు జరిగేలోపు ఈ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. పలు జిల్లాల్లో పంచాయతీల విభజన, విలీనం, పునర్వ్యవస్థీకరణ కోసం దరఖాస్తు చేసుకున్నారు. చాలా జిల్లాల్లో ఈ ప్రక్రియ మొదలైంది. ఈ ప్రక్రియ పూర్తికి పునర్వ్యవస్థీకరణ, విభజనపై ఉన్న నిషేధం ఎత్తేయాల్సిన నేపథ్యంలో ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఆర్థిక హబ్ అమరావతి

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించనున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం ఉదయం 11.22 గంటలకు ఈ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తదితరులు కూడా పాల్గొంటారు. ఈ 15 ఆర్థిక సంస్థల కార్యాలయాల ఏర్పాటు ద్వారా రూ.1,328 కోట్ల పెట్టుబడులు రాజధాని అమరావతికి రానున్నాయని, 6,514 ఉద్యోగాల కల్పన జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీసీఆర్డీఏ) తెలిపింది. ఈ బ్యాంకు కార్యాలయాలు ఉద్దండరాయునిపాలెం, వెలగపూడి, రాయపూడి, లింగాయపాలెం పరిధిలో కొలువుదీరనున్నాయి.

చకచకా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఏర్పాటు

అమరావతిలో ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఏర్పాటు ప్రక్రియను సీఆర్డీఏ వేగవంతం చేసింది. పలు ప్రభుత్వ బ్యాంకులు, ఇన్సూరెన్స్, ఇన్‌కంట్యాక్స్ వంటి పలు ప్రభుత్వ అనుబంధ ఆర్థిక కార్యాలయాలు ఇక్కడకు రానున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆయా సంస్థల కార్యాలయాలు, ఉద్యోగుల నివాసాలకు అవసరమైన స్థలాల కేటాయింపుపై సీఆర్డీఏ దృష్టిపెట్టి చకచకా స్థలకేటాయింపును పూర్తి చేసింది.

కార్యాలయాలు, సిబ్బంది వసతికి స్థలం

ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు స్థలాలను కార్యాలయాలు, సిబ్బంది వసతి, అనుబంధ సంస్థలు అనే మూడు విభాగాలుగా కేటాయించారు. బ్యాంకులు, కార్యాలయాల భవనాల నిర్మాణం కోసం 9.695 ఎకరాలను ఇచ్చారు. ఎస్‌బీఐ, కెనరా బ్యాంకు, నాబార్డు, యూనియన్ బ్యాంకు సహా 12 బ్యాంకులు ఈ స్థలంలో తమ కార్యాలయాలను నిర్మించుకోనున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ), లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ), ఆదాయపు పన్నుశాఖ వంటి కీలకమైన సంస్థల కోసం 5.80 ఎకరాలు కేటాయించారు. సిబ్బంది వసతి, సంస్థాగత టౌన్‌షిప్ అభివృద్ధికి వీలుగా నివాస స్థలాలకు 7.02 ఎకరాలు, అనుబంధ సంస్థల ఉద్యోగుల నివాసాలకు 4.54 ఎకరాలు, మొత్తంగా 11.56 ఎకరాలు నివాసస్థలాలను కేటాయించారు. మొత్తంగా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఏర్పాటులో భాగంగా అమరావతిలో 27.855 ఎకరాల స్థలం కేటాయించారు.



సీఎంతో నిర్మలా సీతారామన్ మర్యాదపూర్వక భేటీ

రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ సీఎం చంద్రబాబుతో గురువారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా డిన్నర్‌కు సీఎం ఆహ్వానించడంతో ఉండవల్లిలోని సీఎం నివాసానికి వచ్చిన నిర్మలా సీతారామన్‌కు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌తో పాటు నారా భువనేశ్వరి, నారా బ్రాహ్మణి స్వాగతం పలికారు.

పోలవరానికి ఆర్థిక సాయం అందించండి

» నేడు నిర్మలా సీతారామన్‌ను కోరనున్న సీఎం చంద్రబాబు

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పోలవరం సాగునీటి ప్రాజెక్టుకు, అలాగే పోలవరం-నల్లమలసాగర్ అనుసంధాన పథకానికి ఆర్థిక సహకారం అందించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు కోరనున్నారు. రాజధానిలో ఆర్థిక సంస్థల శంకుస్థాపన కార్యక్రమం అనంతరం కేంద్ర మంత్రి వెలగపూడి సచివాలయానికి వస్తారు. ఈ సందర్భంగా ఆమెతో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఇతర మంత్రులతో కలసి ముఖ్యమంత్రి సమావేశమవుతారు. ఈ సమావేశంలో పోలవరం ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ ను పూర్తి చేసేందుకు, పునరావాస కార్యక్రమాలకు అడ్వాన్సుగా నిధులు మంజూరు చేయాలని కోరనున్నారు. పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టు ప్రాథమిక అంచనా వ్యయం రూ.58,700 కోట్లుగా పేర్కొన్నారు. ఈప్రాజెక్టు డీపీఆర్ తయారీకి గురువారం పత్రికా ప్రకటన ఇచ్చారు.

బ్యాంకులు, ఆర్థిక సంస్థల నిర్మాణాల వివరాలు ఇలా..

- ఉద్దండరాయునిపాలెంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు రూ. 256 కోట్లతో భవనాలు నిర్మిస్తుంది. ఈ కార్యాలయంలో 1,000 మందికి ఉపాధి రానుంది.
- వెలగపూడి, ఉద్దండరాయునిపాలెంలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ. 40 కోట్లతో నిర్మించే కార్యాలయంలో 300 ఉద్యోగాలు కల్పిస్తుంది.
- రాయపూడిలో ఏపీ సహకార బ్యాంక్ (ఆప్కాబ్) రూ. 200 కోట్లతో నిర్మించే కార్యాలయంలో 400 మందికి ఉద్యోగాలు లభిస్తాయి.
- ఉద్దండరాయునిపాలెంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ. 40 కోట్లతో కార్యాలయం నిర్మిస్తుంది. 200 మందికి ఉద్యోగాలు కల్పించనుంది.
- ఉద్దండరాయునిపాలెంలో కెనరా బ్యాంక్ రూ. 50 కోట్లతో భవనాలు నిర్మించి 300 ఉద్యోగాలు ఇస్తుంది.
- లింగాయపాలెం, ఉద్దండరాయునిపాలెంలో ఎస్‌బీఐ రూ. 300 కోట్లతో భవనాన్ని నిర్మిస్తుంది. 2 వేల ఉద్యోగాలు కల్పిస్తుంది.
- ఉద్దండరాయునిపాలెంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ. 50 కోట్లతో కార్యాలయం నిర్మించి 160 ఉద్యోగాలు ఇస్తుంది.
- బ్యాంక్ ఆఫ్ బరోడా ఉద్దండరాయునిపాలెంలో రూ. 60 కోట్లతో భవనాన్ని నిర్మిస్తుంది. 300 ఉద్యోగాలు కల్పిస్తుంది.
- ఉద్దండరాయునిపాలెంలో ఇండియన్ బ్యాంక్ రూ. 40 కోట్లతో కార్యాలయం నిర్మించి 105 ఉద్యోగాలు ఇస్తుంది.
- నాబార్డ్ ఉద్దండరాయునిపాలెంలో 90 కోట్లతో కార్యాలయం నిర్మిస్తుంది. 160 మంది ఇక్కడ కొలువులు చేయనున్నారు.
- ఉద్దండరాయునిపాలెంలో కార్యాలయాలు నిర్మించే వాటిలో.. పంజాబ్ నేషనల్ బ్యాంక్ రూ. 15 కోట్లతో 150 ఉద్యోగాలు, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ రూ. 10 కోట్లతో 100 ఉద్యోగాలు, ఐడీబీఐ బ్యాంక్ రూ. 50 కోట్లతో 215 మందికి ఉద్యోగాలు, ఎల్ఐసీ రూ. 22 కోట్లతో 1,036 ఉద్యోగాలు, న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ రూ. 93 కోట్లతో 150 ఉద్యోగాలు కల్పించనున్నాయని సీఆర్డీఏ తెలిపింది.

ఎస్సీలకు పదోన్నతుల్లో వర్గీకరణ

జీవో జారీ చేసిన ప్రభుత్వం

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉద్యోగులకు పదోన్నతుల్లో వర్గీకరణ అమలుకు ప్రభుత్వం గురువారం జీవో జారీ చేసింది. గతంలో ఎస్సీలకు 15 శాతం రిజర్వేషన్ ఉమ్మడిగా అమలు చేయగా కూటమి ప్రభుత్వం ఎస్సీల్లోని ఉపకులాలన్నింటికీ రిజర్వేషన్ ఫలాలు సమానంగా అందేలా మూడు గ్రూపులుగా విభజించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ 3 గ్రూపులకు పదోన్నతుల్లో రిజర్వేషన్ వాటాలను నిర్ణయిస్తూ ఆదేశాలు జారీ చేసింది. గ్రూప్ -1 కింద రెల్లి కులాలను పొందుపరిచి 1 శాతం రిజర్వేషన్, గ్రూప్ -2 కింద మాదిగ ఉపకులాలను చేర్చి 6.5 శాతం రిజర్వేషన్, గ్రూప్ - 3 కింద మాల ఉపకులాలను చేర్చి 7.5 శాతం రిజర్వేషన్ వర్తింపజేయాలని జీవోలో పేర్కొన్నారు. కేడర్ స్ట్రెంత్ 5 కంటే ఎక్కువ ఉన్న చోట్ల ఈ రిజర్వేషన్లు వర్తింపజేయాలి. ప్రతి గ్రూప్‌లోనూ మహిళా ఉద్యోగులకు 33.33 శాతం సమాంతర రిజర్వేషన్ అమలు చేయాలని తెలిపారు. ఏదైనా గ్రూప్‌నకు చెందిన అర్హత గల అభ్యర్థులు అందుబాటులో లేకపోతే ఆ ఖాళీని తదుపరి సంవత్సరానికి తరలించాలి. రెండో ఏడాది కూడా అభ్యర్థి అందుబాటులో లేకపోతే ఆ ఖాళీని తరువాతి గ్రూప్‌నకు ఇవ్వాలి. అప్పుడు కూడా ఎవరూ అందుబాటులో లేకపోతే ఫీడర్ కేటగిరీలోని మెరిట్ కమ్ సీనియారిటీ ఆధారంగా నియామకం జరగాలి. ఈ విధంగా నియమించిన ఖాళీలు తర్వాతి సంవత్సరంలో మొదటగా రిజర్వ్ చేస్తారు. ప్రతి కేడర్‌లోనూ ఎస్సీ కేటగిరీలు 1, 2, 3లకు వేర్వేరుగా ప్రాతినిధ్యం లెక్కించాలి. మొత్తం ఎస్సీల ప్రాతినిధ్యం 15 శాతానికి మించరాదు. దీనికి అనుగుణంగా ఏపీస్టేట్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్ 1996కి అవసరమైన సవరణలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అన్ని శాఖలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ రంగంలోని కార్పొరేషన్లు, సొసైటీలు, యూనివర్సిటీలు ఇందుకు అనుగుణంగా సవరణలు చేసుకోవాలని ఆదేశించింది. 2025 ఏప్రిల్ 18 నుంచే అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. అంతకు ముందు సిద్ధం చేసిన పదోన్నతుల ప్యానెల్స్ యథాతథంగా కొనసాగించాలన్నారు.

నేడు క్యాబినెట్ భేటీ

» రిలయన్స్ డేటా సెంటర్ సహా పలు ప్రాజెక్టులకు ఆమోదం!

అమరావతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గ సమావేశం సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరగనుంది. శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఇది ప్రారంభమవుతుంది. విశాఖపట్నంలో రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్‌తోపాటు ఎస్ఐపీబీలో ఆమోదం పొందిన పలు ప్రాజెక్టులకు ఆమోదం తెలపనుంది. విశాఖలో పెట్టుబడుల సదస్సు తర్వాత జరుగుతున్న మొదటి క్యాబినెట్ సమావేశం కావడంతో మంత్రులందరికీ సదస్సులో కుదిరిన ఒప్పంద వివరాలను సీఎం మరోసారి వివరించే అవకాశం ఉంది.

ఇష్టం.. కొంచెం కష్టం

(మొదటి పేజీ తరువాయి)

కనిగిరి రెవెన్యూ డివిజన్‌లో కలపడంపై అభ్యంతరం వ్యక్తమవుతోంది. సుదూరంగా ఉండటమే గాక రవాణాకు అనుకూలత లేని కనిగిరిలో కలపడాన్ని తప్పుబడుతున్నారు. కనిగిరి డివిజన్ నుంచి తప్పించి గిద్దలూరు డివిజన్ ఏర్పాటు చేయాలని, సాధ్యం కాకపోతే మార్కాపురం డివిజన్‌లోనే ఉంచాలని ఆ ప్రాంత ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

నెల్లూరుకు దూరంగా..

తిరుపతి జిల్లా పునర్విభజన మార్పులకు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో విలీనం చేస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు, లోకేశ్ హామీ ఇచ్చారు. ఇపుడా హామీని నెరవేర్చకపోవడం పట్ల టీడీపీ శ్రేణులు సైతం తీవ్ర నిరాశ చెందుతున్నాయి. తొలినుంచీ నియోజకవర్గం నెల్లూరు జిల్లాలో కొనసాగినందున విద్య, వైద్యం, వ్యాపార సంబంధాలు ఎక్కువ. ప్రత్యేక అనుబంధం ఉంది. గూడూరు నుంచి నెల్లూరు 36 కి.మీ. కాగా తిరుపతి 110 కి.మీ. ఎలా చూసినా తిరుపతి జిల్లాలో కొనసాగడం అసౌకర్యంగా ఉందని నియోజకవర్గ ప్రజలు అంటున్నారు. వెంకటగిరి నియోజకవర్గంలో ఆరు మండలాలు ఉండగా.. కలువాయి, సైదాపురం, రాపూరు మండలాలు నెల్లూరు జిల్లాలోనూ, వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాలు తిరుపతి జిల్లాలో ఉన్నాయి. తాజాగా ప్రభుత్వం నెల్లూరు పరిధిలోని కలువాయి, సైదాపురం, రాపూరు మండలాలను తిరుపతి జిల్లాలోని గూడూరు రెవిన్యూ డివిజన్ పరిధిలోకి చేర్చేలా నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయాన్ని ఆ మూడు మండలాల ప్రజలూ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కలువాయి నుంచి నెల్లూరుకు 70 కి.మీ. కాగా గూడూరు 80 కి.మీ. ఇక జిల్లా కేంద్రమైన తిరుపతి ఏకంగా 160 కి.మీ. దూరంలో ఉంది. అలాగే రాపూరు నుంచి నెల్లూరు 60 కి.మీ. అయితే తిరుపతి 90 కి.మీ. సైదాపురం నుంచి నెల్లూరు 50 కి.మీ. ఉంటే తిరుపతి ఏకంగా 130 కి.మీ. దూరంలో ఉంది. ఈ 3 మండలాలనూ నెల్లూరులోనే కొనసాగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

కడపలోనే కొనసాగించండి

కడప జిల్లా, కడప రెవెన్యూ డివిజనులో ఉన్న సిద్దవటం, ఒంటిమిట్ట మండలాలను రాజంపేట రెవెన్యూ డివిజను, అన్నమయ్య జిల్లాలో చేర్చడాన్ని ఆ రెండు మండలాల ప్రజలు ఇష్టపడటం లేదు. సిద్దవటం మండలం కడపకు కూతవేటు దూరంలో ఉంది. మండల కేంద్రం కడపకు 22 కి.మీ. దూరంలోనే ఉంది. అన్నమయ్య జిల్లాలో చేర్చడంతో ఆ జిల్లా కేంద్రం రాయచోటికి పోవాలంటే కడపకు వచ్చి రెండు బస్సులు మారాలి. వంద కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంది. రెవెన్యూ డివిజన్ కేంద్రం రాజంపేటకు వెళ్లాలన్నా 45 కి.మీ. ప్రయాణించాలి. అలాగే ఒంటిమిట్టను అన్నమయ్య జిల్లాలో చేర్చడాన్ని కడప జిల్లా వాసులు అంగీకరించడం లేదు. రాష్ట్ర విభజన తరువాత ఒంటిమిట్ట ఆంధ్రా భద్రాద్రిగా పేరుగాంచింది. ఏటా ప్రభుత్వ లాంఛనాలతో శ్రీరాముని కల్యాణం నిర్వహిస్తున్నారు. కడప జిల్లావాసులకు ఒంటిమిట్టతో విడదీయరాని బంధం ఉంది. ఇప్పుడు ఒంటిమిట్టను అన్నమయ్య జిల్లాలో చేర్చడాన్ని ఇష్టపడటం లేదు. ఒంటిమిట్ట మండల కేంద్రం నుంచి కడపకు 25 కి.మీ. ఉంది. అన్నమయ్య జిల్లాకు మార్చడంతో రాయచోటికి పోవాలంటే 90 కి.మీ ప్రయాణించాలి. రెండు బస్సులు మారాలి. సిద్దవటం, ఒంటిమిట్టలను కడప జిల్లాలోనే కొనసాగించాలని స్థానికులు కోరుతున్నారు.

జనాభా 2.5లక్షలు ఉంది. ఈ పట్టణానికి కర్ణాటక సరిహద్దుగా ఉంది. తమిళనాడు సరిహద్దు కూడా చాలా దగ్గరలో ఉంది. దీనివల్ల ఈ ప్రాంతం వ్యాపార, వాణిజ్య రంగాల్లో వృద్ధి చెందడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. పరిశ్రమలకూ అనుకూల వాతావరణం ఉంది. బెంగళూరు వంద కిలోమీటర్ల లోపే ఉండటం మదనపల్లెకు కలిసొచ్చే అంశం. ప్రస్తుత ప్రతిపాదిత జిల్లాలోని నియోజకవర్గాలన్నీ.. జిల్లా కేంద్రానికి 35 కి.మీ. నుంచి 50 కి.మీ. దూరంలోనే ఉన్నాయి. దీంతో జిల్లా కేంద్రానికి వివిధ పనుల మీద వచ్చే ప్రజలకు అనుకూలంగా ఉండనుంది.

ఎన్టీఆర్ జిల్లాలో కలపాలి

గ్రేటర్ విజయవాడ విలీన ప్రతిపాదిత జాబితాలో ఉన్న కృష్ణా జిల్లా పరిధిలోని గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాలను ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేయకపోవటంపై ప్రజలలో అసంతృప్తి వ్యక్తం అవుతోంది. ఉమ్మడి కృష్ణా జిల్లాగా ఉన్నపుడు 2016-17లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో గన్నవరం, పెనమలూరు, మైలవరం నియోజకవర్గాల పరిధిలోని 43 గ్రామ పంచాయతీలను గ్రేటర్ విజయవాడ పరిధిలోకి తీసుకురావటానికి ప్రతిపాదనలు చేశారు. ప్రస్తుతం విజయవాడ ఎన్టీఆర్ జిల్లా కేంద్రంగా ఉంది. ఎన్టీఆర్ జిల్లాలో మైలవరం నియోజకవర్గం మాత్రమే ఉంది. గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాలు కృష్ణా జిల్లాలో ఉన్నాయి. గన్నవరం నియోజకవర్గంలోని విజయవాడ రూరల్ మండలం ఎన్టీఆర్ జిల్లాలో ఉండగా.. మిగిలిన గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు మండలాలు కృష్ణా జిల్లాలో ఉన్నాయి. పెనమలూరు నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలో కలిపారు. పెనమలూరు పరిధిలోని పెనమలూరు, కంకిపాడు మండలాలలోని గ్రామాలు గ్రేటర్ విజయవాడ విలీన ప్రతిపాదిత జాబితాలో ఉన్నాయి. గ్రేటర్‌లో విలీనం కావని తెలిసినా.. ఎన్టీఆర్ జిల్లాలో కలవకపోయినా.. ఈ ప్రాంతాల అభివృద్ధిపై ప్రభావం చూపించే అవకాశాలు ఉన్నాయి. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, కేసరపల్లి వంటి ప్రాంతాలు కూడా అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నాయి. ఈ ప్రాంతాలను ఎన్టీఆర్ జిల్లాలో కలపకపోతే అభివృద్ధి ఆగిపోతుందని ప్రజలు భావిస్తున్నారు.

నెరవేరిన ఏళ్లనాటి కల

మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె, పుంగనూరు నియోజకవర్గాలను కలిపి మదనపల్లె జిల్లా ఏర్పాటు పట్ల స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల నాటి కల నేరవేరిందని అంటున్నారు. మదనపల్లె కేంద్రంగా అటు తంబళ్లపల్లె, ఇటు పీలేరు, పుంగనూరు ప్రాంతాలు కూడా మరింత అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఉంటుంది. మదనపల్లె పట్టణంలో

ఒకే నియోజకవర్గం పరిధిలోకి..

పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లో ఉన్న గోరంట్లను పెనుకొండ రెవెన్యూ డివిజన్‌లోకి, కదిరి డివిజన్‌లో ఉన్న అమడగూరును పుట్టపర్తి డివిజన్‌లోకి కలిపారు. తద్వారా ఒక నియోజకవర్గంలోని అన్ని మండలాలు ఒకే రెవెన్యూ డివిజన్‌లోకి చేరాయి.

మడకశిర ప్రజల ఆకాంక్ష.. రెవెన్యూ డివిజన్

కర్ణాటక సరిహద్దులో ఉన్న వెనుకబడిన ప్రాంతం మడకశిర నియోజకవర్గం. శ్రీసత్యసాయి జిల్లాలోని ఈ నియోజకవర్గాన్ని ప్రత్యేక రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలన్న ప్రజల ఆకాంక్ష నెరవేరింది. పెనుకొండ రెవెన్యూ డివిజన్ నుంచి విడిపోయి.. అగళి, అమరాపురం, గుడిబండ, రొళ్ల, మడకశిర మండలాలతో ప్రత్యేక రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు కానుంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటికే మడకశిరలో రక్షణ రంగానికి చెందిన మందుగుండు సామగ్రి తయారీ కంపెనీ ఏర్పాటుకు అనుమతులిచ్చారు. కల్లుమర్రి సమీపంలో రూ.7,500 కోట్లతో సోలార్ పార్క్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. తాజాగా రెవెన్యూ డివిజన్‌కు ఆమోదం తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకునే అవకాశం ఉంది.



పర్యాటక శాఖతో చేసుకున్న ఒప్పంద పత్రాలతో సీఎం చంద్రబాబును కలిసిన రాపిడో సంస్థ ప్రతినిధులు, చిత్రంలో మంత్రి దుర్గేశ్, అధికారులు

రాష్ట్రంలో 'డ్రైవర్ కం గైడ్'

దేశంలోనే తొలిసారిగా అమలు

» రాపిడోతో పర్యాటక శాఖ ఒప్పందం: మంత్రి దుర్గేశ్

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఏపీకి వచ్చే పర్యాటకులకు రాష్ట్ర అందాలను మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని మంత్రి దుర్గేశ్ తెలిపారు. రాపిడో సంస్థ సహకారంతో దేశంలోనే తొలిసారిగా 'డ్రైవర్ కం గైడ్' విధానాన్ని ఏపీ పర్యాటక శాఖ ఆవిష్కరిస్తోందన్నారు. 'సీఎం చంద్రబాబు సమక్షంలో రాపిడో సహ వ్యవస్థాపకుడు పవన్ గుంటుపల్లితో విశాఖలోని సీఐఐ సదస్సులో ఒప్పందం కుదుర్చుకున్నాం. ఒప్పందం మేరకు రాపిడోలో మంచి రేటింగ్ ఉన్న డ్రైవర్లను ఎంపిక చేస్తాం. వారికి రాష్ట్ర చరిత్ర, సంస్కృతి, అతిథ్యం, భద్రతపై వచ్చే నెల నుంచి పర్యాటక శాఖ ప్రత్యేక శిక్షణ ఇస్తుంది. త్వరలోనే విజయవాడ, తిరుపతి, విశాఖపట్నంలో ఈ సేవలను ప్రారంభిస్తాం. రాపిడో యాప్‌లోనే టూరిస్టు ఆటోలు, క్యాబ్, పర్యాటక సర్క్యూట్ల వివరాలు అందుబాటులో ఉంటాయి. విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్‌లలో పర్యాటకుల సౌకర్యార్థం ప్రత్యేక కో - బ్రాండెడ్ హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటుచేసి పర్యాటక సేవలను సులభతరం చేస్తాం. ఈ ప్రాజెక్టు... పర్యాటక రవాణాలో దేశానికే ఆదర్శంగా నిలుస్తుంది' అని మంత్రి పేర్కొన్నారు.

అభ్యంతరాలుంటే చెప్పండి!

» కొత్త జిల్లాలపై ప్రాథమిక గజిట్‌లు విడుదల

» 30 రోజుల పాటు అభ్యంతరాలు, సూచనల స్వీకరణ

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మూడు కొత్త జిల్లాలు, ఐదు రెవెన్యూ డివిజన్లు, ఒక మండలాన్ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ప్రాథమిక గెజిట్‌లు విడుదల చేసింది. రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ గురువారం వీటిపై విడివిడిగా ఉత్తర్వులు జారీచేశారు. కొత్త జిల్లాలు, సరిహద్దులు, రెవెన్యూ డివిజన్ల కూర్పు, ఇతర మార్పు చేర్పులపై బుధవారం 'ఆంధ్రజ్యోతి' సవివరమైన కథనాన్ని ప్రచురించింది. అవే అంశాలతో ఇప్పుడు ప్రాథమిక గెజిట్‌లు వెలువడ్డాయి. ఈ మార్పులపై ప్రజలు తమ అభిప్రాయాలు, సూచనలు, సలహాలు, అభ్యంతరాలను... 30 రోజుల్లోగా నేరుగా సంబంధిత జిల్లా కలెక్టర్‌కే పంపించవచ్చు. ప్రజల అభిప్రాయాలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంటుందని గెజిట్ ఉత్తర్వుల్లో సాయిప్రసాద్ పేర్కొన్నారు. ప్రాథమిక గెజిట్ ప్రకారం... మార్కాపురం, మదనపల్లె, రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లాలు ఏర్పడతాయి. కొత్తగా అద్దంకి-ప్రకాశం జిల్లా, నక్కపల్లి- అనకాపల్లి జిల్లా, మడకశిర-సత్యసాయి జిల్లా, బనగానపల్లె-నంద్యాల జిల్లా, పీలేరు-మదనపల్లె జిల్లా డివిజన్లను ఏర్పాటు చేయనున్నారు. కర్నూలు జిల్లా ఆదోని మండలాన్ని విభజించి కొత్తగా 'పెద్దహరివాణం' మండలం ప్రకటించారు. పశ్చిమగోదావరి జిల్లాలోని పెనుగొండ మండలం పేరును 'వాసవీ పెనుగొండ'గా మార్చారు. ఆయా మార్పులపై అభ్యంతరాల స్వీకరణ, పరిశీలన అనంతరం తుది నోటిఫికేషన్ విడుదల చేస్తారు.

ఏపీ కళింగ కోమటి చైర్మన్, డైరక్టర్ల నియామకం

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఏపీ కళింగ కోమటి/కళింగ వైశ్య సంక్షేమ కార్పొరేషన్‌కు చైర్‌పర్సన్‌గా టెక్కలి నియోజకవర్గానికి చెందిన బోయిన గోవిందరాజులను నియమిస్తూ బీసీ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనతోపాటు 15 మంది డైరక్టర్లను నియమిస్తూ మరో ఉత్తర్వు విడుదల చేశారు. చైర్‌పర్సన్, డైరక్టర్లు పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రెండేళ్ల పాటు పదవిలో కొనసాగుతారు.

రబీలో యూరియా కొరత రాకూడదు: అచ్చెన్న

» 'ఆగ్రోస్'పై విజిలెన్స్ దర్యాప్తునకు ఆదేశం



అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో ఎట్టిపరిస్థితుల్లోనూ యూరియా కొరత తలెత్తకూడదని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. గురువారం విజయవాడ క్యాంప్ ఆఫీస్‌లో వ్యవసాయ అనుబంధశాఖలపై ఆయన సమీక్ష చేశారు. 'రబీకి అవసరమైన యూరియా ముందుగానే సమృద్ధిగా నిల్వలు పెట్టాలి. అత్యవసరమైతే బఫర్‌స్టాక్ వినియోగించుకోవాలి. రైతుసేవా కేంద్రాల్లో అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉంచాలి. జిల్లాల వారీగా నిల్వల లెక్కలు పక్కాగా ఉండాలి. జేసీలు బాధ్యత తీసుకుని, యూరియా సక్రమంగా రైతులకు అందేలా చూడాలి. అక్రమ రవాణాను అరికట్టాలి. రైతులకు విత్తనాలు సకాలంలో అందించని వారిపై చర్యలు తీసుకోవాలి' అని స్పష్టం చేశారు. ఈ సీజన్‌లో 20.69 లక్షల టన్నుల ఎరువులు అవసరం ఉండగా, అనకాపల్లి, శ్రీకాకుళం, విజయనగరం, గుంటూరు, కర్నూలు, కడప జిల్లాల్లో అవసరానికి సరిపడా నిల్వలున్నాయని అధికారులు చెప్పారు. గ్రోమోర్ దుకాణాల వద్ద తరచూ యూరియా సమస్యలు వస్తున్నాయని, వాటిని పరిశీలించి, పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

'ఆగ్రోస్‌లో ఇష్టారాజ్యం' కథనంపై స్పందన

'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 26న వచ్చిన 'ఆగ్రోస్‌లో ఇష్టారాజ్యం' కథనంపై మంత్రి స్పందించారు. ఏపీ ఆగ్రోస్‌పై వస్తున్న ఆరోపణలపై విజిలెన్స్‌తో దర్యాప్తు చేయించాలని వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్‌ను ఆదేశించారు. ఆగ్రోస్ ద్వారా రైతులకు సబ్సిడీపై అందించే పరికరాలు, వాహనాల విషయంలో మార్పులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులకు కిసాన్ డ్రోన్లపై అవగాహన కల్పించాలని సూచించారు.

ట్రేడ్ యూనియన్ల ఆందోళన వెనుక రాజకీయ పార్టీలు

» కార్మిక చట్టంలో సంస్కరణపై అవగాహన పెంచుకోవాలి: సుభాశ్



అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాల్లో సంస్కరణలపై ట్రేడ్ యూనియన్ల ఆందోళనల వెనుక కొన్ని రాజకీయ పార్టీలు ఉన్నాయని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాశ్ ఆరోపించారు. కార్మిక చట్టాల్లో చేపట్టిన సంస్కరణలపై కార్మిక శాఖ ఉన్నతాధికారులు విజయవాడలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సుభాశ్ మీడియాతో మాట్లాడుతూ... టేడ్ యూనియన్లు ఆందోళనలకు వెళ్లే ముందు కొత్త సంస్కరణలపై అవగాహన తెచ్చుకోవాలని సూచించారు. నవంబరు 21 నుంచి కొత్త సంస్కరణలు అమలులోకి తీసుకువచ్చామన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలు తాము కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకునే స్వాగతించామన్నారు. అవగాహన సదస్సుల్లో పాల్గొన్న కార్మిక శాఖ అధికారులు జిల్లాల్లో ప్రతి ఒక్కరికీ సంస్కరణలపై అవగాహన కల్పిస్తారని స్పష్టం చేశారు. వారానికి 48 పనిగంటల అమలు అలానే ఉందని, రోజుకి 10 పని గంటలు అన్న దాని వల్ల కార్మికులకు ఎలాంటి నష్టం జరగడం లేదని కార్మిక శాఖ సెక్రటరీ ఎం.శేషగిరిబాబు స్పష్టం చేశారు. మరోవైపు ఫ్యాక్టరీల్లో సేఫ్టీ ఆఫీసర్లు, కమిటీల ఏర్పాటు వల్ల ప్రమాదాలు చాలా వరకూ తగ్గుతాయని చెప్పారు. కార్యక్రమంలో గంధం చంద్రుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏపీలో క్యాన్సర్ రిజిస్ట్రీ, ట్యూమర్ బోర్డు

» కేంద్రం సూచనతో ఏర్పాటు: ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ నియంత్రణ, నివారణ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాల ద్వారా సత్ఫలితాలు సాధించేందుకు ఏపీ క్యాన్సర్ రిజిస్ట్రీ, ట్యూమర్ బోర్డును ఏర్పాటు చేయాలని కేంద్రం సూచించిందని ఆరోగ్యశాఖ సెక్రటరీ సౌరబ్ గౌర్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఎన్సీడీ, క్యాన్సర్ కేర్ వర్క్‌షాప్‌లో చర్చల సందర్భంగా కొన్ని కీలక నిర్ణయాలను కేంద్ర ఆరోగ్య శాఖ ప్రకటించినట్లు ఆయన వివరించారు. రాష్ట్రంలో క్యాన్సర్ నియంత్రణ, నివారణ దిశగా జరుగుతున్న కృషికి గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం గురువారం పలు సహాయక చర్యలను ప్రకటించిందన్నారు.

'సిట్' ప్రశ్నలకు 'జోగి' ఉక్కిరిబిక్కిరి

» అన్నదమ్ములను వేర్వేరు గదుల్లో విచారించిన అధికారులు

» కొన్ని ప్రశ్నలకు మౌనం.. మరికొన్నింటికి దాటవేత

» కస్టడీ ఒక రోజు పొడిగింపు



విజయవాడ ప్రభుత్వాస్పత్రి నుంచి బయటకు వస్తున్న జోగి సోదరులు

విజయవాడ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) నకిలీ మద్యం తయారీ కేసులో నిందితులుగా ఉన్న వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్, ఆయన సోదరుడు జోగి రాము సిట్ అధికారుల ప్రశ్నలకు ఉక్కిరిబిక్కిరి అయినట్టు తెలుస్తోంది. నాలుగు రోజుల కస్టడీలో భాగంగా వీరిద్దరినీ అధికారులు గురువారం విజయవాడలో విచారించారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విచారణ కొనసాగింది. ఇద్దరికీ కలిపి 100 ప్రశ్నలు వే యగా, కొన్నింటికి మాత్రమే జోగి రమేశ్ జవాబు చెప్పినట్టు తెలిసింది. మరికొన్ని ప్రశ్నలకు డొంక తిరుగుడుగా సమాధానాలు ఇచ్చాడని, ఇంకొన్ని ప్రశ్నలకు అసలు నోరు విప్పలేదని సమాచారం. ముఖ్యంగా అద్దేపల్లి జనార్దనరావు, అద్దేపల్లి జగన్మోహనరావులకు వీరు చేసిన ఫోన్‌కాల్స్‌పై ఎక్కువ సమయం విచారించారు. ఇప్పటికే జోగి బ్రదర్స్ అద్దేపల్లి సోదరుల కాల్‌డేటాను ఎక్సైజ్ పోలీసులు సేకరించి భద్రపరిచారు. ఆ డేటాను ఎదురుగా పెట్టి రమేశ్‌ను ప్రశ్నించారు. సుమారు మూడు నెలలుగా అద్దేపల్లి సోదరులు, జోగి బ్రదర్స్ మధ్య నిత్యం వందలాది ఫోన్ కాల్స్ ఉన్నట్టు గుర్తించారు. వాటిపై ప్రశ్నించగా ఒకే వీధిలో ఉన్నాం కాబట్టి యోగక్షేమాలు తెలుసుకోవడానికి ఫోన్లు చేసుకున్నామని చెప్పినట్టు సమాచారం. ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం తయారీ వ్యవహారం బయటపడానికి ముందు తాను జోగి రమేశ్‌ను ఇంటికి వెళ్లి కలిశానని అద్దేపల్లి జనార్దనరావు రెండుసార్లు కస్టడీలో వెల్లడించాడు. దీనిపై ప్రశ్నించగా జోగి బ్రదర్స్ అడ్డంగా బుకాయించినట్టు తెలిసింది. అసలు జనార్దనరావు తమ గుమ్మం మెట్లు ఎక్కలేదని చెప్పినట్టు సమాచారం. ఇబ్రహీంపట్నంలోని ఫెర్రీ వద్ద జోగి రాము తీసుకున్న రూ.9 లక్షలపై ప్రశ్నించగా.. కొన్ని సంవత్సరాలుగా ఫెర్రీ వైపు తాను వెళ్లలేదని రాము చెప్పినట్టు తెలిసింది. విచారణ ముగిసిన అనంతరం జోగి బ్రదర్స్‌కు ప్రభుత్వాస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించి జిల్లా జైలుకు తరలించారు. కాగా, జోగి బ్రదర్స్ కస్టడీని కోర్టు ఒకరోజు పొడిగించింది. విజయవాడలోని ఆరో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు గురువారం ఈ ఆదేశాలిచ్చింది. తొలుత బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు వీరి కస్టడీకి అనుమతి ఇచ్చింది. అయితే, వారిని నెల్లూరులోని కేంద్ర కారాగారం నుంచి బెజవాడకు తీసుకురావడానికి ఎక్కువ సమయం పట్టింది. తొలిరోజు మొత్తం ప్రయాణానికి సరిపోయిందని, అందువల్ల మరో రోజు కస్టడీ పొడిగించాలని ఎక్సైజ్ పోలీసులు పిటిషన్ దాఖలు చేయడంతో కోర్టు అనుమతించింది. దీంతో కస్టడీ గడువు 30వ తేదీ వరకు పెరిగింది.

సిట్ ప్రశ్నలకు జోగి రమేశ్ ఇచ్చిన సమాధానాలు ఇవీ..

సిట్: ఈ నంబరుకు మీరు ఎప్పుడైనా ఫోన్ చేశారా?
జోగి: ఆ నంబరు ఎవరిదో తెలియదు!
సిట్: అద్దేపల్లి జనార్దనరావుతో మీరు, జగన్మోహనరావుతో మీ తమ్ముడు రాము చాలాసార్లు మాట్లాడారు కదా!
జోగి: యోగక్షేమాలు తెలుసుకోవడానికి మాట్లాడాం.
సిట్: నకిలీ మద్యం తయారీ ద్వారా వచ్చిన ఆదాయంలో అద్దేపల్లి బ్రదర్స్ మీకు డబ్బులు ఇచ్చారా?
జోగి: మా మధ్య ఎలాంటి ఆర్థిక లావాదేవీలూ జరగలేదు.

తిరుమల వైభవం విశ్వవ్యాప్తం



దేవాదాయ శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు, మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, అధికారులు

» వైకుంఠ ఏకాదశి దర్శనాలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలి: సీఎం

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రపంచం నలుమూలలా తిరుమల తిరుపతి ఆధ్యాత్మిక వైభవాన్ని చాటేలా కార్యక్రమాలు రూపొందించాలని టీటీడీ అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. వైకుంఠ ఏకాదశికి పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని, ఎక్కడా సమస్యలు ఉత్పన్నం కాకూడదని ఆదేశించారు. గురువారంలో సచివాలయంలో దేవదాయ శాఖ, టీటీడీపై ఆయన సమీక్ష నిర్వహించారు. తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనాలకు భక్తులు అన్ని భాషల్లోనూ రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించాలని చెప్పారు. వీలైనంత ఎక్కువమంది భక్తులు శ్రీవారి దర్శనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. టీటీడీ ఆధ్వర్యంలో నడిచే అన్ని దేవాలయాల్లో నిత్యాన్నదానం చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు. ఆధ్యాత్మికం, అన్నదానం, విద్య, వైద్యానికి టీటీడీ చిరునామాగా మారాలని ఆకాంక్షించారు. తిరుపతిలో ఉన్న ఆస్పత్రులన్నీ ఓ మోడల్‌గా అభివృద్ధి చేయాలని, పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి ఆస్పత్రుల తరహాలోనే వీటి నిర్వహణ కూడా చేపట్టాలని ఆదేశించారు. స్విమ్స్, రుయా, బర్డ్ ఆస్పత్రులను అనుసంధానిస్తూ మెరుగైన వసతులు కల్పించాలన్నారు. అత్యుత్తమ నిపుణులైన డాక్టర్లను శ్రీవారి సేవకులుగా ఆహ్వానించి వైద్య సేవ చేసే అవకాశం కల్పించాలని టీటీడీని ఆదేశించారు. అత్యవసర సమయాల్లో క్యూలైన్లలోని భక్తులను వేగంగా ఆస్పత్రులకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. తిరుమలలో కాలుష్య నివారణకు ఎలక్ట్రానిక్ వాహనాలు దశల వారీగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. టీటీడీ సేవలను వాట్సాప్ గవర్నెన్స్‌లోకి తీసుకువచ్చి భక్తులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రసాదాల తయారీ కోసం ఆర్గానిక్ ఉత్పత్తులు ఎంచుకోవాలని తెలిపారు. టీటీడీ పోర్టల్‌ను ఆర్టీజీఎస్‌తో అనుసంధానించాలని చంద్రబాబు ఆదేశించారు.

5 వేల ఆలయాలు రీడిజైన్

రాష్ట్రంలో కొత్తగా నిర్మించనున్న 5వేల దేవాలయాలను రీడిజైన్ చేయాలని సీఎం అన్నారు. ఆ దేవాలయాల్లో ఆధ్యాత్మికత, ప్రశాంతత ఉట్టిపడేలా ప్రత్యేకంగా ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. పురాతన దేవాలయాల జీర్ణోద్ధరణపై కార్యాచరణ చేపట్టాలన్నారు. వివిధ రాష్ట్రాల్లో 8 దేవాలయాలతో పాటు నవీ ముంబై, తమిళనాడులోని ఉలందూర్‌పేటలో కొత్తగా శ్రీవారి ఆలయాలు నిర్మిస్తున్నట్టు అధికారులు వివరించారు. కోయంబత్తూరులోనూ ఆలయ నిర్మాణానికి ఓ భక్తుడు ముందుకొచ్చారని తెలిపారు. అసోంలో టీటీడీ ఆలయ నిర్మాణానికి 10 ఎకరాలను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కేటాయించారని చెప్పారు. దీనిపై స్పందించిన చంద్రబాబు... మరింత స్థలాన్ని కేటాయించాలని కోరతామని తెలిపారు. దేశ, విదేశాల్లో నిర్మించే ప్రతీ ఆలయం తిరుమల ఆలయానికి అనుసంధానం కావాలని, శ్రీవారి ధనానికి, ఆస్తులకు జవాబుదారీగా ఉండాలని, దుర్వినియోగానికి చోటులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని సీఎం పేర్కొన్నారు. ఒంటిమిట్ట రామాలయంలో భక్తుల సంఖ్య పెరిగేలా కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు.



అమరావతిలో వేంకటేశ్వరస్వామి ఆలయ భూమి పూజా కార్యక్రమంలో చంద్రబాబును ఆశీర్వదిస్తున్న వేదపండితులు

శ్రీవారి ఆలయంలో వేగంగా దర్శనం

తిరుమల శ్రీవారి ఆలయానికి వచ్చే సామాన్య భక్తులకు వేగంగా దర్శనాలు జరిగేలా వినూత్న కార్యాచరణ చేపట్టాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం నిమిషానికి 8 మంది చొప్పున దర్శనాలు చేసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. పండుగలు, ప్రత్యేక రోజుల్లో సాధారణ భక్తులకే ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. లడ్డూ నాణ్యతను పెంచటంతో పాటు అన్నప్రసాదంలో వడ కూడా అందిస్తున్నామని, కిచెన్‌ను ఆధునీకరించి 2.75 లక్షల మందికి అన్నప్రసాదం అందించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. సమీక్షలో దేవదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, ఈవో సింఘాల్, జేఈవో వెంకయ్య చౌదరి, దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

తిరుమలను తలపించేలా...

(మొదటి పేజీ తరువాయి)

భాగంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఉత్సవర్లను వేంచేపు చేశారు. అనంతరం అర్చకులు చతుర్వేద పారాయణం, నివేదనం, దివ్య సమర్పణ, హోమం, పూర్ణాహుతి, వేదాశీర్వచనం నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవిద నామస్మరణల మధ్య చంద్రబాబు పునాది రాయి వేయడంతో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. శ్రీవారి ఆలయ అభివృద్ధికి రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను సీఎం పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, 'దేవతల రాజధాని అమరావతి.. మన రాజధాని కూడా అమరావతి.. ఆ వేంకటేశ్వరస్వామి సంకల్పంతోనే ఈ పేరు పెట్టాను. ఆయన చిత్తంతోనే రాజధాని రైతులు కూడా భూములిచ్చారు. 29వేల మంది రైతులు 33వేల ఎకరాలు స్వచ్ఛందంగా ఇవ్వడం అనేది శ్రీవారి ఆశీస్సులతోనే సాధ్యం. దేవతల రాజధాని ఎలా ఉంటుందో.. ఆ నమూనాగా మన అమరావతి ఉండాలని స్వామిని కోరుకుంటున్నా' అన్నారు.

ఎన్టీఆర్ అన్నదానం.. నేను ప్రాణదానం..

తిరుమలలో ఎన్టీఆర్ 1983లో అన్నదానం ప్రారంభిస్తే.. తాను 2003లో ప్రాణదానం ట్రస్ట్‌ను మొదలుపెట్టానని చంద్రబాబు వివరించారు. 'బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించడానికి వెళ్తుండగా క్లెమోర్ మైన్స్ పేలిస్తే ఆ వేంకటేశ్వరుడే నాకు ప్రాణభిక్ష పెట్టారు. నేను, మా కుటుంబం ఇంటి దైవంగా వేంకటేశ్వరస్వామిని కొలుస్తాం. మా ఇంటి నుంచి చూస్తే స్వామి కొలువైన శేషాచలం, శ్రీవారి నామాలు కనిపిస్తాయి. ఆయన్ను చూస్తూ బతికి, స్వామి పాదపద్మాల చెంత తరించాం. వేంకటేశ్వరస్వామికి అప్రతిష్ఠ తెచ్చే పనులు చేయను.. ఎవరినీ చేయనివ్వను' అని స్పష్టం చేశారు. దేవుడి దగ్గరకు పెత్తందారుగా వెళ్లకూడదని, తప్పు చేసిన వారిని ఈ జన్మలోనే స్వామి శిక్షిస్తారని హెచ్చరించారు. 'గత ప్రభుత్వం విధ్వంసం తప్ప మంచి చేసిన సందర్భాలు లేవు. మంచి సంకల్పంతో రైతులు భూములు ఇస్తే వారికి నరకాన్ని చూపించారు. రైతులు వేంకటేశ్వరస్వామిని నమ్ముకున్నారు. న్యాయస్థానం నుంచి దేవస్థానం వరకు యాత్ర చేసి రాజధానిని కాపాడుకోవడానికి పాటుపడ్డారు. అమరావతినే కాకుండా, ఈ ప్రాంతాన్ని కాపాడే శక్తి ఈ దేవాలయానికి ఉంది' అని సీఎం పేర్కొన్నారు.

'టీటీడీ'లో తొలి అరెస్టు

» కల్తీ నెయ్యి కేసులో అప్పటి ప్రొక్యూర్‌మెంట్ జీఎం సుబ్రమణ్యం అదుపులోకి..

» డిసెంబరు 10 వరకు రిమాండ్

తిరుపతి/తిరుపతి(నేరవిభాగం), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కల్తీ నెయ్యి కేసులో టీటీడీలో తొలి అరెస్టు చోటుచేసుకుంది. టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ విభాగం జనరల్ మేనేజర్‌గా పనిచేసిన ఆర్ఎస్ఎస్వీ సుబ్రమణ్యాన్ని (58) సిట్ అధికారులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ కోర్టు డిసెంబరు 10వ తేదీ వరకూ ఆయనకు రిమాండు విధించింది. ఈ కేసులో సిట్ అధికారులు సుబ్రమణ్యంను ఏ29గా రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. ఆయన ప్రస్తుతం టీటీడీలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఉన్నారు. తిరుపతి ఎన్‌జీవో కాలనీలోని ఆయన నివాసం నుంచి గురువారం మధ్యాహ్నం సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. తొలుత రుయా ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించిన అనంతరం సాయంత్రానికి నెల్లూరు ఏసీబీ కోర్టుకు తరలించారు. కోర్టు 14 రోజుల పాటు రిమాండ్ విధించడంతో నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. సుప్రీం కోర్టు ఆదేశాలతో సీబీఐ, ఏపీ పోలీసు సిట్‌గా ఏర్పడి సంయుక్తంగా దర్యాప్తు చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ కేసులో 28 మందిని నిందితులుగా చేర్చారు. వారిలో ఇద్దరు టీటీడీ కిందిస్థాయి ఉద్యోగులు కూడా ఉన్నప్పటికీ ఇంతవరకూ అరెస్టు కాలేదు. నిందితులు 28 మందిలో ఎనిమిది మందిని అరెస్టు చేయగా, మిగిలిన వారిని అదుపులోకి తీసుకోవాల్సి ఉంది. అయితే, టీటీడీ పరిధిలో అరెస్టులు సుబ్రమణ్యం ఒక్కరితోనే ఆగుతాయా లేక మరికొందరికి కూడా అరదండాలు పడతాయా అన్నదానిపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. కేసు దర్యాప్తు కీలక దశకు చేరుకోవడం, డిసెంబరు 15లోపు తుది చార్జిషీటు దాఖలు చేస్తారన్న సమాచారం నేపథ్యంలో రానున్న రోజుల్లో మరిన్ని కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఇప్పటికీ కీలకమైన విధుల్లోనే..

కల్తీ నెయ్యి సరఫరాకు సహకరించారని తీవ్ర స్థాయి ఆరోపణలు ఎదుర్కొంటున్న సుబ్రమణ్యం టీటీడీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హోదాలో తిరుమలలో శ్రీవారి ఆలయం సహా మాడవీధుల విధుల్లో ఉన్నారు. ప్రొక్యూర్‌మెంట్ జీఎం పోస్టు నుంచి రిలీవయ్యాక టీటీడీ చీఫ్ ఇంజనీర్‌కు పీఎస్‌గా నియమితుడైన సుబ్రమణ్యం తర్వాత గత ప్రభుత్వంలోనే సాక్షాత్తూ తిరుమలలో శ్రీవారి ఆలయం, పరిసర ప్రాంతాలకు ఈఈ-1గా నియమితులయ్యారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై, టీటీడీలో ఉన్నతాధికారులంతా మారి, కొత్త పాలకవర్గం ఏర్పాటయ్యాక కూడా అదే పోస్టులో కొనసాగుతున్నారు.

వైవీ పీఏ చిన్న అప్పన్నకు సహకారం

కల్తీ నెయ్యి దందాలో అప్పటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ కడూరు చిన్న అప్పన్నకు ప్రొక్యూర్‌మెంట్ జీఎం హోదాలో సుబ్రమణ్యం సహకరించినట్టు సమాచారం. 2019 నుంచీ 2023 వరకూ టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ విభాగం జీఎంగా ఆయన పనిచేశారు. 2022లోచిన్న అప్పన్న ఆయనను సంప్రదించి, నెయ్యి సరఫరాదారుల వివరాలు కోరినట్టు సిట్ గుర్తించింది. నెయ్యి సరఫరా చేసే డెయిరీల పేర్లు, వాటి చిరునామాలు, యజమానుల వివరాలు, వారి మొబైల్ నంబర్లు, డెయిరీల అధికారుల వివరాలు, వారి మొబైల్ నంబర్లు, ఏయే సంస్థ ఎంతెంత పరిమాణంలో నెయ్యి సరఫరా చేస్తున్నదీ, టెండర్ల గడువు తదితర కీలక సమాచారాన్ని సుబ్రమణ్యమే చిన్న అప్పన్నకు ఇచ్చారని సిట్ గుర్తించింది. ముఖ్యంగా భోలేబాబా డెయిరీ ప్రతినిధుల వివరాలు ఇవ్వడంతోపాటు వారికి సుబ్రమణ్యమే ఫోన్ చేసి చిన్న అప్పన్న ఫోన్ చేస్తారని, ఆయన మాట్లాడాలని సూచించినట్టు తెలిసింది. ఈ క్రమంలో సుబ్రమణ్యం కాల్ రికార్డు డేటా సహా పలు వివరాలు సిట్ సేకరించినట్టు సమాచారం. భోలేబాబా డెయిరీ సరఫరా చేస్తున్న నెయ్యి నాసిరకంగా ఉందని మైసూరు ల్యాబ్ నుంచి రిపోర్టు వచ్చినప్పటికీ దాన్ని టీటీడీ ఉన్నతాధికారుల దృష్టికి ఆయన తీసుకుపోలేదని, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేయలేదని సిట్ గుర్తించినట్టు తెలిసింది. జీఎం హోదాలో ఉండి శ్రీవారి ప్రసాదాల తయారీకి వినియోగించే నెయ్యి కల్తీ అవుతోందని తెలిసి కూడా అనుమతించారని, ఆ విషయం బయటపెట్టకుండా మౌనం వహించారని సిట్ భావిస్తోంది. నెయ్యి సరఫరాకు సంబంధించిన రికార్డులు కూడా సక్రమంగా నిర్వహించలేదని తెలుస్తోంది. చిన్న అప్పన్నకు, ఆయనకు మధ్య కొంతమేర ఆర్థిక లావాదేవీలు జరిగినట్టు కూడా దర్యాప్తు అధికారులు గుర్తించారని తెలిసింది.

రవికుమార్ ఖాతాలపై సీఐడీ ఆరా

పరకామణి చోరీ కేసు నిందితుడు రవికుమార్ ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తు బృందం దృష్టిపెట్టింది. ఆయనతో పాటు కటుంబ సభ్యులు, బంధుమిత్రులకు తిరుపతి, చిత్తూరు, బెంగుళూరుల్లో ఉన్న బ్యాంకు అకౌంట్ల వివరాలు సేకరిస్తున్నట్టు తెలిసింది. పెద్దఎత్తున లావాదేవీలు ఏమైనా జరిగాయా? ఎవరి ఖాతాలనుంచి ఎవరి ఖాతాల్లోకి బదలాయింపులు జరిగాయి? అన్న కోణంలో సీఐడీ ఎస్ఐల నేతృత్వంలో వివరాలు సేకరిస్తున్నారు.

ముడుపులూ ముట్టాయి

చిన్న అప్పన్నను సిట్ అధికారులు గత నెల 29వ తేదీన అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఆయన బెయిల్ పిటిషన్‌ను ఏసీబీ కోర్టు ఈనెల 17వ తేదీన కొట్టివేసింది. అయితే ఆ పిటిషన్‌పై వాదనలు జరిగినప్పుడు సిట్ తరపున వాదించిన ఏపీపీ జయశేఖర్.... ఏ24 కడూరు చిన్న అప్పన్న కల్తీ నెయ్యి వ్యవహారంలో కీలక పాత్ర పోషించారని, 2022 ఏప్రిల్‌లో సుబ్రమణ్యం నుంచి నెయ్యి సరఫరాకు సంబంధించిన కీలక సమాచారం సేకరించారని వాదనలు వినిపించారు. చిన్న అప్పన్న నుంచి సుబ్రమణ్యానికి నాలుగైదు లక్షల నగదు అందిందని సిట్ గుర్తించినట్టు వాదనలు వినిపించారు. ఆ సందర్భంలోనే ఈ కేసులో సుబ్రమణ్యం పాత్ర బహిర్గతమైంది. తాజాగా గురువారం కల్తీ నెయ్యి కేసులో ఆయన ఏ29గా మారారు.


వైద్య కళాశాలల్లో ఈడీ సోదాలు

» ఎన్ఎంసీ తనిఖీ అధికారులకు భారీగా ముడుపుల కేసులో రంగంలోకి ఈడీ

హైదరాబాద్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఏపీ సహా పది రాష్ట్రాల్లోని వైద్య కళాశాలల తనిఖీలకు వెళ్లిన జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) అధికారులకు కోట్లాది రూపాయల ముడుపులు అందిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. సీబీఐ నమోదు చేసిన ఈ కేసులో మనీలాండరింగ్ కోణం ఉన్నట్లు గుర్తించిన ఈడీ.. తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, రాజస్థాన్, బిహార్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీలో 15చోట్ల సోదాలు నిర్వహించింది. ఇందులో ఏడు వైద్య కళాశాలలతో పాటు అధికారులు, ఈ దందాలోని మధ్యవర్తుల ఇళ్లు, కార్యాలయాలు ఉన్నాయి. తెలంగాణకు సంబంధించి వరంగల్ జిల్లాలోని ఫాదర్ కొలంబో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో, మధ్యవర్తులుగా వ్యవహరించిన ముగ్గురు వైద్యుల ఇళ్లలో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. ముగ్గురు డాక్టర్లు అంకం రాంబాబు, హరిప్రసాద్, కృష్ణ కిషోర్ పలు వైద్య కళాశాలలకు మధ్యవర్తులుగా వ్యవహరించిన క్రమంలో వారి ఇళ్లల్లోనూ ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఏపీకి సంబంధించి.. విశాఖలోని గాయత్రి మెడికల్ కాలేజీ డైరెక్టర్ వెంకట్ నుంచి మధ్యవర్తి కృష్ణ కిషోర్‌కు రూ.50 లక్షలు అందగా.. ఆయన ఆ మొత్తాన్ని హవాలా మార్గంలో ఢిల్లీలోని ఎన్ఎంసీ పెద్దలకు పంపించిన క్రమంలో హవాలా చెల్లింపులపై ఈడీ అధికారులు ఆరా తీశారు. ముడుపుల చెల్లింపులు చాలావరకు హవాలా మార్గంలో జరిగినట్లు గుర్తించి, కీలక సాక్ష్యాధారాలను సేకరించినట్లు సమాచారం. ముడుపులతో పాటు ఎన్ఎంసీ నుంచి తనిఖీలకు సంబంధించి కీలక సమాచారం లీక్ అవుతున్న వ్యవహారంపై జూన్ 30న సీబీఐ కేసు నమోదు చేసింది. దాని ఆధారంగా మనీ లాండరింగ్ కోణంలో ఈడీ తాజాగా దర్యాప్తు చేపట్టింది. కేంద్ర ఆరోగ్య శాఖ, ఎన్ఎంసీ అధికారులు, మధ్యవర్తులు, ప్రైవేటు వైద్య కళాశాలల ప్రతినిధులు ఒక సిండికేట్‌గా ఏర్పడి అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని సీబీఐ అభియోగం. ఎన్ఎంసీ, ప్రభుత్వ అధికారులు వైద్య కళాశాలల తనిఖీలకు సంబంధించిన రహస్య సమాచారాన్ని వైద్య కళాశాలల యాజమాన్యాలకు, మధ్యవర్తులకు లీక్ చేశారని, దాంతో ఆ అధికారులకు భారీ మొత్తంలో ముడుపులు అందాయని సీబీఐ గుర్తించింది. తనిఖీల సమాచారం ముందుగానే అందడంతో కళాశాలల యాజమాన్యాలు జాగ్రత్తపడి.. ప్రమాణాల విషయంలో మసిపూసి మారేడుకాయ చేసి, అనుమతులు సాధిస్తున్నాయి. ఎన్ఎంసీ అధికారుల బృందం వైద్య కళాశాలల తనిఖీకి ఎప్పుడు వచ్చేదీ, బృందంలోని సభ్యుల వివరాలు, వారు ఏ అంశాలను పరిశీలిస్తారనే సమాచారంముందుగానే బ్రోకర్ల ద్వారా కొన్ని వైద్య కళాశాలలకు అందిందని, దానికి ప్రతిఫలంగా మధ్యవర్తుల ద్వారా పలు వైద్య కళాశాలలు ఎన్ఎంసీ అధికారులకు కోట్ల రూపాయలు చెల్లించాయని సీబీఐ కేసు నమోదు చేసింది. ఎఫ్ఐఆర్‌లో 34 మంది పేర్లను చేర్చింది. వీరిలో కేంద్ర ఆరోగ్య శాఖ అధికారులు 8 మంది, జాతీయ ఆరోగ్య సంస్థ అధికారి ఒకరు, ఎన్ఎంసీ తనిఖీ బృందం సభ్యులైన ఐదుగురు డాక్టర్లు కూడా ఉన్నారు. కాగా, ఛత్తీస్‌గఢ్‌లోని ఓ వైద్య కళాశాలకు అనుకూలంగా నివేదిక ఇచ్చేందుకు రూ.55 లక్షలు లంచం తీసుకున్న అభియోగంపై ముగ్గురు తనిఖీ బృందం సభ్యులను, మరో ఐదుగుర్ని సీబీఐ అరెస్టు చేసింది.

సాగునీటి ప్రాజెక్టులపై కేంద్రాన్ని ఒప్పించండి

టీడీపీ ఎంపీలకు బాబు ఆదేశం
రైతుల సమస్యలనూ ప్రస్తావించండి
క్యాంపు కార్యాలయంలో టీడీపీపీ భేటీ



టీడీపీపీ సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, ఎంపీ కృష్ణదేవరాయలు

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కృష్ణా, గోదావరి జలాల్లో రాష్ట్ర వాటా, సాగునీటి ప్రాజెక్టుల అనుమతులపై కేంద్రాన్ని ఒప్పించేలా టీడీపీ ఎంపీలు పార్లమెంటులో బలంగా తమ గళాన్ని వినిపించాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. 1వ తేదీ నుంచి పార్లమెంటు సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో.. టీడీపీపీ సమావేశం గురువారం ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగింది. ఉభయసభల్లో ప్రస్తావించాల్సిన అంశాలపై చర్చించారు. వంశధార-గోదావరి-నల్లమల సాగర్ అనుసంధానం, వెలిగొండ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు.. ఇవన్నీ రాష్ట్ర భవిష్యత్‌ను నిర్ణయిస్తాయని, నీటి భద్రతే మన ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టును 2027 జూన్‌లో జాతికి అంకితం చేసేందుకు కేంద్ర సహకారం కావాలన్నారు. పత్తి, మొక్కజొన్న, అరటి ధరల పతనం, సీసీఐ నియమాల కారణంగా వచ్చిన సమస్యలను కేంద్రానికి వివరించి రైతులకు ఉపశమనం కల్పించేలా చూడాలని ఎంపీలను కోరారు. మొంథా తుఫాను నష్టాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లి, వీలైనంత త్వరగా పరిహారం వచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. దీనికోసం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో టీడీపీ ఎంపీలు కేంద్ర పెద్దలను కలవాలని నిర్ణయించారు. టీడీపీ అత్యధిక యువపార్లమెంటేరియన్లు కలిగిన పార్టీ అని, ఈ యువశక్తి పార్లమెంటు వేదికగా రాష్ట్ర సమస్యలను స్పష్టంగా వినిపించాలని సీఎం స్పష్టం చేశారు. 'రాష్ట్రాభివృద్ధి, ప్రజాప్రయోజనాలే లక్ష్యంగా సమన్వయంతో కలిసి పనిచేయాలి. పార్లమెంటులో ప్రవేశపెట్టే ప్రతి అంశమూ రాష్ట్రాభివృద్ధికి ఎలా ఉపయోగపడుతుందో పరిశీలించి సద్వినియోగం చేసుకోవాలి. విశాఖ సీఐఐ సదస్సులో వచ్చిన పెట్టుబడులకు అనుగుణంగా పాలసీల్లో మార్పు, కేంద్ర అనుమతులకు కృషి చేయాలి. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, డేటా సెంటర్లకు అవసరమైన వనరులపై కేంద్ర సాయం సాధించాలి. ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు, 4జీ, 5జీ కనెక్టివిటీ, క్వాంటమ్ వ్యాలీ, ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌కు మద్దతు సాధించేలా ఎంపీలు కృషి చేయాలి. విశాఖ, విజయవాడ మెట్రో రైలు, విశాఖ-తిరుపతి-అమరావతి ఎకనామిక్ రీజియన్లు, భోగాపురం ఎయిర్‌పోర్టు, విశాఖ రైల్వే జోన్, వైజాగ్ స్టీల్ ప్లాంట్ వంటి అంశాలపై కేంద్రంతో చర్చలు జరపాలి' అని ఎంపీలకు స్పష్టంచేశారు.

అనవసర వివాదల జోలికి వెళ్లొద్దు..

పార్లమెంటులో చురుగ్గా ఉండడంతోపాటు తమ తమ నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్న ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ ఎంపీలు తప్పనిసరిగా పాల్గొనాలని సీఎం ఆదేశించారు. ఎంపీలు రాజకీయంగా నియోజకవర్గాల్లో గుడ్‌విల్ సంపాదించాలని, అనవసర వివాదాల జోలికి వెళ్లకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. వివాదాలతో వ్యక్తిగతంగా.. పార్టీకి కూడా నష్టం జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధుల పనితీరుపై ప్రతివారం వేర్వేరు మార్గాల్లో సమాచారం తెప్పించుకొని బేరీజు వేస్తున్నామని తెలిపారు. పార్టీ కార్యక్రమాల్లో ఎంపీలు క్రియాశీలంగా ఉండాలని, రాష్ట్రాభివృద్ధి కోసం ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించాలని కోరారు. ప్రతి పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్, విద్యార్థుల్లో ఆవిష్కరణలను ప్రోత్సహించే కార్యక్రమాలపై ఎంపీల సహకారం అవసరమన్నారు. లోకేశ్ మాట్లాడుతూ.. పార్లమెంటులో ఎంపీలు అడిగే ప్రశ్నలు ప్రజాహితంగా, రాష్ట్రానికి ప్రయోజనం కలిగించేలా ఉండాలని అన్నారు. సమావేశంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌తోపాటు ఉభయసభల్లోని టీడీపీ ఎంపీలు పాల్గొన్నారు.



దుబాయ్‌లో ఆస్తులు ఎలా వచ్చాయ్?

- విదేశాల్లో పెట్టుబడుల సొమ్ము ఎక్కడిది..
- జగన్ మాజీ జైలు మేట్ సునీల్‌రెడ్డికి సిట్ ప్రశ్నలు

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో నాసిరకం మద్యం సరఫరా చేసి దోచుకున్న సొమ్ములో మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి మాజీ జైలు మేట్ నర్రెడ్డి సునీల్ రెడ్డికి ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) నలువైపులా ఉచ్చు బిగిస్తోంది. కడప జిల్లాలో అత్యంత సామాన్య కుటుంబంలో జన్మించిన సునీల్ రెడ్డి పది కంపెనీలు ప్రారంభించి, ఇతర దేశాల్లో పెట్టుబడులు పెట్టే స్థాయికి ఎదిగాడు. దుబాయ్‌లో ఆస్తులు కొనుగోలు చేసిన సునీల్ రెడ్డి పన్నెండేళ్ల క్రితమే జగన్ అక్రమాస్తుల(ఎమ్మార్ ప్రాపర్టీస్) కేసుల్లో చంచల్ గూడ జైలుకు వెళ్లాడు. జగన్ పాలనలో సునీల్ రెడ్డి హైదరాబాద్‌లో ఉంటూనే ఇక్కడ మద్యం విక్రయాలకు జే బ్రాండ్లకు అనుమతులు ఇప్పించినట్లు ఆరోపణలు ఉన్నాయి. మద్యం ముడుపుల సొమ్మును విదేశాలకు తరలించేందుకు డొల్ల కంపెనీలు సృష్టించినట్లు సిట్ ఆధారాలు సేకరించింది. సెప్టెంబరు చివరి వారంలో హైదరాబాద్, విశాఖపట్నంలోని పలు ప్రాంతాల్లో సోదాలు చేపట్టి కీలక డాక్యుమెంట్లు, కంప్యూటర్ హార్డ్‌డిస్క్‌లు, బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన ఫైళ్లు తదితరాలను స్వాధీనం చేసుకుంది. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి.. పలు లావాదేవీలు పారదర్శకంగా లేవని పసిగట్టిన సిట్ అధికారులు సునీల్ రెడ్డిని విజయవాడకు పిలిపించి గురువారం ప్రశ్నించారు.

వైసీపీ అధికారంలోకి వచ్చాక 2019-2022 మధ్య సృష్టించిన గ్రీన్‌టెల్ ఎంటర్‌ప్రైజెస్ ఎల్ఎల్‌పీ, గ్రీన్ స్మార్ట్ వెంచర్స్ ఎల్ఎల్‌పీ, గ్రీన్‌టెక్ ఇంజనీరింగ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, వాయ్‌లేట్ ఫర్నిచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, శేఖర్ ఫౌండేషన్, ఆర్ఆర్ గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్‌లలో జరిగిన ఆర్థిక లావాదేవీలపై సిట్ బృందం పలు ప్రశ్నలు సంధించింది. సుమారు నాలుగేళ్లు ఆ కంపెనీల్లో డైరెక్టర్‌గా కొనసాగి ఎన్నికల ముందు ఎందుకు వైదొలిగారని సిట్ ప్రశ్నించడంతో సునీల్ రెడ్డి పొంతన లేని సమాధానలు చెప్పినట్లు తెలిసింది.

ఆస్తులమ్మి నగదు చెల్లించాల్సిందే!

- కటక్ కి'లేడీ' గ్యాంగ్‌కు లిక్కర్ సిట్ అల్టిమేటం
- పది రోజుల్లో డబ్బు తెచ్చి ఇవ్వాలని ఆదేశం

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలోని ముడుపుల సొమ్మును కటక్ కిలేడీ గ్యాంగ్ నుంచి ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) వసూలు చేయబోతోంది. రాజ్ కసిరెడ్డి గ్యాంగ్ దోచుకున్న మద్యం ముడుపుల సొమ్ములో రూ.5కోట్లకు పైగా కటక్ కిలేడీ గ్యాంగ్ దొంగిలించింది. ఆ సొమ్ముతో ఒడిశాలోని కటక్‌లో రూ.4కోట్లకుపైగా స్థిరాస్తులు, హైదరాబాద్‌లో రూ.1.20కోట్ల ఆస్తులను ఆ గ్యాంగ్ కొనుగోలు చేసినట్లు సిట్ దర్యాప్తులో తేలింది. పొరుగు రాష్ట్రాల్లో ఆస్తులు జప్తుకు న్యాయ ప్రక్రియలో బాగా జాప్యం జరుగుతోంది. దీంతో కటక్ నుంచి కిలేడీతోపాటు ఆమె ప్రియుడిని, హైదరాబాద్ ఆస్తులకు సంబంధించి ముబారక్ అలీని సిట్ అధికారులు విజయవాడకు రప్పించారు. పది రోజుల్లోపు ఆ ఆస్తులను విక్రయించి, నగదు తీసుకొచ్చి ఇవ్వాలని చెప్పడంతో అందుకు ఆ ముగ్గురూ అంగీకరించారు.

నేడు సిట్ కస్టడీకి అనిల్ చోక్రా

- చెవిరెడ్డికి ఇంటి నుంచి భోజనానికి కోర్టు అనుమతి
- పార్లమెంటు సమావేశాలకు హాజరయ్యేందుకు మిథున్‌రెడ్డికీ..

విజయవాడ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో 49వ నిందితుడు అనిల్ చోక్రాను మూడు రోజుల సిట్ కస్టడీకి కోర్టు అప్పగించింది. విజయవాడలోని ఏసీబీ కోర్టు గురువారం ఈ తీర్పు ఇచ్చింది. విజయవాడలోని జిల్లా జైల్లో ఉన్న అతడిని వారం కస్టడీకి ఇవ్వాలని సిట్ పిటిషన్ దాఖలు చేయగా, మూడు రోజులు కస్టడీకి ఇస్తూ న్యాయాధికారి పి.భాస్కరరావు తీర్పు ఇచ్చారు. ఇదే కేసులో విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న వైసీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి వారం రోజులపాటు ఇంటి నుంచి భోజనానికి ఏసీబీ కోర్టు అనుమతించింది. జైల్లో డిష్ కనెక్షన్ ఉన్న టీవీ, మంచం, దిండు, టేబుల్, కుర్చీ సదుపాయాలను కల్పించాలని మాత్రం నిరాకరించింది. కాగా, త్వరలో జరుగనున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాలకు హాజరయ్యేందుకు వైసీపీ ఎంపీ పీవీ మిథున్‌రెడ్డికి ఏసీబీ కోర్టు అనుమతి ఇచ్చింది.

వారికి ముందస్తు బెయిల్ ఇవ్వొద్దు!

- వాసుదేవ రెడ్డి, సత్యప్రసాద్ పిటిషన్లను తిరస్కరించండి
- హైకోర్టులో చెవిరెడ్డి అనుబంధ పిటిషన్

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో నిందితులైన ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ అప్పటి ఎండీ వాసుదేవ రెడ్డి, ఎక్సైజ్ శాఖ అధికారి డి.వెంకటసత్యప్రసాద్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లను తోసిపుచ్చాలని ఇదే కేసులో నిందితుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి హైకోర్టులో అనుబంధ పిటిషన్ వేశారు. 'ఈ కేసులో కీలక నిందితులుగా ఉన్న వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్ అప్రూవర్‌గా మారుతామని, ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతున్నారు. వారికి బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేస్తారు. వీరిని ఇప్పటి వరకు అరెస్టు చేయలేదు. వీరిపై ఎలాంటి శాఖాపరమైన చర్యలూ తీసుకోలేదు. వీరికి దర్యాప్తు అధికారులు సహకరిస్తున్నారు. ఇది నిష్పాక్షిక దర్యాప్తు సూత్రాలకు విరుద్ధం' అని చెవిరెడ్డి తన అనుబంధ పిటిషన్‌లో పేర్కొన్నారు.

సంజయ్ సస్పెన్షన్ 6 నెలలు పొడిగింపు

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సీఐడీ మాజీ చీఫ్ ఎన్.సంజయ్ సస్పెన్షన్‌ను రాష్ట్ర ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించింది. దళితులు, గిరిజనుల్లో చట్టాలపై అవగాహన పెంచేందుకు ఖర్చు చేయాల్సిన నిధులను దారి మళ్లించిన ఆరోపణలతో ఆయనపై ఏసీబీ కేసు నమోదుచేసింది. మరో వైపు అగ్నిమాపకశాఖ డీజీగా ఉన్న సమయంలోనూ భారీ అవకతవకలకు పాల్పడినట్లు ఆయనపై ఆరోపణలొచ్చాయి. ఈ రెండింటిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో విచారణ చేయించిన కూటమి ప్రభుత్వం ఆ నివేదిక ఆధారంగా చర్యలకు ఉపక్రమించింది. ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టూ నిరాకరించడంతో ఆగస్టు 26న విజయవాడలోని ఏసీబీ కోర్టులో సంజయ్ లొంగిపోయారు. అప్పటి నుంచి విజయవాడ జైలులో సంజయ్ రిమాండ్ ఖైదీగా ఉన్నారు. వీటిపై ఏసీబీ దర్యాప్తు చేస్తోంది. సీఐడీ, ఫైర్ డిపార్ట్‌మెంట్లలో అవినీతికి సంబంధించిన డిజిటల్ ఆధారాల్లో ఫోరెన్సిక్ ఎవిడెన్స్ రావాల్సి ఉందని ఇటీవల ఏసీబీ డీజీ నివేదించారు. దీంతో మరో ఆర్నెళ్లు సంజయ్ సస్పెన్షన్‌ను పొడిగించాలని కమిటీ సిఫారసు చేయడంతో వచ్చే ఏడాది మే 26 వరకూ పొడిగిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

వైసీపీ విద్యార్థి నేత కొండారెడ్డికి రిమాండ్

విజయవాడ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ విద్యార్థి విభాగం నేత పులగడం కొండారెడ్డి అలియాస్ బన్నూరెడ్డికి మాదకద్రవ్యాల సరఫరా కేసులో విజయవాడ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టు డిసెంబరు 5వ తేదీ వరకు రిమాండ్ విధించింది. విశాఖపట్నం జైల్లో ఉన్న అతడిని పోలీసులు పీటీ వారెంట్‌పై విజయవాడలోని ఎంఎస్‌జే కోర్టులో గురువారం హాజరుపరచడంతో న్యాయాధికారి సత్యానంద్ రిమాండ్ విధించారు. అనంతరం కొండారెడ్డిని తిరిగి విశాఖ జైలులో అప్పగించారు.

ఏడాదిగా పెండింగులోనా?

చట్టాలు చేసేవారు చట్టం కంటే అధికులేం కాదు

- ఎమ్మెల్సీ జయమంగళ రాజీనామా లేఖపై 4 వారాల్లో విచారణ ముగించండి
- మండలి చైర్మన్ మోషేన్ రాజుకు హైకోర్టు ఆదేశం
- విచారణ ప్రక్రియను దుర్వినియోగం చేయడమే: న్యాయమూర్తి



అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ రాజీనామా లేఖపై శాసన మండలి చైర్మన్ మోషేను రాజు నిర్ణయం వెల్లడించకుండా ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉంచడంపై హైకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. విచక్షణాధికారం పేరుతో సహేతుక సమయంలో నిర్ణయం వెల్లడించకపోవడం విచారణ ప్రక్రియను దుర్వినియోగం చేయడమేనని స్పష్టంచేసింది. 33వ రాజ్యాంగ సవరణ ప్రకారం.. చట్టసభలకు ఎన్నికైన సభ్యుడు రాజీనామా లేఖ సమర్పించిన అనంతరం.. దానిపై విచారణ జరిపి కనీసం 15 రోజుల్లో.. గరిష్ఠంగా నెల రోజుల్లో ఏదో ఒక నిర్ణయం వెల్లడించాల్సిన బాధ్యత స్పీకర్/చైర్మన్‌పై ఉందని తేల్చిచెప్పింది. పిటిషనర్ విషయంలో మండలి చైర్మన్ చర్య సదరు సవరణ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని.. నిర్ణయం వెల్లడించేందుకు సుదీర్ఘ సమయం తీసుకోవడం చట్టవిరుద్ధమని ప్రకటించింది. పదవికి రాజీనామా చేస్తూ ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ సమర్పించిన లేఖపై విచారణను నాలుగువారాల్లో ముగించి నిర్ణయం వెల్లడించాలని చైర్మన్‌ను ఆదేశించింది. అనంతరం ఆ నిర్ణయాన్ని పిటిషనర్‌కు తెలియపరచాలని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ గురువారం తీర్పు వెలువరించారు. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తూ గత ఏడాది నవంబరు 23న మండలి చైర్మన్‌కు లేఖ సమర్పించానని.. దానిపై నిర్ణయం వెల్లడించేలా ఆయన్ను ఆదేశించాలని కోరుతూ జయమంగళ వెంకటరమణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాజీనామా లేఖ సమర్పించి ఏడాది (అప్పటికి 9 నెలలు) గడుస్తున్నా ఇప్పటివరకు దానిని ఆమోదించడం గానీ, తిరస్కరించడం గానీ చేయలేదన్నారు. ఏపీ శాసనసభ కార్యకలాపాల నిర్వహణ విధానంలోని 186వ నిబంధన.. అధికరణ 190(3)బీ ప్రకారం రాజీనామా సమర్పించాక దానిని ఆమోదించడమో, తిరస్కరించడమో చేయాల్సిన రాజ్యాంగబద్ధమైన బాధ్యత చైర్మన్‌పై ఉందని తెలిపారు. వ్యాజ్యంపై గతంలో విచారణ సందర్భంగా కౌంటర్ దాఖలులో జాప్యం జరగడంతో చైర్మన్‌కు అప్పట్లోనే కోర్టు రూ.10 వేల ఖర్చులు విధించింది. ఆ తర్వాత జరిగిన విచారణలో వాదప్రతివాదనలు విన్నాక న్యాయమూర్తి తన తీర్పును రిజర్వుచేశారు. గురువారం నిర్ణయాన్ని వెల్లడించారు.

ఏడాది తర్వాత నోటీసు ఇస్తారా?

రాజీనామా స్వచ్ఛందంగా, మనస్ఫూర్తిగా చేశారో లేదో విచారణ జరిపే అధికార పరిధి చైర్మన్‌కు ఉందని హైకోర్టు తెలిపింది. ఈ విషయంలో ఆయనకున్న అధికారాన్ని న్యాయస్థానం నిరోధించడం లేదని పేర్కొంది. 'జయమంగళ రాజీనామా లేఖ సమర్పించి ఏడాది గడిచిన తర్వాత.. వ్యక్తిగతంగా మాట్లాడేందుకు శుక్రవారం (ఈ నెల 28) తన ముందు హాజరుకావాలని సెప్టెంబరు 8న చైర్మన్ ఆయనకు నోటీసులు జారీ చేయడం సహేతుకం, సమర్థనీయం కాదు. విచక్షణాధికారం పేరుతో చైర్మన్ విచారణ ప్రక్రియను దుర్వినియోగం చేశారు. రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టేలా వ్యవహరించడం రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారి బాధ్యత. సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం.. చట్టం చేసేవారు చట్టానికన్నా అధికులు కాదు. సుప్రీంకోర్టు ఇచ్చిన వివిధ తీర్పులను పరిశీలిస్తే మండలి చైర్మన్‌కు రాజ్యాంగపరమైన రక్షణ, సంపూర్ణ విచక్షణాధికారం లేదని కోర్టు భావిస్తోంది. చైర్మన్ సకాలంలో నిర్ణయం తీసుకోకపోవడం వెడ్నెస్‌బరీ సూత్రానికి, అధికరణ 14కి విరుద్ధం' అని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

రైలులో నగల బ్యాగ్ చోరీ.. ఆపై డ్రెస్ మార్చి పరారీ..

- సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు.. నిందితుడిని పట్టిచ్చిన ర్యాపిడో బైక్
- విజయవాడలో బంగారం అమ్ముతుండగా అరెస్ట్

ఒంగోలు క్రైం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ముఖానికి మాస్క్, తలకు టోపీ.. నెక్ టీ షర్ట్ వేసుకున్న ఓ వ్యక్తి హైదరాబాద్‌లో రైలెక్కాడు. ఆ తర్వాత టోపీ తీసేసి ఏ3 కోచ్‌లో కలియ తిరిగాడు. అర్ధరాత్రి సమయంలో ప్రయాణికులు నిద్రిస్తుండగా.. రూ.48 లక్షల విలువైన బంగారు నగలతో కూడిన బ్యాగును కాజేశారు. ఆ తర్వాత పూర్తిగా డ్రెస్ మార్చి.. ప్యాంట్, షర్ట్ ధరించి నెల్లూరులో దిగిపోయాడు. సినీ ఫక్కీలో అంతా ప్లాన్ ప్రకారమే చేసినప్పటికీ.. ర్యాపిడో బైక్ ఆ దొంగను పట్టించింది. ఈ నెల 13న చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో జరిగిన దొంగతనం కేసులో రైల్వే పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ.48.10 లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. గురువారం స్థానిక రైల్వే పోలీసుస్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో నెల్లూరు రైల్వే డీఎస్పీ జీ.మురళీధర్ ఆ వివరాలు తెలియజేశారు. .

దొంగను పట్టించిన ర్యాపిడో బైక్

చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో చోరీపై రైల్వే డీఐజీ సత్య ఏసుబాబు నేతృత్వంలో ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ ఆదేశాల మేరకు పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజీని పరిశీలించగా ఈనెల 13న రాత్రి హైదరాబాద్‌లోని నాంపల్లి రైల్వేస్టేషన్‌కు ర్యాపిడో బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తిని పోలీసులు అనుమానించారు. అతను ఎవరు అని ఆరా తీయగా బాలాపూర్‌కు చెందిన మహ్మద్ షకీల్‌గా గుర్తించారు. అతని కదలికలపై నిఘా ఉంచిన పోలీసులు విజయవాడలో బంగారం అమ్ముతుండగా గురువారం ఉదయం ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఇళ్లలో దొంగతనాలు చేసే మహ్మద్ షకీల్ ఈ నెల 13న తన ఇంటి దగ్గర నుంచి నాంపల్లి స్టేషన్ వరకు ర్యాపిడో బైక్ బుక్ చేసుకున్నాడు. హైదరాబాద్ నుంచి నెల్లూరు వెళ్లేందుకు టికెట్ కొనుగోలు చేశాడు. మాస్కు ధరించి, తలకు టోపీ పెట్టుకుని స్టేషన్‌లోకి ప్రవేశించిన షకీల్ ఆ సమయంలో నెక్ టీషర్ట్‌తో ఉన్నాడు. బండి ఎక్కిన తర్వాత టోపీ తీసేసి తిరిగాడు. ఏ3 కోచ్‌లో బ్యాగ్ దొంగిలించిన తర్వాత పూర్తిగా డ్రెస్ మార్చి షర్ట్, ప్యాంట్ వేసుకున్నాడు. మాస్క్ తీసేసి.. టోపీ పెట్టుకున్నాడు. ఆ తర్వాత నెల్లూరులో రైలు దిగాడు. అక్కడ నుంచి విజయవాడ వరకు రైలులో ప్రయాణం చేసి, హైదరాబాద్‌కు బస్సులో వెళ్లినట్లు సీసీ ఫుటేజీ ద్వారా రైల్వే పోలీసులు గుర్తించారు.

విశాఖకు డేటా సెంటర్ల వెల్లువ

(మొదటి పేజీ తరువాయి)



మల్టీ నేషనల్ కంపెనీలు చేతులు కలిపి జాయింట్ వెంచర్‌గా ఏర్పడుతున్నాయి.

- విశాఖలో తొలి డేటా సెంటర్ ఏర్పాటుకు అదానీ గ్రూపు చాలా కాలం క్రితమే శంకుస్థాపన చేసింది. మధురవాడ హిల్ నంబరు 4పై 170 ఎకరాల్లో 300 మెగావాట్ల డేటా సెంటర్ ఏర్పాటుకు రూ.16 వేల కోట్లు వెచ్చిస్తామని ప్రకటించింది. ఈ ప్రాజెక్టుకు ఇటీవలే పర్యావరణ అనుమతులు లభించాయి.
- ప్రపంచ ప్రసిద్ధి చెందిన గూగుల్ అమెరికా వెలుపల అతి పెద్ద పెట్టుబడి రూ.1.35 లక్షల కోట్లతో ఒక గిగావాట్ సామర్థ్యంతో ఏఐ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. దీనికి అవసరమైన సబ్‌సీ కేబుల్ కోసం అదానీ గ్రూపుతో జాయింట్ వెంచర్ చేసింది. వీరికి ప్రభుత్వం విశాఖ, అనకాపల్లి జిల్లాలో 580 ఎకరాల భూములు కేటాయించింది. కొద్దిరోజుల్లోనే ఈ డేటా సెంటర్‌కు శంకుస్థాపన జరగనుంది.
- తాజాగా రిలయన్స్ సంస్థ కూడా ఒక గిగావాట్ సామర్థ్యంతో 'డిజిటల్ కనెక్షన్' పేరుతో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తామని పేర్కొంది. దీని కోసం రిలయన్స్, బ్రూక్‌ఫీల్డ్, డిజిటల్ రియాల్టీ అనే మూడు సంస్థలు జాయింట్ వెంచర్‌గా ఏర్పడ్డాయి. వీరికి ప్రభుత్వం 400 ఎకరాలు కేటాయించనుంది. సుమారు రూ.98 వేల కోట్ల పెట్టుబడి పెట్టనున్నారు.
- సిఫీ టెక్నాలజీస్ సంస్థ గత నెలలోనే విశాఖలో 550 మెగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేసింది. ఈ కంపెనీకి ప్రభుత్వం రెండుచోట్ల 31.6 ఎకరాలు కేటాయించింది. ఇందులో ఒక డేటా సెంటర్‌ను రుషికొండ ఐటీ పార్కులో 2027 నాటికే పూర్తి చేయాలని ఆ సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సంస్థకు కేబుల్ ల్యాండింగ్ సెంటర్ల ఏర్పాటులో అనుభవం ఉంది.
- 'టిల్‌మేన్ గ్లోబల్ హోల్డింగ్స్' సంస్థ 300 మెగావాట్లతో డేటా సెంటర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఎంవోయూ చేసుకుంది. రూ.15 వేలకోట్లపెట్టుబడి పెట్టనుంది. టీడీజీపీఏ-1 పేరుతో ఏర్పాటయ్యే ఈ కంపెనీకి 40 ఎకరాల కేటాయింపుకు ప్రభుత్వం అంగీకరించింది.

ఆస్ట్రేలియా కంపెనీ సంప్రదింపులు

మరో పెద్ద డేటా సెంటర్ ఏర్పాటు చేయడానికి ఆస్ట్రేలియాకు చెందిన ఓ కంపెనీ ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోంది. శ్రీకాకుళం జిల్లాలో 1.2 గిగావాట్ల డేటా సెంటర్ ఏర్పాటు చేసి, విశాఖపట్నంలో కార్యాలయం ఏర్పాటు చేస్తామని ప్రతిపాదించింది. భూముల కోసం అన్వేషిస్తున్నారు. మరోవైపు ఎల్ అండ్ టీ కంపెనీ భారతదేశంలోని ఐదు ప్రాంతాల్లో ఒక్కొక్కటి 300 మెగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తామని ఇప్పటికే ప్రకటించింది. అందులో ఒకటి విశాఖ కావడం గమనార్హం.

అతిపెద్ద సబ్‌సీ కేబుల్ ల్యాండింగ్ సెంటర్‌గా..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆరు గిగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, కేవలం ఆరు నెలల వ్యవధిలోనే 3.65 గిగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్లకు ఒప్పందాలు చేసుకుంది. ఇంకా మరికొన్ని సంస్థలు సంప్రదింపులు జరుపుతున్నాయి. అందులో మెటా కూడా ఉంది. సబ్‌సీ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తామని ప్రతిపాదించింది. తూర్పు తీరంలో విశాఖపట్నం అతి పెద్ద సబ్‌సీ కేబుల్ ల్యాండింగ్ సెంటర్‌గా మారబోతోంది. కాగా, అమెరికన్ కంపెనీ ఒకటి విశాఖలో రెడీమేడ్ దుస్తుల పరిశ్రమ, జీసీసీ ఏర్పాటుకు ఆసక్తి చూపుతోంది. రూ.6 వేల కోట్లు పెట్టుబడి పెడతామని హామీ ఇచ్చింది. ఈ సంస్థ ప్రతినిధులు గురువారం విశాఖపట్నం రాగా.. జిల్లా అధికారులు వారికి పలు ప్రాంతాల్లో భూములు చూపించారు.





రాజధాని అమరావతి రైతులతో సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతిలో అద్భుత అభివృద్ధి

- భూముల ధరలు పెరుగుతాయ్: చంద్రబాబు
- రిటర్నబుల్ ప్లాట్లను అమ్ముకోవద్దు
- 'రాజధాని' నోటిఫికేషన్ ఇవ్వాలని కేంద్రాన్ని కోరాం
- అమరావతి రైతులకు న్యాయం చేయడం నా బాధ్యత
- రాజధాని ఫలాలు తొలిగా వారికే దక్కాలి: సీఎం
- రెండో విడత భూసమీకరణకు తాము అనుకూలమని రైతుల ప్రకటన

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో అద్భుతమైన అభివృద్ధి జరుగబోతోంది. రిటర్నబుల్ ప్లాట్లను రైతులు అమ్ముకోవద్దు. భూముల ధరలు పెరుగబోతున్నాయి. బిట్స్ పిలానీ, క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటవుతున్నాయి' అని సీఎం చంద్రబాబు తెలిపారు. అమరావతిని రాజధానిగా గుర్తిస్తూ నోటిఫికేషన్ ఇవ్వాలని ఇప్పటికే కేంద్రాన్ని కోరామని చెప్పారు. మరోసారి చర్చిస్తామని ప్రకటించారు. రాజధాని రైతులకు క్యాపిటల్ గెయిన్స్ గడువును మరికొంత కాలం పాటు పొడిగించే అంశంపైనా కేంద్రంతో మాట్లాడతామని చెప్పారు. గురువారం అమరావతి సచివాలయంలో రాజధాని రైతులతో ఆయన సమావేశమయ్యారు. వారి సమస్యలను ఆలకించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. 'జరీబు, గ్రామ కంఠాలు, లంక భూములు, రిటర్నబుల్ ప్లాట్లలో మౌలిక సదుపాయాల కల్పనపై రైతుల అభిప్రాయాలు నా దృష్టికి వచ్చాయి. లంక భూములను పూలింగ్‌కు తీసుకోవడానికి అనుమతి ఇచ్చాను. ఇంకా ఏమైనా సమస్యలుంటే ముందుగా త్రిసభ్య కమిటీ తో చర్చించండి. అవసరమైతే నేనూ మాట్లాడతా. ఇకపై రెగ్యులర్‌గా మీ సమస్యలపై సమీక్షిస్తా. రైతులతో మనసు విప్పి మాట్లాడాలి కాబట్టి అన్నీ చెబుతున్నా. అమరావతే రాష్ట్రానికి గ్రోత్ ఇంజన్‌గా ఉండాలి. రాజధాని అభివృద్ధి చెందాలి. ఇక్కడి అభివృద్ధి ఫలాలను రాజధాని రైతులే ముందు అందుకోవాలి. అమరావతి ప్రాంతానికి రాజధాని రైతులకు న్యాయం చేయడం నా బాధ్యత. రెండో విడతలోనూ ల్యాండ్ పూలింగ్‌లో భూములు తీసుకుని ఇంకా అభివృద్ధి చేద్దామని చూస్తున్నాం. అభివృద్ధి ఫలాలు ఎలా ఉంటాయో హైదరాబాద్‌ను చూస్తే అర్థమవుతుంది. గతంలో భూములకు అక్కడ చాలా తక్కువ ధర ఉండేది. ఇప్పుడు ఎకరా రూ.170 కోట్లు పలుకుతోంది. కొందరు రైతులు ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ (ఎఫ్ఎస్ఐ) పెంచాలని కోరుతున్నారు. దీనిపై చర్చించి నిర్ణయం తీసుకుంటాను. రైతులు చెప్పే ఏ సమస్యనైనా వీలైనంతవరకు పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధం.అలాగే మీరంతా కలిసికట్టుగా ఉండాలి. ఐకమత్యం గా ఉంటేనే అభివృద్ధి సాధ్యం' అని చెప్పారు. తిరుమల తరహాలో అమరావతి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు.

సీఎం ప్లాన్‌తో మాకూ మేలు: రాజధాని రైతులు

'రాజధాని కోసం జేఏసీలు ఏర్పాటు చేసుకుని ఉద్యమించాం. ఇక అమరావతి డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఏర్పాటు చేసుకుంటాం. రెండో విడత భూ సమీకరణకు పూర్తిగా సహకరిస్తాం' అని రైతులు సీఎంకు హామీ ఇచ్చారు. ఆయన రూపొందించిన ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తే తమకూ మేలు జరుగుతుందన్నారు. 'ఎఫ్ఎస్ఐ పెంపు వల్ల కలిగే లాభనష్టాలను వివరించే బాధ్యత సీఆర్‌డీఏ తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి పి.నారాయణ, తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, మున్సిపల్, సీఆర్‌డీఏ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాజకీయ నినాదాలు కాదు.. వివక్షకు ఆధారాలు చూపాల్సిందే

- తెలంగాణకు ఏపీ తరపు సీనియర్ న్యాయవాది స్పష్టీకరణ
- తెలంగాణలో ప్రాజెక్టుల నిర్మాణానికి ఉమ్మడి రాష్ట్రం శాయశక్తులా యత్నించింది
- ఆధారాలు చూపుతూ పటిష్ఠ వాదనలు వినిపించిన జైదీప్ గుప్తా

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాల విషయంలో నాటి హైదరాబాద్ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని.. నేటి విభజిత ఆంధ్రప్రదేశ్‌పై నెట్టేస్తామంటే ఎలాగని ఆంధ్రప్రదేశ్ గట్టిగా ప్రశ్నించింది. నదీ జలాల వాటాలు, కేటాయింపుల విషయంలో రాజకీయ నినాదాలు చేస్తే కుదరదని.. చారిత్రక ఆధారాలు చూపాల్సిందేనని తెలంగాణకు స్పష్టం చేసింది. కృష్ణా జలాల పునఃపంపిణీపై జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్ ఎదుట ఏపీ తరఫు సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా వరుసగా మూడో రోజైన గురువారం కూడా గట్టిగా వాదనలు వినిపించారు. నీటి వాటాలు, కేటాయింపులపై చారిత్రక ఆధారాలు, ఉత్తర్వులను చూపారు. తెలంగాణ ప్రాంత సాగునీటి ప్రాజెక్టులకు నీటి కేటాయింపుల విషయంలో చారిత్రక అన్యాయం, వివక్ష జరిగాయన్న తెలంగాణ ప్రభుత్వ వాదనలపై స్పందిస్తూ.. రాజకీయ నినాదాలు చేయడం కాకుండా వివక్షకు నిర్మాణాత్మక, నిర్దిష్ట ఆధారాలను చూపాలని.. లేదంటే ఆరోపణలు నిలబడవని స్పష్టంచేశారు. 'వివక్ష జరిగిందంటూ తెలంగాణ ఏవో కొన్ని ఉదాహరణలను ప్రస్తావించింది. అయితే అవి నిజంగా వివక్షను ప్రతిబింబిస్తున్నాయా.. లేక ఇతర పరిస్థితుల కారణంగా ఉత్పన్నమయ్యాయా అనేది జాగ్రత్తగా పరిశీలించాలి. స్పష్టమైన ఆధారాల్లేకుండా ఇలాంటివి చెప్పరాదు. దురుద్దేశంతో నిర్లక్ష్యం చేశారనడానికి కూడా గట్టి రుజువులు చూపాలని న్యాయసూత్రాలు చెబుతున్నాయి. ఆధారాలు చూపాల్సిన పూర్తి బాధ్యత ఆరోపణలు చేస్తున్న రాష్ట్రానిదే' అని తేల్చిచెప్పారు. తమ కోసం రూపొందించిన చాలా ప్రాజెక్టులను తిరస్కరించారని.. దారి మళ్లించారన్న తెలంగాణ ఆరోపణలు అతిశయోక్తులేనన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆవిర్భావ సమయంలో హామీలిచ్చారనేందుకు ఎలాంటి ఆధారాలనూ చూపలేదని తెలిపారు. 'అప్పటి హైదరాబాద్ రాష్ట్రం తెలంగాణ ప్రాంతంలో ప్రాజెక్టులను ప్రతిపాదించినట్లు అధికారిక రికార్డుల్లో కూడా లేదు. హైదరాబాద్ రాష్ట్ర నిర్లక్ష్యం కారణంగానే కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్-1.. ప్రాజెక్టులను తిరస్కరించింది. అందుచేత ఉమ్మడి రాష్ట్రంలో వాటిని తిరస్కరించారని తెలంగాణ చేస్తున్న వాదనలను తిరస్కరించండి' అని బ్రిజేశ్ ట్రైబ్యునల్‌ను గుప్తా కోరారు. నిర్ధారిత చారిత్రక నిర్లక్ష్యం వల్లనో, వనరుల పంపిణీలో అసమానతల వల్లనో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయలేదని స్పష్టంచేశారు. స్వతంత్ర ప్రాతినిధ్యం, ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలకు అనుగుణంగా ఏర్పాటుచేశారని తెలిపారు. ఏపీ విభజన చట్టం-2014లోని లక్ష్యాలు, కారణాల ప్రకటనలో.. అభివృద్ధి, నీటి కేటాయింపుల్లో అన్యాయానికి సంబంధించిన ఏ ఆరోపణలనూ పేర్కొనలేదన్నారు. నిర్దిష్ట గుర్తింపు, ప్రభుత్వ వ్యవస్థ కోసం చేసిన రాజకీయ డిమాండ్ కారణంగా ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారని వెల్లడించారు. సాంకేతిక సాధ్యాసాధ్యాలు, ఆర్థికంగా లాభదాయకం, ట్రైబ్యునల్ అవార్డుల ప్రాతిపదికన ప్రాజెక్టులను చేపడతారని.. ప్రాంతీయ వివక్ష కారణంగా కాదని గుప్తా తెలిపారు.

తెలంగాణ వాదనలు దురుద్దేశపూరితం!

కృష్ణా జలాల విషయంలో తెలంగాణ చేస్తున్న వాదనలన్నీ దురుద్దేశంతో కూడుకున్నవని 2013లో ముత్తా అసోసియేట్స్‌కూ మహారాష్ట్ర ప్రభుత్వం మధ్య జరిగిన కేసులో తేటతెల్లమైందని జైదీప్ గుప్తా చెప్పారు. తెలంగాణ ప్రాంత అభివృద్ధిపై ఉద్దేశపూర్వకంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నిర్లక్ష్యం చేసిందనేందుకు చారిత్రక ఆధారాల్లేవని కేంద్రం వర్సెస్ టి.రామచంద్రరావు (2001) కేసులో స్పష్టమైందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ అభివృద్ధి పట్ల చిత్తశుద్ధితో ప్రభుత్వాలు ఉన్నందునే 1956-2008 మధ్య రూ.4.99 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని.. భారీ సాగునీటి ప్రాజెక్టు నాగార్జున సాగర్, జూరాల, కోయిల్‌సాగర్, దేవాదుల, శ్రీరాంసాగర్, కడెం తదితర ప్రాజెక్టులు పూర్తయ్యాయని వివరించారు. గుప్తా తదుపరి వాదనలను వచ్చే నెల 17, 18 తేదీల్లో వింటామని చెబుతూ విచారణను ట్రైబ్యునల్ వాయిదా వేసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.